క్రీ.శ. 1050 సం.లోని "సోమదేవుని"

# కథా సరిత్సాగరము

( అద్భుత ప్రాచీన కథలు)



బ్రహ్మశ్రీ మేడవరపు సంపత్ కుమార్

క్రీ.శ. 1050 సం.లోని "సోమదేవుని"

# కథా సరిత్సాగరము

(అద్భుత ప్రాచీన కథలు)


సాహిత్య విద్యాప్రవీణ: తర్క-వేదాంత ధురీణ

జ్యోతిష - తంత్రపారీణ

బ్రహ్మశ్రీ మేడవరపు సంపత్‌కుమార్

M.A. సంస్కృతం



ప్రచురణ కర్తలు ☎ 2465253

గొల్లపూడి వీరాస్వామి సన్

పబ్లిషర్స్ అండ్ బుక్ సెల్లర్స్

కోటగుమ్మం - రాజమండ్రి - 533 101



కాపీరైట్]



2009 వెల : 80-00

# కథా సరిత్సాగరము

రచన :
బ్రహ్మశ్రీ మేడవరపు సంపత్‌కుమార్
విద్యాప్రవీణ, M.A. సంస్కృతం..

4-399, 'విశ్వామిత్ర' బిల్డింగ్,
తారకరామా నగర్, జగన్నాథపురం
కాకినాడ - 533002.
మొబైల్ : 09998 344758

మీ సందేహాలకు
మరియు సలహాలకు
రచయితనే
సంప్రదించగలరు.

ప్రథమముద్రణ: 2009

ముఖచిత్రము :
కె.బి. క్రియేషన్స్
రాజమండ్రి - 533 103.
ఫోన్ : 2464707

గ్రంథ ముద్రణ :
మహేశ్వరీ ప్రింటింగ్ & బైండింగ్ వర్క్స్
రాజమండ్రి - 533 104.
ఫోన్ : 2478594

ముఖచిత్ర ముద్రణ :
ఈశ్వర్ గ్రాఫిక్స్
రాజమండ్రి - 533 103.
ఫోన్ : 2461532

ప్రకాశకులు :
గొల్లపూడి వీరాస్వామి సన్
కోటగుమ్మం - రాజమండ్రి - 533 101.
ఫోన్ : 2465253

సర్వహక్కులు ప్రకాశకులవి

భారతీయ కథా సాహిత్యంలో ప్రప్రథమ స్థానం "బృహత్కథ"కు చెందుతుందనడంలో సందేహం లేదు. దీనిని "గుణాఢ్యుడు" పైశాచీప్రాకృత భాషలో రచించాడు. ఇతడు క్రీ॥పూ॥ 225 సం. మొదలు క్రీ॥శ॥ 250 వరకూ ఆంధ్ర సామ్రాజ్యమును పాలించిన శాతవాహన రాజులలో 17వ వాడగు హాల శాతవాహనుని ఆస్థానకవి. ప్రాకృతభాష 5 విధములుగా నుండెడిది. 1. మహారాష్ట్రీ 2. శౌరసేనీ 3. పైశాచీ 4. మాగధి 5. అర్ధమాగధి.

మూలప్రాకృత భాషలోని గ్రంధము లభించుట లేదు అది లక్ష శ్లోకములు గలది. అందలి కథలు బహుప్రచారము పొందినవి. మహాకవి కాళిదాసు తన మేఘదూత కావ్యములో."ఉజ్జయినీ" నగరమును వర్ణించుచూ అచ్చట "ఉదయన కథా కోవిదులగు గ్రామవృద్ధులు" ఉండిరని వర్ణించాడు. బృహత్కథ యందు ప్రధానముగా ఉదయనుని కథ వివరించబడింది. ఎందరో సంస్కృత కవులు 'బృహత్కథ' యందలి కథలను ఆధారముగా చేసుకొని గద్య-పద్య-నాటక సాహిత్యమును రచించారు. మూలప్రాకృత భాషా గ్రంధము క్రీ॥శ॥ 1100 వరకూ లభించేది. క్షేమేంద్రుడు దీనిని సంస్కృత భాషలో "బృహత్కథామంజరి" అని సంగ్రహముగా అనువదించెను.

కాశ్మీర వాస్తవ్యుడైన "సోమదేవుడు" క్రీ॥శ॥ 1050లో 'బృహత్కథ'ను సంస్కృత భాషలో "కథా సరిత్సాగరము" అను పేర అనువదించాడు. ఇతడు క్రీ॥శ॥ 1029 నుండి 1064 వరకు కాశ్మీరమును పరిపాలించిన అనంతవర్మ ఆస్థానకవి. అనంతవర్మ కూడా శాతవాహన వంశీయుడే. ఇతని భార్య త్రిగర్తాధిపుని కుమార్తె "సూర్యావతి". ఈమె విద్వాంసురాలు. అనేక సత్రములు - మఠములు - దేవా లయములను నిర్మించినది. శివపూజా దురంధరురాలై హిరణ్యాన్నదానములు చేయుచూ శాస్త్ర గౌరవము గల ఈమె మనోల్లాసము కొరకు రామదేవుని కుమారుడైన "సోమదేవుడు" కథా సరిత్సాగరమును రచించినట్లు కవియే చెప్పెను.

కథలు అను నదులకు ఈ గ్రంధము సాగరము వంటిది. ఇందు "నరేంద్ర వాహను"ని కథ ప్రధానేతివృత్తము. ఇతడు పాండవ వంశీయుడైన జనమేజయుని మనుమడైన సహస్రానీకుని మనుమడు. ఉదయనుని కుమారుడు. విద్యాధర చక్రవర్తి అవుతాడు. శివానుగ్రహముచే విద్యాబలముచే వివిధ రకములుగా

విద్యాధర వంశము లున్నవని, వీరు దేవతల కంటే తక్కువ శక్తి, మానవులకంటే గొప్ప శక్తులు గలవారని పేర్కొనబడింది. ఇందు 18 లంబకములు, 124 తరంగములు, 24000 శ్లోకములు గలవు.

బృహత్కథ లక్ష శ్లోకములు గలదట. దానిని తాను సంక్షేపముగా సంస్కృత భాషలో మూలాతిక్రమణము చేయకుండా ఔచిత్యము - అన్వయము పాటించి, కథారసమునకు విఘాతము కలుగకుండా కథలను సులభముగా గుర్తుంచుకొనుటకు వీలుగా ఈ సంస్కృతీకరణము చేసితినని, పాండిత్య ప్రదర్శనకు కాదని - "సోమదేవుడు" ప్రతిజ్ఞా వాక్యముగా ముందుగానే చెప్పినాడు.

ఇందలి కథలను ఏఏ కవులు, ఏ కావ్యములకు గ్రహించినదీ ఈ క్రింద వివరించబడింది.

| లంబకం | తరంగం | కావ్యము | కవిపేరు |
|---|---|---|---|
| 1 | 5 | ముద్రారాక్షసం | విశాఖదత్తుడు |
| 2 | 4 | ప్రతిజ్ఞాయౌగంధరాయణం | భాసమహాకవి |
| 2 | 6-67 శ్లో | ప్రియదర్శిక | శ్రీహర్షుడు |
| 3 | 2 | స్వప్నవాసవదత్త | భాసమహాకవి |
| 4 | 2 | నాగానందము | శ్రీహర్షుడు |
| 12 | 23 | | |
| 10 | 3 | కాదంబరి | బాణభట్టు |
| 10 | 4 | మిత్రభేదము | విష్ణుశర్మ |
| 10 | 5 | మిత్రలాభము | విష్ణుశర్మ |
| 10 | 6 | కాకోలూకీయము | విష్ణుశర్మ |
| 12 | | దశకుమారచరిత్ర | దండి మహాకవి |
| 13<br>3 | 1<br>4 | మాలతీమాధవం | భవభూతి |

కొన్ని కావ్యములు ఇందలి కథలను నామమాత్రముగా గ్రహించి విస్తారము గావించబడ్డాయి. అవి-మహాకవి కాళిదాసుని, విక్రమోర్వశీయము, మాళవికాగ్ని మిత్రము, మరియు హితోపదేశము, రత్నావళి వంటివి.

ఇందలి కథా శిల్పము ఎంతో రమ్యముగా ఉంటుంది. భూతప్రేత, పిశాచ బ్రహ్మ రాక్షస శాకినీ ఢాకినీ కథలు, యక్ష, గంధర్వ, కిన్నెర, విద్యాధరుల కథలు, జ్ఞానుల, మూఢుల కథలు – జారుల – చోరుల – జూదరుల సాహసక్రియలు, మంత్ర, తంత్ర, ఇంద్రజాల కథలు అద్భుతము, ఆశ్చర్యము కలిగించు సిద్ధుల – యోగుల, దైవబల సంపన్నుల లీలలు – రాజుల, సేవకుల, వర్తకుల ద్వీపాంతర వాసుల, సముద్ర వర్తకుల కథలు – పతివ్రతల శక్తి – కులటల కుటిలోపాయములు, దారుణకృత్యములు – ప్రభువుల ప్రజారంజన, సేవకుల, మంత్రుల భక్తితత్పరత కథలు – నీతికథలు, చక్కని సామెతలతో బోధిసత్త్వుల – భేతాళ, విక్రమార్కుల కథలు నవరస భరితముగా వర్ణించబడినవి. హాస్యరసమును కడుపుబ్బ నవ్వించు నట్లుగా కొన్ని కథలున్నవి.

ఇందు చారిత్రక పురుషుల కథలు కూడా ఉన్నవి. శాతవాహన – విక్రమార్క – వరరుచి – పాణిని–చాణక్య చంద్రగుప్త – నాగార్జునాది అనేక చారిత్రక పురుషుల కథలు, పురాణేతిహాసమునందు ప్రసిద్ధి కలవి– కల్పనాత్మకములైనవి –ఊహాలోకములో విహరింపచేయునవి ఎన్నో కథలు కలవు.

ప్రాచీనమైన ఇంత మహత్తరమైన – అద్భుతమైన కథా సాహిత్యము ప్రపంచ సాహిత్యములలోనే మరొకటి లేదు. దీనిననుసరించియే ఇతర దేశము లలో 'అరేబియన్ నైట్స్' – థౌజెండ్ అండ్ వన్ నైట్స్' వంటి కథలు వ్రాసిరి.

ఈ గ్రంథమందు శివుడు ప్రధాన దైవముగా వర్ణించబడినాడు. శివుడు పార్వతికి చెప్పిన ఏడుగురు విద్యాధరుల కథే అసలు మూలకథ. ఇందలి కథలలో శృంగారాది నవరసములూ అహమహమికతో పాఠకులను వ్రూతలూగించును.

రసఝురి "కాదంబరి" రచించిన బాణభట్ట మహాకవి బృహత్కథను ఇట్లు ప్రశంసించెను. "సముద్దీపిత కందర్పాకృత గౌరీ ప్రసాధనా, హరలీలేవ నోకస్య విస్మయాయ "బృహత్కథా" –

హిమాలయము "విద్యాధరుల" నివాసభూమి. అది దక్షిణ వేద్యర్ధము – ఉత్తర వేద్యర్ధము అని రెండు భాగములు. కైలాసమునకు ఉత్తరమున ఉన్నది ఉత్తరవేది, దక్షిణమున ఉన్నది దక్షిణవేది. విద్యను ధరించుటచే వీరికి విద్యాధరు లని పేరు వచ్చినది. విద్యాప్రభావముచే వీరికి ఆకాశగమనాది శక్తులు కలుగు

చున్నవి. దేవయోనుల వలె వీరు కూడా భోగప్రధానులు. భోగపరాయణులకు స్త్రీ వ్యసనమెక్కువ ఆ కారణముచే కొందరు అధఃపతితులైరి. విద్యను ధరించుట యనునది తప్ప మరే విషయమునందునూ వీరు మానవుల కంటే అధికులు కారు. సహజముగా విద్యాధరులైన వారు విద్యాధర చక్రవర్తులై పిమ్మట మదోన్మత్తులై పదచ్యుతులైరి. మానవులుగా పుట్టి శివానుగ్రహము వలన విద్యాధరులూ, విద్యాధర చక్రవర్తులూ అయి వ్యసనముల చిక్కక, ఇంద్రాదుల మెప్పు సైతము పొందిన వారున్నారు. అట్టి వారిలో 'నరేంద్రవాహను'డొకడు.

పండిత-పామర-స్త్రీ జనరంజకముగా ఈ కథలు ఈనాటికీ ఏనాటికీ ఆహ్లాదము కలిగించుననుటలో ఏ మాత్రమూ సందేహము లేదు.

ఈ "కథా సరిత్సాగరము"ను తెలుగు పాఠకులు సమాదరించి సంతోషిస్తారని, ముందు తరాలకు కానుకగా అందిస్తారని, పిల్లలూ పెద్దలూ భావాంబర వీధిలో హాయిగా విహరించి మనోల్లాసం పొందుతారని భావిస్తున్నాను.

కాకినాద
**07.07.07** **మేడవరపు సంపత్‌కుమార్**

## ఆధార గ్రంథములు


1. కథా సరిత్సాగరము - సంస్కృతము
   చౌఖంబా సంస్కృత ప్రచురణలు; వారణాసి

2. కథా సరిత్సాగరము - తెలుగు
   శ్రీ చతుర్వేదుల సత్యనారాయణ శర్మ
   వావిళ్ళ వారి ప్రచురణ; 1955

3. కథా సరిత్సాగరము - ఇంగ్లీషు
   సి. హెచ్. టానే
   ఆసియాటిక్ సొసైటీ; కలకత్తా, 1880 సం.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | 1వ లంబకము | 1వ తరంగము | 11 |
| 2. | | 2వ తరంగము | 13 |
| 3. | | కాణభూతి వృత్తాంతము | 13 |
| 4. | | వరరుచి కథ | 15 |
| 5. | | వర్షుని కథ | 16 |
| 6. | | 3వ తరంగము | 17 |
| 7. | | బ్రహ్మదత్తుని కథ | 19 |
| 8. | | 4వ తరంగము | 21 |
| 9. | | 5వ తరంగము | 25 |
| 10. | | నవ్విన ఎండుచేప | 26 |
| 11. | | శివవర్మకథ | 28 |
| 12. | | 6వ తరంగము | 31 |
| 13. | | గుణాఢ్యుని కథ | 32 |
| 14. | | ఎలుకసెట్టి కథ | 32 |
| 15. | | వేదజడుని కథ | 33 |
| 16. | | శాతవాహనుని కథ | 35 |
| 17. | | మాల్యవంతుని పేరు కథ | 39 |
| 18. | | 8వ తరంగము | 40 |
| 19. | 2వ లంబకము | 2-1వ తరంగము | 42 |
| 20. | | శ్రీదత్తుని కథ | 44 |
| 21. | | 2-2వ తరంగము | 50 |
| 22. | | 2-3వ తరంగము | 51 |

| | | |
|---|---|---|
| | 2-4వ తరంగము | 52 |
| | లోహజంఘుని కథ | 53 |
| | 2-5వ తరంగము | 57 |
| | దేవస్మిత కథ | 58 |
| | సిద్ధకరి కథ | 59 |
| | శక్తిమతికథ | 62 |
| | 2-6వ తరంగము | 64 |
| | బాల వినష్టకుని కథ | 64 |
| | రురుదుంఢుభ కథ | 66 |
| 3వ లంబకము | 1వ తరంగము | 67 |
| | వైశ్యకన్యా మౌనవ్రతుల కథ | 68 |
| | ఉన్మాదినీ కథ | 69 |
| | యయిల్లకుని కథ | 70 |
| | పుణ్యసేనుని కథ | 70 |
| | 3-2వ తరంగము | 71 |
| | కుంతిభోజుని కథ | 73 |
| | 3-3వ తరంగము | 75 |
| | సోమప్రభకథ | 76 |
| | అహల్యకథ | 77 |
| | 3-4వ తరంగము | 78 |
| | విదూషకుని కథ | 79 |
| | 3-5వ తరంగము | 86 |
| | దేవదాసు కథ | 87 |
| | 3-6వ తరంగము | 90 |
| | సోమదత్తుని కథ | 90 |

| | | | |
|---|---|---|---|
| 48. | 4వ లంబకము | (నరవాహనదత్తుని జననం) | |
| | | 1వ తరంగము | 95 |
| 49. | | దేవదత్తుని | 96 |
| 50. | | 4-2వ తరంగము | 98 |
| 51. | | సింహపరాక్రముని కథ | 101 |
| 52. | 5వ లంబకము | 1వ తరంగము | 103 |
| 53. | | శక్తివేగుని కథ | 103 |
| 54. | | శివమాధవుల కథ | 104 |
| 55. | | హరస్వామి కథ | 108 |
| 56. | | 2వ తరంగము | 108 |
| 57. | | అశోకదత్తుని కథ | 110 |
| 58. | | 3వ తరంగము | 117 |
| 59. | | దేవదత్తుని కథ | 122 |
| 60. | 6వ లంబకము | (మదనమంచుక) 1వ తరంగము | 125 |
| 61. | | సురభిదత్త కథ | 126 |
| 62. | | 6-2వ సులోచన కథ | 127 |
| 63. | | రాజపుత్ర-వర్తక పుత్రుల కథ | 128 |
| 64. | | 6-3వ తరంగము | 131 |
| 65. | | 6-4వ తరంగము | 132 |
| 66. | | తేజస్వతి కథ | 133 |
| 67. | | 6-5వ తరంగము | 133 |
| 68. | | 6-6వ తరంగము | 134 |
| | | (7వ తరంగం పరిశిష్టములో ఇవ్వబడినది) | |
| 69. | | 6-8వ తరంగము | 136 |
| 70. | 7వ లంబకము | (రత్నప్రభ) 1వ తరంగము | 138 |

| | | | |
|---|---|---|---|
| 71. | | 7-2వ తరంగము | 139 |
| | | (3-4-5-6-7 పరిశిష్టములోనున్నవి) | |
| 72. | | 7-8వ తరంగము | 140 |
| 73. | 8వ లంబకము | (సూర్యప్రభ) 1వ తరంగము | 143 |
| 74. | 9వ లంబకము | (అలంకారవతి) 1వ తరంగము | 144 |
| 75. | | 9-2వ తరంగము | 145 |
| 76. | 10వ లంబకమునకు (శక్తియశ) యను పేరు | | |
| | | 10-3వ తరంగము (శక్తియశ కథ) | 146 |
| 77. | 11వ లంబకము | (వేలా) 1వ తరంగము | 148 |
| 78. | 12వ లంబకము | (శశాంకవతి) | 149 |
| 79. | | 12-2వ తరంగము | 150 |
| 80. | 14వ లంబకము | 14-1 తరంగము | 151 |
| 81. | | 14-2వ తరంగము | 153 |
| 82. | | 14-3వ తరంగము | 155 |
| 83. | | 14-4వ తరంగము | 158 |
| 84. | 15వ లంబకము | (మహాభిషేకము) 1వ తరంగము | 161 |
| 85. | | 15-2వ తరంగము | 164 |
| 86. | 16వ లంబకము | (సురతమంజరి) 1వ తరంగము | 166 |
| 87. | | 16-2వ తరంగము | 167 |
| 88. | | పరిశిష్ట భాగము (అవాంతర కథలు) | 169 |
| 89. | | 6వ లంబకము - 3వ తరంగము | 169 |
| 90. | | 7వ లంబకము - | |
| | | 3వ తరంగము నిశ్చయదత్తుని కథ | 170 |
| 91. | | 7-5 గుణవరాదేవి కథ | 173 |

# కథాసరిత్సాగరము

## మొదటి లంబకము

**శి**వుడు ఒకనాటి సాయంత్రమున పార్వతి మనసు రంజింప చేయుటకు కొన్ని కథలను చెప్పెను. అందు పార్వతి పూర్వజన్మమందు దక్ష ప్రజాపతి కుమార్తె సతీదేవియని, దక్షుడు చేయు యాగమునకు శివుని ఆహ్వానింపక అవమానించగా, శివుడు వలదన్ననూ ఆ యాగమునకు సతీదేవి వెళ్ళి అవమానము పొంది శరీరత్యాగము చేసినది. అది తెలుసుకొని శివుడు దక్షయజ్ఞమును విధ్వంసము గావించెను. పిమ్మట సతీదేవి హిమవంతుని కుమార్తెగా జన్మించి శివునికై తపము చేసెను. తారకాసురుని సంహరింప శివకుమారుని జననము గోరి దేవతల ప్రేరణచే మన్మధుడు శివుని తన కామబాణములచే వేధించెను. క్రోధముచే శివుడు మన్మధుని దహించెను. అనంతరము పార్వతి చేసిన తీవ్ర తపమునకు శివుడనుగ్రహించి ఆమెను వివాహమాడెను.

ఈ కథ విని పార్వతి ఇంకరూ మంచి కథను చెప్పమని కోరగా 'విద్యాధరుల' కథను చెప్పెదనని ఇట్లు చెప్పెను.

దేవతలు ఏకాంతసుఖులు, మనుష్యులు నిత్య దుఃఖితులు, దేవ మానుష చేష్టలు మిక్కిలి మనోహరముగా నుండును అని ఏడు కథలు చెప్పెను. ఆ సమయమున చాటుగా ఉన్న 'పుష్పదంతుడ'ను గణోత్తముడు ఆ కథలు విని, తన భార్య అయిన జయకు చెప్పెను. కొన్ని దినముల అనంతరము జయ కైలాసమున పార్వతికి ఈ ఏడు విద్యాధరుల కథలను చెప్పెను. అది వినిన పార్వతి పాత కథలనే నాకు చెప్పితిరని శివుని కోపించగా, శివుడు దివ్యదృష్టిచే జరిగినది తెలుసుకొని పుష్పదంతుడు మాయారూపమున ఈ కథలను విని తన భార్యకు చెప్పెనని వివరించెను.

అంత పార్వతి పుష్పదంతుని పిలిపించి మానవునిగా జన్మింపమని శపించెను. ప్రమథగణములలో 'మాల్యవంతుడ'ను నతడు పుష్పదంతుని అనుగ్రహించమని వేడుకొనగా అతనిని కూడా మానవ జన్మపొందమని శపించెను. వారిద్దరూ జయతో గూడ పార్వతి కాళ్లపైబడి శాపాంతమును ప్రార్థింపగా పార్వతి ఇట్లు పలికెను.

"వింధ్యపర్వత అడవిలో కుబేరుని శాపము వలన సుప్రతీకుడను యక్షుడు 'కాణభూతి' అను పేరుతో పిశాచమై యున్నాడు. అతనిని చూడగనే పూర్వజన్మ స్మృతి కల్గి అతనికి ఈ కథలను చెప్పెదవు. అదే నీకు శాపావసాన కాలము. కాణభూతి వలన ఈ కథలను మాల్యవంతుడు విన్నప్పుడే కాణభూతికి శాపవిమోచనమగును. మాల్యవంతుడు కూడా ఈ కథలను లోకమునకు తెలియజేసె శాప విముక్తుడగును." అని చెప్పెను.

కొంతకాలము తరువాత పార్వతి, పరమేశ్వరునితో 'స్వామీ! నాచే శపింపబడిన ఆ ప్రమథ శ్రేష్ఠులిరువురూ ఎచ్చట పుట్టిరి? అని అడిగెను. శివుడిట్లు చెప్పెను-

కౌశాంబియను మహానగరమందు పుష్పదంతుడు వరరుచియను పేర జన్మించెను. సుప్రతిష్ఠితమను పట్టణమందు మాల్యవంతుడు 'గుణాఢ్యుడ'ను పేర జన్మించెను అని వివరించెను.

# 1 -2వ తరంగము

వరరుచి - కాత్యాయనుడను పేరుతో సమస్త విద్యల యందు ఆరితేరి మంత్రి పదవి పొందెను. ఒకనాడు వింధ్యవాసిని యైన దేవతను జూడనెంచి తపస్సు చేయగా దేవి స్వప్నమున కనబడి వింధ్యారణ్యమున నున్న 'కాణభూతి'ని చూచుటకు పంపెను. భయంకర మృగములతో నిండిన ఆ అడవి యందు వరరుచి తిరుగుచూ ఒక పెద్ద మర్రిచెట్టును చూచెను. దాని కింద వందలాది పిశాచములతో కూడిన పిశాచరూపమున ఉన్న 'కాణభూతి'ని చూచెను. కాణభూతి కూడా ఇతనిని చూచి నమస్కరించాడు. వరరుచి కొంతసేపు కూర్చుండి 'సదాచారుడవైన నీకు ఈ గతి పొందుటకు కారణమేమి? అని ప్రశ్నించగా కాణభూతి ఇట్లనెను.

# కాణభూతి వృత్తాంతము

ఒకనాడు ఉజ్జయినీ శ్మశానమందు పార్వతి, పరమేశ్వరునితో - స్వామీ ఏ కారణము వలన పుర్రెలు - శ్మశానములనిన మీకు ఇష్టము? అని పలుకగా శివుడు ఇట్లు చెప్పెను.

పూర్వము కల్పాంతమున జగత్తంతయూ నీటిచే నిండగా నేను నా తొడను భేదించి ఒక రక్తబిందువును నీటిలో వేసితిని. అది ఒక గుడ్డు అయినది. అది రెండు బద్దలు కాగా దాని నుండి పురుషుడు బయటకు వచ్చెను. అనంతరము సృష్టికై నేను ప్రకృతిని సృజించితిని. ఈ ప్రకృతి పురుషులు-ప్రజాపతులను, ప్రజలను సృష్టించిరి. అందువలన ఆ పురుషుడు ప్రపంచమున పితామహుడని పేరు పొందెను.

ఈ విధముగా చరాచరమైన ప్రపంచమును సృజించి పితామహుడు గర్వాంధుడు కాగా నేనాతని శిరస్సు ఖండించితిని. అనంతరము పశ్చాత్తాపముచే 'మహావ్రతము'ను పూనితిని. కపాలములనిన శ్మశానములనిన నాకు గల యిష్టమున కిదియే కారణము. నా చేతిలో నున్న యీ కపాలమే జగత్తు. 'గుడ్డు రెండు చిప్పలుగా బ్రద్దలయ్యేనని చెప్పితిని గదా! ఆ రెండు చిప్పలే భూమ్యాకాశములు' – ఇది చెప్పు సమయమున నేను (కాణభూతి) అచటనే యుండి అది వినుచుంటిని. అపుడు పార్వతి 'స్వామీ! ఎంత కాలమునకా పుష్పదంతుడు మన వద్దకు రాగలడని శివుని ప్రశ్నించెను. శివుడిట్లు చెప్పెను.

ఈ కనబడుచున్న పిశాచము కుబేరుని కనుచరుడగు యక్షుడు. అతనికి స్థూలశిరుడను రాక్షసుడు మిత్రుడుగా కలడు. పాపాత్ముడగు ఆ రాక్షసుని స్నేహము చూచి కుబేరుడు కోపించి వింధ్యాటవి యందు పిశాచము కమ్మని వానిని శపించెను. దీర్ఘ జంఘుడను నాతని సోదరుడు కుబేరుని కాళ్లపై బడి శాపాంతమును వేడుకొనగా 'శాపవిముక్తుడైన పుష్పదంతుని వలన 'మహాకథ'ను విని, దానిని శాపము వలన మనుష్యునిగా జన్మించిన మాల్యవంతునికి చెప్పి వారిరువురితో కూడా ఇతడునూ శాప విముక్తుడు కాగలడు – అని శాపాంతమును విధించెను. –

ఇట్లు పుష్పదంతుని రాకతో నా శాపము పోవునని 'కాణభూతి' చెప్పగా, వరరుచి పూర్వజన్మ జ్ఞానము (జాతిస్మరత) పొంది, నిద్ర నుండి మేల్కొన్నట్లు – నేనే ఆ పుష్పదంతుడను నా వలన ఆ కథను వినుము. లక్ష లక్ష పరిమితిగల ఆ ఏడు మహాకథలను 'కాణభూతి'కి చెప్పెను. అంత కాణభూతి 'దేవా నీవు రుద్రుని యవతారము కాకున్న మరెవ్వరీ కథను తెలియగలరు? నీ అనుగ్రహము వలన నేను శాపముక్తుడనైతిని. నీ వృత్తాంత మును గూర్చి కూడా వివరించుము అని ప్రార్థించెను. అంత వరరుచి ఇట్లు వివరించెను.

# వరరుచి కథ

కౌశాంబియందు సోమదత్తుడు - అగ్నిశిఖుడు అను రెండు పేర్లు గల బ్రాహ్మణుడొకడుండెను. అతని భార్యపేరు వసుదత్త. ఆమె యొక మునికన్య. శాపవశమున నేను వారి కుమారుడనై జన్మించితిని. నా బాల్యముననే తండ్రి మరణించెను. తల్లి తన కాయకష్టముచే నన్ను పోషించెను.

ఒకనాడు ఇరువురు బ్రాహ్మణులు ఒకనాటి రాత్రి నివసించుటకు మా యింటి యందుండిరి. ఆ రోజు ఒక నాట్యమును చూచి ఏక శృతధరు డనగుటచే దానిని అభినయించి మా అమ్మకు చూపితిని. ఆ బ్రాహ్మణులు నన్ను ఏకశృతధరునిగా నిశ్చయించుకొని వారిలో నొకడగు 'వ్యాడి' యను వాడు నా తల్లికి నమస్కరించి యిట్లనెను.

'వేతసమను పట్టణమున 1. దేవస్వామి 2. కరంభకులను ఇరువురు బ్రాహ్మణ సోదరులు గలరు. వారిలో నొకని పుత్రుడను నేను. ఈ ఇంద్ర దత్తుడు రెండవవాని పుత్రుడు నేను పుట్టగానే నా తండ్రి పరలోక గతు డయ్యెను. ఆ దుఃఖము వలన ఇంద్రదత్తుని తండ్రి మరణించెను. మా తల్లులు గుండె పగిలి మరణించిరి. మేము ధనవంతులమైననూ ఇట్లు అనాధలమై విద్యాసక్తిచే, కుమార స్వామిని గూర్చి తపస్సు చేసితిమి. అంతట మాకు స్వప్నమునందు స్వామి కనబడి 'నందుడను రాజు పాలించు పాటలీ పుత్రమున 'వర్షుడ'ను బ్రాహ్మణుడు గలడు. అతని వలన విద్యను పొందు మని ఆదేశించెను. మేమా పట్టణమున కేగి వర్షుని గూర్చి ప్రశ్నించితిమి. ఇచట మూర్ఖుడగు వర్షుడు గలడు గాని పండితుడెవ్వడు లేడని అచటి జనులు చెప్పిరి. సందేహముతో వర్షుని ఇంటికి వెళ్ళితిమి. దరిద్రముగా నున్న ఆ యింటిలో ధ్యాననిష్ఠుడై యున్న వర్షుని చూచి, మాకు ఆతిథ్యము ఇవ్వబోవు అతని భార్యను ప్రశ్నించితిమి ఆ సాధ్వి యిట్లు చెప్పెను.

# వర్షుని కథ

శంకరస్వామి యను బ్రాహ్మణునకు నా భర్త వర్షుడు - ఉపవర్షుడు అను ఇద్దరు కుమారులు. నా భర్త మూర్ఖుడు - దరిద్రుడు. తమ్ముడీతనికి వ్యతిరేకము. అన్నగారి గృహపోషణ మొనరింప తన భార్యను నియోగించెను. ఒక వర్షాకాలమున - స్త్రీలు, బెల్లము - పిండి కలిపి గుహ్యరూపముగా ఒక వంటకము చేసి మూర్ఖ బ్రాహ్మణునికి దానమిచ్చిన శీతాకాలమున శీతబాధ, ఎండాకాలమున తాప బాధ ఉండదని భావించి దానిని నా భర్త కిచ్చిరి. నేనాతనిని దూషించగా, అతడు తన మూర్ఖత్వము నకు బాధపడి కుమారస్వామి పాదముల నాశ్రయించి తపస్సు చేసి స్వామి అనుగ్రహము వలన సకల విద్యలను పొందెను "ఈ విద్యలనన్నిటినీ ఏకశృత ధరుడగు బ్రాహ్మణునకు చెప్పి ప్రకాశింపచేయుము" అని స్వామిచే ఆదేశింప బడి సంతోషముతో యీ వృత్తాంతమును నాకు చెప్పి, నిరంతరము జప తపము లందు ధ్యాననిష్ఠుడై యున్నాడు.

కావున ఏకశృతిధరుడగు బ్రాహ్మణుని వెదికి యిచటకు గొనిరండు దాని వలన సర్వార్థసిద్ధి పొందగలరని ఆమె చెప్పగా, ఆమె దారిద్ర్యమును తొలగించుటకు నూరు బంగారు నాణెములు ఇచ్చి, ఏకశృతిధరుడగు వాని గూర్చి వెతుకుచుంటిమి. ఇచట మీ కుమారుని ఏకశృతిధరుని గాంచితిమి. విద్యయు, ధనము సంపాదించుటకై మాతో ఇతనిని పంపించుము - అని వ్యాడి చెప్పగా, ఆ తల్లి ఆదరముతో మీయందు నాకు విశ్వాసము కలుగుచున్నది. ఇతడు పుట్టినప్పుడు ఆకాశవాణి స్పష్టముగా 'వీడు ఏకశృతి ధరుడు. వర్షుని వలన విద్యనంతయు పొందగలడు. వ్యాకరణ శాస్త్రమును లోకమున ప్రతిష్ఠింప చేయగలడు. ఏది లోకములో వరమో (శ్రేష్ఠమో) అది అంతా ఇతనికి రుచింపగలదు. అందువలన ఇతడు 'వరరుచి' యను పేర ప్రఖ్యాతు డగును - అని చెప్పినది.

పిమ్మట వ్యాడి నా తల్లికి ధనమిచ్చి, వేదార్హత కలుగజేయుటకై నాకు ఉపనయనము గావించెను. పిమ్మట వ్యాడీంద్రదత్తులతో కలసి ప్రయాణ మైతిని. కొన్ని రోజులకు మేము వర్షుని ఇంటికి చేరితిమి. అతడు నన్ను శరీరధారిగా నున్న కుమారస్వామిగా నన్ను భావించెను. మరునాడు మా యందరి ఎదుట శుచియగు భూమిపై కూర్చుండి వర్షోపాధ్యాయుడు దివ్య స్వరముతో ఓంకారము చేసెను. వెంటనే అతనికి షడంగములతో వేదములు స్ఫురించెను. పిమ్మట మాకు అధ్యాపన మొనరింప మొదలుపెట్టెను. ఒకసారి వినగానే నేను, రెండుసారులు విన్న వ్యాడి, మూడు సార్లు విన్న ఇంద్ర దత్తుడును గురువు చెప్పిన దానిని గ్రహించితిమి. అపూర్వమైన ఆ దివ్యధ్వని విన్న అచట నున్న బ్రాహ్మణులందరూ వర్షోపాధ్యాయుని గాంచి సత్కరించిరి. పాటలీ పుత్రమందలి పౌరజనులందరూ మహోత్సవము పొందిరి. ఉదారు డైన నందరాజు కుమారస్వామి అనుగ్రహ వరప్రభావమును పొందిన వర్షుని చూచి సంతసించి వర్షుని యింట ధనరాశుల నింపెను.

# 1వ లంబకము - 3వ తరంగము

ఒకనాడు వర్షోపాధ్యాయుడు వేదములు చెప్పిన పిమ్మట-వరరుచి - వ్యాడి - ఇంద్రదత్తులిట్లు ప్రశ్నించిరి. స్వామీ! ఈ నగరము ఎందువలన లక్ష్మీ సరస్వతుల కిద్దరికినీ నివాసమయ్యెనో తెలుపమనగా - అతడిట్లు చెప్పెను.

"గంగాద్వారమున కనఖలమను పుణ్యతీర్థము కలదు. అచట కాంచన పాతమను దేవగజము ఉశీనర పర్వత పార్శ్వమును భేదించి గంగానదిని క్రిందికి ప్రవహింప చేసెను. అచ్చటనే దాక్షిణాత్యుడగు ఒక బ్రాహ్మణుడు భార్యతో కలసి తపము చేయుచుండెను. అతనికి ముగ్గురు కుమారులు కలరు. తల్లిదండ్రుల మరణానంతరం వారు 'రాజగృహ' మను పట్టణము చేరి విద్యలు నేర్చిరి.

పిమ్మట దక్షిణాపథమున నున్న కుమారస్వామిని దర్శింపగోరి బయలు దేరారు. సముద్రతీరమున 'చించిని' యను నగరమున భోజికుడను బ్రాహ్మణుని ఇంట బసచేసిరి. ఆ బ్రాహ్మణుడు తన ధనములతోబాటు ముగ్గురు కుమార్తెలను ముగ్గురికీ ఇచ్చి గంగాతీరమునకు వెళ్ళెను. వారట్లు మామగారింట సుఖముగా నున్నపుడు ఆ దేశమున గొప్ప కరువు సంభ వించినది. పతివ్రతలగు తమ భార్యలను వదలి వారు ముగ్గురూ ఉదర పోషణార్థము వెళ్ళిపోయారు.

ఆ సమయమున వారిలో మధ్యయామె గర్భవతి. తమ తండ్రి మిత్రు డగు యజ్ఞదత్తుని యండచేరి భర్తల పునరాగమనము కొరకు ఎదురు చూడసాగిరి. కొంతకాలమునకు ఆమెకు కుమారుడు జన్మించెను. ముగ్గురూ ఒకరి కంటే ఎక్కువగా ఒకరు ఆ బాలుని ప్రేమతో పెంచసాగారు. ఒకనాడు ఆకాశమున విహరించు ఆది దంపతులు వారిని చూసిరి. ఆ కుర్రవానిని చూచి జగన్మాత ఆ బాలుని అనుగ్రహించవలసినదని పరమేశ్వరుని ప్రార్థించెను.

అంత శివుడు 'ఇతనిని నేను అనుగ్రహించుచున్నాను. పూర్వ జన్మమున నీతడు భార్యతో కలసి నన్ను పూజించెను. అందువలన నితడు భోగము కొరకై యీ లోకమున జన్మించినాడు. ఆమె ఈ జన్మమునందు కూడా నితనికి భార్య కాగలదు అని చెప్పి ఆ ముగ్గురు స్త్రీలకు కలలో కనబడి 'మీ బాలుని పేరు పుత్రకుడు. ఇతడు నిద్రించి లేవగానే యితని తలకింద ప్రతీరోజు లక్ష వరహాలుండును. ఇతడు రాజుకాగలడు' అని అనుగ్రహించెను. నిద్ర నుండి మేల్కొనిన బాలుని తలకింద లక్ష వరహాలు చూచి ముగ్గురు తల్లులు ఎంతో సంతసించారు. ఈ విధముగా లభించిన బంగారముచే వారు అత్యంత ధనవంతులైరి. కొలది కాలమున పుత్రకుడు రాజయ్యెను. యజ్ఞదత్తుడొకనాడు పుత్రకునితో ఇట్లు చెప్పెను.

'రాజా! కరువు బాధచే నీ తండ్రులెచటికో వెళ్ళిరి. నీవు బ్రాహ్మణులకు దానము ప్రకటింపుము ఈ వార్త విని వారు రాగలరు. ఇందుగూర్చి బ్రహ్మదత్తుని కథను చెప్పెదను వినుము.

# బ్రహ్మదత్తుని కథ

పూర్వము కాశియందు బ్రహ్మదత్తుడను రాజుండెను. అతడొకనాటి రాత్రి అనేక రాజహంసలు కొలుచుచుండగా ఆకాశవీధిలో వెళ్లు రెండు బంగారు హంసలను చూచెను. మరల వానిని చూడవలెనని కోరిక ఎక్కువై రాజభోగములందు ఆదరము పోయెను. మంత్రుల యోచన మేరకు ఒక అందమైన సరస్సు నిర్మించాడు. కొంత కాలమునకా హంసలు అచటికి వచ్చినవి. అపుడు వాని శరీరము బంగారమగుటకు కారణమడిగెను.

ఆ హంసలు మనుష్య వాక్కులతో 'పూర్వజన్మమున మేము రెండు కాకులము ఒక పుణ్యమైన శివాలయమున ఆహారము కొరకు పోరాడుచు అచట నున్న ఒక గోతిలో బడి మరణించితిమి. ఆ కారణము వలన పూర్వజన్మ జ్ఞానము గల బంగారు హంసలమైతిమి' అని చెప్పగా విని రాజు ఎంతో సంత సించెను. నీవును ఇలాగే సాటిలేని దానమున తండ్రు లను కలిసిగొనగలవని యజ్ఞదత్తుడు చెప్పగా పుత్రకుడట్లే చేసెను.

దానవార్త విని ఆ ముగ్గురు తండ్రులు వచ్చి పుత్రకుని గాంచి సంత సించిరి. కొంతకాలమునకు రాజ్యకాంక్షచే పుత్రకుని వధించదలచి హంతకు లకు ధనమిచ్చి వింధ్యవాసినియున్న అడవికి పంపిరి. తన్ను చంపబోవు ఆ హంతకుల నెదిరించి వారి వలన తండ్రుల ద్రోహచింత తెలిసికొని వారికి రత్నాభరణముల నిచ్చి వారిని పంపివేసెను. ఈలోగా రాజ్యార్థులై వచ్చిన ముగ్గురినీ ద్రోహులని తెలిసి మంత్రులు హతము గావించిరి. పుత్రక మహారాజు ధర్మాత్ముడగుటచే విరక్తుడై వింధ్యారణ్యము ప్రవేశించెను. అచట రెండు పాదుకలు – ఒక గిన్నె–ఒక కర్ర కోసము యుద్ధము చేయు ఇద్దరు రాక్షసులను చూచెను. వారిని వివరములడుగగా 'మేము మయాసురుని కుమారులము మాలో ఎవడు బలవంతుడో వీటిని వాడు పొందుతాడు' అని పలుకగా –

వీటిలో ఏమి గొప్పదనమున్నదని ప్రశ్నించెను. ఈ పాదుకలు తొడిగిన ఆకాశ గమనము చేయవచ్చును. ఈ కర్రచే ఏది లిఖించిన అది సత్య మగును. ఈ గిన్నెలో ఎవడే ఆహారము కోరునో అది లభించును అని చెప్పిరి. దుర్మార్గులైన వీరి వద్ద ఇవి ఉండుట సత్‌పురుషులకు ప్రమాదమని భావించి పరుగు పందెములో ఎవరు గొప్పవారో వారి దీనిని గ్రహించమని వారికి చెప్పి వారిని పరుగులెత్తించి, పుత్రకుడు పాదుకలు తొడిగికొని గిన్నె–కర్ర తీసుకుని ఆకాశమునకెగిరి 'ఆకర్షిక' అను నగరములో దిగెను.

వేశ్యలు మోసగింతురు. బ్రాహ్మణులు తండ్రి వంటివారు. వైశ్యులు ధనలుబ్ధులు. కనుక ఎక్కడ బసచేయడమా? అని ఆలోచించి ఒక శిధిల గృహమున వున్న వృద్ధురాలిని చూచి, ఆమెకు కొంత ధనమిచ్చి రహస్యముగా పుత్రకుడు, అక్కడ నివసించుచుండెను.

ఆమె ద్వారా ఆ నగరమును పాలించు రాజునకు 'పాటలి' అను అందమైన కుమార్తె కలదని తెలుసుకొని, పాదుకల వల్ల రాత్రివేళ ఆమె అంతఃపురము చేరెను. పుత్రకుని సౌందర్యమును చూచి పాటలి కూడా మోహితురాలైనది. వారిరువురూ గాంధర్వవిధిన వివాహము చేసుకొని రహస్యముగా క్రీడించసాగిరి.

ఇలా ప్రతీరాత్రీ రాకపోకలు చేయుచుండగా ఒకనాడు రక్షకభటులు పాటలి యందు సంభోగ చిహ్నములు చూచి రాజుకు నివేదించిరి. అంత పాటలి శయ్యపై రంగు పులిమి దాని సహాయమున జీర్ణగృహమున ఉన్న పుత్రకుని బంధించ ప్రయత్నించగా పాదుకల సహా యమున పాటలిని చేరి ఆమెకు విషయము వివరించి ఆమెతో సహా ఆకాశమార్గమున పయనించి గంగాతీరమున దిగి పాత్ర ప్రభావమున దివ్యా హారము భుజించి ప్రియురాలినా నందింపజేసెను. కర్రతో చతురంగ బల యుక్తమైన నగరమును లిఖించి, రాజై మహాశక్తిచే మామను గూడ జయించి సముద్ర పర్యంత మైన భూమండలమును పాలించెను. వారిరువురి పేర్లలో వెలసిన

ఆ దివ్యనగరమే ఈ 'పాటలీపుత్రము'-ఓ కాణభూతీ ఇలా అద్భుతమైన ఈ కథను వర్షోపాధ్యాయుల ద్వారా విని విస్మయానందభరితుల మైతిమి అని వరరుచి పల్కెను.

# 1వ లంబకము - 4వ తరంగము

ఈ విధముగా వ్యాడి – ఇంద్రదత్తులతో సర్వవిద్యలను నేర్చుకొని ఒక వసంతోత్సవమునాడు ఒక నవయవ్వనవతిని చూచి మోహించితిని, ఆమె ఉపవర్షుని కుమార్తె ఉపకోశయని తెలిసి అనురాగ పాశబద్ధుడ నైతిని. ఆనాటి కలలో నాలోనున్న విద్యాదేవత సరస్వతిచే 'ఉపకోశ' పూర్వజన్మము నందునూ తన భార్యయే యని తెలిసికొంటిని. పిమ్మట వర్షోపాధ్యాయుల, ఉపవర్షుల అంగీకారము వలన ఆమెను వివాహము చేసుకొంటిని. కౌశాంబి నుండి నా తల్లిని వ్యాడి తీసుకువచ్చెను. నా తల్లి, భార్యతో సుఖముగా నున్నాను.

కొంతకాలమునకు వర్షుని వద్ద విద్యార్థుల సంఖ్య ఎంతగానో పెరిగి పోయినది. వారిలో 'పాణిని' యనువాడు మిక్కిలి మందబుద్ధి. వర్షుని భార్య అతనిని చూచి జాలిపడి తపము చేయమని ప్రోత్సహించెను. అతడు విద్యాభిలాషియై హిమాలయములకేగి ఘోరమైన తపస్సు చేసి శివుని మెప్పించి సర్వ విద్యాముఖమైన నూతన వ్యాకరణ సూత్రములను నేర్చెను. అచటి నుండి వచ్చి నన్ను వాదమునకు పిలిచెను. ఏడు దినములు మా ఇద్దరికీ వాదము జరిగిన పిమ్మట ఎనిమిదవ దినమున నేనాతనిని జయింపగా, వెంటనే ఆకాశమునందున్న రుద్రుడు మహాఘోరమైన హుం కారము చేసెను. దాని వలన భూలోకమున ఐంద్రవ్యాకరణము నశించినది. మేము మూర్ఖులమైతిమి. ఇట్లు మూర్ఖులమైన మేమంతా పాణినిచే ఓటమిని పొందితిమి. దీనికి నేనెంతో బాధపడి నా ధనమునంతా హిరణ్యగుప్తుడను వర్తకుని చేతియందుంచి ఉపకోశను ఓదార్చి నిరాహారుడనై శంకరుని తపస్సుచే మెప్పించదలచి హిమాలయము వెళ్ళితిని. ఉపకోశ కూడా నా

శ్రేయస్సు గోరి ప్రతిదినము గంగ యందు స్నానము చేయుచు నియతవ్రతయై యుండెను.

ఒక మధుమాసమున గంగాస్నానము చేయుటకు వెళ్ళుచున్న ఉపకోశను, మంత్రి కుమార - సేనాపతి - రాజపురోహితులు చూచి మోహపరవశులై ఆమెను పొందుటకై ఏకాంతమున ఆమెను వేధించసాగిరి. ఆమె ఒక ఉపాయము పన్ని ఆ ముగ్గురికీ మరునాడు రాత్రి విడి విడిగా మొదటి - రెండవ - మూడవ జాములందు తన గృహమునకు రమ్మని చెప్పినది. బ్రాహ్మణపూజకు ధనము అవసరపడి హిరణ్య గుప్తుని చేరగా అతడునూ అమె పొందు కోరెను. అమె ఆలోచించి నాల్గవ జామునందు రమ్మనెను.

అనంతరం నూనెతో కాటుకను రంగరించి అందు నాలుగు గోచీలు తడిపి యుంచి, ఒక పెద్ద భోషాణమును (పెద్ద పెట్టె) సిద్ధము చేసినది. మొదటి జామున మంత్రి కుమారుడు రాగా, ఆమె స్నానము చేసి రమ్మనగా అతడు సరేనని ఆమె చౌటిక (దాసి) ద్వారా ఒక చీకటి గదిలో ప్రవేశించి నూనెతో మర్ధించబడిన దేహము గలవాడై, ఆమె ఇచ్చిన నల్లని గోచీ ధరించి యుండగా, సేనాపతి ప్రవేశించాడు. ఉపకోశ, మంత్రి కుమారుని భోషాణములో దాగి యుండుమని అందుపెట్టి బయట గడివేసినది. సేనాపతికిని ఇట్లే చేయగా రాజపురోహితుడు వచ్చినాడు. పూర్వము వలెనే భోషాణమందు సేనాపతిని దాచినది. నాల్గవ జామున వర్తకుడు రాగా రాజ పురోహితుని భోషాణమునందు దాచినది.

పిమ్మట వర్తకునితో తన భర్త దాచిన ధనమివ్వమని అడుగగా, తన కోర్కెన తీర్చిన వెంటనే నీ భర్త ధనము నీకిత్తునని చెప్పగా, ఉపకోశ - ఓ కులదేవతలారా! ఈ హిరణ్యగుప్తుని మాటలు వినండి అని బిగ్గరగా పలికి దీపము నార్పి యితరుల వలెనే వర్తకునికీ కాటుకచే దేహము పులిమిమర్దన చేయగా తెల్లవార వచ్చినది. బయటకు పొమ్మని దాసీలు అతనిని మెడపట్టి గెంటగా, వీధి కుక్కలు తరుముచుండగా వర్తకుడెట్లో ఇల్లు చేరాడు.

ఉదయముననే ఉపకోశ నందరాజు వద్దకు వెళ్ళి హిరణ్యగుప్తుని వద్ద దాచిన ధనముకై అభియోగము చేసెను. రాజాతనిని పిలిచి విచారించగా, అదంతా అసత్యమని అతడు చెప్పగా, ఉపకోశ తనవద్ద సాక్షులు గలరని, ఆ భోషాణము తెప్పించి, ఓ కులదేవత లారా రాత్రి వర్తకుడు చెప్పిన మాటలను చెప్పమని ప్రార్థించెను.

భోషాణమున ఉన్న ముగ్గురూ భయముతో ఆమె చెప్పినదే నిజమని పలికిరి. పిమ్మట రాజు భోషాణము తెరిపించగా నిజము లోకానికి తెలిసినది. ఉపకోశ చాతుర్యమును మెచ్చుకొని, వర్తకుని వద్ద నున్న ఆమె ధనమును ఇప్పించి కామాంధులైన ఆ ముగ్గురికీ దేశబహిష్కార శిక్ష విధించెను.

హిమాలయమున ఘోరతపము గావించి, పరమేశ్వరుని మెప్పించి శివుని అనుగ్రహము వలన పాణినీయ వ్యాకరణశాస్త్ర మర్మములను నాకు ప్రకాశింపచేసెను. శివానుగ్రహము వలన పాణిని వ్యాకరణమును పూరించి తిని. పిమ్మట ఇంటికి వచ్చి ఉపకోశ వృత్తాంతమును విని ఆశ్చర్యానంద ములు పొందితిని. వర్షాచార్యులు నా ముఖమున ఈ నూతన వ్యాకరణ మును వినదలచెను. అంతట కుమారస్వామియే యాతని కదియంతయూ ప్రకాశింపచేసెను. గురుదక్షిణగా వర్షోపాధ్యాయులు మమ్ము కోటి వరహాలు కోరిరి.

ఇంతకు పూర్వము నందరాజు, ఉపకోశను తన ధర్మభగినిగా చెప్పెను. అతడు తొంబది తొమ్మిది కోట్ల ధనమున కధిపతి. కావున అతనిని యాచించిన కొంత ధనము లభించునని అతని వద్దకు వెళ్లితిమి. ఆ సమ యముననే రాజు మరణించెను. పట్టణమంతయూ కోలాహలముగా ఉన్నది. మాకునూ ఎంతో విచారము కలిగినది. మాలో యోగసిద్ధి ఇంద్రదత్తుడు 'ప్రాణవిహీనమైన ఈ రాజు శరీరమున నేను ప్రవేశించెదను.

అపుడు వరరుచి నన్ను ధనము కోరగా నేనిచ్చెదను. నేను తిరిగి వచ్చునంత వరకూ వ్యాడి నా శరీరమును రక్షించును గాక-అని చెప్పి

పరకాయ ప్రవేశవిద్యచే నందరాజు శరీరమున ప్రవేశించెను. రాజు బ్రతికెను. దేశమంతా సంతసించిరి. శూన్యమైన ఒక దేవాలయమున వ్యాడి, ఇంద్రదత్తుని శరీరము రక్షించుచుండగా నేను నందరాజు వద్దకు వెళ్ళి స్వస్తి పల్కి నాకు కావలసిన ధనమును యాచించితిని. అంతట యోగ నందుడు శకటాలుడను మంత్రిని పిలిచి, కోటివరహాలు నాకిమ్మని ఆజ్ఞా పించెను. చనిపోయిన రాజు బ్రతుకుటా, వెను వెంటనే యాచకుడు వచ్చుట చూచి మంత్రి ఆలోచించి, నిజమును గ్రహించి, నగర పరిసరము లందున్న శవములన్నిటినీ దహనము చేయమని ఆజ్ఞాపించెను.

గూఢచారులు దేవాలయమున నున్న ఇంద్రదత్తుని శవమును గాంచి వ్యాడిని ప్రక్కకు తోసి శవమును తగులబెట్టిరి. వ్యాడి వచ్చి 'అయ్యో! ప్రాణము కలిగి యోగస్థితులైన బ్రాహ్మణుని గాంచి అనాధశవమని బల వంతముగా తగులబెట్టిరి' యని రాజుకు విన్నవించగా యోగనందుడు విలక్షణమైన దుఃఖముననుభవించెను. దేహము లేకపోవుటచే రాజు దేహము నందు స్థిరుడుగా నుండవలసి వచ్చెను. మహామతి అయిన శకటాలుడు నాకు సువర్ణకోటి నిచ్చెను. ఏకాంతమున యోగనందుడు వ్యాడితో నిట్లు శోకించెను.

'బ్రాహ్మణుడై కూడా ఇట్లు శూద్రుడనైతిని' అని విలపించగా, వ్యాడి నీవు శకటాలునిచే తెలియబడితివి. అతడు మహామేధావి, త్వరలోనే నిన్ను చంపి పూర్వనందుని కుమారుడైన చంద్రగుప్తుని రాజు చేయగలడు. కావున వరరుచిని ముఖ్యమంత్రిగా చేసుకొనుము. అతని బుద్ధిబలముచే రాజ్యము స్థిరము కాగలదు' అని చెప్పి గురుదక్షిణ నిచ్చుటకు వెడలగా యోగనందుడు నాకు మంత్రిత్వము నిచ్చెను. అంత నా ముందుచూపుచే శకటాలుని అతని నూర్గురు కుమారులతో సహితముగా 'బ్రాహ్మణుడు జీవించి యుండగానే తగులబెట్టించెనను నేరము ఆధారముగా చీకటి కూపమున పడవైచి రోజుకు ఒక మూకుడు పిండి, ఒక మూకుడు నీరు ఇచ్చునట్లు ఏర్పాటు చేసెను.

అంత ఆ కూపమున వారంతా ఆలోచించి యోగనందునిపై ప్రతీకారము చేయుటకు ఒకనిని బ్రతికింపనెంచి పుత్రులందరూ త్యాగము చేసి ఆ ఆహారమును శకటాలునికిచ్చిరి. ప్రభువుల చిత్తము తెలియక, విశ్వాసము నొందక స్వేచ్ఛగా వ్యవహరింపరాదని చింతించుచూ అంధ కూపమున ఆకలి బాధచే గిలగిలలాడి మరణించిన కుమారుల కంకాళముల మధ్య నివసించుచుండెను. వ్యాడి గురుదక్షిణ నొసగి యోగనందుని వద్దకు వచ్చి ఆశీర్వదించి తపసు చేయుటకు వెళ్ల నిశ్చయించుకొనెను. యోగనందుడు 'నా రాజ్యమున భోగములననుభవింపుము. నన్ను వదలి ఎక్కడికీ వెళ్లకుము' అని కన్నీరు పెట్టుకొనెను. 'రాజా క్షణభంగురమైనదీ శరీరము, బుద్ధిమంతుడెవ్వడును ఇట్టిసారహీనములైన వాటికి పరితపింపడు. ఎండ మావుల వంటి లక్ష్మీ మోహ పెట్టజాలదు' అని బోధించి వెళ్ళిపోయెను. యోగనందుడు నాతో గూడ పాటలీ పుత్రము రాజధానిగా చేసుకొని రాజ్యము పాలించుచూ భోగముల ననుభవింపసాగెను. ఉపకోశ పరిచర్యలు చేయుచుండగా నేను మంత్రిత్వము నిర్వహించుచుంటిని.

# 1వ లంబకము - 5వ తరంగము

కొంతకాలమునకు భోగపరవశుడైన యోగనందుడు విషయవాంఛా బద్ధుడయి లాలసుడయ్యెను. అపుడు నేనిట్లు తలచినతిని "రాజు నిరంకుశుడు. అతని కార్యములు నిర్వహించు నాకు స్వధర్మము లోపించుచున్నది. కావున శకటాలుని ఉద్ధరించి నా సహాయకునిగా చేసికొందును. నేను మంత్రిత్వమున నుండగా నాతడు నాకు విరుద్ధముగా నాచరింపజాలడు" అని నిశ్చయించి చీకటి కూపము నుండి రాజాజ్ఞచే వానిని బయటకు రప్పించితిని. 'వరరుచి మంత్రిగా నుండగా యోగనందుని జయించుట అసాధ్యము. అనుకూలమైన కాలము వచ్చు వరకు వీనికి లోబడి

యుండెదను' అని శకటాలుడు మంత్రిత్వమంగీకరించి నా యిచ్చాను సారము రాజకార్యములను నిర్వహించుచుండెను.

ఒకనాడు యోగనందుడు విహారముగా బయలుదేరి గంగానది మధ్యలో అయిదు వేళ్లు కలిసి యున్న చేతిని చూచి వెంటనే 'ఇదేమిటి' యని నన్ను అడిగెను. నా రెండు వేళ్లను కలిపి ఆ దిశగా జూపగా ఆ హస్తము అదృశ్యమయ్యెను. దీని భావమేమని అడుగగా 'అయిదుగురు కలసిన లోకమున నసాధ్యమేదియని అయిదు వేళ్లను గలిపి చూపి హస్తము చెప్పెను. దానికి నేను రెండు వేళ్లను కలిపి, అయిదుగు రేల? ఇరువురొకే అభిప్రాయమున నున్న నసాధ్యమేది? యని చూపితిని అని వివరింపగా రాజు సంతసించెను.

# నవ్విన ఎండు చేప

ఒకనాడు యోగనందుడు, తన భార్య కోట కిటికీ నుండి ఒక బ్రాహ్మణుని చూచుటను గమనించి అంతమాత్రముననే కోపించి అతనిని సంహరించమని ఆజ్ఞాపించెను. అతనిని చంపుటకై వధ్యస్థలమునకు తీసుకు వెళ్లుచుండగా బజారులో నున్న ఒక ఎండుచేప బిగ్గరగా నవ్వినది. ఆ వార్త విని రాజు బ్రాహ్మణవధ నాపి చేప నవ్వుటకు కారణమునడిగెను. విచారించి తెలుసుకొనెదనని చెప్పి నేను ఏకాంతమున సరస్వతిని ధ్యానించి తిని. 'రాత్రి యందెవ్వరికి కనబడకుండ తాటి చెట్టుపై నుండుము. అచట చేప నవ్వు కారణము తెలిసికొనగలవని' పలికినది. ఆ రాత్రి తాటిచెట్టుపై కూర్చుండి పిల్ల రాక్షసులతో వచ్చిన భయంకర పెద్ద రాక్షసిని చూచితిని. ఆ పిల్లలు ఆహారమును పెట్టుమని రాక్షసినడుగగా 'అది – రేపటి దాకా నుండుడు బ్రాహ్మణుడొకడు హతుడు కాగలడు. వాని మాంసము మీకు పెట్టెదను అని పలికెను. ఈ రోజేల వధింపబడలేదని బాలురడుగగా – అతనిని చూచి ఎండు చేప నవ్వినదని బదులు చెప్పెను. ఏల నవ్వినదని వారు మరల అడిగిరి. అందుకు రాక్షసి ఇట్లనెను.

'రాజు భార్యలందరూ చెడిపోయిరి. అంతఃపురము నందంతటనూ స్త్రీ రూపములో పురుషులు సంచరించుచున్నారు. దోషములేని బ్రాహ్మణుడు వధింపబడుచుండెనని చేప నవ్వినదనెను! ఈ మాటలు విని ఉదయము ననే రాజుకు విన్నవించితిని. అంతట రాజు తన తప్పు తెలుసుకొని అంతః పురమున స్త్రీ రూపములో నున్న వారిని శిక్షించి నన్ను బహుమానించి బ్రాహ్మణుని వదిలిపెట్టెను.

ఒకనాడు చిత్రకారుడొకడు వచ్చెను. అతడు యోగనందుని, అతని పట్ట మహిషిని జీవకళ ఉట్టిపడునట్లుగా చిత్రించాడు. అతనిని రాజు గొప్పగా సత్కరించి పంపించాడు. ఆ చిత్రమును ఒక గదిలో నుంచెను. ఒకనాడు అచటకు వెళ్ళిన నాకు ఆ చిత్రమునందు సంపూర్ణ లక్షణములు గల దేవి తోచినది. అపుడు ప్రతిభా వశమున ఆమె లక్షణములందు మొలనూలు వద్ద మచ్చలేకుండుట చూచి దానిని లిఖించి సంపూర్ణ లక్షణను గావించి వెళ్ళితిని. పిమ్మట యోగనందుడు చిత్రము నందున్న ఆ మచ్చను నేను లిఖించినదిగా తెలుసుకుని, అపోహచే నన్ను అంతఃపుర ద్రోహిగా భావించి, నన్ను వధించుటకు శకటాలుని ఆజ్ఞాపించెను.

అపుడు శకటాలుడు 'వరరుచిని వధించుటకు నాకు తగిన శక్తి లేదు. అతుడు దివ్యబుద్ధి ప్రభావుడు. నన్ను ఆపదల నుండి ఉద్ధరించెను. అదియు గాక బ్రాహ్మణుడు. వీనిని రహస్యముగా నుంచుట మంచిది' అని నిశ్చయించి, విషయమంతయునూ నాకు వివరించి అతని ఇంట దాచెను. అతనికి నేను నా రాక్షసమిత్రుని గూర్చి చెప్పితిని. ఆ కథేమిటని అతడు ప్రశ్నించెను.

ఒకనాడు రాత్రి నగర సంచారము చేయుచుండగా ఒక రాక్షసుడు నన్ను బంధించి, ఈ నగరమున గొప్ప అందగత్తె ఎవరని ప్రశ్నించినాడు? నేను నవ్వి! మూర్ఖ ఎవతె ఎవ్వనికిష్టమో ఆమెయే అతనికి అందగత్తె అని

జవాబు చెప్పగా అతడు నాకు మిత్రుడైనాడు. నేను తలచిన వెంటనే వచ్చి నాకు సహాయము చేతునని బాస చేసినాడు అని వివరించితిని.

ఒకనాడు నేను విచారముతో నుండగా శకటాలుడు, ఆర్యా అంతయు తెలిసిన వాడవు, నీకీ విచారమేల రాజుల బుద్ధులు వివేక శూన్యములని ఎరుగవా? త్వరలోనే నీ దోషము పోగలదు. దానికి ఈ కథను వినుము.

# శివవర్మ కథ

పూర్వము ఆదిత్యవర్మ అనే రాజు గలడు. అతని మంత్రి పేరు శివవర్మ. రాజు భార్యలలో ఒకామె గర్భవతి అయినది. "నేనామె అంతఃపురమునకు వెళ్ళి రెండు సం.లు అయినది ఆమె గర్భమునెట్లు ధరించెనో చెప్పు"దని రాజు అంతఃపుర రక్షకులను ప్రశ్నింపగా వారిట్లనిరి.

'మహారాజా! శివవర్మ తప్ప పరపురుషుడెవ్వడును అంతఃపురమున ప్రవేశింపలేదు' అది విని మహారాజు భోగవర్మ యను మిత్రునికి లేఖ వ్రాసి శివవర్మను రహస్యముగా చంపుటకు ఆజ్ఞాపించెను. ఇది జరిగిన వారం రోజులకు ఆ రాణి స్త్రీ రూపమున నున్న యొక పురుషునితో కలసి పారిపోవుచుండగా భటులు బంధించిరి. రాజు తాను మంత్రిని నిష్కారణముగా చంపితినని పశ్చాత్తాపము చెందెను. కాని శివవర్మను భోగవర్మ చంపలేదు. రాజాజ్ఞ వినిపించగా శివవర్మ తనను చంపిన దేశమున 12 సం.లు కరువు వచ్చునని చెప్పగా భోగవర్మ ఇతర మంత్రి మండలితో నాలోచించి రహస్యముగా నుంచెను. ఇట్లు భోగవర్మ బుద్ధిబలముచే శివవర్మ సజీవుడై దోషనిర్ముక్తుడు కూడా అయినాడు.

కనుక నీవును దోషముక్తుడవు కాగలవు. అంతవరకూ నా యింట రహస్యముగా నుండుమని శకటాలుడు వరరుచిని ఓదార్చినాడు.

కొంతకాలమునకు యోగనందుని కుమారుడు హిరణ్యగుప్తుడనువాడు వేటకు వెళ్లి, చీకటి వేళలో దారితప్పి రాత్రి గడుపుటకు ఒక చెట్టు నెక్కినాడు. దానిపై ఒక ఎలుగుబంటి ఉన్నది. ఈలోగా చెట్టు కిందకు ఒక సింహము వచ్చినది. భయపడుచున్న రాకుమారునికి ఎలుగుబంటి మానవభాషలో అభయమిచ్చినది. ఆ నరుని కిందకు ద్రోయుము అని పలుకగా 'నేను మిత్రద్రోహిని కానని' ఎలుగుబంటి బదులిచ్చినది. పిమ్మట ఎలుగుబంటి నిద్రించగా సింహము రాకుమారునితో ఎలుగును కిందకు త్రోయుమని కోరగా రాకుమారుడట్లే చేసెను.

దైవవశమున ఎలుగుబంటి కిందబడక 'ఓరీ! మిత్రద్రోహీ! నీవు చేసిన ఈ ఘాతుకమునకు పిచ్చివాడవు కమ్మని శపించెను. ఆ విధముగా శాప గ్రస్తుడైన రాకుమారుడు ఇంటికి చేరగా, యోగనందుడు మిక్కిలి విచారించి అయ్యో! ఇపుడు వరరుచి యుండిన తగిన తరణోపాయమును చేసెడి వాడే అని దుఃఖించెను. అపుడు శకటాలుడు ఇదే తగిన సమయమని భావించి వరరుచిని తీసుకువచ్చి జరిగిన కథను వివరించెను. వరరుచి సరస్వతీ కటాక్షముచే రాకుమారుడు చేసిన ద్రోహకర్మను తెలుసుకొని అతనిని శాపవిముక్తుని గావించెను. ఈ వృత్తాంతము నీకెట్లు తెలిసినదని యోగనందుడు నన్ను ప్రశ్నించెను.

'రాజా! లక్షణముల వలనను, అనుమాన ప్రమాణము (తర్కశాస్త్రము) చేతనూ, మేధావులు సర్వము తెలియగలరు. నేను నీ భార్య యొక్క మచ్చను గూడ ఇట్లే తెలిసికొంటిని' అని చెప్పగా రాజు సిగ్గుపడెను. అనంతరం నేను దోషముక్తుడనైతినని భావించి నా గృహమునకు వెళ్ళగా అచటి వారందరూ నన్ను చూచి ఏడవసాగిరి. నేను రాజుచే వధించబడితినని భావించి నా భార్య ఉపకోశ అగ్నిప్రవేశము చేసినది. నా తల్లి గుండె పగిలి మరణించినదని ఉపవర్షుడు వివరించినాడు. అది విని శోకాగ్నిచే

దహింపబడినవాడనై' ఈ ప్రపంచము అనిత్యమైనది నిత్యమైనది ఏదీ లేదు. మాయామోహితుడవు కావద్దని వర్షోపాధ్యాయులు ఉద్బోధచేయగా, వైరాగ్యముచే సంసారమును విడిచి తపోవనము చేరితిని.

అనంతరము కొంతకాలమునకు అయోధ్య నుండి ఒక బ్రాహ్మణుడు నేనున్న తపోవనమునకు రాగా యోగనందుని గూర్చి అడిగితిని. అతడిట్లు చెప్పెను. శకటాలుడు యోగనందునిపై పగతీర్చుకొనుటకు సమయమునకై వేచియుండగా చాణక్యుడను బ్రాహ్మణుడు తన కాలికి గుచ్చుకున్న దర్భను పెకలించి నిర్మూలము చేసి దహించుట చూచి అతడు కోపి-క్రూర నిశ్చయు డని భావించి - నందుని గృహమున త్రయోదశీ శ్రాద్ధమునకు అగ్రభోక్తగా లక్ష వరహాల నిప్పింతునని పిలచెను. కాని శ్రాద్ధ దినమున సుబంధుడను బ్రాహ్మణునికి నందుడు అగ్రస్థానమునివ్వగా చాణక్యుడు మండిపడి 'ఏడు దినములలో ఈ నందుని చంపిగాని నా శిఖముడి వేయనని' ప్రతిజ్ఞ చేసెను. యోగనందుడీ ప్రతిజ్ఞ విని ఉగ్రుడయ్యెను.

చాణక్యుడు పారిపోవుచుండగా శకటాలుడతనిని తన గృహమున దాచెను. మంత్రి అతనికి కావలసిన సాధనములను రహస్యముగా ఇవ్వగా చాణక్యుడు ఎచటికో పోయి రాజుపై అభిచారప్రయోగము చేసెను. దాని వలన యోగనందునకు దాహ జ్వరము వచ్చి ఏడవ దినమున మరణించెను. అనంతరము యోగనందని వంశమును నిర్మూలము చేసి శకటాలుడు పూర్వనందసుతుడైన చంద్రగుప్తుని రాజు చేసెను. బృహస్పతి వంటి బుద్ధి గలిగిన చాణక్యుని అతనికి మంత్రిగా చేసి శకటాలుడు పుత్రశోక నిర్వేదము చెంది విరక్తుడై తపోవనము చేరెను.

ఈ కథ విన్న వరరుచి ప్రపంచమంతయూ చంచలమని గ్రహించి వింధ్య వాసిని దేవతను చూడగోరి, ఆమె అనుగ్రహము వలన పూర్వజన్మ

స్మృతీ, దివ్యజ్ఞానమును పొందెను అని వరరుచి తన కథను వివరించి తానీ దేహమును విడుచుటకు ప్రయత్నించెదనని, శిష్యయుక్తుడై గుణాఢ్యుడు నీ వద్దకు వచ్చువరకు ఇచటనే యుండమని అతడు తన మిత్రుడు మాల్య వంతుడని అతనికి మహాకథను వివరించిన అతనికి కూడా శాపవిముక్తి కలుగునని కాణభూతికి వివరించెను.

పిమ్మట శరీరత్యాగము చేయుటకు బదరికాశ్రమమునకు వెళ్లుచూ గంగ యందు శాకాహారమొనర్చు ఒక మునిని చూచెను. వరరుచి చూచు చుండగా దర్భను కోయు ఆ ముని చేయి తెగి రక్తము కారుచుండగా, అతనిని పరీక్షించుటకై తన తపోప్రభావముచే వరరుచి ఆ రక్తమును శాకరసము చేసెను. శాకరసమును చూచి ఆ ముని తాను సిద్ధుడనైతినని గర్వించెను. అదిచూచి వరరుచి చిరునవ్వుతో 'నీ సంగతి తెలిసికొనుటకై రక్తమును శాకరసముగా చేసితిని. నీవిప్పటికినీ అహం కారమును వదల లేదు. జ్ఞానమార్గమున కహంకారము పెద్ద ఆటంకము. నూరు యజ్ఞములు చేసిననూ జ్ఞానము లేనిచో మోక్షము సాధ్యము కాదు. ఈ విధముగా అతనికి బోధ చేసి బదరికాశ్రమమును చేరి యోగాగ్నిచే శరీరమును భస్మము చేసెను.

# 1 - 6వ తరంగము

గుణాఢ్యుడు వింధ్యవాసినిని దర్శించి ఆమె అనుగ్రహము వలన కాణభూతిని దర్శించి పూర్వజన్మ జ్ఞానము పొందెను. అపుడు పైశాచీ ప్రాకృత భాషలో తనపేరు తెల్పి పుష్పదంతుడు (వరరుచి) చెప్పిన మహా కథను తనకు చెప్పినచో తానునూ, కాణభూతియూ శాపవిముక్తులగుదురని ప్రార్థింపగా అతడు అంగీకరించి ముందుగా గుణాఢ్యుని చరితమును వివరించమని కోరగా గుణాఢ్యుడు తన జీవిత చరిత్రను ఇలా చెప్పాడు.

# గుణాఢ్యుని కథ

ప్రతిష్ఠానమున సుప్రతిష్ఠితమను పట్టణము కలదు. అచట సోమశర్మ బ్రాహ్మణునకు వత్సుడు-గుల్మడు అను ఇద్దరు కుమారులు, శృతార్ధ యను కుమార్తె గలరు. వీరి బాల్యముననే తల్లిదండ్రులు గతించిరి. సోదరులిద్దరూ తమ శక్తి కొలది చెల్లిలిని రక్షించుచుండిరి. శృతార్ధవాసుకి సోదరుడగు కీర్తిసేనుడను వానిని గాంధర్వవిధిని వివాహమాడి ఒక కుమారుని ప్రసవించెను. నేనే యాతడను. నేను పుట్టిన వేళ ఆకాశవాణి 'ఇతడొక ప్రమధ గణావతారము. గుణాఢ్యుడని కీర్తిపొందును' అని పలికెను. బాల్యము ననే నా వారందరూ మరణించగా ఒంటరినై దక్షిణా పథము చేరి సర్వవిద్యలను అభ్యసించి ప్రసిద్ధి పొంది స్వదేశమునకు వచ్చితిని. అచ్చట వివిధ వృత్తులవారు గుమిగూడి తమ తమ వివరములను ముచ్చ టించుకొనుచుండిరి. అందు ఒక వర్తకుడు తన గాధను ఇట్లు చెప్పెను.

# ఎలుకసెట్టి కథ

నేను బాల్యమునందే తండ్రిని కోల్పోయి, జ్ఞాతులు మా ధన మప హరింపగా తల్లి కాయకష్టముచే పెద్దవాడనైతిని. వ్రాతయు, లెక్కయు నేర్చిన నన్ను మా అమ్మ 'పుత్రా నీవు వర్తకపుత్రుడవు కావున వ్యాపారము చేయుము. ఈ ప్రాంతమందు విశాఖిలుడను మహా ధనవంతుడు గలడు. కులీనులగు దరిద్రులకు వ్యాపార నిమిత్తము ధన సహాయము చేయును. కనుక నీవు అతని సహాయమర్థింపుము' అని చెప్పగా నేనచ్చటికి వెళ్ళితిని. ఆ సమయ మున విశాఖిలుడు కోపముతో ఒక వ్యాపారస్తుని ఇట్లు నిందించుచుండెను.

'అదిగో ఆ నేలపై చచ్చిపడి యున్న ఆ ఎలుకను చూడుము సమర్థు డగువాడు దీనిపైనను సొమ్ము చేసుకొని ధనమార్జింప గలడు. పాపాత్ముడా! నీకిదివరకెన్నియో వరహాల నిచ్చితిని. వాని వడ్డీ మాట అటుండనీ, అసలే నాశనము చేసితివి' - ఆ మాటలు విని నేను వెంటనే విశాఖిలునితో 'నా

మూలధనముగా ఈ ఎలుకను తీసుకువెళ్ళుచున్నాను' అని చెప్పి ఆ ఎలుకను తీసుకుని అతని లెక్కలో దానిని వ్రాయించి అతడు నవ్వుచుండగా వెళ్ళి పోయితిని. ఒక కోమటి తన పిల్లి కొరకు ఆ ఎలుకను కొని రెండు దోసిళ్ల శెనగలనిచ్చెను. నేనా శెనగలను వేయించి నీటి కుండను తీసుకుని ఊరి బయట నాలుగు వీధుల కూడలియందు నీడలో కూర్చుంటిని. అక్కడికి కట్టెలు మోయు వారు ఆయాసపడి రాగా సవినయముగా చల్లని నీటిని, వేపిన శెనగలను వారికిచ్చితిని. వారంతా తలా రెండు రెండు కట్టెలను నాకివ్వగా వాటిని నేనమ్మితిని.

మరునాడునూ అట్లే శెనగలు కొన్ని కొని కట్టెలను వారికిచ్చి కట్టెలను తీసుకొంటిని. ప్రతీరోజూ ఇలాగే చేసి కొంత డబ్బు గడించి మరిన్ని కట్టెలను కొంటిని అకస్మాత్తుగా అతివృష్టి వలన కట్టెలు కరువగుటచే నా కట్టెలను ఎక్కువ ధనమున కమ్మి ఒక దుకాణము పెట్టితిని. నేర్పుగా వ్యాపారము చేయుచూ క్రమముగా మహా ధనవంతుడనైతిని. నేను బంగారపు ఎలుకను చేయించి విశాఖిలున కివ్వగా అతడు నా తెలివికి మెచ్చుకొని తన కుమార్తె నిచ్చి వివాహము చేసెను. దరిద్రుడనగు నేనిట్లు ధనవంతుడనగుటచే నన్నందరూ ఎలుకసెట్టి యని పిలుతురు. ఈ కథ విని అచట వారందరూ ఆశ్చర్య చకితులైనారు.

# వేదజడుని కథ

వేదము చదివిన అమాయక బ్రాహ్మణునకు ఒకసారి పదిమాడల బంగారము దానముగా లభించినది. అంత ఒక విటుడు "చతురిక యను వేశ్య వద్దకు వెళ్లి ఈ బంగారమిచ్చి సామము ప్రయోగింపుము నీకు లోక జ్ఞానము నేర్పును" అని సలహా ఇచ్చెను. బ్రాహ్మణుడు సరేయని చతురిక వద్దకు వెళ్ళి బంగారమునిచ్చి ఆమెచే సత్కారము పొందగా – సామవేద గానము చేయసాగెను. అచటనున్న విటులు 'ఎక్కడిదో నక్క ఇచటికి వచ్చెను

త్వరగా దీనికి అర్ధచంద్ర ప్రయోగము (చెప్పుదెబ్బలు) చేయుడు' అని పలికిరి. ఆ మాటలు విని అర్ధచంద్రాకారమైన బాణమని యర్థము చేసుకుని తాను లోకజ్ఞానము నేర్చుకొంటినని అరచుచూ బయటకు వచ్చెను. తనను పంపిన విటుని వద్దకు వచ్చి జరిగినది వివరించగా 'సామమనగా మంచి మాటలు, మంచి మాటలు పలుకమని నేను చెప్పితిని. వేశ్యా గృహమున సామవేద పఠనమేల? కనుకనే మిమ్ములను వెర్రి వైదీకులందురు' అని నవ్వుచూ అతనిని తీసుకుని వేశ్యాగృహమునకు వెళ్ళి ఆమెతో 'ఈ ద్విపాద పశువునకు బంగారమును గద్దివేయుమని' కోరగా, ఆమె అతడిచ్చిన బంగారమును ఇచ్చివేసినది. దానిని తీసుకుని వేదజడుడు ఇంటికి సంతోషముతో పోయెను.

ఈ విధముగా అనేక కథలు - గాథలు వినుచూ నేను సాతవాహన మహా రాజును చేరితిని - అచట శర్వవర్మ మొదలగు మంత్రులు పరివేష్టించి యున్నారు. శిష్య సమేతముగా నన్ను ఆ రాజు సత్కరించి 'నన్ను తన మంత్రి మండలిలో చేర్చుకొనెను. నేనచటనే యుండి 'గుణాఢ్యుని'గా కీర్తి పొంది, పెళ్ళి చేసుకుని సుఖముగా నుంటిని.

ఒకనాడు గోదావరీ తీరమున విహరించుచుండగా ఒక చక్కని ఉద్యానవనమును చూచితిని. దాని అద్భుత సౌందర్యమునకు ఆశ్చర్యము పొంది ఆ తోట వివరములను ప్రశ్నింపగా ఆ తోటమాలి ఆ వివరముల నిట్లు చెప్పెను.

పూర్వము నర్మదాతీరమున భరుకచ్ఛమను (భరూచ్; గుజరాత్) దేశము కలదు. అందు ఒక దరిద్ర బ్రాహ్మణుడు వింధ్యవాసిని నర్చించి ఆమె వరప్రభావము వలన ఒక దివ్యమైన విత్తనము పొంది ఈ ప్రతిష్ఠాన పురమున ఈ దివ్యోద్యానమును నిర్మించెనట. అనంతరము కాణభూతి, సాతవాహనునికా పేరు ఎట్లు వచ్చినదని గుణాఢ్యుని ప్రశ్నించగా ఆ కథ ఇట్లు గుణాఢ్యుడు వివరించెను.

# సాతవాహనుని కథ

పూర్వము 'దీపకర్ణి'డను రాజునకు శక్తిమతి యను భార్య కలదు. ఒకనాడు ఆమె పాము కరచి మరణించెను. శివభక్తుడగు దీపకర్ణికి స్వప్నమున పరమేశ్వరుడు కనబడి 'అడవి యందు సింహారూఢుడైన బాలుడు నీకు లభించును. వాడే నీ పుత్రుడు కాగలడు' అని చెప్పగా రాజు అడవికి బయలుదేరెను. అచట సింహాధి రూఢుడైన బాలుడు కనబడగా ఆ బాలుడు సింహము దిగి రాజువద్దకు వచ్చెను. సింహము పారిపోవుచుండగా రాజు బాణముతో దానిని కొట్టెను. వెంటనే అది ఒక మానవరూపము ధరించి ఇట్లు చెప్పెను.

'రాజా! నేను కుబేరుని సఖుడను. నా పేరు సాతుడు. ఒకనాడు గంగానది యందు స్నానము చేయు ఋషికన్యను చూచి మోహించి పరస్పరము గాంధర్వ విధిన వివాహము చేసికొంటిమి. అందుకు ఋషులు కోపించి మమ్ములను సింహరూపులను కమ్మని శపించెను. మేము ప్రార్థింపగా పుత్ర జన్మమైనచో శాపము తీరునని చెప్పెను. కొంతకాలమున కామె ఈ పుత్రుని కని మరణించినది. మహాసత్త్వుడగు ఈ బాలుని గ్రహింపుము' అని పలికి అంతర్ధానమొందెను.

రాజు ఆ బాలుని స్వీకరించి సాతుని వాహనముగా చేసుకొనెను కనుక ఆ బాలునికి 'సాతవాహను'డని పేరుపెట్టెను. అతడు పెద్దవాడైన పిమ్మట దీపకర్ణి అతనికి రాజ్యాభిషేకము చేసి అరణ్యమునకు వెళ్ళిపోయెను. కాలక్రమమున రాజ్యము విస్తరించి సాతవాహనుడు సార్వభౌముడయ్యెను.

ఒకనాడు వసంత సమయమున జలకేళి చేయుచున్న రాణులలో ఒకామె – నీళ్లు చల్లుచున్న సాతవాహనుని 'మోదకైర్దేవ పరితాడయ మాం' అని సంస్కృత భాషలో పలుకగా రాజు వెంటనే కుడుములను తెప్పించెను. ఆమె పరిహసించుచూ రాజా! జలకేళి సమయమున మోదకములతో పని ఏమున్నది. మా+ఉదకైః పరి తాడయ' అనగా 'నన్ను నీళ్లతో కొట్టవద్దు'

అని నేను పలికితిని మా+ఉదకైః అను చోట సంధి చేత 'మోదకైః' అయినది. వ్యాకరణ జ్ఞానము, సందర్భమును ఎరుగని మూర్ఖుడవైతివి అని పలుకగా మిగిలిన వారు నవ్విరి. రాజు సిగ్గుచే మిగుల పరితాపము చెంది తన మందిరమునకు వెళ్ళిపోయెను.

పాండిత్యమో -మృత్యువో ఈ రెంటిలో ఏదో ఒకటి మాత్రమే నాకు శరణ్యము అని దిగులుతో మంచమెక్కెను. రాచకార్యములు నిర్వహించక రాజు మనోవ్యాధి పీడితుడయ్యెను. రాజహంసుడను రాజ చేటకుని వలన రాజు మనోవ్యధకు కారణమును శర్వవర్మ గుణాఢ్యుడు తెలిసికొనిరి. అంత రాజునకు ఆరు సం.లలో సంస్కృత భాషను, వ్యాకరణశాస్త్రమును నేర్పెదనని 'గుణాఢ్యుడు' పలికెను.

శర్వవర్మ తాను ఆరుమాసములలో రాజును సంస్కృత పండితుని, వ్యాకరణ వేత్తను చేతునని పలికెను. అంతట నాకు ఆగ్రహము కలిగి నీవు ఆరు మాసములలో నేర్పినచో నేను సంస్కృత - ప్రాకృత - దేశభాష లను మూడింటినీ వదలివైతునని ప్రతిజ్ఞ చేసితిని. తానట్లు చేయలేనినాడు నీ చెప్పులను పన్నెండు సంవత్సరములు మోసెదనని శర్వవర్మ బదులు ప్రతిజ్ఞ చేసెను. అనంతరము శర్వవర్మ కుమారస్వామికై ఘోర తపము చేసి వరము పొంది సాతవాహనుని తన తపో ప్రభావముచే పొందిన సిద్ధిచే సకల శాస్త్ర పారంగతుని చేసెను.

శర్వవర్మ కుమారస్వామి ముఖమున నేర్చిన వ్యాకరణశాస్త్రము దేవుని వాహనమైన నెమలి యొక్క కలాపము (పింఛము) పేర 'కలాప వ్యాకరణ' మని పేరు పొందినది. కుమారస్వామి తన ఆరు ముఖములతో 'సిద్ధోవర్ణః సమామ్నాయః' అను సూత్రమును పఠించగా శర్వవర్మ తన చాపల్యముచే బదులు పల్కెను. అంత కుమారస్వామి 'నీవు చాపల్యముచే బదులు పలుక కుండినచో ఇది 'పాణిని వ్యాకరణము' కంటే గొప్పదై దానిని తొక్కివేసెడిది స్వల్పమైన శాస్త్రమగుటచే ఇది 'కాతంత్ర వ్యాకరణ' మని పేరొందును అని దీవించెను.

ఈ వృత్తాంతమును విని నేను మూడు భాషలను త్యజించి వింధ్య వాసినిని సేవించుటకు మౌనిగా మారి అరణ్యము చేరితిని. సాతవాహనుడు పూర్వజన్మలో భరద్వాజుని శిష్యుడగు కృష్ణుడను పేరు గలవాడని, ఒక ముని కన్యతో అనురాగము పొంది మునుల శాపమునకు గురై రాజుగా జన్మించెనని శర్వవర్మకు కుమారస్వామి చెప్పెనట.

అడవిలో నేను కిరాతుల వలన పైశాచీ ప్రాకృత భాషను ఆలకించి దానిని నేర్చుకొంటిని. అనంతరము నిన్ను చూచి శాప విముక్తుడనై పూర్వ జన్మ జ్ఞానమును పొందితిని అని గుణాఢ్యుడు కాణభూతితో పలికెను. అంతట కాణభూతి– గుణాఢ్యునితో "నీకు పూర్వమున గల మాల్యవంత నామము, నీ మిత్రుడైన పుష్పదంతుని ఆ పేరును ఎట్లు వచ్చినవని" ప్రశ్నించగా గుణాఢ్యుడు ఆ వృత్తాంతము నిట్లు చెప్పెను.

పూర్వము గంగాతీరమున 'బహుసువర్ణక' మను అగ్రహారము కలదు. అక్కడ బహు శాస్త్రవేత్త అయిన గోవింద దత్తుడను బ్రాహ్మణుడు కలడు. అతని భార్యపేరు అగ్నిదత్త. వారికి అయిదుగురు కుమారులు కలరు. కానీ వారంతా మూర్ఖులే. ఒకనాడు వైశ్వానరుడను బ్రాహ్మణుడు వారింటికి అతిథిగా వచ్చెను. అతడిని అయిదుగురూ పరిహసించిరి. అతడు కోపములో ఆతిధ్యము గ్రహింపకయే గోవిందదత్తుని కోపించి వెడలి పోవుటకు ప్రయత్నించగా, వీరు కుపుత్రులనియే వీరిని తాను తాకనైనా తాకనని గోవిందదత్తుడు చెప్పగా, చివరకు వైశ్వానరుడు ఆతిధ్యము స్వీకరించెను.

ఈ సంఘటన జరిగిన తర్వాత వారిలో దేవదత్తుడనువాడు నిర్వేదము పొంది తపము చేయుటకు బదరికాశ్రమము చేరెను. చిరకాల తపః ఫలముగా శంకరుడు మెచ్చి దర్శనమిచ్చెను. శంకరుని అనుచరుడుగా నుండుటకు వరము వేడుకొనగా 'విద్యలను పొంది, భోగముల ననుభవించి ఆ పిమ్మట నీ కోరిక నెరవేర గలదని' శివుడానతి నిచ్చెను. అనంతరము దేవదత్తుడు విద్యార్థియై పాటలీ పుత్రమును వేదకుంభుడను ఉపాధ్యాయుని ఆశ్రయించెను. అతని భార్య కామాతురయై దేవదత్తుని చేరగా, ఆ

ఆశ్రమమును వదలి ప్రతిష్ఠానము చేరి వృద్ధ భార్య గల 'మంత్రస్వామి' అను గురువును ఆశ్రయించి సకల విద్యలను పొందెను.

అందగాడు - విద్యావంతుడు అయిన దేవదత్తుని సుశర్మయను రాజు కూతురు 'శ్రీ' అనునది చూచి మోహితురాలయ్యెను. ఇతడును, ఆమెను కిటికీ నుండి చూచి పరస్పరాకర్షితులయిరి. అతడామె వైపు కదలగా ఆమె ఒక పుష్పమును దంతముచే గ్రహించి అతనిపై విసిరెను. రాజకుమార్తె యొక్క సంజ్ఞకు ఏమి భావమో తెలియక గురుగృహము చేరెను. గురువు శిష్యుని అన్యమనస్కతను గమనించి యుక్తిగా ప్రశ్నింపగా జరిగినదంతయూ దేవదత్తుడు వివరించెను.

ఆ సంజ్ఞ యొక్క భావము 'పుష్పదంత' దేవాలయమని, అక్కడ తనకై నిరీక్షింపు మని ఆమె అభిప్రాయమని తెలిపెను. దేవదత్తు ఆ దేవాలయమున కేగి అచట ఆమెను కలుసుకొనెను. తన సంజ్ఞ ఎట్లు తెలిసికొంటివి అని ఆమె ప్రశ్నించగా, తన గురువు దానిని వివరించెనని నిజము చెప్పెను. ఆమె కోపించి 'నీవు విదగ్ధత లేనివాడవు' అని తన సంగతి బహిర్గతమగునని భయపడి వెళ్ళిపోయినది. ఆమె విరహముచే దేవదత్తుడు ఏకాంతమున విలపించుచూ ప్రాణావశిష్టుడై యుండగా, శివుడు జాలిపడి పంచ శిఖుదను ప్రమథ గణముతో 'అతని కోరిక' నెరవేర్చుమని ఆజ్ఞాపించెను.

పంచశిఖుడు దేవదత్తుని చేరి అతనిని ఊరడించి అతనికి స్త్రీ వేషము వేసి తాను వృద్ధ బ్రాహ్మణుని వేషము ధరించి సుశర్మ వద్దకు చేరి 'రాజా! ఈమె నా కోడలు నా కుమారుడెచటికో వెళ్ళిపోయెను అతనిని వెదకుచూ నేను బయలుదేరితిని నేను వచ్చునంత వరకు ఈమెను నీ అంతఃపురమున రక్షించుమని ప్రార్థించెను. రాజు అంగీకరించెను. దేవదత్తుడు స్త్రీ వేషమున అంతఃపురము చేరి ఒకనాటి రాత్రి తమకమున తన వృత్తాంతమును రాజ కుమార్తెకు దెలిపి గాంధర్వవిధిన వివాహము చేసుకొని ఆమెతో సుఖించ సాగెను. కొంతకాలమునకు ఆమె గర్భవతి కాగా, పంచశిఖుడు

రహస్యముగా వచ్చి దేవదత్తుని తీసుకుపోయెను. పిమ్మట వృద్ధ బ్రాహ్మణ వేషము ధరించి రాజు వద్దకు వెళ్ళి తన కుమారుడిగా దేవదత్తుని చూపించి తన కోడలిని పంపించమని ప్రార్థించెను.

అంతపురమున ఆమె లేదని తెలిసిన రాజు బ్రాహ్మణ శాపమునకు భయపడి మంత్రులతో ఆలోచించి తన కుమార్తెనిచ్చి వృద్ధబ్రాహ్మణుని క్షమించమని ప్రార్థించెను. దేవదత్తుడు ఆమెతో అచటనే సుఖముగా నుండగా పంచశిఖుడు తాను వచ్చిన పని జరిగినదని వెడలి పోయెను. కొంత కాలము నకు దేవదత్తుని కుమారునికి రాజ్యమొసగి సుశర్మ 'మహీధర' మను వనమును చేరెను. అటుపిమ్మట దేవదత్తుడు కూడా వృద్ధాప్యమున వాన ప్రస్థము చేరి శివుని ఆరాధించి శివానుగ్రహము వలన మనుష్య శరీరము వదలి ప్రమథగణములో చేరెను. ప్రియురాలు దంతముతో పుష్పమును విసరుటలోని భావము తెలియని వాడగుటచే ప్రమథగణము అతనిని 'పుష్పదంతు'డని పిలువసాగిరి. అతని భార్య 'జయ' అను పేరుతో పార్వతీదేవికి ప్రతీహారిణి అయినది.

# మాల్యవంతుని పేరు కథ

దేవదత్తుని సోదరుడు సోమదత్తుడను వాడను నేను. నేను గూడ సోదరుని వలెనే నిర్వేదము చెంది హిమాలయమును చేరి శివుని మెప్పించి, పూలమాలలచే అతనిని సంతోషపెట్టి ప్రత్యక్షము చేసికొంటిని. ప్రసన్నుడైన పరమేశ్వరుని ఇతర భోగముల నాశించక ప్రమథ గణత్వమును కోరు కొంటిని. అంతట పూలను స్వయముగా గుచ్చి మాలలను చేసి నన్ను పూజించుటచే నీవు 'మాల్యవంతుడ'ను పేరుతో నా ప్రమథ గణము నందుండుము' అని శివుడనుగ్రహించెను. అంతట మానవ శరీరమును వదలి ప్రమథ గణ శరీరమును పొందితిని. మరల దేవి శాపమున మానవుడ నైతిని. ఓ కాణభూతీ శివుడు చెప్పిన ఆ మహాకథను చెప్పుము. అందుచేత ఇద్దరమూ శాపవిముక్తులము కాగలము అని చెప్పెను.

# 1 - 8వ తరంగము

గుణాఢ్యుడిట్లడుగగా కాణభూతి ఆ మహాకథను ఏడు కథలుగా నున్న దానిని తన భాషలో చెప్పెను. దానిని గుణాఢ్యుడు పైశాచీ ప్రాకృత భాషయందు ఏడు సంవత్సరములలో ఏడు లక్షల శ్లోకములతో ఏడు కథలుగా రచించెను. విద్యాధరులు దానిని తాకకుండా యుండవలెనని, వ్రాయుటకు సిరాలేక తన నెత్తుటిచే ఆ మహాకవి దానిని పైశాచీ ప్రాకృత భాషలో వ్రాసెను. అనంతరము ఆ కథను తిరిగి విని కాణభూతి శాప విముక్తుడై నిజస్థానము చేరెను. భూమియందు ఈ కథ ప్రచారము పొంద వలెనను పార్వతీదేవి శాసనము మేర దీని ప్రచారము సాగవలెనను తలంపుతో గుణాఢ్యుడు తన శిష్యులైన గుణదేవ-నందిదేవులకు దీనినిచ్చి, దీని కృతి భర్త యగుటకు రసికుడైన 'సాతవాహనుడే' సమర్థుడని నిశ్చయించు కొని అతని వద్దకు పంపెను.

శిష్యులు సాతవాహనుని వద్దకు వెళ్ళి గుణాఢ్యుడు రచించిన కావ్యమని దానిని సమర్పించిరి. గ్రంథము పైశాచి భాషలో నుండుట విని, పిశాచా కారమున నున్న వారిని చూచి విద్యాగర్వముచే అసూయచెంది రాజు "గ్రంథ ప్రమాణము ఏడు లక్షలు - భాషయా నీరసమైన పైశాచి - అక్షరములు వ్రాసినది నెత్తుటితో ఛీ! పాడు పిశాచ కథ" అని నిందించెను. శిష్యులు ఆ తిరస్కారమును భరించి తిరిగి వచ్చి గురువైన గుణాఢ్యునితో జరిగినది వివరించిరి.

అది విని గుణాఢ్యుడు మిక్కిలి విచారించి సమీపమున నున్న ఒక పర్వతము చేరి ఒక రమ్య ప్రదేశమున అగ్ని కుండము నేర్పరిచి మృగములు - పక్షులు వినుచుండగా, శిష్యులు కన్నీటితో చూచుచుండగా ఒక్కొక్క పత్రము చదివి వినిపించుచూ అగ్నికాహుతి కావించుచుండెను. ఆ కథలు వినుచూ గడ్డి మేయుట మాని లేళ్లు - అడవి పందులు - దున్నలు మొ॥ ప్రాణులు కన్నీటిని కార్చుచూ మండలాకారముగా చుట్టుముట్టి వినుచున్నవి.

ఇలా ఉండగా సాతవాహనుడు ఎండిన మాంసము భుజించుట చేత ఆరోగ్యము చెడినవాడయ్యెను. దీనికి కారణము విచారించగా వేట కాండ్రు ఇట్టి మాంసమునే యిచ్చిరని వంటవారు చెప్పిరి. వేటగాళ్లను పిలిచి విచారించగా ఇచ్చటికి దూరమున ఉన్న పర్వతమున ఒక బ్రాహ్మ ణుడు ఒక్కొక్క పత్రమును చదివి అగ్నిలో పడవేయుచున్నాడు. ప్రాణు లన్నియు అచటనే నిరాహారములై వినుచున్నవని, అందుచేతనే శుష్కించిన వాటి మాంసమే తెచ్చితిమని బదులు చెప్పిరి' - వెంటనే ఆశ్చర్యకరమైన ఈ విషయమును తెలిసికొనుటకు రాజు పరివార సమేతముగా బయలుదేరి గుణాఢ్యుని చేరెను. అచట వనవాసము వలన శరీరమంతటను జడలు అలుముకుని, కన్నీరు కార్చు మృగ మధ్యమున నున్న గుణాఢ్యుని గుర్తించి నమస్కరించి రాజా వృత్తాంతము నడిగెను.

గుణాఢ్యుడు రాజునకు పుష్పదంతుని శాపము మొ॥ కథావతారము నంతయూ పిశాచ ప్రాకృత భాషలో చెప్పెను. ఇతడు ప్రమథ గణావతారమని తెలుసుకొని రాజు గుణాఢ్యుని కాళ్ళపై బడి మిగిలిన కథను తన కను గ్రహించ మని యాచించెను. గుణాఢ్యుడంత సాతవాహన రాజుతో ఇలా చెప్పెను.

"రాజా! ఆరు లక్షల శ్లోక గ్రంథము గల ఆరు కథలు అగ్నికి ఆహుతి అయినవి. లక్ష పరిమితి గల ఈ 'నరవాహనదత్త' చరిత్రము మాత్రమే మిగిలినది. దీనినే స్వీకరింపుము. నా శిష్యులు దీనికి వ్యాఖ్యానము చెప్ప సమర్థులని తెలిపి యోగశక్తి శరీర త్యాగము చేసి శాప ముక్తుడై దేవత్వము పొందెను.

'బృహత్కథ'-అను పేరుగల ఈ కథను తీసకుని రాజు తన దోషము నకు విచారించి, మిగిలిన కథను తనతో నగరమునకు తీసుకువచ్చెను. ఆ శిష్యులను అనేక విధముల సన్మానించెను. వారితో కథను విభజించి ఆ భాషలోనే కథావతారమును చెప్పుటకై కథా పీఠమును వ్రాయించెను. నవ రసములతో నిండిన ఈ కథ దేవకథలను గూడ మరపించి నగరమందే గాక లోకము నందంతటా ప్రఖ్యాతి పొందెను.

# 2 - 1వ తరంగము

కైలాసమున శివుని ముఖము నుండి పుష్పదంతునికి, పుష్పదంతుని అవతార మగు వరరుచి నుండి భూమిపై కాణభూతికి, కాణభూతి నుండి గుణాఢ్యునికి, గుణాఢ్యుని నుండి సాతవాహన మహారాజుకు చేరిన అద్భుత మైన ఈ 'విద్యాధరుని కథ' మీరూ తెలుసుకోండి!

పాండవ వంశము నందలి జనమేజయునకు శతానీకుడను కుమారుడు వత్సదేశమును కౌశాంబి రాజధానిగా పాలించుచుండెను. శాండిల్య ముని శతానీకునిచే పుత్రకామేష్ఠి యాగము చేయించగా ఒక పుత్రుడు కలిగెను. అతని పేరు సహస్రానీకుడు. ఒకనాడు ఇంద్రునికి యుద్ధములో సహాయము చేయుటకై వెళ్ళుచూ రాజ్యమును మంత్రియగు యుగంధరుని, సేనాపతియగు సుప్రతీకుని చేతులలో నుంచెను. కాని ఆ యుద్ధమునందు శతానీకుడు వీరమరణమొందగా ఇంద్రసారధి మాతలి అతని శరీరమును తీసకువచ్చెను. భార్యయైన విష్ణుమతి దానితో సహగమనము చేసెను.

సహస్రానీకుడు రాజ్యవిస్తారము చేసి ఎంతో సమర్థతతో రాజ్యపాలన చేయుచుండెను. ఒకనాడు శత్రు విజయోత్సవము చేయుచూ ఇంద్రుడు మాతలిని పంపి తన మిత్రుని పుత్రుడగు సహస్రానీకుని స్వర్గమునకు పిలిపించెను. అచట నందనవనమున తమ తమ కాంతలతో కూడి దేవతలు క్రీడించుట చూచిన సహస్రా నీకుడు అవివాహితుడు కావున మిగుల తాపము చెందెను. అతని అభిప్రాయ మును తెలిసికొని ఇంద్రుడిట్లనెను.

రాజా! విచారించకు. నీ కోరిక తీరగలదు. నీకు కాబోయే భార్య అయోధ్య రాజైన కృతవర్మ కుమార్తె మృగావతి అను పేర పుట్టియున్నది. ఆమె నీకు భార్య కాగలదు - అని చెప్పెను. అనంతరము తిరిగి తన రాజ్యమును మాతలి రథముపై వచ్చుచున్న సమయములో తిలోత్తమ యను అప్సరస సహస్రానీకుని పలుకరించగా, మృగావతిని గూర్చి తలచుకొనుచు

ఆమె మాటలు వినిపించుకొనకయే వెడలి పోయెను. దానికామె సిగ్గుపడి కోపముతో రాజా! ఎవరిని తలచుచూ నా మాట వినిపించుకొనలేదో ఆమెతో నీకు పదునాల్గు సం.లు వియోగమును పొందెదవు గాక' అని శపించెను. మాతలి దానిని వినెను. ప్రియురాలిని గూర్చి చింతించుచూ రాజు శరీరముచే కౌశాంబిని, మనసుచే అయోధ్యను చేరెను.

వెంటనే యుగంధరాది మంత్రులతో 'మృగావతి' విషయము చర్చించగా, వారు ఒక దూతను అయోధ్యకు పంపి కృతవర్మ అంగీకరింపగా సహస్రానీకుడు – మృగావతిల వివాహము జరిపించిరి. కొంతకాలమునకు రాజునకు, మంత్రులకును కుమారులు పుట్టిరి. వారు యుగంధరుని కుమారుడు యౌగంధరాయణుడు – సుప్రతీకుని పుత్రుడు రమణ్వంతుడు, బ్రాహ్మణ మిత్రుని కుమారుడు వసంతకుడు.

మృగావతి గర్భము ధరించిన సమయమున నెత్తుటి సరస్సులో స్నానము చేయవలెనని ఆమెకు కోరిక కలిగినది. గర్భిణి కోరిక తీర్చవలెనని రాజు భావించి ఎర్రని లక్క రసముతో నింపిన సరస్సు నందు స్నానమున కేర్పాటు చేసెను. ఆమె స్నానము చేయు సమయమున ఒక పెద్ద గరుడపక్షి ఆమెను పెద్ద మాంసఖండముగా భావించి ఎత్తుకొని పోయెను. సహస్రానీకుడు ఈ విషయము తెలిసి దుఃఖితుడు కాగా మాతలి వచ్చి తిలోత్తమ శాపమును వివరించి ఓదార్చెను.

మృగావతిని తీసుకువెళ్ళిన పక్షి ఉదయ పర్వతమున ఆమెను ఉంచి, జీవించి యున్నదని తెలుసుకొని అచటనే వదలి వెళ్ళి పోయినది. పిమ్మట ఒక మునికుమారుడు వచ్చి ఆమెను రక్షించి తన గురువగు 'జమదగ్ని ఆశ్రమము'నకు చేర్చెను. అచట కొంతకాలమునకు ఒక కుమారుని ప్రసవించినది. అపుడు ఆకాశవాణి – ఇతడు ఉదయనుడను రాజు. ఇతడు సర్వ విద్యాధరులకు రాజు కాగలడని – పలికినది. జమదగ్ని ఆ బాలునకు క్షత్రియోచితములైన సంస్కారము చేసి అన్ని విద్యలను నేర్పెను. మృగావతి

పుత్రప్రేమచే తన చేతినున్న 'సహస్రానీకు'డను నామాంకితమైన కంకణ మును తీసి పుత్రునికి ఇచ్చి ధరింపచేసినది.

ఉదయనుడు ఒకనాడు వేటకై తిరుగుచూ ఒక గొప్ప సర్పమును బంధించిన కిరాతుని చూచి, తన చేతినున్న కంకణ మతనికి ఇచ్చి దానిని విడిపించెను. దానికి ఆ నాగము సంతసించి నేను వాసుకి సోదరుడనగు 'వసునేమి'ని నీ వలన రక్షింప బడితిని, మనోహరముగా స్వరములు పలుకు 'ఘోషవతి'యను ఈ వీణను స్వీకరించుము అని దానితో పాటు తాంబూలపు తీగలు, వాడిపోని పూలమాల, తిలకములనిచ్చెను. ఉదయనుడు వాటిని గ్రహించి ఆశ్రమమునకు వచ్చి ఆ విషయ మందరికీ చెప్పి సంతసించెను.

కిరాతుడు ఉదయనుడిచ్చిన కంకణమును నగరమునందు అమ్ముటకు ప్రయత్నించి రాజభటులకు చిక్కి జరిగిన వృత్తాంతమంతయూ వివరించగా, సహస్రా నీకుడు ఆ కంకణమును చూచి విచారగ్రస్తుడయ్యెను. అనంతరము ప్రియురాలిని కలుసుకొనుటకు ఉదయ పర్వతమునకు సపరివారముగా బయలు దేరెను. మార్గ మధ్యమున ఒక సాయంత్రము బడలిక దీర విశ్రమించి 'సంగతుడ'ను కథకుని పిలచి మనోహరమగు కథను చెప్పమని కోరెను. అపుడు సంగతుడిట్లనెను.

దేవా! ఏల వృధాగా తపించెదవు? శాపవిముక్తుడవైన నీవు త్వరలోనే నీ భార్యను పొందగలవు. మానవులకు సంయోగ వియోగములు కలుగు చుండును. అందుకు ఒక చక్కని కథ కలదు. దానిని చెప్పెదను వినుము.

# శ్రీదత్తుని కథ

పూర్వము మాళవదేశమున యజ్ఞసేనుడను బ్రాహ్మణుడు కలడు. అతనికి కాలనేమి - విగతభయుడను ఇద్దరు కుమారులు గలరు. బాల్యము ననే తండ్రి మరణింపగా వారు పాటలీపుత్రమును చేరి అచ్చట దేవశర్మ యను ఉపాధ్యాయుని చేరి సర్వవిద్యలను నేర్చిరి. పిమ్మట దేవశర్మ వారి

విద్యా, గుణములకు మెచ్చి తన ఇద్దరు కుమార్తెలనూ వారిరువురికీ ఇచ్చి వివాహము చేసెను. కాలక్రమములో కాలనేమి గొప్ప ధనవంతుడయ్యెను. శ్రీదేవి మెప్పించి ఆమె వర ప్రభావమున కాలనేమి ఒక పుత్రుని పొంది అతనికి 'శ్రీదత్తుడ'ని పేరు పెట్టెను.

శ్రీదత్తుడు బ్రాహ్మణుడైననూ అస్త్ర విద్యయందు, బాహు యుద్ధము నందూ సాటిలేనివాడయ్యెను. కాలనేమి సోదరుడు విగతభయుడు భార్య సర్పదష్టయై మరణించగా తీర్థయాత్ర చేయుటకై వెళ్ళిపోయెను. శ్రీదత్తునకు రాజకుమారుడైన విక్రమశక్తి, దాక్షిణాత్యులైన బాహు యుద్ధవేత్తలగు మహా బల వ్యాఘ్రభట - ఉపేంద్రబల-నిష్ఠురులను వారితో స్నేహము ఉండెడిది. ఒక వర్షాకాలములో శ్రీదత్తుడు మిత్ర పరివారములో గంగాతీరమున విహరించుచుండగా నదిలో కొట్టుకొని పోవుచున్న ఒక స్త్రీని చూచి ఆమెను రక్షించుటకై నదిలో దుమికెను. కాని క్షణములో నతడొక దివ్యమైన శివా లయమును చూచెను. అచట నీరుగాని, స్త్రీ గాని కనబడలేదు. ఆశ్చర్యముతో శ్రీదత్తుడు శివునికి నమస్కరించి ఆ రాత్రి ఆ శివాలయమునందే గడిపెను.

ప్రాతఃకాలమున ఒక స్త్రీ శివాలయమునకు వచ్చి శివుని పూజించి మరలి పోవుచుండగా ఆమెయే నదిలో కొట్టుకుని పోవుచున్న స్త్రీగా గుర్తించి శ్రీదత్తుడు ఆమె ననుసరించి ఆమె గృహమునకు చేరెను. అక్కడ ఆమె ఏడ్చుచుండగా కారణమడిగెను. ఆమె యిట్లనెను.

రాక్షసరాజగు బలిచక్రవర్తి వంశములోని వేయిమంది మనుమరాండ్రు గలరు. వారిలో నేను జ్యేష్ఠురాలను. నాపేరు విద్యుత్ ప్రభ. మేము విష్ణువుచే పరాభవితులమై మా నగరము ప్రవేశించకుండా ఒక సింహమును కాపలాగా వుంచెను. ఆ సింహమును నీవు సంహరించినచో నీవు "మృగాంకమను" ఖడ్గమును పొందగలవు. దాని మహిమచే గొప్ప రాజువు కాగలవు అని చెప్పగా శ్రీదత్తుడు బయలుదేరి సింహమును సంహరించి ఖడ్గమును పొంది వారిని విడిపించెను.

అంతట విద్యుత్ ప్రభ ఒక బావి యందు స్నానము చేయమని శ్రీదత్తుడికి చెప్పగా సరేనని బావిలో మునిగి పూర్వము తానెచట గంగానదిలో దుమికెనో అచట తేలెను. పాతాళము నుండి పైకి వచ్చి తన దగ్గర నున్న ఖడ్గమును, విద్యుత్‌ప్రభ ఇచ్చిన విషము హరించు ఉంగరము చూచి ఆమె తనను మోసగించినదని విషాదము పొందెను. అచట నుండి తన మిత్రులను వెదకుచు బయలుదేరగా మార్గమున "నిష్ఠురకుడు" అను మిత్రుని చూచి ఈ మధ్య జరిగిన విషయములను అడిగెను. అతడు యిట్లు చెప్పెను.

నీవు గంగానదిలో దుమికిన పిమ్మట నీ కోసము చాలా దినములు వెతికి నీవు మరణించితివని మేము కూడా ఆత్మహత్యకు ప్రయత్నింపగా నీవు బ్రతికి యుంటివని, త్వరలో మమ్ము కలుసుకొనగలవని ఆకాశవాణి పలికినది. విక్రమశక్తి రాజై నీపై గల పాతవైరముచే నీ తండ్రిని దొంగతన మారోపించి కొరత వేయించెను. అది చూచి అతని భార్య గుండె పగిలి మరణించెను. ఈ విషయము విని శ్రీదత్తుడు తల్లిదండ్రుల మరణమున కెంతయో చింతించి ప్రతీకారము తీర్చు కొనుటకై తగిన సమయమును ఆలోచించుచు నిష్ఠురకునితో కలసి యితర మిత్రులను కలియుటకు "ఉజ్జయిని"కి బయలుదేరెను.

మిత్రునకు తాను గంగానదిలో దుమికినది మొదలు జరిగిన దంతయూ తెలుపుచూ మార్గమధ్యమున ఒక స్త్రీని చూచి ఆమె దారి తప్పినదని తెలిసికొని జాలిపడి తమ కూడా తీసుకొని బయలుదేరెను. రాత్రి యందు ఒక చోట బసచేయగా అర్థరాత్రమున ఆ స్త్రీ నిష్ఠురకుని చంపి తినసాగినది. శ్రీదత్తుడు వెంటనే తన మృగాంకమను ఖడ్గముతో ఆమెను సంహరించబోవుగా ఆమె దివ్యరూపము దాల్చి స్వామీ నేను "కౌశికముని" శాపము వలన రాక్షసరూపము పొందితిని. నీ ఖడ్గ ప్రభావముచే శాపము తొలగినది. వరము కోరుకొనుము అని చెప్పగా. శ్రీ దత్తుడు తన మిత్రుని బ్రతికింపుమని కోరెను. అట్లే యగును గాక!

అని చెప్పి ఆమె అంతర్ధానమయ్యెను. నిష్టురకుడు పూర్వము వలె అయ్యెను. మరునాడు ఉదయమున మిత్రులిద్దరూ బయలుదేరి ఉజ్జయినీ చేరి ఇతర స్నేహితులను కలుసుకొని సుఖముగా నుండిరి.

ఒక వసంతోత్సవ సమయమున బింబికి అను రాజు కూతురు మృగాంకవతి యనునది తోటలో విహరించు శ్రీదత్తుని చూచి మోహితురాలైనది. శ్రీదత్తుడు కూడ ఆమె యందు ఆకర్షితుడై తరచు ఆమెను కలుసుకొనుచుండెను. ఒకనాడు ఆమె తోటలో తిరుగుచుండగా పాము కాటు వేసినది. శ్రీదత్తుడు తన వుంగర ప్రభావముచే ఆమెను బ్రతికించెను. రాజు సంతోషముతో ఇచ్చిన ధనమునంతయు మిత్రులైన బాహుశాలి, తదితరుల కిచ్చెను.

తన ప్రియురాలినే తలంచుచూ శ్రీదత్తుడు పరితపించుచుండగా మిత్రులందరూ కలసి మృగాంకవతితో ఎచ్చటికైనా వెళ్ళి పొమ్మని చెప్పిరి. మిత్రులు రహస్యముగా రాజపుత్రుని అపహరించి ఎవ్వరికి తెలియకుండా మధురాపురము వెళ్ళుటకు ఆలోచించిరి. మరునాడు ఉదయము బాహుశాలి తన ముగ్గురు స్నేహితులతో వర్తకము చేయుటకై మధురాపురము వెళ్ళు చున్నామని బయలుదేరి దారి పొడుగునా రాజపుత్రి వచ్చుటకు గూఢముగా చతురములైన గుఱ్ఱములను అంచె లంచెలుగా సిద్ధము చేసెను.

శ్రీదత్తుడు మృగాంకవతికి తన ప్రణాళిక చెప్పి ఆమెను సిద్ధపరచెను. సమ యము చూసి శ్రీదత్తుడు ఒక స్త్రీని కుమార్తెతో కూడ బాగుగా కల్లు త్రాగించి రాజపుత్రిక యింటిలో ఉంచెను. రాజపుత్రిక మారువేషమున తన చెలికత్తెతో కలసి ఆయింటికి నిప్పంటించి శ్రీదత్తుని మిత్రులతో వెడలి పోయెను. రాజపుత్రిక తన సఖితో అగ్నికి ఆహుతి ఆయెనని లోకము తలచెను. ప్రొద్దుట శ్రీదత్తుడు జనులకు కనపడెను. రెండవ నాటి రాత్రి మృగాంకవతిని కలుసుకొనుటకై బయలుదేరెను. కొద్ది రోజుల పిమ్మట మిత్రులను కలుసుకొని రాజసఖిని మాత్రమే చూచి రాజకుమార్తెను గురించి ప్రశ్నించెను. వారిట్లు పలికిరి.

మిత్రమా! యిచ్చట మమ్ము దారి దోపిడీ గాండ్రు హింసించి రాజ కుమార్తెను ఎత్తుకొని పోయెను. ఆమెను రక్షించుము అని చెప్పగా, శ్రీదత్తుడు అతివేగముగా గుఱ్ఱముపెక్కి బయలుదేరి దోపిడీ దొంగలను కలుసుకొని తన మృగాంకమను ఖడ్గముచే వారిని సంహరించి, మృగాం కవతిని రక్షించి తిరిగి వచ్చునంతలో గుఱ్ఱము గాయ ములచే మరణించినది. మృగాంకవతి భయముచే, ఆయాసముచే బడలిక చెంది నీరసించగా ఆమెకు నీళ్ళు తెచ్చుటకై ఆమె నచట నుంచి కొంతదూరమేగెను.

ఇంతలో సూర్యుడస్తమించెను. నీళ్ళు తీసుకుని వచ్చుచూ దారి తప్పుటచే విలపించుచూ ఆ రాత్రి అచ్చటనే గడిపెను. ఉదయమున గుఱ్ఱము పడి వున్న చోటికి వచ్చిననూ రాజపుత్రిక కనపడలేదు. పొరపాటున ఖడ్గమును క్రింద నుంచి ఆమెను చూచుటకై ఒక చెట్టు నెక్కెను. ఒక కోయరాజు ఆ మార్గమున పోవుచూ ఆ కత్తిని తీసుకొనెను. శ్రీదత్తుడు చెట్టుపై నుండి తన ప్రియురాలను గూర్చి వివరమడిగెను. నీవు మా పల్లెకు రమ్ము అచ్చటనే ఆమె యున్నది. ఈ కత్తిని నీకీయగలను. అన్న అతని మాటలను నమ్మి అతని ననుసరించి కోయగూడెము చేరి బడలికచే నిద్రించగా వారతనిని బంధించిరి. క్షణకాలము సుఖము, క్షణకాలము దుఃఖము ఏర్పడుట తలచుకొని శ్రీదత్తుడు దుఃఖించెను.

కోయలు అతనిని కాళికాదేవికి బలియిచ్చుటకు మేపుచుండిరని ఒక దాసి ద్వారా తెలుసుకొనెను. దానిని తప్పించుకొనుటకు కోయదొర కూతురు సుందరి యనునది శ్రీదత్తునిపై మోహము పొందియున్నదని తెలుసుకొని ఆమెను గాంధర్వ విధిన వివాహము చేసికొనెను. ప్రతిరాత్రీ ఆమె అతని సంకెళ్ళు తొలగించుచున్నది. అచిరకాలమునే ఆమె గర్భవతి అయినది. ఆమె తల్లి ఈ వృత్తాంతమంతయూ తెలిసికొని శ్రీదత్తుని వద్దకు వచ్చి

"నాయనా ఈ సుందరి తండ్రి మహాకోపి అతని పేరు శ్రీచండుడు. ఈ విషయము తెలిసిన నిన్నుక్షమించడు. కావున నీవు పారిపొమ్ము సుందరిని మాత్రము మరువకుము"అని చెప్పి అతనిని విడిచి పెట్టెను.

శ్రీదత్తుడు మృగాంకవతిని వెదకుచూ మరల ఆమె అపహరింపబడిన చోటును సమీపించెను. అచ్చట ఒక బోయవాని వలన మృగాంకవతి మధురాపుర సమీపమున నాగస్థలము వద్ద "విశ్వదత్తుడ"ను వృద్ధ బ్రాహ్మణుని యింట అతనిచే ఉంచబడినదని తెలుసుకొని అచటకు బయలు దేరెను. విశ్వదత్తుని యింటికి వెళ్ళి మృగాంకవతిని గూర్చి యడుగగా మధురానగరమున తన మిత్రుడగు ఉపాధ్యాయుని వద్ద సురక్షిత ముగా నుంచితిని. కనుక ఈ దినమిచ్చట విశ్రమించి ఉదయమునే బయలు దేరుమని చెప్పెను. శ్రీదత్తుడు మరనాడు బయలుదేరి మధురానగరము చేరి పట్టణము వెలుపల నున్న ఒక దిగుడు బావి యందు స్నానము చేయుటకై దిగెను.

కొందరు దొంగలు ఒక వస్త్రము చివర హారమును ముడి వైచి అచ్చట దాచిరి. శ్రీదత్తుడు ఆ ముడిని చూడకయే ఆ వస్త్రమును గ్రహించి మధురా పురిని ప్రవేశించెను. నగర భటులు ఆ వస్త్రమును ఆనవాలు పట్టి హారమును కనిపెట్టి అతడే దొంగయని భావించి నగరాధిపతి యొద్దకు తీసుకువెళ్ళిరి. అతను మరణశిక్ష విధించెను. డప్పులు మ్రోగించుచూ తలారులు శ్రీదత్తుని తీసుకొని వెళ్ళుచుండగా మృగాంకవతి అది చూచి విలపించుచూ ఉపాధ్యాయునికి మొరపెట్టుకొనగా అతడు రాజునకు చెప్పి తలారులను నివారించి శ్రీదత్తుని విడిపించి తన యింటికి తీసుకొని వెళ్ళెను. ఆ ఉపాధ్యాయుడు ఎవరో కాదు, కొన్ని సంవత్సరముల క్రితము దేశాంతర గతుడైన శ్రీదత్తుని పినతండ్రి "విగతభయుడే" అతనిని గుర్తించి పినతండ్రి కాళ్ళపై పడెను. అతడును శ్రీదత్తుని తన అన్న కుమారునిగా తెలుసుకుని

కౌగిలించుకుని ఆదరించెను. శ్రీదత్తుడు మృగాంకవతిని అచ్చటనే వివాహమాడి పిన తండ్రితో కలసి అతని భాగ్యమును అనుభవించుచూ సుఖముగా నుండెను.

# 2-2వ తరంగము

ఒకనాడు శ్రీదత్తునితో పినతండ్రి ఇట్లు చెప్పెను. 'నాయనా! ఈ శూరసేన మహారాజునకు ఒక కుమార్తె కలదు. అవంతీ దేశమునకు నేనామెను తీసుకు వెళ్లవలసి వున్నది. మార్గమధ్యమున ఆమెను నీవు పరిగ్రహించిన నీవు రాజువు కాగలవు. నేను సహాయము చేసెద'నని చెప్పెను. అంతట ఆమెను తీసుకుని వెళ్లు పినతండ్రితో కలసి ఆమెను పరిగ్రహించి ఆ సైన్యముతో కలసి వింధ్యాటవిని చేరెను.

అచట మరల గొప్ప దొంగల సైన్యము వలన అడ్డగింపబడి ధన మంతయు కొల్లగొట్ట బడి శ్రీదత్తుడు మూర్ఛనొందెను. అతనిని చండికాలయ మున బలినిచ్చుటకు తీసుకొని పోగా అచ్చట శ్రీ చందుని కుమార్తె సుందరి శ్రీదత్తుని గుర్తించి రక్షించెను. ఆమె సహాయముతో పినతండ్రిని, భార్యను విడిపించి 'మృగాంక'మను ఖడ్గమును తిరిగి పొంది శూరసేన మహారాజు నగరము చేరి బింబకి - శూరసేన మహారాజు మామగార్ల అభిమానము పొంది, బాహుశాలి మొ॥ మిత్రులను ఆదరించెను. పిమ్మట శ్రీదత్తుడు తన తండ్రిని చంపిన విక్రమశక్తిపై దండెత్తి అతనిని చంపెను. మృగాంకవతి పట్టమహిషిగా ముగ్గురు రాణులతో సుఖముగా నుండెను. ఓరాజా! ఈ విధముగా ధైర్యవంతులు వియోగదుఃఖమును దాటి సుఖసంతోషములను పొందెదరు.

సంగతుకుని వలన పైన చెప్పిన కథను విని సహస్రానీకుడు సుఖముగా నిద్రించెను. మరునాడు ఉదయమే బయలుదేరి కొద్ది దినములకు జమదగ్ని ఆశ్రమము చేరి భార్య అయిన 'మృగావతి'ని కుమారుడైన

'ఉదయనుని' తీసుకుని ఋషి వద్ద అనుజ్ఞ పొంది తన నగరమైన కౌశాంబి చేరెను. ఉదయనునికి యౌవరాజ్య పట్టాభిషేకము గావించి తన మంత్రి కుమారులగు, యౌగంధరాయణ- రమణ్వంత - వసంతకులను అతనికి సహాయకుల గావించెను. అతనంతరము కుమారునిపై భారముంచి సహస్రా నీకుడు మృగావతితో తాను చిరకాలము నుండి కోరుకున్న రాజ్యభోగముల ననుభవించెను. వృద్ధావస్థ యందు భోగములందాసక్తి సన్నగిల్లి సహస్రా నీకుడు భార్యతో, మంత్రులతో కలసి తమ వంశములోని పూర్వుల వలెనే హిమాలయమునకు మహాప్రస్థానము చేసెను.

# 2 - 3వ తరంగము

ఉదయనుడు కౌశాంబి యందుండి వత్సరాజ్యమును చక్కగా పాలించుచుండెను. యౌగంధరాయణాది మంత్రులందు రాజ్యభారము నుంచి వేటయందు, సుఖములందూ ఆసక్తుడై కాలము గడుపుచుండెను. ఘోషవతి యను వీణను వాయించుచూ దానికి ఆకర్షితులైన ఏనుగులను బంధించుట యందు ఎంతో నేర్పరి అయ్యెను. తనకు తగిన భార్య ఉజ్జయినీ రాజైన చండమహాసేనుని కుమార్తె వాసవదత్త యని తెలుసుకొని ఆమెను పరిణయమాడుటకు తగిన ఉపాయము నాలోచించుచుండెను. చండ మహా సేనుడు కూడా తనకు తగిన అల్లుడు ఉదయనుడే యని భావించి అతనిని మాయోపాయమున తన వద్దకు రప్పించి కుమార్తె నివ్వవలెనని తలచినాడు.

ఉదయనునికి గల వేట వ్యామోహమును తెలుసుకుని ఒక అద్భుత మైన యంత్ర గజమును నిర్మించి అందు సైనికులను దాచి అడవి యందుంచినాడు. గొప్పదైన ఆ గజమును గూర్చి విని దానిని బంధించుటకై వేటకు బయలుదేరిన ఉదయనుడు అడవి యందు దానిని చూచి అచ్చెరు వొంది దానిని వెంబడించెను. అది ముందుకు వెళ్ళుచుండగా "ఘోషవతి"ని వాయించుచూ ఉదయనుడు దానిని ఆకర్షించుటకు ప్రయత్నించెను.

గాంధర్వమునందు లగ్నమనస్సు గలవాడగుటచే, సాయం చీకటుల చేతను అది మాయాగజమని ఉదయనుడు తెలిసికొనలేకపోయెను. కొంత దూర మేగిన తర్వాత యంత్రగజము నుండి సైన్యము వచ్చి ఉదయనుని బంధించి ఉజ్జయినీ తీసుకువెళ్ళిరి. చండమహాసేనుడు ఉదయనుని సత్కరించి తన కుమార్తె అయిన వాసవదత్తకు 'సంగీతము' నేర్పమని అర్థించెను. ఉదయ నుడు 'సరే' యని అంగీకరించెను.

చండ మహాసేనుడు ఉజ్జయినీ రాజైన జయసేనుని పుత్రుడు, మహేంద్రవర్మ మనుమడు. చండికను ఆరాధించి ఖడ్గమును పొంది చండ మహాసేనుడని బిరుదు పొందినవాడు. అంగారకుడను రాక్షసుని కుమార్తె అయిన అంగారవతిని వివాహమాడెను. ఆమె యందు గోపాలకుడు-పాలకుడు అను కుమారులను పొందెను. పిమ్మట ఇంద్రోత్సవ మాచరించి ఇంద్రుని అనుగ్రహముచే గొప్ప సౌందర్యవతి అయిన కుమార్తెను పొందెను. వాసవుని (ఇంద్రుని) అనుగ్రహము వలన జన్మించినది కావున ఆమెకు 'వాసవదత్త' యని పేరుపెట్టెను. ఆమె జన్మించినపుడు 'నీకు మన్మధుడు పుత్రుడై విద్యాధరరాజు కాగలడని' దివ్యవాణి పలికెను.

## 2 - 4వ తరంగము

ఉదయనుడు వాసవదత్తకు సంగీతము నేర్పుచూ సంగీతశాల యందే నివసించుచుండెను. కౌశాంబి యందు తమ రాజు బంధితుడైనాడని కల్లోలము చెలరేగినది. ప్రజలందరూ కోపించి ఉజ్జయినిని ముట్టడింప దలచిరి. ధీరుడైన యౌగంధరాయణుడు వారిని శాంతిపచేసి కపటో పాయము చేతనే దీనికి ప్రతిక్రియ చేయవలెనని, అనవసరముగా బల వద్విరోధము వహించి జననష్టము పొందుట తగదని వారిని ఓదార్చెను. రాజ్యభారము రమణ్వంతునిపై నుంచి వసంతకునితో యౌగంధరాయణుడు ఉజ్జయినికి బయలుదేరెను. మార్గమధ్యమున వింధ్యారణ్యము నందు ఉదయ

నుని మిత్రుడగు కోయరాజు పుళిందుని సన్నద్ధముగా నుంచి, ఉజ్జయిని యందలి మహాకాల శ్మశానము చేరెను. అచట 'భేతాళ శక్తి'ని స్వాధీనము చేసుకొని ఆ శక్తిచే తన రూపమును ముసలి గూనివానిగా మార్చుకొని, వసంతకుని బానకడుపు, మిట్టపండ్లు గల వికారరూపునిగా మార్చి ఉజ్జయినీ నగరమున ప్రవేశించెను.

వీరి 'హాస్య ప్రదర్శన' ఆ నగరమందు ఎంతో పేరు పొందగా వాసవదత్త ఆకర్షితురాలై ఆ ప్రదర్శన చూచుటకు వారిరువురినీ సంగీత శాలకు పిలిపించినది. వారచట ఉదయనుని చూచి కన్నుల నీరిడి అతనికి సంజ్ఞ చేయగా రాజు వారిని గుర్తించి ప్రదర్శనానంతరం వారితో ఏకాంతముగా ముచ్చటించెను. తరువాత ఏమి చేయవలెనో వారాలోచించిరి. సంగీత శాలకు వారు కోరినప్పుడల్లా వచ్చుటకు అనుమతి పొందిరి. ఒకనాడు వాసవదత్త వసంతకునితో మనసు రంజింపచేయు 'కథ' ఒకటి చెప్పమని కోరగా హాస్యరస ప్రధానమగు 'లోహజంఘుని' కథ ఇట్లు చెప్పెను.

# లోహ జంఘుని కథ

కృష్ణుడు జన్మించిన మధురా నగరమందు 'రూపణిక' అను ఒక వేశ్య కలదు. ఆమె తల్లి 'మకరదంష్ట్ర'. ఒకనాడు ఆ వేశ్య దేవాలయము నందు 'లోహ జంఘు'డను బ్రాహ్మణుని సౌందర్యము చూచి మోహితురాలై అతనిని తన ఇంటికి పిలిచి అతనితో సరససల్లాపములు సాగించెను. కాలక్రమమున అతడు ఆ ఇంటి యందే నివసించడం చూచి 'మకరదంష్ట్ర'కు ఒళ్లుమండి కుమార్తెతో ఇలా అన్నది.

'అమ్మాయీ! ఎందుకే ఈ డబ్బులేని పురుషుని సేవించుచున్నావు. సజ్జనులు శవమును ముట్టరు, వేశ్యలు దరిద్రుని తాకరు. అనురాగమెక్కడ? వేశ్యాత్వమెక్కడ? కావున ఈ నిర్ధనుని వదలివేయుము' – ఆ మాటలు విని రూపణిక కోపించి – అమ్మా! నీవట్లు మాట్లాడకు. నాకీతడు ప్రాణముల కంటే ప్రియుడు. నాకు ధనమధికముగా గలదు. వేరే ధనమేల? అని

బదులు చెప్పినది' మకరదంష్ట్ర మారుమాట్లాడక లోహజంఘుని వెడల గొట్టుటకై తగిన ఉపాయము వెతుకుచుండెను. కొంతకాలము తరువాత ఒక రాజపురుషుని ఆశ్రయించి అతని సైన్య సహాయముచే రూపణిక ఇంట లేని అదను చూచి లోహజంఘుని గృహము నుండి వెడల గొట్టించినది. రూపణిక ఇంటికి వచ్చి దుఃఖముచే మంచము పట్టినది.

లోహజంఘుడు చేయునది లేక దేశ దిమ్మరిగా తిరుగుచూ ఒక చోట ఏనుగు కళేబరము చూచెను. దాని శరీరమంతయూ నక్కలు డొల్ల చేసినవి. అతడు జఘన మార్గమున లోపలికి ప్రవేశించి బడలికచే అచటనే నిద్రించెను. అంతలో కుంభవృష్టి కురియుట మొదలు పెట్టినది. ఆ వానకు ఏనుగు చర్మము సందులేకుండా మూసుకు పోయినది. జలప్రవాహము వచ్చి గజచర్మమును తీసుకొని ఒక నదిలో పడవైచెను.

అపుడు ఒక గరుడపక్షి ఆ ఏనుగును సముద్రమందున్న ఒక లంకకు ఎత్తుకు వెళ్ళి దానిని చీల్చగా లోపలనున్న 'లోహజంఘుని' చూచి ఎగిరి పోయినది. అతడు బయటకు వచ్చి చూడగా ఇద్దరు రాక్షసులు సముద్రము దాటి ఇతడు ఎట్లు వచ్చెనో అని భయపడి – అతనిని తీసుకుని రాజైన విభీషణుని వద్దకు తీసుకువెళ్ళిరి. విభీషణుడు మానవులందు ఆదరము గలవాడగుటచే అతనిని గౌరవించి వివరము లడిగెను. అంత లోహ జంఘుడు తెలివిగా ఇట్లు బదులు చెప్పెను.

"నేను లోహ జంఘుడను బ్రాహ్మణుడను, మధురయందు విష్ణువు గూర్చి తపస్సు చేసితిని అపుడు శ్రీమన్నారాయణుడు నాకు కలలో కనబడి 'విభీషణుని వద్దకు వెళ్లుము. అతడు నా భక్తుడు, నీ దరిద్ర బాధ తీర్చగలడని చెప్పగా, 'నేనెక్కడ? విభీషణుడెక్కడ? అని నేనంటిని. కాని అంతలోనే మేల్కొని చూడగా సముద్రమందున్న ఈ లంకలో నుంటిని అంతకంటే నేనేమీ ఎరుగను"– అని చెప్పెను.

ఈ మాటలు విని లంక ఇతరులు ప్రవేశింప శక్యము కానిదగుటచే ఇది నిజముగా దేవతా మహిమయని విభీషణుడు తలచెను. పిమ్మట లోహజంఘునకు బహుధనమిచ్చి, 'స్వర్ణమూల'మను పర్వతమునకు రాక్షసులను పంపి ఒక గరుడపక్షి పిల్లను తెప్పించి లోహజంఘునకు మచ్చిక చేసుకొనుటకు ఇచ్చెను. కొంతకాలము పిమ్మట మధురకు వెళ్ళుటకు అనుమతిని కోరగా విభీషణుడు లోహజంఘునకు అమూల్యమైన రత్నములనిచ్చి, మధురవాసియగు హరికిమ్మని బంగారపు శంఖచక్ర గదాదుల నిచ్చెను.

అవి తీసుకుని గరుడపక్షి నెక్కి లంక నుండి బయలుదేరి సముద్రమును దాటి మధురను చేరెను. నగరము బయట ఒక శూన్యాలయమున రత్నములను దాచి, పక్షిని ఒక చెట్టుకు కట్టి ఒక రత్నమును అంగడిలో అమ్మి వస్త్రములను, ఆహారమును తీసుకొని శూన్యాలయము చేరి పక్షికి ఆహారము పెట్టి తన్ను తాను విష్ణుమూర్తి వలె అలంకరించుకొని శంఖ చక్రములు ధరించి పక్షి నెక్కి రాత్రి కాగానే 'రూపణిక' సౌధమును చేరి ఆమెను పిలచి - నేను విష్ణువును నీ కోసము వచ్చితిని - అని పలుకగా, ఆమె నమస్కరించి దేవా! నన్నునుగ్రహింపుము' అని ఆదరించినది. ఆమెతో కొంతసేపు సుఖము ననుభవించి, వెనువెంటనే పక్షినెక్కి ఆకాశవీధిలో ఎగిరిపోయెను.

ఉదయముననే రూపణిక 'నేను విష్ణుభార్యను మానవులతో మాట్లాడను' అని మౌనము పూనినది. తల్లి మకరదంష్ట్ర లాలించి వివరము లడుగగా రూపణిక ఇద్దరి మధ్య ఒక తెర గట్టించి రాత్రి జరిగిన వృత్తాంతమును తల్లికి చెప్పినది. ఆరోజు రాత్రి మరల యధాపూర్వము వలె పక్షిపై వచ్చిన శంఖచక్రధారిని చూచి మకరదంష్ట్ర అది నిజమేనని నిశ్చయించుకొన్నది. మరునాడు ఉదయమున వేశ్యమాత రూపణికతో - అమ్మా! దైవానుగ్రహము వలన నీవు దేవివైతివి. నేను నీకు తల్లిని కనుక దయచేసి

నాకు బొందితో స్వర్గము చేరునట్లు స్వామి వారిని వేడుకొనమని బ్రతిమిలాడినది రూపణిక సరేనని ఆనాటి రాత్రి మరల వచ్చిన లోహజంఘునితో ఈ విషయము చెప్పినది. దేవ వేషమందున్న లోహజంఘుడు ప్రియురాలితో ఇట్లనెను.

'నీ తల్లి పాపాత్మురాలు. ఇలాగే తీసుకువెళ్లుటకు వీలులేదు. ఏకాదశినాడు స్వర్గము తెరిచెదరు. ముందుగా శంకరుని ప్రమథ గణములు ప్రవేశించెదరు. వారి వేషము నీ తల్లి వేసినచో వారితో పాటు లోనికి వెళ్ల గలదు. కావున ఆమె తల గొరిగించి మెడలో ఎముకల మాల, కాటుక పూసిన శరీరముతో దిగంబరిగా చేయుము – అని చెప్పెను.

మరునాడు ఆ విషయము తల్లికి చెప్పగా సరే యని అంగీకరించి ఆ వేషము వేసినది. ఆ రాత్రి లోహజంఘుడు పక్షినెక్కి వచ్చి వికార వేషముతో దిగంబరిగా నున్న ఆమెను తీసుకుని ఆకసమున కెగసి ఆమెను ఒంటి స్తంభముగల శిఖరముపై నుంచెను. నేను మరలా వచ్చెదనని ఆమెకు చెప్పి, నగరమునందు జాగరణ చేయు భక్తులను చూచి – ప్రజలారా – జన సంహారము చేయుటకు మహమ్మారి స్తంభ శిఖరమున ఉన్నది. అందరూ హరిభజన చేయుడని హెచ్చరించెను. ఆకసము నందుండి వచ్చిన ఇతని మాటలు నమ్మి ప్రజలు ఆందోళన చెందసాగిరి.

లోహజంఘుడు తన వేషము తీసివేసి, జన మధ్యమున నుండి ఈ విచిత్రమును చూచుచుండెను. స్తంభముపై నున్న మకరదంష్ట్ర దేవుడు ఇంకనూ రాలేదామా యని విచారించుచుండెను. కింద జనుల కల్లోలమును విని – అయ్యో! అయ్యో! పడుచున్నాను, పడుచున్నాను' అని హాహాకార మొనర్చెను. మధురావాసులందరూ అదిగో నిజముగానే మహమ్మారి పడు చున్నదని – దేవీ! పడవద్దు – వద్దు అనుచూ బిగ్గరగా అరిచిరి. ఆ రాత్రి

ఎట్లో గడచినది. ఉదయముననే స్తంభముపైనున్న వేశ్యమాతను చూచి గుర్తు పట్టి అందరూ భయము పోగా నవ్వసాగిరి.

ఈ వృత్తాంతము తెలిసి రూపణిక వచ్చి, ఆమెను దింపించి, జరిగినది వివరించినది. ఇది కాముకులను మోసగించినందుకు ఎవడో తగిన శాస్తే చేసినాడని, అతనిని తప్పక సత్కరించవలెనని అందరూ భావించగా, లోహ జంఘుడు తాను చేసిన దానిని ప్రజలందరికీ చెప్పి, విభీషణుడిచ్చిన శంఖ చక్ర గదాదులను శ్రీహరికి సమర్పించెను. అపుడు మధురావాసు లందరూ సంతసించిరి. రాజాజ్ఞచే రూపణికను పొంది వేశ్యమాతకు ప్రతీకారము చేసి సుఖముగా నుండెను. వసంతకుని వలన హాస్యరస ప్రధానమగు ఈ కథను విని వాసవదత్త సంతసించెను.

# 2 - 5వ తరంగము

ఒకనాడు యౌగంధరాయణుడు ఏకాంతమున ఉదయనునితో "రాజా! మనము ఇచట కాలహరణము చేయుట మంచిది కాదు. మనమే అతని కుమార్తెను ఎత్తుకొని పోదము, గర్వితుడైన అతనికి ప్రతీకారము చేసినట్లగును. వాసవదత్తకు, భద్రవతి అను గొప్ప ఏనుగును అతడిచ్చినాడు. దానిని వెంబడించుటకు చండ మహాసేనుని 'అళగిరి' తప్ప మరిదేనికీ సాధ్యము కాదు. ఆ భద్రవతికి 'ఆషాఢకు'డను మావటీవాడు కలదు. అతనికి ధనమిచ్చి నా వశము చేసికొంటిని కనుక నీవు ఈ రాత్రి వాసవదత్తను తీసుకుని భద్రవతిపై రమ్ము మార్గ రక్షణమునకు పులిందుని సిద్ధము చేసినాను' - అని చెప్పెను.

ఉదయనుడు వాసవదత్తతో విషయము వివరించి యౌగంధ రాయణుడు చెప్పినట్లు 'భద్రవతి'పై ప్రయాణం సాగించిరి. ఉజ్జయి... ద్వారమందు కావలి కాయుచున్న వీరభటులను వీరబాహువు, తా...భటుడను రాజపుత్రులను సంహరించి అరణ్యామార్గము పట్టిరి. ప్రాకార రక్షకుల వలన విషయము తెలిసికొనిన చండమహాసేనుడు వత్సరాజు, వాసవత్తలను

తిరిగి బంధించుటకై పాలకుడను తన కుమారుని ఆధిపత్యములో సైన్యమును పంపెను.

వత్సరాజు ఎంతో వేగముగా వింధారణ్యము మధ్యమును చేరు కొనెను. భద్రవతి అరువది మూడు యోజనములు పయనించుటచే దప్పిక వేసినది. వత్సరాజు దానికి సమీపమున నున్న సరసునందు నీరు త్రాగించగా అందలి దోషముచే ఏనుగు మరణించినది. అది ఒక స్త్రీ రూపమును పొంది – రాజా! నేను 'మాయావతి'యను విద్యాధర స్త్రీని శాపము వలన ఆడ ఏనుగునైతిని. నీ కుపకారము చేసితిని, నీ కుమారునికి కూడా ఉపకారము చేయగలను. నీ భార్య వాసవదత్త మనుష్య స్త్రీ గాదు. శాపవశమున భూమిపై పుట్టిన దేవతా స్త్రీ"– అని చెప్పి అదృశ్యమాయెను. ఆ రాత్రి వత్సరాజు అచటనే బసచేసెను.

మరునాటి మధ్యాహ్నమునకు రమణ్వంతుడు పుళిందులు సైన్య సమేతముగా వచ్చి వత్సరాజు ఉదయనుని చేరిరి. అంతయూ కలసి కౌశాంబి దిశగా పయనం చేసిరి. మార్గమున వాసవదత్త కాలక్షేపము కొరకు వసంతకుడు పతిభక్తిని వృద్ధి చేయు ఒక కథను చెప్పెను.

# దేవస్మిత కథ

**తా**మ్రలిప్తి యను నగరమును ధనదత్తుడను వర్తకునకు ఏకైక కుమారుడు గుహసేనుడను పేరు గలవాడు కలడు. వ్యాపారనిమిత్తమున ఒక ద్వీపమును చేరి అచట ధర్మగుప్తుని కుమార్తె 'దేవస్మిత'ను తన కుమారున కిమ్మని అర్థించెను. తామ్రలిప్తి బహుదూరమున నుండుటచే కూతురు దూరముగా నుండునని భావించి ధర్మగుప్త డంగీకరించలేదు. కాని దేవస్మిత గుహసేనుని చూచి అతని రూప– గుణములకు ఆకర్షితురాలై తండ్రికి తెలియకుండా అతనితో తామ్రలిప్తి చేరి గుహసేనుని వివాహము చేసికొనెను.

కొంతకాలమునకు ధనదత్తుడు మరణించెను. పిదప వ్యాపార నిమిత్తము బహుదూరమున నున్న 'కటాహద్వీపము'నకు గుహసేనుడు వెళ్ళవలసి వచ్చెను. భార్యా వియోగము సహింపలేక ఏమి చేయవలెనో తోచక నిరాహారుడై దేవాలయమున వ్రతము పూనెను. స్వప్నమున శివుడు కనబడి రెండు కమలములనిచ్చి "చెరి ఒకటి దగ్గర ఉంచుకొనుడు. ఇది ఎన్నటికీ వాడిపోదు" ఒకరికి శీలభంగము కలిగినచో మరియొకరి చేతి యందలి కమలము వాడును" అని పల్కెను.

గుహసేనుడా కమల మనుగ్రహించి కటాహ ద్వీపమునకు బయలు దేరెను. అచట వ్యాపారము వృద్ధి అయినది. కాని ఇతని చేతి యందున్న వాడని కమలము చూచి నలుగురు వర్తకులు ఆశ్చర్యపడి అతనిని యుక్తిగా తమ ఇంటికి తీసుకు వెళ్ళి బాగుగా మద్యము త్రాగించి కమల వృత్తాంతము తెలిసికొనిరి. పిమ్మట అతని భార్యను చెరచదలచి తామ్రలిప్తికి పయనమైరి. అచట బౌద్ధమఠమున 'యోగకరండిక' అను బౌద్ధ సన్యాసినిని సమీపించి-తమ కోర్కె నెరవేరునట్లు చేసిన అమిత ధనము నిచ్చెదమని ఆశచూపిరి. అందులకామె 'నాకు ధనవ్యామోహము లేదు. సిద్ధికరి అను శిష్యురాలి వలన నా కమితమైన ధనలబ్ధి కలిగినది. అయిననూ మీకు సహాయము చేసెదను' అని పల్కుగా-వారు నలుగురూ సిద్ధికరిని గూర్చి అడిగిరి. అంత ఆమె కథను ఇట్లు వివరించినది.

# సిద్ధికరి కథ

ఉత్తరదేశము నుండి వచ్చిన ఒక వర్తకుని వద్ద నా శిష్యురాలు సిద్ధికరి పనిమనిషిగా చేరి నమ్మకము కలిగించి, ఒకనాటి రాత్రి అతని ధనమంతయూ అపహరించి పారిపోయినది. అడవిలో వెళ్ళుచున్న ఆమెను మద్దెలను ధరించిన డోంబుడను వాడు దాని వద్ద నున్న సొమ్ము నపహరించు

టకై వెంటపడెను. ఒక మఱ్ఱిచెట్టు క్రిందికి పోయి ఆమె అతనిని చూచి గడుసుదనముతో దీనముగా "నా భర్తతో కలహించి యింటి నుండి వచ్చితిని. చచ్చుటకొక ఉరిత్రాడు కట్టుము" అని పలికెను.

అతడు ఇది కూడా మంచిదే అని తలచి ఉరిత్రాటిని సిద్ధము చేసెను. అపుడు సిద్ధికరి తెలియని దానివలె గొంతునకు ఉరి ఎట్లు వేసుకొందురో చూపమని అతనిని అడిగెను. డొంబుడు మృదంగము మీది కెక్కి "ఇట్లు ఉరి పోసుకొందురు" అని ఆ త్రాటిని మెడకు తగిలించుకొనెను" వెంటనే సిద్ధకరి మృదంగము కాలితో తన్నినది. కాళ్ళు గిజగిజ తన్నుకొని డొంబుడు ఉరి బిగిసి మరణించెను. ఆ సమయముననే వర్తకుడామెను వెదుకుచూ వచ్చి దూరమున ఉన్న సిద్ధకరిని చూచెను. సిద్ధకరి అది గమనించి ఆ వృక్షమున ఆకుల మధ్య దాగికొనెను. భటులతో అక్కడకు వచ్చిన వర్తకునకు సిద్ధకరి కనబడలేదు. డొంబుడు ఉరిపోసుకుని కనిపించెను. అంత ఒక భటుడు చెట్టు పైకి ఎక్కి చుట్టూ చూడసాగెను. సిద్ధకరి అతనిని కౌగిలించి ముద్దు మాటలు పల్కుచు ఆభటుని నాలుక కొరికెను. అతడా బాధ భరింప లేక అరచుచూ చెట్టుపై నుండి కిందపడెను. అతడిని చూచి చెట్టుపై దయ్యమున్నదని భయపడి అందరూ పారిపోయిరి. పిమ్మట సిద్ధకరి ఆ ధనముతో తన గ్రామము చేరెను. ఆమె అనుగ్రహము వలన నాకునూ ధనము వచ్చినది. కనుక మీకు కావలసినది ఎవతెయో చెప్పుడు నేను సాధించెదను అని చెప్పెను.

గుహసేనుని భార్య దేవస్మిత తమకు కావలెనని ఆ నలుగురు వర్తకులు చెప్పగా, వారిని తన ఇంట రహస్యముగా నుంచి 'యోగకరండిక' - దేవస్మిత ఇంటికి వెళ్ళి కపటప్రేమను నటించుచూ ప్రియోపభోగములు లేని రూప యౌవనములు నిష్ఫలములు కదా! అనుచు ఓదార్చెను. రెండవ దినమున మిరియం గుండ చల్లిన మాంసపు ముక్కను తీసుకొని దేవస్మిత

ఇంటికి వెళ్లి వాకిటనున్న కుక్కకు దానిని పెట్టెను. అది దానిని తిని ముక్కు -కన్నుల వెంట నీరు కార్చసాగినది. పిమ్మట యోగకరండిక దేవస్మితను చేరి ఆమె ఆతిధ్యము గ్రహించి ఏడ్వసాగెను. దేవస్మిత కారణమడుగగా -

అమ్మా! బయట ఏడ్చుచున్న కుక్కను చూడుము అది నేడు నా పూర్వ జన్మ సంబంధమును తెలిసికొని ఏడ్చుచుండెను. నేనునూ జాలిచే కన్నీరు కార్చితిని - అది విని దేవస్మిత బయటకు వచ్చి కన్నీరు కార్చుచున్న కుక్కను చూచి ఆశ్చర్యపడి యోగకరండికను ప్రశ్నించెను.

"అమ్మా! నేనునూ - ఈ కుక్కయును పూర్వజన్మమున ఒక బ్రాహ్మణుని భార్యలము. అతడు దూరదేశగతుడైనపుడు నేను స్వేచ్ఛగా పరపురుషులను సంగమించుచూ శరీరేంద్రియములకు సుఖమొసగితిని. అందువలన ఈ జన్మమున పూర్వజన్మ జ్ఞానము కలదాననైతిని. అప్పుడీ కుక్క అజ్ఞానము వలన తన శీలము కాపాడుకొనుచుండెను. అయిననూ కుక్క జన్మ మెత్తిననూ దీనికి గూడ పూర్వజన్మ జ్ఞానము కలదు"-అని చెప్పగా విన్న దేవస్మిత - ఆలోచించి, ఓహో! ఈమె నన్ను మోసగించుటకు ప్రయత్నించుచున్నది - అని భావించి, తెలివిగా - "ఓ పరివ్రాజికా! నేనింత వరకూ ఇట్టి ధర్మమెరుగను. కనుక నెవరితోనైనా నాకు సంగమము కూర్పుము" - అని పలికెను.

అట్లయినచో ద్వీపాంతరము నుండి వచ్చిన వర్తక పుత్రులున్నారు. వారిని తీసుకువచ్చెదను అని సంతోషముతో ఇంటికి వెళ్ళెను. దేవస్మిత తన సఖులతో నాలోచించి - ఉమ్మెత్తరసము కలిపిన సారాయిని, కుక్క పాదాకారములో ఒక ఇనుప ముద్రను తయారు చేయించినది. ఒకనాటి సాయంకాలము వర్తక పుత్రుడొకడు దేవస్మిత ఇంటికి రాగా అతనికి ఉమ్మెత్త సారాయి త్రాగించి స్పృహ తప్పునట్లు దేవస్మిత చెలికత్తెలు చేసిరి.

పిమ్మట అతని వస్త్రము లూడదీసి లోహముద్రను నుదుటిపై అచ్చొత్తి వీధిలోని బురదగుంటలో పడవేసిరి. రాత్రి చివరి జామున తెలివి వచ్చి జరిగినది ఎవరికీ చెప్పలేక, ముద్ర కనబడకుండా తలకు గుడ్డచుట్టి, ఏదో మిషచే నిద్రించుటకు గదిలోనికి వెళ్లెను. తరువాత వరుసగా మూడు రోజులూ మిగిలిన ముగ్గురూ వెళ్ళి అట్లే సన్మానము పొందిరి. వారు 'యోగకరండిక'కు ఏమీ చెప్పక, దీనికి కూడా ఇట్లే శాస్తి కావలెనని భావించి వెళ్ళి పోయిరి.

మరునాడు తాను కృతార్థురాలనైతినను సంతోషముతో పరివ్రాజిక, దేవస్మిత ఇంటికి వెళ్లగా ఆమెకూ మద్యము త్రాగించి, ముక్కు చెవులు కోసి వీధిలో పడవేసిరి. పిమ్మట ఈ వృత్తాంతమును దేవస్మిత తన అత్తగారికి చెప్పెను. 'అమ్మా! మంచి పని చేసితివి కాని వారు నా కుమారునకు ఏమి హాని చేతురో భయముగా నున్నదని పలుకగా, పూర్వము శక్తిమతి ఎట్లు తన ప్రజ్ఞచే తన భర్తను రక్షించుకొనెనో నేనునూ నా భర్తను రక్షించుకొనెదనని దేవస్మిత చెప్పగా - అత్తగారు శక్తిమతిని గూర్చి ప్రశ్నించగా ఆ కథ ఇట్లు చెప్పెను.

# శక్తిమతి కథ

పూర్వము మా గ్రామమందు మణిభద్రుడనే యక్షుని ఆలయ మున్నది. పరస్త్రీలతో నున్న వారిని బంధించి ఆ ఆలయములో ఒక రాత్రి యుంచి శిక్ష నిమిత్తము రాజసన్నిధికి తీసుకువెళ్లెడివారు. ఒకనాడు సుభద్రు డను వర్తకుడు పరస్త్రీతో కూడియుండగా నగర రక్షకుడు పట్టుకొని యక్షా లయములో బంధించెను. ఆ వర్తకుని భార్య శక్తిమతి బహుమేధావి. ఈ సంగతి తెలుసుకొని, మారువేషము వేసుకుని పూజాద్రవ్యములతో ఆ ఆలయ

మునకు వెళ్లెను. పూజారికి ద్రవ్యమునాశ జూపి భర్త వద్దకు వచ్చి అతనితో నున్న స్త్రీని తన వేషములో బయటకు పంపించి వేసెను. ఉదయమునే రాజభటులు వచ్చి విచారించగా వీరిద్దరూ భార్యా భర్తలే యని నిజము తెలిసికొని నగర రక్షకునిని దండించిరి – అని ఆ కథను చెప్పిన దేవస్మిత తన భర్తను రక్షించుకొనుటకు పురుషవర్తక వేషము ధరించి చెలులు వెంట రాగా 'కటాహద్వీపము'నకు బయలుదేరెను.

ఆ ద్వీపము నందు భర్తను కనుగొని అచటనే యుండెను. పిమ్మట ఆ ద్వీపపురాజును ఆశ్రయించి తన దాసులు నలుగురు ఇచటనే యున్నారని వారిని తన వెంట పంపుటకు అనుమతింపుడని ప్రార్థించగా, రాజు పౌరు లందరినీ సమావేశపరచెను. అంత తనను మోసగింప ప్రయత్నించిన నలుగురు వర్తకులనూ గుర్తుపట్టి వారే తన దాసులని చెప్పెను. వీరు ఇచ్చటి వర్తకుని కుమారులు నీకు దాసులెట్లయ్యిరి? అని ప్రశ్నించగా, ఆమె ఆనవాలుగా వారి లలాటము నందు శునకపాదము గుర్తుండునని చెప్పినది.

అపుడు వారి నుదుట నున్న గుడ్డ తొలగించగా ఆ చిహ్నము కన బడినవి. వర్తకులు సిగ్గుపడిరి. అపుడు దేవస్మిత జరిగినదంతయూ వివరించగా వీరు నిజముగా నీకు దాసులేయని తీర్పు చెప్పెను. అపుడు ఇతర వర్తకుల విన్నపము మేరకు ఆమెకు విస్తారమైన ధనమిచ్చి దాస్య విముక్తి గావించిరి. పిమ్మట ఆమె తన భర్తతో, ధనముతో 'తామ్రలిప్తి' నగరము చేరి సుఖముగా నుండెను.

వసంతకుని వలన ఈ కథను విన్న వాసవదత్త తన భర్త ఉదయనుని పై మరింత ప్రేమను పొంది ఆనందభరితురాలయ్యెను.

# 2 - 6వ తరంగము

చండమహాసేనుడు తన కుమార్తె వాసవదత్తపై నున్న అను రాగముచే, వత్సరాజు ఉదయనుడు కూడా తాను ముందుగా ఆమెకు నిర్ణయించుకున్న వరుడేనని భావించి తన కుమారుడైన గోపాలునితో వారి వివాహమునకు అంగీకారము తెలుపుచూ వార్త పంపెను. పిమ్మట వాసవ దత్తా వత్సరాజుల వివాహము ఎంతో ఘనముగా జరిగినది. ఆ ఉత్సవ సమయమునందు గోపాలక-పులిందులను సత్కరించెను. యౌగంధరాయణ - రుమణ్వంతులు పురజనులను, పండితులను యధోచితముగా గౌరవించిరి. ఒకనాడు యౌగంధరాయణుడు, రుమణ్వంతునితో ఇట్లనెను.

"రాజు ప్రీతికొరకు మనమెంతో క్లిష్ట కార్యములను చేసితిమి. జనుల మనోభిప్రాయమెట్లున్నదో తెలియదు. ఇష్టము లేని జనుడు బాలుడైననూ రాజునకు మనపై ద్వేషము కలిగించును. ఈ విషయమై 'బాలవినష్టకుని కథ చెప్పెదను వినుము.

**(పై క్రింది లంబకములు, తరంగముల మధ్య ఏవిధమైన ప్రధాన కథాంశములులేని కారణముగా వాటిని విడిచిపెట్టడమైనవి) - రచయిత**

# బాల వినష్టకుని కథ

పూర్వము రుద్రశర్మయను బ్రాహ్మణునకు ఇద్దరు భార్యలు కలరు. ఒకామె కుమారుని ప్రసవించి మరణించినది. రెండవ భార్యతో నీ కొడుకుతో సమానముగా వీనినీ పెంచుమని చెప్పెను. కాని ఆమె ఆ బాలుని సరిగా చూచెడిది కాదు. ఆ కుర్రవానిని బాలవినష్టకుడని పిలిచెడివారు. సవతి తల్లి ఆ బాలునికి సరైన తిండి పెట్టక పోవుట వలన పొట్ట పెరిగి వికారుడుగా అయ్యెను. అయిదేండ్ల ఆ బాలుడు బహుబుద్ధిశాలి. సవతితల్లిపై ప్రతీ

కారము చేయనెంచి, తండ్రి ఇంటికి వచ్చిన ప్రతీసారీ నాన్నా! 'నాకిద్దరు నాన్నలు' అంటూ ముద్దుగా పలికేవాడు.

ఇలా ప్రతీరోజూ అనుటచే తండ్రికి అనుమానము కలిగి పత్నితతో సరిగా మాట్లాడుట కూడా మానివేసెను. ఆమె బాలవినష్టకుడేదో చేసెనని భావించి ఒకనాడు -నాయనా! మీ నాన్న నా మీద కోపము వచ్చునట్లు ఏమైనా చెప్పితివా? అని ప్రశ్నించగా, 'నీవు నన్ను సరిగా చూడనిచో ఇంకా బాధపెట్టెదను' అనెను. ఆ మాటలు విని ఆమె లొంగిపోయి-వినష్టకుని సరిగా చూచుకొనసాగెను. అపుడు ఒకరోజు రుద్రశర్మ ఇంటికి రాగా బాలవినష్టకుడు అద్దమును తండ్రికి చూపి ఆ ప్రతిబింబమును చూచుచు 'నాన్నా! ఇతడే రెండో నాన్న' అని పలికెను.

అంత అతడు ప్రసన్నుడై భార్యతో సుఖముగా నుండెను. కనుక ఎవరినీ తక్కువ అంచనా వేయరాదు' -అనెను. వాసవదత్తా వత్సరాజులు ఆనందముగా నున్నారు. ఇలా ఉండగా వత్సరాజు ఒకనాడు చపలుడై తనకు పూర్వ సంబంధము గల విరచిత యను అంతఃపుర పరిచారికతో రహస్యముగా క్రీడించి పొరబాటున దానిపేరుతో వాసవదత్తను పిలుచుటచే అమెకు కోపము వచ్చెను. అంతనాతడామె కాళ్లపై బడి ప్రసన్నురాలిని కావించుకొనెను.

గోపాలకుడు-బంధుమతి యను రాజపుత్రికను వాసవదత్తకు కానుకగా పంపగా, ఆమెకు మంజులిక అను మారుపేరు పెట్టి వత్సరాజు కంటబడకుండా దాచెను. ఒకనాడు రాజు వసంతకునితో తోటలో విహరించుచూ లతా గృహమున మంజులికను చూచి గాంధర్వ విధిచే స్వీకరించెను. వాసవదత్త అది తెలిసికొని వసంతకుని దూషించి చెట్టుకు కట్టివేసెను. మరల రాజు వాసవదత్తను ఆమె ప్రియసఖి సాంకృత్యాయని ద్వారా ప్రసన్నురాలిని చేసికొనెను. ఆ సందర్భముగా వసంతకుడు వాసవదత్తకీ కథ చెప్పెను.

# రురుడుండుభ కథ

పూర్వము రురువను మునికుమారుడు కలడు. స్థూలకేశుడను ఋషి పెంచుచున్న 'ప్రమద్వర' అను అప్సరస్త్రీని చూచి మోహించి ఆమె పెంపుడు తండ్రి నడిగెను. అతడు ప్రమద్వర ఒక విద్యాధరునికీ మేనకకూ జన్మించినదని, ఆమె ఇష్టపడినచో వివాహము చేతునని చెప్పి ప్రమద్వరను అడుగగా ఆమె అంగీకరించినది. వివాహము సమీపించుచుండగా ప్రమద్వర పాముకాటుచే మరణించెను. రురుడు ఆమె కొరకు విలపించు చుండగా 'క్షీణాయుర్దాయము గల ఆమెకు నీ ఆయుర్దాయములో సగము ఇచ్చినచో ఆమె బ్రతుకునని ఆకాశవాణి పలుకగా – అతడు తన ఆయువులో సగమిచ్చి ఆమెను బ్రతికించుకొనెను. పిమ్మట తన భార్యను పాము కరచిన దని కనబడిన పాములనెల్లా చంపుచుండెడివాడు.

ఒకనాడొక పామును చంపబోవుచుండగా మానవభాషలో "ఓయీ! పాములపై కోపము వహించి విషము లేని పాములను కూడా చంపుచు న్నావు. నీ ప్రియురాలిని కరచిన విషసర్పము వేరు, మేము వేరు. వాటికి విషముండును. మాకు విషముండదు. మేము ధుండుభ జాతి పాములము అని చెప్పగా – రురుడు 'మిత్రమా! నీవెవ్వరవు?' అని ప్రశ్నించగా, దుండు భము. 'బ్రాహ్మణుడా! శాపముచే ఈ సర్పమునైతిని నీతో సంభాషించుట వలన నా శాపము తీరినది" అని పలికి అంతర్ధానమైనది. అది మొదలు రురుడు పాములను చంపుట మానివేసెను– వసంతకుడు ఈ కథ చెప్పి – "దేవీ! నీవునూ నన్ను అట్లే బాధించితివి" అని వాసవదత్తతో పలుకగా ఆమె స్నేహపూరిత మందస్మితముతో అభిమానముగా చూచెను.

# 3-1వ తరంగము

వత్సరాజు-వాసవదత్తతో భోగముల ననుభవించుచూ కాలము గడుపుచుండెను. మహామంత్రియగు యౌగంధరాయణుడు, సేనాపతి రుమణ్వంతుడు రాజ్యభారము వహించుచుండిరి. ఒకనాడు యౌగంధ రాయణుడు రుమణ్వంతుని తన ఇంటికి పిలిచి యిట్లనెను'

ఉదయనుడు పాండవ వంశమునందు పుట్టినవాడు. సమస్తమైన భూమండలము, హస్తినాపురము ఇతనికి వంశపరంపరాగతములు. కాని ఇతడు నిత్యమూ స్త్రీ - మద్య- మృగయా (వేట) సక్తుడగుటచే, అది అంతయు కోల్పోయి నేడు కేవలం ఒక చిన్న దేశముగానున్న మండలమును (వత్సదేశము) పాలించుటకు పరిమితుడైనాడు. కనుక మనమే కులక్రమా గతమైన సమస్త భూమిని తిరిగి సాధించవలయును.

ప్రస్తుతము మగధేశ్వరుడగు ప్రద్యోతుడొక్కడే మనకు శత్రువు. అతనికి "పద్మావతి" యను కుమార్తె కలదు. ఆమెను మన ఉదయనునికిచ్చి వివాహము చేసినచో ప్రద్యోతుడు మనకు సైన్యసహాయము చేయును. అపుడు నాల్గుదిక్కులా జయించి రాజ్యవిస్తరణ కావించుటకు వీలగును - అది విని "వాసవదత్త" యుండగా ఉదయనుడెట్లు ద్వితీయ వివాహమున కొప్పుకొనును-అని రుమణ్వంతుడడుగగా-యౌగంధరాయణు డిట్లనెను.

'వాసవదత్తను దాచి వాస గృహమును దహనము గావించి దేవి దగ్ధమైనదని పుకారు పుట్టింతును. అపుడు మగధకుమార్తెతో వివాహ మొనరింతును"- అనగా పద్మావతికై మనము చేయు మోసము మనకే అనర్థము కలిగించవచ్చు' అందుకు నిదర్శనముగా ఈ కథ వినుము - అని రమణ్వంతుడీ కథ చెప్పెను.

# వైశ్యకన్యా-మౌనవ్రతుల కథ

పూర్వము గంగానదీ తీరమున 'మాకందిక' అను పట్టణము కలదు. అందు మౌనవ్రతము పూనిన సన్యాసి ఉండెను. ఒకనాడు భిక్షకై ఒక వర్తకుని ఇల్లు చేరి అద్భుత సౌందర్యవతి యగు ఒక కన్యను చూచి 'అయ్యో! ఎంత ఘోరం? ఎంత ఘోరం? అని వర్తకుడు వినుచుండగా పల్కి వెళ్ళిపోయెను. అపుడు ఏనాడూ మాట్లాడని ఆ సాధువు అలా ఎందుకనెను? అని తెలుసుకొనుటకు వర్తకుడు సన్యాసి మఠమునకు వచ్చి ప్రశ్నించెను'–

'నీ కుమార్తె లక్షణములు మంచివి కావు. ఆమెకు వివాహము కాగానే నీవు సర్వనాశనమగుదువు. అది తలచి దుఃఖము వచ్చినది' – అనెను. మరి ఏమి చేయవలెనని వర్తకుడు ప్రశ్నించగా, నీ కన్యను ఒక పెట్టెలో పెట్టి దానిపై ఒక దీపము నుంచి గంగానదిలో వదలిపెట్టుము అని చెప్పగా, భయము చెందిన వర్తకుడు అట్లే చేసెను. సన్యాసి తన అను చరులతో "గంగానదిలో తేలుచున్న – దీపము గల పెట్టె వచ్చును. దానిని తీసుకుని రండు" అని ఆజ్ఞాపించెను.

ఈ లోగా గంగానదిలో తేలుచున్న ఆ పెట్టెను ఒక రాజకుమారుడు చూచి దానిని తెప్పించి, తెరచి అందు అందగత్తెను చూచి ఆమెను వరించెను. ఆ పెట్టెలో ఒక కోతిని ఉంచి తిరిగి నదిలో వదలివేసిరి. సన్యాసి శిష్యులు ఆ పెట్టెను తెచ్చి సమర్పించిరి. వారినందరినీ పంపించి ఏకాంతముగా ఆ పెట్టె తెరవగా అందుండి కోతి బయటకు వచ్చి సన్యాసిని రక్కి పళ్లతో గాయము చేసినది – కొంతకాలమునకు, తన కుమార్తెకు మంచి భర్త లభించెనని వర్తకుడు సంతోషించెను – కనుక వాసవ దత్తతో వియోగము అనేకానర్థములనిచ్చును అని రుమణ్వంతుడు పలికెను.

"మరొక మార్గము లేదు. మనమేమీ చేయకున్నచో ఉదయనుడు వ్యసనము వలన ఇపుడున్న రాజ్యమును గూడ నశింప చేయగలడు. మంత్రులమై యుండగా కార్యసిద్ధికై ప్రయత్నించుట మన ధర్మము–" అని యౌగంధరాయణుడు చెప్పెను.

అభీష్ట స్త్రీ వియోగము వలన వివేకవంతుడు కూడా బాధలను పొందును. ఉదయనుని సంగతి చెప్పనేల? అందులకు ఉదాహరణముగా ఈ కథను వినుము – అని రుమణ్వంతుడీ కథను చెప్పెను.

# ఉన్మాదినీ కథ

పూర్వము శ్రావస్తి యందు దేవసేనుడను రాజు గలడు. ఆ నగరమున గొప్ప ధనికుడైన ఒక వర్తకుడు కలడు. అతనికి దేవలోక సౌందర్య వతి అయిన కుమార్తె కలిగినది. ఆమెకు 'ఉన్మాదిని' అని పేరు పెట్టిరి. ఆమెను చూచిన వారికి మదనోన్మాదము కలుగుచుండెడిది. అతడే దేవసేనుని వద్దకు వచ్చి తన కుమార్తెను వివాహము చేసుకొమ్మని ప్రార్థించెను. ఆమె లక్షణములు పరిశీలింపుమని విశ్వాసము గల కొందరు బ్రాహ్మణులను పంపెను. వారు వెళ్ళి 'ఉన్మాదిని' ని చూచి తాపము చెందిరి. రాజు ఈమెను వివాహము చేసుకొన్నచో రాజ్యమును నిర్లక్ష్యము చేయునని తలచి, ఆమె రాజునకు తగదని విన్నవించిరి.

పిదప వర్తకుడు సేనాపతికిచ్చి వివాహము చేసెను. ఒకనాడామె మేడపై నుండి ఆ మార్గమున వెళ్ళుచున్న రాజును చూచి తన విలాసమును ప్రదర్శించెను. రాజు ఆమెను చూచి పరవశుడై మునుపు తాను వలదంటినని తలచి విరహానలపీడితుడయ్యెను. సేనాపతి రాజు భావము నెరిగి తన భార్యను దాసిగానైనా స్వీకరింపుడని ప్రార్థించెను. కాని రాజు "నేను పరస్త్రీని పరిగ్రహించను. నీవామెను వదలినచో నీవు దండింపబడుదువు" అని చెప్పెను.

మంత్రులు లేమీ చెప్పలేదు. రాజు చివరకు మన్మథ తాపముచే మరణించెను. కనుక వాసవదత్త లేనిచో ఉదయనుడు ఏమి గతి చెందునో కదా! అని చెప్పిన రుమణ్వంతునితో యౌగంధరాయణుడు - పూర్వము సీతను విడచి రాముడు జీవింప లేదా? అని ప్రశ్నించెను. అందులకు రుమణ్వంతుడు మరల ఇట్లనెను. వారు దేవతలు, వారి మనస్సు అన్నిటినీ సహింపగలదు. మానవుల మనస్సు సహింపలేనిది - ఈ కథను వినుము.

# యయిల్లకుని కథ

పూర్వము మధుర యందు 'యయిల్లకుడ'ను వర్తక పుత్రుడు కలదు. అతనికి తన భార్యయందు ఎంతో ప్రేమగలదు. ఆమెతో సుఖముగా కాలము గడుపుచూ ఒకనాడు కార్యనిర్వహణకై ద్వీపాంతరము వెళ్ళవలసి వచ్చెను. అతని భార్య కూడా అతనితో వచ్చుటకు సిద్ధమయ్యెను. కాని ఆమెను అతడు తీసుకుని వెళ్ళలేదు. ప్రయాణమై వెళ్ళుచున్న భర్తను చూచుచూ కనుచూపుమేర దాటిపోగా వియోగము సహింపలేక ఆమె కిందపడి మరణించినది. ఆ సంగతి తెలిసిన వర్తక పుత్రుడు వెంటనే వచ్చి ప్రాణములు పోయిన ప్రియురాలిని చూచి దుఃఖావేశముచే అతడునూ మరణించెను. ఇట్లు పరస్పర వియోగముచే దంపతులిద్దరూ మరణించిరి. కనుక ఉదయనునికి -వాసవదత్తకు వియోగము కలిగింపరాదు- అని రుమణ్వంతుడు పలుకగా - యౌగంధరాయణుడు "నేనిదియంతయూ నిదివరకే నిశ్చ యించితిని. రాజకార్యములిట్లే యుండును. ఈ కథను వినుము.

# పుణ్యసేనుని కథ

పూర్వము ఉజ్జయిని యందు పుణ్యసేనుడను రాజుండెను. బల వంతుడగు మరొక రాజు అతనిపై దండెత్తినపుడు, మంత్రులు ఒక

పన్నాగము పన్ని రాజు మరణించెనని వదంతి కల్పించి పుణ్యసేనుని దాచి పెట్టి ఒక శవమునకు రాజోచిత లాంఛనములచే దహన సంస్కారములు గావించిరి. అనంతరము శత్రురాజుకు, రాజులేని ఈ రాజ్యమునకు నీవే దిక్కని ఒక వార్త పంపి అతనిని రప్పించి రాజుగా చేసి, అతని మంత్రి-సేనాపతులలో విభేదములు కల్పించి సైన్యమును కూడా చీల్చి, వారు బలహీనులైనపుడు పుణ్యసేనుని నాయకత్వములో శత్రురాజుని చంపిరి. రాజకార్యములు ఈ విధముగా నుండును. కనుక మనము ధైర్యము వహించి దేవి దగ్ధమైనదని ప్రవాదము కల్పించి మన కార్యమును సాధింతము - అని యౌగంధరాయణుడు పలుకగా, రుమణ్వంతుడు సరే! యని అంగీకరించి వాసవదత్త సోదరుడైన గోపాలకుని పిలిపించి అతనితో కూడా ఆలోచించి చేయుదమని - పలుకగా యౌగంధరాయణుడు సమ్మతించెను.

పిమ్మట మగధదేశమునకు సమీపముగా నున్న తమ రాజ్యములోని "లావాణకమ"ను నగరమునకు ఉదయనుని వేట నిమిత్తము వాసవదత్తా సమేతముగా పయనము సాగించిరి. గోపాలకునితో తమ ప్రణాళికను వివరించి అతనిని కూడా ఒప్పించిరి.

# 3-2వ తరంగము

ఒక దినము లావాణకము చేరి అచట ఉదయన వాసవదత్తలు నివసించసాగిరి. కొంతకాలమునకు యౌగంధరాయణుడు తన రాజకీయ పన్నాగమును వాసవదత్తకు వివరించగా ఆమె విధిలేక సామ్రాజ్య విస్తరణ, వంశోన్నతి కొరకు సమ్మతించినది. పిదప వాసవదత్తకు బ్రాహ్మణీ రూపము ధరింపచేసి వసంతకునికి గుడ్డి బ్రహ్మచారి వేషము వేసి యౌగంధరాయణుడు వృద్ధ బ్రాహ్మణ వేషము వేసికొని వారితో మగధ దేశమునకు ప్రయాణము సాగించెను. వేటకు వెళ్ళిన ఉదయనుడు తిరిగి

"లావాణకము"ను చేరుసరికి గృహము అగ్నికాహుతి అయినదని, అందు వసంతకుడు - వాసవదత్త మరణించిరని తెలుసుకొని తెలివిదప్పి మూర్ఛితు డయ్యెను. కొంతసేపటికి స్మృతి కలిగి ఇట్లు ఆలోచించెను.

"పూర్వము నారదుడు వాసవదత్త వలన తనకు విద్యాధరులను పాలించు కుమారుని పొందగలనని చెప్పినాడు. ఈ గోపాలకుడు కూడా సోదరికై అంతగా దుఃఖించుట లేదు. ఇందువలన దేవి జీవించియే యుండ వచ్చు - అని తలచెను. అదే సమయమున గోపాలకుడు ఈ విషయ మంతయూ తన తండ్రియైన ప్రచండ సేనునికి చారుని ద్వారా రహస్యముగా తెలియజేసెను.

యౌగంధరాయణుడు, వసంతక, వాసవదత్తలతో మగధచేరి, పద్మావతి ఉద్యానవనము నందుండగా రక్షకభటులచటికి పోవలదన్ననూ వాసవదత్త ఆ ఇరువురితో ఆమెను చేరెను. బ్రాహ్మణీ వేషధారిణియైన దేవిని చూడగానే పద్మావతి కామె యందు ఇష్టము కలిగెను. యౌగంధ రాయణుని తన సమీపమునకు రప్పించి "బ్రాహ్మణోత్తమా! ఈ బాల ఎవరు? ఇక్కడికేల వచ్చితిరి? యని అడుగగా - అతడిట్లనెను - '

'ఈమె అవంతిక యను రాజుపుత్రి. నా అభిమాన పుత్రిక. ఈమె భర్త వ్యసనాసక్తుడై ఈమెను వదలి ఎచటికో వెళ్ళెను. అతనిని వెదికి తీసుకు వచ్చునంత వరకు ఈమెను నీ చేతి కప్పగించుచున్నాను. ఈమె సోదరుడీతడు కాణుడు. బ్రహ్మచారి ఈమె ఒంటరిగా నుండి దుఃఖ పడకుండా ఈతని నీమె దగ్గరనే యుండనిమ్ము" -అని రాజతనయ పద్మావతితో చెప్పి ఆమె నంగీకరింపచేసి యౌగంధరాయణుడు వేగముగా లావాణమునకు బయలుదేరెను.

అవంతిక, పద్మావతికి బాగా చేరిక అయినది. ఒకనాడు ప్రసంగ వశమున అవంతిక తాను ఉదయనుని వలన నేర్చుకొంటినని వాడని

మాలా తిలకములను పద్మావతి కోసము తయారు చేసెను. వాని నలంకరించుకొనిన పద్మావతిని చూచి ఆమె తల్లి రహస్యముగా 'ఎవరీ మాలా తిలకమును రచించిరి? అని అడిగెను. 'నా మందిరమున అవంతిక అను నామె కలదు. ఆమె వీటిని రచించినదని పద్మావతి తల్లితో చెప్పగా ఆమె ఇట్లనెను.

'అమ్మా! అయినచో ఆమె ఎవ్వరో దేవత గాని మనుష్య స్త్రీ గాదు. మానవులిట్టి విజ్ఞానమెరుగరు. దేవతలు సత్ పురుషులైన మనుష్యుల ఇంటి యందుందురు. ఈ కథను వినుము.

# కుంతిభోజుని కథ

పూర్వము కుంతి భోజుడను రాజు కలదు. అతని గృహమున దుర్వాసుడను ముని యుండెను. అతనికి పరిచర్య చేయుటకై రాజు తన కుమార్తె కుంతిని నియోగించెను. ఆమె ఆ ఋషికి శ్రద్ధగా ఉపచారములు చేయుచుండెను. ఒకనాడు ముని కుంతిని పరీక్షించుటకై "నేను స్నానము చేసి వచ్చునంతలో త్వరగా పరమా న్నము వండుము" అని పలికి త్వరగా స్నానమొనరించి భోజనమునకై వచ్చెను. కుంతియు పాయసపాత్ర అతని ముందుంచెను. మిక్కిలి వేడిగా నున్న ఆ పాత్ర తాకుటకు వీలుకాదని భావించి కుంతి వీపుపై అతడు కనుసైగ చేసెను. అతని అభిప్రాయము తెలుసుకొని ఆ పాత్రను వీపున ధరించెను. ముని ఆ పాయసము భుజించెను. కుంతి వీపు బొబ్బలెక్కెను. ఆమె సహనమునకు మెచ్చి దుర్వాసుడు ఆమెకు వరము నిచ్చెను- అదే విధముగా నీవును చేయుము అని తల్లి పద్మావతికి బోధించెను.

లావాణకమున జరిగిన వృత్తాంతమును మగధరాజు ప్రద్యోతునికి తెలిసినది. ఇంతకు ముందే ఉదయనుని కొరకు యౌగంధరాయణాదులచే

యాచింపబడిన పద్మావతిని, అతనికిచ్చుటకు ఇష్టపతి దూతముఖమున ఉదయనునికి, యౌగంధరాయణునికి సందేశము పంపెను. యౌగంధ రాయణుని బోధనవిని 'ఈ వివాహము కోసమే వాసవదత్తను దాచియుండ వచ్చునని చింతించి ఉదయనుడు పద్మావతితో వివాహమున కంగీకరించెను.

మగధరాజునకు అంగీకారముతో లేఖ పంపబడినది. ఏడు రోజులలో ముహూర్తము నిర్ణయించిరి. మంచిరోజున అందరూ మగధకు బయలు దేరిరి. ఉదయనుడు ముత్తైదువలతో గూడిన విడిదిల్లు ప్రవేశించినాడు. పిమ్మట వధూవేషమున పద్మావతిని చూచెను. ఆమె ధరించిన దివ్యమైన మాలా తిలకములను చూచి ఇవి ఈమెకెట్లు వచ్చినవని ఉదయనుడు తర్కించుకొనెను. దైవజ్ఞులు నిర్ణయించిన సుముహూర్తమున ఉదయన-పద్మావతుల వివాహము ఘనముగా జరిగినది. కొలది దినములచట వుండి పిమ్మట లావాణకము చేరి తన గృహమున నూతన వధువుతో కూడా ప్రవేశించెను. వాసవదత్త అర్ధరాత్రమున తన సోదరుడైన గోపాలకుని వద్దకు వెళ్ళి ఏడ్చుచు కౌగిలించుకొనెను.

ఈ విషయము భటుల ద్వారా వినిన పద్మావతి, ఉదయనుని సముఖ మున నుండి అనుమానపడి అవంతిక వెంటనే రావలసినదని వారిచే ఆజ్ఞాపించెను. వారు వెళ్ళగానే మాలా తిలకముల గూర్చి ఉదయనుడు పద్మావతి నడుగగా, ఆమె అవంతికా వృత్తాంతము వివరించినది. వెంటనే ఉదయనుడు పద్మావతిని తీసుకుని గోపాలకుని గృహమునకు వెళ్లినాడు. అచట వాసవదత్తను చూచి శోక విహ్వలమానసుడై తెలివి దప్పి భూమిపై పడెను. ఆమె కూడా విరహముచే తెల్లనైన శరీరముతో నేలపై బడి తాను చేసిన దానికి వగచుచూ విలపించసాగెను. ధీరుడగు యౌగంధరాయణుడు కూడా కంట తడిపెట్టెను. క్రమముగా ఉదయనుడు, వాసవదత్తలు సమావస్థను పొందిరి.

'ప్రభూ! మగధరాజకుమార్తెతో మీకు వివాహమైనచో మీకు సామ్రాజ్యము లభించునని తలంచి నేనే ఇదంతయు చేసితిని ఇందు దేవి దోషమేమియు లేదు"– అని యౌగంధ రాయణుడు పలుకగా ఉదయనుడు శాంతచిత్తుడయ్యెను. పిమ్మట గోపాలకుడు, రుమణ్వంతుడు కూడా పద్మావతిని ఉదయనులను ఒకటిగా చేయుటకై మంత్రికి సాయపడితిమని పల్కిరి. పద్మావతి కూడా అవంతికగా తన వద్ద వాసవదత్త మసలుటచే ఆమె సౌజన్య సౌశీల్య ప్రేమాస్పద వ్యక్తిత్వమునకు వశీభూతురాలై జ్యేష్ఠ సోదరివలె భావించి ఎంతో ఆనందమును పొందినది. ఈ విధముగా పద్మావతీ – వాసవదత్తా సమేతముగా ఉదయనుడు సుఖసంతోషములతో కాలము గడుపసాగెను.

# 3-3వ తరంగము

ఒకనాడు ఉదయనుడు తన భార్యల మనోల్లాసమునకై ఊర్వశీ పురూరవుల కథను చెప్పెను.

పురూరవుడను రాజు ఇంద్రుని అనుగ్రహము వలన తాను ప్రేమించిన ఊర్వశిని పొందెను. పిదప దేవదానవ యుద్ధమున పురూరవుని సహాయము కోరి ఇంద్రుడు పిలిచెను. ఆ యుద్ధమునందు మాయాధరుడను రాక్షసుడు మరణించెను. అపుడు జరిగిన ఉత్సవములో రంభ చేసిన నృత్యమున దోషమును పురూరవుడు ఎత్తి చూపగా, ఆమె కోపించి ఊర్వశితో వియోగము పొందుమని శపించెను. పురూరవుడు ఆమె వియోగమును సహింపలేక బదరికాశ్రమమును చేరి విష్ణువును ఆరాధించి మరల ఊర్వశిని పొందెను.

ప్రద్యోతుడు తనను మోసగించి వాసవదత్త జీవించి యుండగనే పద్మావతిని ఉదయనుడు వివాహము చేసుకొనెనని క్రోధము పూనగా, పద్మావతి తండ్రికి లేఖ వ్రాసి ఉదయనుడు, తనూ ఎంతో అన్యోన్యముగా

ఉన్నామని, వాసవదత్త కూడా తన సోదరివలె మెలగుచున్నదని అన వసరముగా బెంగ వహించవలదని, ఉదయనుని ఆదరింపుమని వివరించగా - ప్రద్యోతుడు చేయునది లేక సహించి యూరకుండెను. పుట్టింటిని తలచుచూ బెంగగా యున్న పద్మావతిని సంతోషపరచుటకు వసంతకుడీ కథను చెప్పెను.

## సోమప్రభకథ

పూర్వము పాటలీ పుత్రమందు ధర్మగుప్తుడను వర్తకుడు కలదు. అతని భార్య పేరు సోమప్రభ. ఆమెకు అతిలోక సౌందర్యవతి అయిన కుమార్తె జన్మించెను. పుట్టిన వెంటనే ఆమె మాటలాడుట ప్రారంభించినది. పురిటింటి యందలి స్త్రీలు ఆశ్చర్యచకితులు కాగా ధర్మగుప్తుడామెను నీవెవరవని ప్రశ్నించెను. "నన్ను ఏమీ ప్రశ్నలడగకుము, నీ ఇంట శుభ ములు కలిగించెదను" - అని సమాధానము చెప్పగా ధర్మగుప్తుడు భయపడి తన యింట ఆమెను రహస్యముగా దాచి మరణించినదను వార్త వ్యాప్తి చేసెను.

సోమప్రభ దినదిన ప్రవర్ధమానురాలైనది. ఒకనాడు మేడపై విహ రించుచుండగా గుహచంద్రుడను వర్తకపుత్రుడు ఆమెను చూచి మోహించెను. ఇంటికి వెళ్ళి తండ్రితో ఆమెను మాత్రమే వివాహము చేసు కొనెదనని పలుకగా, ఆ తండ్రి ధర్మగుప్తుని ఇంటికి వెళ్ళి నీ కన్యను నా కుమారున కిమ్మని యాచించెను. ధర్మగుప్తుడు తనకు కుమార్తె లేదని అబద్ధ మాడెను. పిదప రాజు సహాయమున పేక్షించి ఎట్టకేలకు సోమప్రభ, గుహచంద్రులు వివాహితులైరి. కాని ఆమె అతనితో శయనించనని నియ మము విధించినది. సరే చూతములే యని గుహచంద్రుడంగీకరించెను. కాని వివాహమై ఎన్ని నెలలైననూ ఆమె శయ్యా సుఖమునకు ఒప్పుకొనలేదు.

ఒకనాడు ఒక వృద్ధ బ్రాహ్మణుడు గుహచంద్రుని ఇంటికి అతిథిగా వచ్చి, గుహచంద్రుని మనోవేదన గమనించి అగ్ని మంత్రముపదేశించి జపించమని చెప్పి వెడలిపోయెను. ఆ మంత్ర ప్రభావము వలన ఒక దివ్యపురుషుడు ప్రత్యక్షమై సోమప్రభ, ఆమె సోదరి దివ్యాంగనలని చెప్పి, ఆ సోదరిని కలుసుకొనుటకై మాయారూపమున అర్ధరాత్రి అప్పుడప్పుడు ఈమె వెళ్లుచున్నదని నిదర్శనము చూపి, ఒక మంత్రమును గుహచంద్రునికి చెప్పి, భార్య గది గుమ్మముపై వ్రాయమని ఉపదేశించెను. పిదప ఆ మంత్ర ప్రభావముచే గుహచంద్రునితో శరీర సుఖము పొందెను.

ఈ విధముగా శాపము వలన పుట్టిన దివ్య స్త్రీలు పుణ్యాత్ములకు భార్యలగుదురు. దుష్కర్మ వలన అధఃపతనము కూడా పొందెదరు. అందులకు అహల్య వృత్తాంతమే నిదర్శనము – ఆ కథ వినుము.

# అహల్య కథ

పూర్వము గౌతముడను ఋషికి అహల్య అను సౌందర్యవతి అయిన భార్య కలదు. ఆమెను పొందగోరి ఇంద్రుడు రహస్యముగా వచ్చి ప్రార్థించెను. కామపరవశ అయిన అహల్య అంగీకరించెను. గౌతముడు వచ్చి ఆమెను గద్దించగా ఇంద్రుడు పిల్లి రూపమును ధరించెను. 'ఎవరిక్కడ వున్నది? అని గౌతముడడుగగా, సత్యమునకు విరుద్ధము కాకుండునట్లు అపభ్రంశ భాషలో 'ఏ సోఠి ఓఖు మజ్జారో" (ఇక్కద, మజ్జారో = పిల్లి అని అర్థము, గూఢార్థములో మత్+జారః = నా విటుడు, నా జారుడగు ఇంద్రు డిక్కడున్నాడని అంతరార్థము) అని అహల్య సమాధానము చెప్పగా, గౌతముడు నీ జారుడిక్కడే యున్నాడని అపహసించి, తప్పు చేసినందులకు శిలవు అగుదువు గాక! అని శాపమును, సత్యము గూఢముగా పలికినందులకు రామ పాదస్పర్శచే శాపవిమోచనమును అనుగ్రహించెను. ఇంద్రుని కూడా భగమోహముచే ఇట్లు చేసితివి కాన 'శరీరమంతయూ భగము

లేర్పడును గాక' అని శపించగా ఇంద్రుడు క్షమార్పణ వేడగా దయతలచి విశ్వకర్మ తిలోత్తమ యను దివ్యస్త్రీని నిర్మింపగలడు. ఆమె చూచినంతనే నీ శరీరమందలి భగములు కన్నులుగా మారగలవు" అని పలికి తపస్సుకై వెళ్ళిపోయెను.

ఈ విధముగా వసంతకుని కథా కాలక్షేపములతో ఉదయనుడు వాసవదత్తా - పద్మావతీ సమేతుడై సుఖముగా నుండెను. పద్మావతి పంపెడి దూతల వలన ఆమె అనుకూల దాంపత్యమును తెలుసుకుని మగధరాజు కూడా సంతోషము పొందెను. కొంతకాలము తరువాత యౌగంధరాయణుడు మంత్రాగము నెరపి మగధ సైన్యసహాయముతో కౌశాంబి నుండి జైత్రయాత్రకు వెడలుటకు ప్రయత్నములు చేయసాగెను.

# 3-4 తరంగము

ఒకనాడు ఉదయనుడు కొలువు తీరియుండగా ఒక బ్రాహ్మణుడు తన కుమారుని అడవిలో గోపాల కబాలకులు కాళ్ళు నరికిరని మొరపెట్టుకొనగా రాజు వారిని రప్పించి విచారించెను. అంత ఆ పశుపాలకులు ఆటలు ఆడుచూ ఒక దిబ్బపై కూర్చుని రాజువలే ఆజ్ఞలు ఇచ్చుచున్నాడని తెలిసినది. యౌగంధరాయణుడు ఇందేదో మర్మమున్నదని గ్రహించి సైన్యముతో వెళ్ళి ఆ మట్టిదిబ్బను త్రవ్వించెను. అచట మహానిధీ, ఒక రత్న సింహాసనము లభించినవి. గోపాలకులను, బ్రాహ్మణుని సత్కరించి వాటితో మంత్రి నగరమును చేరి "ప్రభూ! ఇది మా పూర్వుల సింహాసనము. దీనినధిరోహింపుడ"ని కోరగా రాజు-"ఈ జైత్రయాత్ర ముగిసె భూమిని జయించియే ఈ సింహాసనమును ఎక్కెదను"అని పలికెను.

అపుడు మంత్రి - "ముందు తూర్పు దిశగా జైత్రయాత్రకు బయలు దేరెదము" అని చెప్పగా-రాజు ఉత్తరముగా వెళ్లుదమని బదులు చెప్పగా, "రాజా! ఉత్తరపు దిక్కు మిగుల విశాలమైనదైననూ మ్లేచ్ఛసంబంధముచే

నింద్యమైనది. సూర్యాదులస్తమించుటచే, యమునికి నివాసమగుటచేతను దక్షిణము దుష్టమైనది. తూర్పున సూర్యుడుదయించును. ఇంద్రుడధిష్టించి యున్నాడు. గంగానది కూడా తూర్పునకే ప్రవహించును కనుక తూర్పు ప్రశంసనీయము. ఆ దిశగా బయలుదేరిన మంగళములు కలుగును" - అని చెప్పగా రాజంగీకరించెను. ప్రసంగవశమున ఉదయనుడు ఆత్మ బలము, సత్త్వగుణము కలవాడు ఒంటరి వాడైననూ ఆశ్రయహీనుడైననూ సంపద లను పొందును" అని విచిత్రమైన ఒక కథ చెప్పెను.

# విదూషకుని కథ

పూర్వము ఉజ్జయినిని ఆదిత్యసేనుదను రాజు పరిపాలించు చుండెను. అతనికి తేజస్వతి యను భార్యకలదు. ఒకనాడు భార్యా సమేతుడై వేటకు వెళ్ళెను. రాజు గుర్రముపై వెడుతూ వేటాడుచుండగా చీకటి సమ యమున గుర్రము దారి తప్పి అరణ్యమందు సంచరించుచూ ఒక గ్రామ సమీపమందున్న బ్రాహ్మణ మఠమును చేరెను. వారు రాజును లోనికి రానిచ్చుటకు సంశయింపగా "విదూషకుడ"ను బ్రాహ్మణుడు రాజు యొక్క రూప తేజస్సులను గమనించి ఆహ్వానించి ఆతిథ్యమిచ్చెను. ఉదయముననే రాజు ప్రయాణము చేయుటకు సర్వము గుర్రముతో సిద్ధము చేసెను. రాజు తన నగరము చేరి - ఆ విదూషకుని రావించి వేయి గ్రామములను, ఛత్ర వాహనములను ఇచ్చి తన మిత్రునిగా చేసుకొనెను.

ఈ విధముగా విదూషకుడు సామంతరాజయ్యెను. అగ్నిని ఆరాధించి ఒక దివ్యఖడ్గమును పొందెను. పిదప తన పూర్వమిత్రులైన బ్రాహ్మణు లందరికీ ఆ గ్రామములనిచ్చి వారిని కూడా ధనవంతులను చేసెను. కాని నడమంత్రపు సిరిచే వారు పరస్పరము కలహించు కొనుచు గ్రామములను పాడుపెట్టిరి. అపుడు చక్రధరుడను బ్రాహ్మణుడు వారందరినీ సమావేశపరచి మీకు అర్హత లేకపోయిననూ మీకు గ్రామాధిపత్యమిచ్చుటచే మీరు మీ అసమర్థత వలన గ్రామములను హీనస్థితికి తెచ్చిరి.

కనుక నా మాటవిని మీరందరూ సమర్ధుడైన ఒకని నాయకత్వము లోనే కార్యమును నిర్వహింపుదని, వారిని సమాధానపరచగా, వారంగీ కరించిరి. వీరుడు గదా ప్రభుత్వమున కర్హుడు కనుక "ఇక్కడ శ్మశానమున ముగ్గురు దొంగలను కొరత వేసిరి. ఎవరు వారి ముక్కులను కోసి తెత్తురో వారే నాయకుడని" చక్రధరుడు చెప్పగా బ్రాహ్మణులందరూ ఈ పని చేయుట మా వలన కాదని వెనుకంజ వేసిరి 'విదూషకుడు' ఈ పనినే చేసెదని శ్మశానమునకు వెళ్లెను.

అచ్చట తన దివ్యఖడ్గముచే భూత భయము లేక ఆ ముగ్గురి ముక్కు లను కోసి ఒక గుడ్డలో మూటకట్టెను. తిరిగి వచ్చునంతలో అచట ఒక శవముపై కూర్చుని ఒక సన్యాసిని చూచెను. భేతాళసిద్ధిచే ఆ శవము నెమ్మదిగా కదలుచూ ఉత్తరదిశ నున్న ఒక పాడుపడిన దేవాలయమును చేరెను. విదూషకుడు కూడా ఇది ఏమిటో చూచెదనని రహస్యముగా వెంబడించెను. అచట కాళికను అర్చించగా ఒక క్షుద్రశక్తి తాను సిద్ధించుటకు ఆదిత్యసేనుని కుమార్తెను బలిగా కోరెను. ఆ సన్యాసి సరే ఈక్షణమే తీసుకు వచ్చెదనని శవముపై కూర్చుండి భేతాళశక్తిచే రాచనగరి వైపు ఆకాసమున పయనించెను. ఇది వినిన విదూషకుడు అచటనే యుండి రాజకుమార్తెను రక్షించుటకు నిశ్చయించుకొనెను.

కొద్దిసేపటికి తవ భేతాళశక్తిచే ఆ సన్యాసి రాజకుమార్తెను తెచ్చి బలి యివ్వబోగా, చాటుగా నున్న విదూషకుడు వెంటనే తన దివ్య ఖడ్గముతో సన్యాసి తల నరికి సంహరించెను. అపుడు ఆ సిద్ధుని బలి ఇచ్చుటచే ఆ క్షుద్రశక్తి విదూషకుని వశమై "ఓ వీరుడా ఆ సన్యాసి ఉత్తరీయమున కట్టిన ఆవాలు గ్రహింపుము. దానిచే నీకీ యొక్క రాత్రీ ఆకాశగమనము సిద్ధించును. మరల ఒక నెల తరువాత ఇదే ఆలయమునకు రమ్మని" దేవి ఆదేశించెను.

విదూషకుడు రాజకుమార్తెను తీసుకుని ఆకాశగమనమున అంతః పురమున ఉంచగా అతనిని కూడా ఆ రాత్రి అచటనే శయనించమని ఆమె కోరినది. శరీరశ్రమ చేతనూ, జాగరణ చేతనూ విదూషకుడు అచటనే యుండగా నెమ్మదిగా అతనికి నిద్రపట్టినది. ఉదయమున పరిచారికులు విదూషకుని చూచి రాజునకా సంగతి వివరించగా, విదూషకుని నిద్ర నుండి లేపి ప్రశ్నించిరి. విదూషకుడు జరిగినదంతయూ వివరించెను. తన ఉత్తరీయమున కట్టిన దొంగల ముక్కులు, సన్యాసి ఆవాలు చూపెను. ఇది సత్యము కావచ్చునని యూహించి మఠము నందలి బ్రాహ్మణు లందరినీ, చక్రధరుని పిలిపించి నిజము తెలుసుకొనెను. పిమ్మట తన కుమార్తె అభీష్టము మేరకు విదూషకునికి ఆమెను ఇచ్చి వివాహము చేసెను.

ఒక నెల జరిగిన తరువాత ఆనాడు శూన్యాలయమున 'మరల ఇచ్చుటకు ఒక నెల తరువాత రమ్ము' అను ఆదేశమును రాజకుమార్తె విదూషకునికి గుర్తు చేసినది. విదూషకుడు తన దివ్యఖడ్గమును ధరించి ఆ శూన్యాలయమునకు వెళ్ళెను. అచట ఒక దివ్యస్త్రీ కలదు. ఆమెను ప్రశ్నించగా తాను "భద్ర" యను విద్యాధర కన్యనని, నిన్ను వరించితినని పలుకగా విదూషకుడు గాంధర్వవిధిచే ఆమెను వివాహ మాడెను. ప్రియా సంగతుడై దివ్యభోగముల ననుభవించుచూ అచటనే యుండెను.

తెల్లవారిననూ భర్త రాలేదని రాజకుమార్తె ఆందోళన పడసాగెను. రాజు తన సైన్యముతో వెతికించిననూ ఆ శూన్యాలయమున విద్యాధరీ ప్రభావముచే విదూషకుడు వారికి కనబడలేదు. రాజకుమార్తె విలపించ సాగెను. అపుడు ఒక మహర్షి వచ్చి "అమ్మా! చింతించకుము. నీ భర్త క్షేమముగానే యున్నాడు. త్వరలోనే రాగలడు" అని ఓదార్చెను. అది విని అతడు రాగలడను నాశచే ఎదురుచూచుచుండెను. విదూషకుడచ్చట యుండగా భద్ర యొద్దకు "యోగేశ్వరి" యను ఆమె చెలికత్తె వచ్చి రహస్యముగా "సఖీ! మానవ సంబంధముచే విద్యాధరులు నీపై కోపగించిరి. నీకు అపకారము చేయుటకు ప్రయత్నించుచున్నారు.

కనుక తూర్పు సముద్రము అవతల ఒడ్డున కార్కోటకమను పురము కలదు. దాని అవతల "శీతోదమ"ను నది కలదు. దానిని దాటినచో ఉదయ మను సిద్ధక్షేత్రమైన మహాగిరి కలదు. అచ్చటకు విద్యాధరులు రాలేరు. నీవచ్చటికి వెళ్లుము. మానవుడైన ఇతని కొరకు విచారింపకుము ఇతడు సత్త్వవంతుడు కావున తప్పక అచ్చటికి రాగలడు" అని చెప్పగా భద్ర విదూషకుని యందు విశేషానురాగమున్ననూ అంగీకరించెను. ఒకనాటి రాత్రి ఇదంతయూ విదూషకునికి చెప్పి తన యుంగరమిచ్చి రాత్రి చివరి భాగమున అంతర్ధానమయ్యెను.

ఉదయముననే విదూషకుడు రాత్రి భద్ర చెప్పినది జ్ఞాపకము చేసుకొని ఉంగరమును తీసుకుని తూర్పుదిశగా బయలుదేరెను. కొన్ని రోజులకు "పౌండ్ర వర్ధనమ"ను నగరమును చేరి ఒక పేదరాశి పెద్దమ్మ ఇంట బస చేసెను. ఆమెను భోజనానంతరము విశేషములు అడుగగా – 'ఆ దేశపురాజు "దేవసేనుడ"ను వానికి "దుఃఖలబ్ధిక" అను కుమార్తె కలదు. ఆమెను కచ్ఛపనాధు నను వానికిచ్చి వివాహము చేయగా మొదటి రాత్రి యందే అతడు మరణించెను. పిమ్మట మరొక రాజు పుత్రుని కిచ్చి వివాహము చేయగా అతడు కూడా మొదటి రాత్రే మరణించినాడు.

ఈ విధముగా అనేకమంది మరణించిరి. అంత రాజు సేనాపతిని బిలిచి "ఈ దేశమునందు ప్రతిదినమూ వరుసగా ప్రతిగృహము నుండి బ్రాహ్మణుని గాని, క్షత్రియుని గాని ఒక్కొక్కని తెచ్చి నా పుత్రికా గృహమున ప్రవేశపెట్టుము ఎవడు చావు తప్పించుకొనునో వాడే ఆమె భర్త కాగలడు." అని ఆజ్ఞాపించగా అది మొదలు సేనాపతి వరుసగా ప్రతిగృహము నుండి ప్రతీరోజూ పురుషులను తీసుకొని వెళ్ళుచునే యున్నాడు. అందరూ చని పోవుచునే యున్నారు. నాకు ఒకే కుమారుడు కలదు. నేడో రేపో అతని వంతు వచ్చును అదియే నాకు భరింపశక్యము కాకున్నదని ఆమె విల పించెను. అది విని విదూషకుడు "అమ్మా! నీవు అధైర్యపడకుము. నేను

నీ కుమారుని బదులుగా వెళ్ళి ఆ విషయము తేల్చెదను. సిద్ధయోగమున జన్మించిన నాకై నీవు బెంగపెట్టుకొనవద్దు" - అని ఓదార్చెను.

ఒకనాడు ఆ యింటి వంతు వచ్చినది. విదూషకుడు సేనాపతి పంపిన భటునితో సాయంకాలము బయలుదేరి రాజకుమార్తె శయన గృహము చేరెను. ఆమె శయనించిన పిమ్మట తన దివ్య ఖడ్గమును స్మరించి దానిని ధరించి మెలకువగా యుండెను. అర్ధరాత్రి సమయమున ఒక ఘోరరాక్షసు డవతరించి విదూషకుని సంహరించబోవగా తన దివ్యఖడ్గముచే అతని చేతిని నరికెను. వెంటనే రాక్షసుడు భయపడి అంతర్ధానమయ్యెను. ఉదయముననే 'దేవసేనుడు' బ్రతికియున్న విదూషకుని ద్వారము వద్ద పడియున్న రాక్షసుని బాహువును చూచి మహాప్రభావము గల విదూషకునికి తన కుమార్తెనిచ్చి వివాహము చేసెను.

అచ్చట కొన్ని దినములుండి రాజకుమార్తె నిద్రించి యుండగా విదూషకుడు ఆమెను వదలి భద్ర వద్దకు వెళ్లుటకు ప్రయాణమయ్యెను. తూర్పుదిశకు పోగా పోగా 'తామ్రలిప్తి' అను నగరము చేరెను. అచట సముద్ర వర్తకుడగు స్కందదాసుడను వర్తకునితో స్నేహము చేసి అతనితో ఓడపై సముద్ర ప్రయాణమునకు బయలుదేరెను. కొన్ని రోజుల పిమ్మట ఓడ సముద్రమునందు కదలక ఆగిపోయినది. ఎంతమంది ఎన్ని విధముల ప్రయత్నించిననూ కుదరలేదు. స్కందదాసుడు "ఎవరు తన ఓడను కదిలింతురో అతనికి తన కుమార్తె నిత్తునని ప్రతిన చేసెను -

విదూషకుడు ఈ కార్యము సాధింతునని చెప్పి తాళ్లను కట్టించుకుని తన దివ్య ఖడ్గముతో సముద్ర గర్భములోనికి వెళ్ళెను. అచ్చట ఒక గొప్ప జలచరము యొక్క సంధులలో ఓడ అడుగుభాగము చిక్కినది. ఎటూ కదలు టకు వీలు లేకున్నది. అపుడు విదూషకుడు తన దివ్యఖడ్గముచే దాని అవయవములను ఖండించి ఓడ సుగమముగా ప్రయాణము

చేయుటకు వీలు కల్పించెను. స్కందదాసుడు ఓడ కదులుట చూచి మోసబుద్ధితో విదూషకునికి కట్టిన త్రాళ్ళను నరికించి సముద్రమున అతడిని వదలి ముందుకు సాగిపోయెను.

విదూషకుడు తాను ఖండించిన అవయవమునే తెప్పగా చేసుకుని, ధైర్యముగా సముద్రము మీద సాగెను. ఏడు దినములా విధముగా పయనించి కార్కోట నగరమును చేరెను. అచట ఒక మఠమును ప్రవేశించెను. దానిని 'ఆర్యవర్మ' యను రాజు నిర్మించెను. 'అచట చక్కని ఆతిధ్యమును పొందెను' ఆరోజు గడిచినది. మరునాడు 'రాజకుమార్తెను వివాహమాడుటకు సాహసుడు రావలసినదిగా చాటింపు వినబడినది. ఇదేమిటని? విదూషకుడు బ్రాహ్మణుల నడిగెను.

రాజకుమార్తెను వివాహమాడు వాడు మొదటి రాత్రే మరణించుచున్నాడని, అందుకే రాజు చాటింపు వేసి అల్లుడికై వెతుకుచుండెనని తెలిపిరి. ఇంతకు ముందు ఇటువంటి అనుభవము కలవాడగుటచే విదూషకుడు "ఆర్యవర్మ"ను చేరి తన అంగీకారమును తెలిపెను. రాజతనిని అభినందించి రాజకుమార్తెతో వివాహము చేసెను. మొదటి రాత్రి విదూషకుడు తన దివ్యఖడ్గమును ధరించి కాపలా కాయుచుండెను. అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి చేయి గల రాక్షసుడు వచ్చి విదూషకుని చంపబోయెను.

అతడిని చూచి "పౌండ్రవర్ధనము"న ఒక చేయి నరికిన రాక్షసునిగా గుర్తించి, ఇతనిని బ్రతకనిచ్చుట చాలా తప్పని భావించి కంఠమును నరకబోయెను. అంతట ఆ రాక్షసుడు విదూషకుని పాదములపై పడి తన పేరు "యమదంష్ట్రుడ"ని, వీరిద్దరూ తన కుమార్తెలని, వీరులు గాని పురుషులతో తన కుమార్తెలు సంగమించుట కిష్టము లేక ఇట్లు చేయుచుంటినని తెలిపి, అతని స్నేహమును కాంక్షించెను. కష్టములందు అవసరమైనపుడు తనను స్మరించినంతనే వచ్చి సహాయపడెదనని వాగ్దానమిచ్చి, విదూషకుని ఆజ్ఞచే అంతర్ధానమయ్యెను.

మరునాడు ఉదయముననే విదూషకుడు, కుమార్తెతో కలసి జీవించి యుండుట చూచి "ఆర్యవర్మ" ఎంతో సంతోషించెను. రాజకుమార్తెతో కొన్ని దినములచట భోగముల ననుభవించి తన ప్రియురాలు భద్రకై మరల ఒంటరిగా బయలుదేరెను. దివ్యామృతమును రుచి చూచిన వానికి ఇతర రసముల నెట్లు ఇష్టపడును?– కొంతదూరము పయనించి రాక్షసుని స్మరించి, తాను విద్యాధరి కోసము ఉదయాద్రి నందలి సిద్ధక్షేత్రము వెళ్లవలసి యున్నదని, తన నచ్చుటకు చేర్చమని కోరెను. రాక్షసుడు తన శరీరముపై విదూషకుని ధరించి ఆకాశమార్గమున మానవులకు దాటుటకు శక్యము కాని "శీతోద"మను నదిని దాటి ఆవల తీరము చేర్చి "అదిగో అదియే ఉదయాద్రి. దానిపై నున్న సిద్ధక్షేత్రమునకు వెళ్లు శక్తి నాకు లేదు. నీవే వెళ్లుమని" చెప్పి విదూషకుని ఆజ్ఞచే అంతర్ధానమయ్యెను.

అక్కడ ఒక దిగుడు బావి కలదు. కొంతమంది దివ్యాంగనలు బంగారు బిందెలతో ఆ బావిలోని నీటిని తీసుకువెళ్ళుచుండిరి. విదూషకుడు వారిని వివరములు ప్రశ్నించగా – 'భద్ర యను విద్యాధరి ఆ కొండపై నున్నది. ఆమె స్నానము నిమిత్తము నీటిని తీసుకు వెళ్లుచున్నామని చెప్పిరి. అపుడు విదూషకుడు గతములో ఆమె ఇచ్చిన ఉంగరమును వారిచేత ఆమెకు పంపించెను.

అంతట ఆమె అది చూచి తన ప్రియుడు తనను వెదకుచూ ఇచటకు వచ్చెనని సంతసించి– చెలులతో 'అతడే నా భర్త' త్వరగా అతనిని స్నానము చేయించి అలంకరించి ఇచ్చటకు తీసుకుని రండని" చెప్పగా వారు విదూషకుని చేరి జరిగినది చెప్పి, అతనికి స్నానము చేయించి అలంకరించి భద్ర యొద్దకు తీసుకువెళ్ళిరి. ఆమెయు అతనిని చూచి ఆనందభాష్పములు రాల్చుచూ అతనిని గట్టిగా కౌగిలించుకొనెను. ఇరువురూ కూర్చుండి ఒకరి నొకరు చూచుకొనుచు తనివితీరని తమకముతో ఆ రాత్రిని సంతోషముగా గడిపిరి.

ఆ మరునాడు, భద్ర తన ప్రియుని కోసమై సంకల్ప మాత్రముననే తన విద్యలనన్నిటినీ త్యజించి విదూషకునితో స్థిరముగా నుండుటకు నిశ్చయించుకొని ఉజ్జయినీ బయలుదేరుటకు సిద్ధపడినది. విదూషకుడు "యమదంష్ట్రుని" స్మరించి అతని సహాయముతో భద్రతో కలసి "కార్కోట పురము"ను చేరి ఆర్యవర్మకు సంగతులు వివరించి తన భార్యను కూడా తీసుకుని, మరల రాక్షసుని సహాయముచే "పౌండ్ర వర్ధనము" చేరుటకు నిశ్చయించెను.

అచటనే ఆనాడు సముద్రములోనికి దిగినపుడు త్రాళ్లు తెగగోయించిన వర్తకుని చేరి, పడవను తప్పించినందులకు వాగ్దత్త అయిన అయిన అతని కుమార్తెను ధనముతో బాటు పరిగ్రహించెను. పిమ్మట "పౌండ్ర వర్ధనము" చేరి దేవసేన మహారాజు కుమార్తెను తీసుకుని 'ఉజ్జయిని' చేరెను. భార్యలతో రాజభోగముల ననుభవించుచూ విదూషకుడు సుఖముగా నుండెను. దైవమనుకూలముగా నున్నప్పుడు ధీరుల సత్త్వమే సిద్ధమంత్రము వలె పని చేయును. వత్సరాజైన ఉదయనుడు చెప్పిన ఈ కథ విని అందరూ సంతసించిరి.

# 3-5వ తరంగము

ఒకనాడు యౌగంధరాయణుడు – ఉదయనునితో ఇట్లనెను. "రాజా! నీకు దైవానుకూల్యము, పౌరుషము పుష్కలముగా నున్నవి. త్వరలోనే మనము జైత్రయాత్రకు బయలుదేరుదము" అని చెప్పగా– ఉదయనుడు ముందుగా అంగీకరించి ఆ పిమ్మట శివానుగ్రహము కొరకు దీక్ష వహించెను. మూడు రాత్రులు ఉపవసించి శివుని ఆరాధించగా, పరమేశ్వరుడు కలలో కనబడి "జయము నిశ్చయముగా కలుగునని, విద్యాధరులకు అధిపతి యగు కుమారుని త్వరలోనే పొందగలవని" ఆశీర్వదించెను. ఆ విషయము నంతయూ మంత్రులకు వివరించగా వారంతా ఆనందించి సర్వ సైన్యమును సన్నద్ధము చేయుటకు ప్రయత్నములు ప్రారంభించిరి. ఉదయనుని మనోల్లాసము కొరకు యౌగంధరాయణు డొక కథను చెప్పెను.

# దేవదాసు కథ

పూర్వము పాటలీ పుత్రమున ధనవంతుడైన దేవదాసుడను వర్తకుడు కలడు. అతనికి పౌండ్రవర్ధనమున గల ఒక ధనిక వర్తకుని కుమార్తెతో వివాహమైనది. కాని తండ్రి మరణానంతరం దేవదాసుడు వ్యసన పరుడూ, జూదరిగా మారి ధనము నంతయూ కోల్పోయి దరిద్రు డయ్యెను. అతని భార్య దారిద్ర్యముచే దుఃఖించుచుండగా ఆమె తండ్రి వచ్చి తన ఇంటికి పౌండ్రవర్ధనమునకు తీసుకుపోయెను. కొంతకాలమునకు దేవ దాసుడు తన వ్యసనములను మానుకొని వర్తకము ప్రారంభింప దలచి ధన సహాయము నర్థించుటకై అత్తవారింటికి బయలుదేరెను.

ఆ నగరము చేరుసరికి బాగా చీకటి పడినది. ఈ దీనావస్థలో రాత్రి వారింటికి వెళ్లుట ఎందుకని ఆలోచించి ఒక అంగడి ప్రక్కనున్న ఇంటి అరుగుపై కూర్చొనెను. కొంతసేపటికి ఒక యువకుడు వచ్చి ప్రక్కనున్న ఇంటి గుమ్మము తలుపు తీసుకుని లోపలికి వెళ్ళెను. మరికొంత సేపటికి ఒక స్త్రీ ముసుగు ధరించి చాలా వేగముగా అదే గుమ్మము గుండాలోనికి వెళ్ళినది. లోపల దీపము వెలిగినది. దేవదాసుడు కుతూ హలము కొలదీ అచ్చటకు వెళ్ళి రహస్యముగా పరికించి ఆమెను తన భార్యగా గుర్తించెను. అంత అమె తలుపునకు గడియపెట్టి ఆ పురుషునితో రమించసాగినది. అది చూచి దేవదాసుడు దుఃఖితుడై వ్యసనముల బారిన పడిన వారికిదియే ఆపద. పితృగృహమందున్న స్వతంత్రురాలి గతి యిదియే అని చింతించెను. కొలది సేపటికి భార్య అతనితో చెప్పు మాటలు దేవదాసుని చెవినబడెను.

"నీ మీద గల ప్రేమచే చెప్పుచున్నాను. వినుము. నా భర్త ముత్తాత వీరవర్మ తన యింటి ముంగిటలో నాలుగు మూలలలో నాలుగు కడవల బంగారు నాణెములను దాచెనట. ఈ విషయము పరంపరగా మా అత్తగారు

నాకు చెప్పినది. నా భర్త దరిద్రుడైననూ ఈ రహస్యము నేనతనికి చెప్పలేదు. జూదరి అయిన అతడనిన నాకసహ్యము. నీవు ఆ గృహమును కొని ఆ ధనము గ్రహించి ఇచటకు వచ్చి నాతో సుఖింపుము' - అని చెప్పగా ఆ ఉపపతి మరింత సంతోషముతో ఆమెను హత్తుకొనెను. దేవదాసుడు ఈ మాటలు విననంతనే వెంటనే బయలుదేరి తన నగరము పాటలీ పుత్రము చేరి పాతిపెట్టిన ధనమును గ్రహించి మరొకచోట భద్రపరచెను. అనంతరము తన భార్యతో తిరుగు ఆ ఉపపతి వచ్చి నిధి యందలి ఆశచే దేవదాసుని అర్థించి ఆ గృహమును కొనెను. దేవదాసుడు విస్తారమైన ధనమునకు దానిని విక్రయించెను. పిమ్మట మరొక గృహము తీసుకొని, భార్యను తీసుకొని వచ్చి కొత్తగా వ్యాపారమును ప్రారంభించెను.

భార్యా కాముకుడైన ఆ ఉపపతి ఆ గృహమునందు నిధి లభింపక పోవుటచే, ఆ ఇంటిని తిరిగి తీసుకొనమని దేవదాసుని నిర్బంధించెను. దేవదాసు దంగీకరించలేదు. ఇద్దరూ వివాదము ముదరగా న్యాయస్థానము చేరిరి. అచ్చట దేవదాసుడు తన భార్యా వృత్తాంతముతో సహా అంతయూ వివరించెను. ఆ ఉపపతికి ధన దండన శిక్ష విధించి, రంకులాడి అయిన దేవదాసుని భార్యకు ముక్కు కోయించెను. దేవదాసుడు ఆమెను విడిచి మరొక స్త్రీని వివాహము చేసుకొని సుఖముగా కాలము గడుపుచుండెను. ఇలా ధర్మముచే సంపాదించిన సంపద వంశమున్నంత వరకూ చెడిపోక యుండును. ఇతరములు నిలువవు - ఇలా కథను చెప్పి అందరినీ ఆనందింప చేసెను.

అటు పిమ్మట ఉదయనుడు తూర్పు మొదలుగా నాలుగు దిక్కులనూ జయించి తన పాండవవంశపు కీర్తిని అధికము గావించుటకు శుభ ముహూర్తమున జైత్రయాత్రకు బయలుదేరెను. తన వెంట వచ్చుచున్న గోపాలకుని సత్కరించుకుటకై వైదేహ రాజ్యమిచ్చెను. పద్మావతీ సోదరుడగు సింహవర్మను గౌరవించి చేది దేశమిచ్చెను. భిల్లరాజగు పుళిందకుని అతని

సైన్యముతో రప్పించి దిగ్విజయములో పాల్గొనునట్లు చేసెను. దండ్రయాత్రా సరంభము జరుగుచుండగా శత్రువుల హృదయములు కలత చెంద సాగినవి. వారణాసిని పరిపాలించుచున్న బ్రహ్మదత్తుని వివరములు తెలుసుకొనుటకై యౌగంధ రాయణుడు చారులను పంపెను. ఉదయనుడు ముందుగా తూర్పుదిశగా బయలుదేరి బ్రహ్మదత్తునిపై దండెత్తెను.

ఈ లోపల యౌగంధ రాయణునిచే నియుక్తులైన చారులు కాపాలిక వేషమును ధరించి వారాణసీపురమును చేరి ముఖ్యులను వశము చేసుకొని సైన్యవివరములను లోటు పాట్లను తెలుసుకొనిరి. యుద్ధ సమయమున బ్రహ్మదత్తుని మంత్రి యోగకరండకుడు అనేక కపటోపాయములను కల్పించెను. కాని ఇదంతయూ ముందే తెలుసుకున్న ఉదయనుని మంత్రి వాటి నతిక్రమించెను. ఇక చేయునది లేక బ్రహ్మదత్తుడు ఓటమి నంగీకరించి ఉదయనుని ఆశ్రయించగా అతనికి అభయమిచ్చి ఉదయనుడు ప్రథమ జయోత్సాహము పొందెను. అటు పిమ్మట తూర్పు సముద్రతీరమును చేరి "జయస్తంభ"మును పాతెను.

పిదప దక్షిణ దిశగా ప్రస్థానము గావించి చోళ-మురళ (మళయాళ) దేశములను జయించెను. ఏడుపాయలుగా చీలిన గోదావరీ జలమును త్రాగుటచే కాబోలు అతని ఏనుగులు ఏడు ధారలుగా మదోదకమును స్రవించినవి. అటు పిమ్మట యమునానదిని దాటి ఉజ్జయిని చేరెను. అచట మామగారు చండ మహాసేనుడెదురు వచ్చి సత్కరించెను. అటు పిమ్మట ఉత్తరదిశగా బయలుదేరి సింధురాజును వశమొనర్చుకొని మ్లేచ్ఛుల నాశనము చేసెను. తురకరాజుల తురగ సమూహము ఉదయనుని గజ సముద్ర ధాటికి చెల్లాచెదురైనవి. పారశీక రాజు శిరమును ఖండించెను. హూణుల ఓడించి దిగంతకీర్తిని పొందెను. ఈ విధముగా జైత్రయాత్ర గావించి మగధ రాజ్యమును చేరెను. అతడు కూడా పాత విషయములను

మనసులో నుంచుకొనక అల్లుడిని, కూతురుని ఆదరించి సంతోషపరచెను. అటు పిమ్మట కొన్ని దినములచట ఉండి ఉదయనుడు లావాణకమునకు ప్రయాణమయ్యెను.

# 3-6వ తరంగము

ఉదయనుడు సేనా విశ్రాంతికై లావాణకమున ఉండెను. ఒకనాడు యౌగంధరాయణునితో ఇట్లనెను:

వారాణసీ రాజైన బ్రహ్మదత్తుడు చెడుతలపు గలవాడు, అతడు మరల తిరుగుబాటు చేయునేమో? అనెను. అంతట మంత్రి - "రాజా! బ్రహ్మదత్తుడు తిరుగుబాటు చేయడు, నీవతనిని జయించిననూ చక్కగా సత్కరించితివి! కనుక అటువంటి తెలివిమాలిన పని అతడు చేయడు. ఒక వేళ చేసినచో అది అతనికే కీడు చేయును ఇందుల కొక కథను చెప్పెదను వినుము.

# సోమదత్తుని కథ

పూర్వము పద్మదేశమునందు రాజు దానము చేసిన అగ్రహారము ననుభవించుచూ అగ్నిదత్తుడను బ్రాహ్మణుడుండెను. అతనికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు సోమదత్తుడు, చిన్నవాడు వైశ్వానరదత్తుడు. ఇద్దరూ వివాహితులైరి. తండ్రి మరణానంతరం అగ్రహారమును చెరిసగము పంచు కొనిరి. చిన్నవాడు పండితుడై రాజసన్మానములు పొందెను. సోమదత్తుడు శూద్ర సహవాసముచే అయోగ్యుడయ్యెను.

ఒకనాడు వారిచే పరాభవితుడై వారిని కొట్టి రాజాజ్ఞ వలన పడిన శిక్షను తప్పించుకొనుటకై భార్యతో సహా పారిపోయెను. మరల బంధువుల విన్నపము మేర తన అగ్రహారములో సగభాగము తీసుకుని అందలి పొలమును వ్యవసాయము చేయుటకు నిశ్చయించుకొని అచ్చట నున్న

ఒక గొప్ప రావిచెట్టును చూచి, దాని నీడలో నివసించుచూ, వ్యవసాయము చేయసాగెను. రోజూ ఆ చెట్టుకు భక్తితో ప్రదక్షిణములూ, నమస్కారములు చేసెడివాడు. పంట చేతికి వచ్చు సమయములో పర రాజసైన్యము వచ్చి దానినపహరించిరి. సోమదత్తుడు దుఃఖించుచూ ఆ చెట్టుకిందే నిదురించెను. అతనికి కలలో ఆ చెట్టు నుండి ఒక మాట వినబడెను.

'ఓ సోమదత్తా! నీవు శ్రీకంఠదేశము పొమ్ము. అదిత్య ప్రభుడను రాజుకలడు. అతని రాజద్వారమున సంధ్యాగ్ని హోత్రమంత్రములను చదివి ఇట్లు చెప్పుచుండుము నేను ఫలభూతి యను బ్రాహ్మణుడను. నేను చెప్పిన దానిని వినుడు "మంచి చేయువాడు మంచిని పొందును. చెడు చేయువాడు చెడును పొందును" ఇట్లు చేసినచో గొప్ప సంపదలు పొందగలవు - అది విని సోమదత్తుడు శ్రీకంఠదేశమును చేరి అదే విధముగా ఆచరించెను.

ఒకనాడు ఆదిత్యప్రభ మహారాజు కుతూహలముతో సోమదత్తుని పిలిపించి ఆసక్తుడై తనవద్దనే ఉండమని, గొప్పగా ధనముతో సత్కరించెను. కాలక్రమమున రాజగౌరవము పొందుతూ ఎల్లప్పుడూ ఆ మాటలనే ఉపదేశించుచూ రాజప్రియుడుగా మెలగుచుండెను.

ఒకనాడు రాజు వేటకు వెళ్ళి తిరిగి వచ్చి ఆకస్మికముగా అంతఃపురమునకు వెళ్ళెను. అచట అతని భార్య "కువలయావళి" దిగంబరిగా క్షుద్రపూజలు చేయుట చూచి గద్దించి ప్రశ్నించెను. రాజక్షేమము కోరియే ఇట్టి పూజలు చేయుచున్నానని, తాను కన్యగా ఉన్నప్పుడు వినాయకుని మహిమ తెలుసుకుని, ఆ మంత్రమును జపించుచుండగా డాకినీ శక్తులు వచ్చి కాళరాత్రి యను క్షుద్రబ్రాహ్మణి తమ గురువని వివరించిరి. పిమ్మట వారు నా కోరిక మేరకు కాళరాత్రిని తీసుకొని వచ్చిరి. ఆమె నన్ను దిగంబరిని చేసి భైరవార్చన చేయించినది. దేవతార్చనమున బలి యిచ్చిన నరమాంసమును తింటిని.

అపుడు ఆకాశగమన సిద్ధి లభించినది. ఇట్లు కన్యగానే నేను డాకినీ శక్తి పొందితిని. నాకు సహకరించినచో రాజులందరినీ జయించి గొప్ప సామ్రాట్ కాగలవని, నన్ను కాదనినచో ఆత్మహత్య కావించుకొనెదనని 'కువలయావళి' బెదిరించినది. ఆదిత్య ప్రభువు ఆమెపై గల వ్యామోహముచే అంగీకరించగా ఆమె భర్తకు కూడా భైరవదీక్ష నొసగి పూజా విధానము నేర్పినది. ఒకనాడు తన భర్తతో 'కాళరాత్రి' యొక్క కథను ఇట్లు వివరించినది.

కన్యాకుబ్జమున విష్ణుస్వామి అనెడి బ్రాహ్మణునకు కాళరాత్రి యను భార్య కలదు. అతని వద్ద అనేకమంది వేదము నేర్చుకొనేవారు. వారిలో సుందరకుడు అను శిష్యుడు పేరుకు తగినట్లుగా ఎంతో అందముగా ఉండేవాడు. కాళరాత్రి అతనిని కామించి తన పొందు కోరగా అతడు తిరస్కరించెను. అంతట ఆమె పరాభవము సహించలేక సుందరకుడు తనను బలాత్కరింపబోయెనని తన భర్తతో చెప్పి అతనిని ఇంటి నుండి వెడల గొట్టించినది. అతడు ఆ వూరిలోని సత్రములో నివసించసాగెను.

ఒకనాడు రాత్రి దొంగల వలన ప్రాణభయముతో ఒక గోశాలపై నక్కి దాగి యుండెను. కాళరాత్రి ఆ సమయమున అచటికి డాకినీ గణముతో వచ్చి మంత్రములతో ఆ గోశాలయున్న భవనముతో సహా ఆకాశమున కెగరి ఒక నగరము యొక్క శ్మశానమందు దిగినది. అది ఉజ్జయినీ నగరము. అచట డాకినీ గణములో క్షుద్రపూజలు చేసి, వారితో క్రీడించి మరల గోశాలతో సహా భవనముతో తన గ్రామమును చేరినది. సుందరకుడు ఆకాశమునకెగురు మంత్రమును విని యుండుటచే మరునాడు రాత్రి ఆ మంత్రమును పఠించి ఆకాశగమనముచే ప్రయాగ చేరినాడు. అచట స్నానము చేయుచున్న ఒక రాజు నీవెవ్వడవు? ఆకాశము నుండి ఏల వచ్చితివని? ప్రశ్నింపగా – నేను శివుని ప్రమథ గణములలో

మురజకుడను వాడను. శివాజ్ఞ చేత నీ వలన మానుష భోగముల నను భవించుటకు ఇచటకు వచ్చితినని - సుందరకుడు చెప్పగా ఆ రాజు ఆ మాటలు నమ్మి సర్వ సౌకర్యములతో ఒక పురమును ఇచ్చి ఆదరించెను.

కొంతకాలమునకు ఒక సిద్ధుని ద్వారా ఆకాశము నుండి సులభముగా అవతరించు మంత్రసిద్ధిని పొందెను. పిమ్మట తన స్వగ్రామమైన కన్యా కుబ్జమును చేరి ఆ రాజునకు కాళరాత్రి దుశ్చరిత్ర వివరించగా రాజు ఆమెను విచారించి ఆమె ముక్కు, చెవులూ కోయించుటకు శిక్ష విధించగా ఆమె తన డాకినీ శక్తిచే తప్పించుకు పారిపోయినది. నేనామె ఉత్తమ ప్రథమ శిష్యురాలను. అని కువలయావళి వివరించినది.

ఒకనాడు దీక్షయందున్న భర్తతో - దేవా! మనవద్ద నున్న 'ఫలభూతి' యను బ్రాహ్మణుని బలిగా సమర్పించుటకు నేను నిశ్చయించితిని. కాని ఆకర్షణ కష్టము. అందులకై వంటవాని నొకనిని ఈ దీక్షలోనికి గ్రహింతము. వాడు స్వయముగా చంపి వండును. అటువంటి ఉత్తమ మాంస భక్షణ వలన గొప్ప సిద్ధి కలుగును. అసహ్యపడకుము" అని రాజును ఒప్పించినది అనంతరము "సాహసికుడ"ను పేరుగల వంట వాని బిలిపించి వానికి నమ్మకము కలిగించి, దీక్షనిచ్చి - "రాజు భార్యా సమేతముగా భోజనమునకు వచ్చును. కావున వంట త్వరగా చేయుము" అని నీ వద్దకు వచ్చిన వానిని చంపి ఆ మాంసముచే భోజనము సిద్ధము చేయుమని" వంటవాని కాజ్ఞాపించిరి.

ఉదయమున ఫలభూతి వచ్చినపుడు - రాజు వానితో "నీవు వంట ఇంటిలో వున్న సాహసికుడను వంటవాని వద్దకు వెళ్ళి "రాజు భార్యా సమేతముగా భోజనము నకు వచ్చును. కావున వంట త్వరగా చేయుము" అని చెప్పుము అని పంపెను. ఫలభూతి సరేయని అంగీకరించి బయలు దేరగా మార్గ మధ్యమున చంద్రప్రభుడను రాజపుత్రుడు కనబడి "ఈ

బంగారముతో మానాన్నగారికి చేసిన కుండలముల వంటి వాటిని చేయింపు మని నిర్బంధించగా, ఫలభూతి ఆ బంగారము గ్రహించి వంటవాని వద్దకు వెళ్ళి ఈ కబురు చెప్పుము అని రాజు తనకు చెప్పిన సంగతిని వివరించెను. సరేయని చంద్రప్రభుడు సాహసికుని వద్దకు వెళ్ళి ఫలభూతి చెప్పమన్నట్లు గానే చెప్పగా, సాహసికుడు అతనిని సంహరించి వంట చేసెను. అతని మాంసముతో చేసిన వంటను, రాజూ రాణి తెలియకయే అర్చన చేసి భుజించిరి. మరునాడు కుండలములతో వచ్చిన ఫలభూతిని చూచి అతని వలన నిజము గ్రహించి, హా! పుత్రా! పుత్రా! అని విలపించుచూ గుండెలు బాదుకొనెను. మంత్రులు వచ్చి కారణమడుగగా జరిగినదంతయూ వివరించెను.

'మంచి చేయువాడు మంచిని పొందును. చెడు చేయువాడు చెడును పొందును' - అని ప్రతిదినమూ ఫలభూతి చెప్పుచునే యున్నాడు. గోడపై కొట్టిన బంతివలె ఇతరులకు కీడు చేసిన తనకే బెడిసికొట్టును. అని ఎంత గానో విలపించి, ఫలభూతికి రాజ్యాభిషేకము చేసి పశ్చాత్తాపముచే భార్యా సహితుడై రాజు అగ్నిప్రవేశము చేసెను -అని యౌగంధరాయణుడు చెప్పెను. అంతట ఉదయనుడు ఒక శుభదినమున సకల రాజులూ పరివేష్ఠించి యుండగా కులోచితమైన రత్న సింహాసనము నధిష్టించెను. వాసవదత్తా పద్మావతులతో భోగముల ననుభవించుచూ సుఖముగా ఉండెను.

# 4-1వ తరంగము

ఒకనాడు నారదమహర్షి వచ్చి - ఉదయనుని ఆశీర్వదించి మన్మధుని అంశతో శివానుగ్రహము వలన కుమారుడు జన్మించునని, అతడు సర్వ విద్యాధరులకు చక్రవర్తి కాగలడని చెప్పెను. మరునాడు దరిద్రా వస్థలో నున్న ఒక బ్రాహ్మణ స్త్రీ తన ఇరువురి కవలపిల్లలతో ఉదయనుని దరిచేరి ఆశ్రయము నర్థించెను. జాలిచే రాజు ఆమెకు ఆశ్రయమిచ్చి ఆదరించెను. రాజాంతఃపురమున రాణులకు ఇష్టాగోష్టి నిర్వహించుచూ ఆమె యున్నది.

ఒకనాడు రాణి కోరికపై తన వృత్తాంతము నిట్లు చెప్పెను. మాళవ దేశమున అగ్నిదత్తుడను బ్రాహ్మణునకు శంకరదత్తుడు శాంతి కరుడను ఇద్దరు కుమారులు కలరు. నేను శంకరదత్తుని భార్యను, శాంతికరుడు చిన్నతనముననే విద్యల నార్జించుటకై దేశాంతర గతుడయ్యెను. కాల క్రమమున అగ్నిదత్తుడు వృద్ధుడై తన భార్యతో కూడా మరణించెను. తల్లి దండ్రుల మరణముచే శోకదగ్ధుడైన నా భర్త గర్భిణియగు నన్ను గూర్చి ఆలోచింపక సరస్వతీనదిలో పడి మరణించెను.

కొంతకాలము పిమ్మట బందిపోటు దొంగలు మా ఇంటిని దోచిరి. శీలభంగ భయము వలన నేను మరి ముగ్గురి స్త్రీలతో కలసి పారిపోతిని. చివరకు కవలపిల్లలను ప్రసవించి పోషించు శక్తి లేక ఉదయన మహారాజు నాశ్రయించితిని. బాల్యము నుండి యగ్నికార్యముల ధూమముచే నా కన్నులు పింగళవర్ణము పొందుటచే నన్ను "పింగళిక" అందరు. నా మరిది శాంతికరుడు విదేశముల కేగి ఎచ్చట నున్నాడో యింతవరకు తెలియలేదు - అని చెప్పినది.

ఈ వృత్తాంతమును పింగళిక ఉన్నత కులమునందు పుట్టిన మానవతి యని గ్రహించి-వాసవదత్త - "అమ్మా! శాంతికరుడను పురోహితుడొకడు కలడు. అతడు విదేశీయుడే! నీ మరిది కావచ్చును అని చెప్పి అతనిని పిలిపించి విచారించగా అతడే ఆమె మరిది యని గ్రహించి, పింగళికను చూపించి ఇదిగో ఈమె  నీ వదిన అని జరిగినదంతయూ తెలిపినది. దాని కాతడు నిజము తెలుసుకుని పింగళికను తన ఇంటికి తీసుకు వెళ్ళెను. వాసవదత్త ఆమె కవలపిల్లలనిద్దరినీ తనకు కలుగబోవు పుత్రునకు పురోహితులుగా నిశ్చయించి పెద్దవానికి శాంతిసోముడని రెండవ వానికి వైశ్వానరుడని పేర్లు పెట్టి బహుమానములనిచ్చినది. ఒకనాడు పింగళిక వాసవదత్త దర్శనమునకు వచ్చినది. మనోల్లాసమునకై ఏదైనా ఒక కథ చెప్పమని కోరగా పింగళిక ఈ కథ చెప్పినది.

# దేవదత్తుని కథ

పూర్వము జయదత్తుడను చిన్నరాజునకు దేవదత్తుడను కుమారుడు కలడు. అతి చంచలమైన రాజశ్రీ వేశ్యవలె బలవంతముగా అనుభవింప తగినది. వర్తకుల లక్ష్మి స్థిరమైనదై కులస్త్రీ వలె ఎవరిదరినీ చేరదు అని భావించి దేవదత్తునికి పాటలీ పుత్రమున వసుదత్తుడను వ్యాపారస్తుని కుమార్తెనిచ్చి వివాహము చేసెను.

కొంతకాలము తరువాత ఒకనాడు వసుదత్తుడు తన కుమార్తెను తన ఇంటికి తీసుకువెళ్ళెను. ఆకస్మికముగా జయ దత్తుడు మరణించగా శత్రువులు అతని రాజ్యమాక్రమించిరి. చక్రవర్తి సహాయమర్థించుటకు వెళ్ళమని తల్లి దేవదత్తునికి సలహా ఇచ్చినది. సరే యని అంగీకరించి చక్రవర్తికి బహుమానమిచ్చుటకు ధనము నాశించి మామగారింటికి పాటలీపుత్రము వెళ్ళెను. రాత్రి బాగా చీకటి పడుటచే ఒక సత్రము నందు బస చేసెను.

ఒక రాత్రివేళ ఒక స్త్రీ రహస్యముగా సత్రములోని ఒక గదిలోనికి వెళ్ళి ఒక పురుషునితో క్రీడించసాగినది. దేవదత్తుడు ఆమెను తన భార్యగా గుర్తించి ఎంతో దుఃఖించెను. ఆమె వెళ్ళిపోవునపుడు ఆమె వజ్రపుదుద్దు ఒకటి కిందబడినది. ఆమె అది గమనించక వెళ్ళిపోయినది. దేవదత్తుడు దానిని గ్రహించి ముందుగా కన్యాకుబ్జము చేరి లక్ష వరహాలకు ఆ ఆభరణ మును తాకట్టుపెట్టి ఏనుగులను, గుర్రములను కొని చక్రవర్తిని దర్శించెను.

పిమ్మట చక్రవర్తి సహాయముతో శత్రువులను ఓడించి, తన రాజ్య మును సాధించి తల్లికి ఆనందము చేకూర్చెను. తరువాత ఈ రత్నాభరణ మును విడిపించి తన మామగారి వద్దకు పంపగా అతడు కుమార్తె చెడు వర్తనకు విలపించి యూరకుండెను. దేవదత్తుడు తన సద్గుణములచే చక్రవర్తి నాకర్షించి అతని కుమార్తెను వివాహము చేసుకొని సుఖముగా నుండెను. కనుక సంపదలు కోరువారు ఎన్ని కష్టములు వచ్చిననూ శీల సంపదను పోగొట్టుకొన కూడదు- అని పింగళిక చెప్పిన కథ విని వాసవదత్త ఎంతో సంతోషించినది.

ఒకనాడు మూకుళ్ళను విక్రయించు కుమ్మరి స్త్రీ తన అయిదుగురి పుత్రులతో రాణి కంట బడినది. అది చూచి రాణి. సఖీ! చూడము. దీనికైదు గురు కుమారులు. నాకు సంతానమే లేదు. ఏమి పాపము చేసితినో అని చింతించగా పింగళిక-దేవీ! దరిద్రులకు పాపసంతానము దుఃఖము కొరకు పుట్టెదరు. మీబోటి వారికి ఎవడో ఒకడు పుట్టిననూ ఉత్తముడగును. చింతించకుము. శివారాధన చేసిన నీకు సంతానము కలుగునని చెప్పిన నారదమహర్షి మాట మరచితివా? అని ఊరడించినది. పిమ్మట రాణి శివారాధన చేయసాగినది. కొన్ని దినములు గడచిన పిమ్మట వాసవదత్తకు స్వప్నమున, జటాధారి అయిన పురుషుడు ఒక పండు నిచ్చెను. అతని కాలములోనే ఆమె గర్భము ధరించెను.

# 4-2వ తరంగము

ఒకనాడు యౌగంధరాయణుడు రాణి మనోల్లాసము కొరకు జీమూత కేతువను విద్యాధరుని కథ ఇట్లు చెప్పెను.

పూర్వము హిమాలయ పర్వతమున జీమూత కేతువను విద్యాధరు డుండెను. అతని నివాసగృహమున కోరిన కోర్కెల నిచ్చు "కల్పవృక్షము" కలదు. రాజు దానిని పుత్రసంతానము నర్థించగా సకల శుభలక్షణములతో ఒక కుమారుడు పుట్టెను. అతనికి "జీమూతవాహను"డని పేరు పెట్టెను. అతడు పెరిగి పెద్దవాడై ఎంతో కారుణ్యము గలవాడై యుండెను. ఈ భూమియందు ఎచ్చటనూ దారిద్ర్యము లేకుండా చేయమని కల్పవృక్షము నర్థించి పృధివిపై బంగారు వర్షము కురిపింప చేసెను. ఈ చర్యతో అతని కీర్తి ముల్లోకములా వ్యాపించినది.

కల్పవృక్షమును దానము చేయటచే అతనిని శక్తిహీనునిగా తలచి శత్రురాజులు యుద్ధము ప్రకటించిరి. జీమూత వాహనుడు కులక్షయము - జననష్టము కలిగించు యుద్ధము నందు విరక్తుడై రాజ్యమును గడ్డిపరకవలె త్యజించి "మలయా చలము"నకు బయలుదేరగా తండ్రి జీమూతకేతువు కూడా అతనిని అనుసరించెను. తల్లిదండ్రులకు సేవ చేయుచూ అచటనే సుఖముగా నుండెను. సిద్ధరాజగు విశ్వావసుని కుమారుడు మిత్రావసువు జీమూతవాహనునికి స్నేహితుడయ్యెను.

జీమూత వాహనునికి జాతిస్మరత (పూర్వజన్మ జ్ఞానము) కలదు. ఆ శక్తిచే మిత్రావసుని చెల్లిలిని "మలయవతి"ని పూర్వజన్మమున తన ప్రియురాలిగా గుర్తించెను. వారి పరస్పరానురాగము చూచి మిత్రావసువు వారి వివాహమున కంగీకరించెను. జీమూతవాహనుడు తన మిత్రునితో తన పూర్వ జన్మ వృత్తాంతము నిట్లు చెప్పెను.

"నేను ఒక విద్యాధరుడను. హిమవంతముపై సంచరించుచూ శివ పార్వతుల సంగమము చూచి వారి కోపముచే శాపము పొంది, భూమిపై "వలభీ నగరము"న వసుదత్తుడను పేర వైశ్యకులమున జన్మించితిని. వ్యాపారము నిమిత్తము ద్వీపాంతరము వెళ్ళగా అడవి యందు దొంగలచే సర్వమూ దోచుకొనబడి, శబరులచేత చిక్కి వారి దేవతకు బలిగా ఇచ్చు సమయమున ఆ దేవత వాక్కుచే ప్రాణములు పొంది శబర నాయకునికి గొప్ప స్నేహితుడనైతిని.

పిమ్మట ఒకనాడు ఆ శబర నాయకుడు రాజభటు లకు చిక్కి వధ్య స్థలమునకు తీసుకువెళ్ళు సమయమున నేనాతనిని చూచి రాజునకు లక్ష వరహాలు పరిహారము చెల్లించి అతనిని రక్షించితిని. అతడు సంతోషముతో వెడలిపోయెను.

కొంతకాలమునకు ఆ శబరుడు అరణ్యమధ్యమున సింహముపై సంచరించు ఒక గొప్ప సౌందర్యవతిని చూచి, నాకు తగిన యువతిగా భావించి ఆమెతో నన్ను గూర్చి వివరించెను. ఆమె నన్ను చూపమనగా అతడు నా వద్దకు వచ్చి నన్నచ్చటికి తీసుకువెళ్ళెను. నన్ను చూచి ఆమె - "ఇతడు మానవుడు కాడు. మానవుల కిట్టి ఆకృతి ఎట్లు లభించును? అని ఆలోచించి నాపై మరులు గొన్నది. నేను కూడా ఆమె సౌందర్యమునకు ఆకర్షితుడనైతిని.

పిమ్మట "వలభీనగరము" చేరి మేము వివాహము చేసు కొంటిమి. వెంటనే సింహము మానవరూపము ధరించినది- అక్కడ జను లందరూ ఆశ్చర్యము నొందగా "నేను చిత్రాంగదుడను విద్యాధరుడను. ఈమె "మనోవతి" నా కుమార్తె. ఆకసమున గంగానదిని ఈమె నెత్తుకొని దాటు చుండగా నా పుష్పమాల జారి కిందనున్న నారదమహర్షిపై బడినది. అతడు కోపించి నన్ను సింహము అగుదువని శపించెను.

నా కుమార్తెను మానవుడు వివాహము చేసుకొన్న వెంటనే శాప విమోచనమగునని కరుణించెను" అని అతడు చెప్పి వెళ్ళిపోయెను. నేను మనోవతితో సుఖముగా సంసారము చేయుచుంటిని. కాలక్రమమున మాకు 'హిరణ్యదత్తుడ'ను కుమారుడు కలిగెను. నేను అతనిని పెంచి పెద్ద చేసితిని. నా వృద్ధాప్యములో సంసారము నతనికి అప్పగించి నా భార్యతో "కాలంజర" పర్వతము చేరితిని. ఆచట పూర్వజన్మ స్మరణము కలిగి దేహమును వదల తలచితిని.

ఆ విషయము శబర స్నేహితునికి, మనోవతికి చెప్పి శివుని తలచు కొని, మరుజన్మమందు కూడా వీరే నాకు భార్య, మిత్రులగుదురు గాక అని భావించి పత్నీమిత్రులతో పర్వతముపై నుండి పడి శరీరమును వదలి పెట్టితిని. ఆ శబర మిత్రుడవు ఈనాడు నీవేయని మిత్రావసువుతో చెప్పెను. నా భార్య అయిన మనోవతియే నీ చెల్లెలు మలయవతి, అని జీమూత వాహనుడు తన పూర్వ జన్మ వృత్తాంతమును చెప్పెను. అనంతరము మిత్రా వసువు తన తల్లిదండ్రుల అనుమతితో జీమూత వాహనునికి తన చెల్లెలు మలయవతినిచ్చి వివాహము చేసెను. పిమ్మట జీమూత వాహనుడు భార్యతో కలసి ఆ మలయపర్వతము నందే సుఖముగా నుండెను.

ఒకనాడు "శంఖచూడుడ"ను సర్పము, గరుత్మంతునికి ఆహారము కావలసి వచ్చినపుడు, అతడిని నివారించి తన శరీరమునే ఆ గరుత్మంతునికి నివేదన గావించి శంఖచూడుని తల్లి దుఃఖము నివారించెను. అంత గరుడుడు సంతసించి తన సర్పద్వేషమును మానుకొని, తాను సంహరించిన సర్పములన్నిటినీ అమృతముచే పునర్జీవిత మొనరించెను. జీమూత వాహనుని త్యాగ గుణమును ఇంద్రాది సమస్త దేవతలు స్తుతించిరి. అంతట శివానుగ్రహము వలన హిమాలయము చేరి భార్యా, స్నేహితులతో కలసి "విద్యాధర చక్రవర్తి" బిరుదము పొంది సుఖముగా ఉండెను.

ఈ కథను విన్న వాసవదత్త ఎంతో సంతోషించినదై ఆ దినమును సుఖముగా గడిపెను.

రాజువద్ద వసంతకుడు, సరససల్లాపములు, చతురోక్తి సంభాషణలూ చేయుచూ ప్రసంగవశమున పూర్వజన్మ సంస్కారము వలన స్నేహ విరోధములు కలుగుచుండునని నిదర్శనముగా ఈ కథ చెప్పెను.

# సింహపరాక్రముని కథ

పూర్వము వారాణసి యందు విక్రమ చండుడను రాజు కలడు. అతనికి అత్యంత ఇష్టుడైన సింహపరాక్రముడను సేవకుడు కలడు. అతని భార్య పేరు 'కలహకారి' సార్థక నామధేయురాలు. నిరంతరమూ ఏదో వంకతో భర్తతో కలహించు చుండెడిది. విసుగు చెందిన సింహపరాక్రముడు ఇల్లు విడిచి వింధ్యవాసిని యర్చించుటకై బయలుదేరెను. నిరాహార వ్రతముచే ఆమె నారాధించగా దేవి కలలో కనబడి "వారాణసి తిరిగి వెళ్ళమని అక్కడ నున్న పెద్ద మర్రిచెట్టు కింద నిధియూ, గారుడ మణిపాత్ర కలవని దాని యందు పూర్వజన్మ వివరము తెలియునని వాటితో సుఖముగా నుండుమని" పలికినది.

సింహవిక్రముడు వెనుకకు మరలి తన నగరము చేరి దేవి చెప్పిన వాటిని పొందెను. గారుడ మణిపాత్ర యందు తన యొక్క భార్య యొక్క పూర్వజన్మలను గూర్చి పరికించగా, తన భార్య ఎలుగుబంటిగాను, తనను సింహముగాను గుర్తించెను. అంతట తమ కలహమునకు పూర్వజన్మ వైరమే కారణమని గ్రహించి శోకమోహములను విడచెను. ఆ పాత్ర సహాయముచే తనకు యోగ్యురాలైన యాదు సింహము అయి ఈ జన్మమున "సింహశ్రీ" అను పేరుగల కన్యను రెండవ వివాహము చేసుకొని నిధిలాభముచే సుఖముగా నుండెను. కనుక ఓ రాజా! పూర్వ జన్మ వాసనావశమున వైర

స్నేహములు కలుగుచుండును-అని వసంతకుడు తన కథతో రాజు నానంద పరచెను. కొన్నినాళ్ళకు యౌగంధరాయణునికి 'మరుభూతి' అను కుమారుడు కల్గెను. రుమణ్వంతునకు హరిశిఖుడు - వసంతకునకు తపంతకుడు - ఇత్యకుడను నామాంతరము గల నిత్యోదితుడను ప్రతీహారముఖ్యునకు గోముఖుడు - అను కుమారులు కలిగిరి. కాబోవు విద్యాధర చక్రవర్తికి వీరు స్నేహితులు. మంత్రులు కాగలరని ఆకాశవాణి పలికినది.

వాసవదత్త కూడా ఒక శుభదినమున కుమారుని ప్రసవించినది. ఆ సమయ మున ఆకాశవాణి - "ఇతడు మన్మధాంశతో జన్మించినవాడని, ఇతనీ లోకమున 'నరవాహన దత్తుడ'ని సకల విద్యాధరేంద్రులకు చక్రవర్తి కాగలడని - చెప్పినది. అంతట పుష్పవర్షము కురిసెను. దేవదుందుభులు మ్రోగినవి. ఉదయనుని ఆనందమునకు మేరలేదు. క్రమక్రమముగా రాజ కుమారుడు విదియనాటి చంద్రుని వలె దినదిన ప్రవర్ధమానమగుచుండెను. ఉదయనుడా బాలునకు "నరవాహన దత్తుడ"ని పేరు పెట్టెను. యౌగంధ రాయణాదులు తమ పుత్రులను తెచ్చి రాజకుమారుని సహవాసముగా పెంచసాగిరి. శాంతికరుడను పురోహితుడు తన అన్నగారి కవల సోదరులైన శాంతిసోమ వైశ్వానరులను తెచ్చి రాజకుమారునికి సఖులుగా చేసెను. నరవాహన దత్తుడు ఆ ఆరుగురు బాలకులతో, వారికి తనయందు గల అమితాభిమానమునకు సంతోషపడుచూ స్నేహముగా నుండెను. ఉదయను నకు ఆ బాలకులతో రోజులు సుఖముగా గడచుచుండెను.

# 5-1వ తరంగము

ఏకపుత్రుడగు నరవాహనుని సంరక్షించుటకై ఉదయనుడు బెంగపడుచుండగా, యౌగంధరాయణుడు "ఓ రాజా! నీ కుమారుని విషయమై చింతించ పనిలేదు, అతనిని రక్షించుటకు శివుడు 'స్తంభకుడ'ను గణనాధుని నియమించెను." అని చెప్పెను. అంతలో ఆకాశము నుండి ఒక పురుషుడు వచ్చి తాను "శక్తివేగుడ"ను విద్యాధరుడనని, పూర్వము తాను మానవుడనని, తమకు కాబోవు విద్యాధర చక్రవర్తిని చూచుటకు వచ్చితినని సమాధానము చెప్పెను. ఉదయనుడు అతనితో 'మిత్రమా! విద్యాధరత్వమెట్లు కలుగును? అది ఎన్ని విధములు? నీవు ఎట్లు విద్యాధరుడవైతివి? అని ప్రశ్నించెను. రాజా! ఈ జన్మలో గాని, పూర్వజన్మలో గాని శంకరుని పూజించి అతని అనుగ్రహము వలన బుద్ధిమంతులు విద్యాధర పదమును పొందెదరు. విద్యా, ఖడ్గమాలాది సాధనలచే అది అనేక విధములు. అది నాకెట్లు లభించెనో చెప్పెదను వినుము-

## శక్తివేగుని కథ

పూర్వము వర్ధమానపురమున ఒక రాజునకు "కనకప్రభ" అను భార్య యున్నది. ఆమె కుమార్తె పేరు 'కనకరేఖ'. ఆమె పెరిగి పెద్దదైనపుడు తల్లిదండ్రులు వివాహ ప్రయత్నములు చేయగా ఆమె తాను వివాహము చేసుకొననని, కన్యగానే యుండెదనని బదులు చెప్పినది. రాజు-రాణి ఆమెకు ఎన్నో విధముల చెప్పి చివరకు పెళ్ళి చేసుకొనుటకు ఒప్పించిరి. కాని ఆమె 'కనకపురి' నగరమును ఎవరు చూచి వత్తురో వారినే వివాహము చేసుకొనెదనని ప్రతిజ్ఞా వాక్యము పలికినది. రాజు అంగీకరించి, ఆ విషయమై అందరినీ సంప్రదించగా అట్టి నగరము పేరైనా తాము వినలేదని అందరూ పలికిరి. ఎంత ప్రయత్నించిననూ ఆ నగర విషయము చెప్పిన వారు లభించలేదు. అంతట రాజు ఆ నగరమును చూచివచ్చిన వారికి

తన కుమార్తెను, అర్ధరాజ్యమును ఇచ్చెదనని దేశమంతా చాటింపు వేయించెను. అనేక మంది వృద్ధులు, ద్వీపాంతర వర్తకులు కూడా 'కనకపురి'ని గూర్చి చెప్పలేకపోయిరి.

ఆ నగరములోనే బలదేవుని కుమారుడు శక్తిదేవుడను బ్రాహ్మణుడు జూద వ్యసనముచే ధనమంతయూ పోగొట్టుకొని రాజకుమార్తెపై ఆశచే, రాజపురుషులను చేరి తాను ఆ 'కనకపురి' నగరమును చూచితినని చెప్పెను. వారు రాజకుమార్తె వద్దకు తీసుకుని వెళ్ళిరి. ఆమె శక్తిదేవుని చూచి ఆ నగరమును ఎట్లు చూచితివి? ఏ మార్గమున వెళ్ళితివి? అని ప్రశ్నించినది. తాను వారాణసి నుండి పౌండ్రవర్ధనము చేరి అచట నుండి కనకపురి వెళ్ళితినని అబద్ధమాడెను. అక్కడ తాను విద్యాభ్యాసము చేసితినని చెప్పెను. అది విని ఆమె నవ్వుచూ - ఓయీ! మహాబ్రాహ్మణా! నీవు నిజముగా ఆ పురమును చూచితివా! నీవే మార్గమున అక్కడికి చేరితివో చెప్పు? అని రెట్టించి ప్రశ్నించగా శక్తిదేవుడు అదే మార్గమును ముందు చెప్పిన దానినే చెప్పెను. అంత రాజకుమార్తె అతడు అబద్ధము చెప్పుచున్నాడని భటులతో గెంటించినది. ఆమె తండ్రితో అతడు ధూర్తుడని తనను మోసగించుటకు ప్రయత్నించెనని ధూర్తులనేక విధములుగా లోకమును మోసము చేయుదురని ఒక కథను వివరించినది.

## శివ-మాధవుల కథ

పూర్వము రత్నపురి నగరమున శివ-మాధవులనే ఇద్దరు ధూర్తులు గలరు. వారు అచట జనులననేక విధముల మోసగించి, ఉజ్జయిని యందు శంకరస్వామి అనెడి మహాధనవంతుడు రాజుగారి పురోహితుడు కలడని తెలుసుకుని అతనిని మోసగించి, ఉజ్జయినీ విలాసినులతో సుఖముగా కాలము గడుపుదమని భావించి ఆ నగరము చేరిరి. ఆచట వారికి శంకర స్వామికి చక్కని కుమార్తె కలదని, అతడు పరమలోభియని తెలిసినది.

ఉజ్జయిని చేరి మాధవుడు పరివారముతో గ్రామమునకు బయట రాజపుత్ర వేషము ధరించి యుండెను. అనేక కపటోపాయములు గల శివుడు బ్రహ్మచారి వేషము ధరించి "సిప్రా" నదీతీరము నందలి మఠము నందుండెను. అందరూ చూచునట్లుగా దర్భలు, భిక్షాపాత్ర, జింక చర్మము ఉంచెను. ఉదయముననే లేచి స్నానము చేసి శీర్షాసనం వేసేవాడు.

పిమ్మట దర్భలు చేత ధరించి పద్మాసనంలో కూర్చుని జపము చేసేడివాడు. మూడు భిక్షలు తెచ్చి ఒకటి కాకులకు, మరొకటి అభ్యాగతులకు ఇచ్చి, మూడవ దానిని తాను భుజించెడివాడు. ఈ విధముగా కొన్ని రోజులు గడిచిన పిమ్మట నగరవాసులు ఆహా! ఎంతటి తపస్వి? ఎంత నిష్ఠ? అని ఆకర్షింపబడిరి. మాధవుడు రాజపుత్ర వేషమున వచ్చి శివుని పాదములపై బడి ఎంతో గొప్ప తాపసుడని పొగిడి వెళ్ళిపోయెను. ఆ రాత్రి ఇరువురూ రహస్యముగా ఒక చోట కలుసుకుని మద్యపానం చేసి తదుపరి కార్యక్రమం నిర్ణయించుకొనిరి.

మరునాడు మాధవుడు తన జూదరులలో ఒకనితో "ఈ జంట వస్త్రములను రాజుగారి పురోహితుడగు శంకరస్వామి వద్దకు వెళ్ళి తన జ్ఞాతులచే ఓడి మాధవుడను రాజపుత్రుడు బహుధనముతో తీసుకుని తన పరివారముతో దక్షిణాపథము నుండి వచ్చెనని, మీరాజు గారి సేవన పేక్షించుచున్నాడని", రాజపురోహితునితో చెప్పుము అని పంపించెను. అతడు సరేయని అంగీకరించి పురోహితుని ఇంటికి వెళ్ళి ఒంటరిగా నుండు సమయమును చూచి కానుకలనిచ్చి మాధవుని సందేశము చెప్పెను. ధనాశచే అతడంగీకరించెను.

మరునాడు మాధవుడు రాజపుత్ర వస్త్రములు ధరించి పరివారముతో బయలుదేరి పురోహితునికి తన రాక తెలుపగా అతడెదురు వచ్చి స్వాగతమిచ్చెను. కాసేపు ముచ్చటించి తన బసకు వెళ్ళిపోయెను. మరునాడు మరల పురోహితునికి కానుకలు తెచ్చి ఇచ్చి తన పరివారము యొక్క బల

వంతముచే రాజసేవ కొప్పుకొంటి నని తనకు ధనాశలేదని నమ్మపలికెను. పిమ్మట ఇతని వలన తనకు బహుధనలబ్ధి కలుగునని పురోహితుడాశపడి రాజునకు వివరించి రాజసేవలో నియోగించెను. క్రమేణా తన నివాసమును రాజపురోహితుని కోరిక మేరకు అతనింటికి మార్చెను. మాధవుడు కృత్రిమ మైన రత్నములతో తయారు చేసిన నకిలీ బంగారు ఆభరణములను రాజ పురోహితుని కిచ్చి భద్రపరచమని చెప్పెను.

కొంతకాలమైన పిమ్మట మాధవుడు తనకు 'అగ్నిమాంద్య'మను రోగము వచ్చినట్లు నటించుచూ అన్నము సరిగా తినక చిక్కిపోసాగెను. తనకు జీవితాశలేదని తన సర్వస్వమంతయూ ఉత్తమ బ్రాహ్మణునికి దానమిచ్చెదనని, అందులకు తగిన వానిని తీసుకురమ్మని శంకరస్వామికి చెప్పెను. అతడు తనకు అనుకూలుడైన ఒక బ్రాహ్మణుని తీసుకురాగా, ఏదో ఒక వంక పెట్టి ఇంకా మంచి బ్రాహ్మణుడు కావలె ననెను. ఇలా ఎందరిని తీసుకువచ్చిననూ మాధవుడిష్టపడలేదు.

చివరకు అతని పరివారములోని ఒకడు "ఇతడు సామాన్య బ్రాహ్మణుల నిష్టపడడు. సిప్రా తీరమున శివుడను మహాతపస్సంపన్నుడు కలడు అతనిని తీసుకువద్దము" అని రాజపురోహితునితో పలుకగా అతడు నిజమేనని భావించి, శివుని వద్దకు వెళ్ళి అతనిని దానము గ్రహించమని మాధవుని వృత్తాంతము వివరించెను. -

ఓయీ! రాజపురోహితుడా! నేను భిక్షాజీవిని, నాకు ధనాశ లేదు. నేను రాను" - అని శివుడు సమాధానమిచ్చెను. అంత రాజపురోహితుడు "గృహస్థాశ్రమము చాలా గొప్పదని, తన కుమార్తె "వినయస్వామిని" ని ఇచ్చి వివాహము చేసెదనని ఆ ధనము దానము గ్రహించి సుఖముగా నుండుమని శివుని బ్రతిమాలెను. శివుడు ఎంతో బలవంతము మీద ఒప్పునొన్నట్లు నటించి రాజపురోహితుని కుమార్తెను వివాహము చేసు కొనెను. మూడవనాడు మాధవుని వద్దకు వెళ్ళి కోశాగారము నుండి

తెప్పించిన కృత్రిమాభరణముల నన్నిటినీ దానము పట్టెను. శివుడు వాటిని పురోహితుని చేతిలో నుంచి నాకివేమీ తెలియవు మీరే భద్రపరచుడని అతనికిచ్చెను.

మరునాడు మహాదాన ప్రభావము వలన తన రోగము కొంచెము తగ్గినదని మాధవుడు పల్కెను. పురోహితునితో నీ సహాయము వలన నేను బ్రతికితినని పొగిడెను. కొంతకాలము తరువాత శివుడు పురోహితునితో "మీ ఇంటిలో నేనెంత కాలముందును. అమూల్యమైన ఆ ఆభరణములను విక్రయింపుము లేదా మీకున్నదిచ్చి వాటిని మీరే గ్రహింపుడని" పలికెను.

ఆ మాటలు విని ఆ నగలు అమూల్యములని భావించి, తన వద్ద నున్న ధనమంతయూ నిచ్చి వాటిని తానే తీసుకొనెను. శివుడు తన చేవ్రాలుచే ఒక పత్రము వ్రాయించెను. ఆ నగలు అమూల్యములని నమ్మి పురోహితుడు కూడా ఒక పత్రము వ్రాసి ఇచ్చెను. శివుడు వేరే కాపురము పెట్టెను. పిమ్మట శివ-మాధవులు పురోహితుని ధనము ఖర్చు చేయుచూ విలాసముగా జీవించసాగిరి.

కొంతకాలము పిమ్మట ధనము కావలసి పురోహితుడు ఆ నగలలో ఒక దానిని విక్రయించుటకు ప్రయత్నించగా అది కృత్రిమమైనదని తెలిసినది. మిగిలిన నగలన్నిటినీ పరీక్షింపచేయగా అవన్నీ ఇత్తడి, గాజురాళ్ళని రత్న పరీక్షకులు చెప్పిరి. శివుని వద్దకు వెళ్ళి తన ధనమిమ్మని అడుగగా, తనవద్ద ఏమీ లేదనీ అంతా వ్యయమైనదని బదులు చెప్పెను. దుఃఖావేశముచే రాజపురోహితుడు రాజువద్ద మొరపెట్టుకొనెను. శివుడు తాను బాల్యము నుండి తాపసుడనని, ఇతడే మాధవుని ధనమునకాశపడి నా చేత దానము పట్టించెను. రత్నముల విలువ నాకేమీ తెలియదు. ఆ సమయమున మేము వ్రాసుకున్న పత్రములివిగో అని చెప్పెను.

మాధవుడు కూడా తన పిత్రార్జితమైన నగలు నిజమైనవే యని, అవి దాన మిచ్చుట వలనే తన రోగము కుదిరినదని నమ్మబలికెను. రాజు

శివ-మాధవుల దోషమేమీ లేదని తీర్పు చెప్పగా పురోహితుడు విచారముగా వెళ్ళిపోయెను- ధూర్తు లిట్లు మోసగింతురని కనకరేఖ తెలుపగా - తండ్రి 'అమ్మా! యావనమున చిరకాలము కన్యగా నుండుట తగదు. ఉత్తములందు కూడా జనులు కళంకము నాపాదించెదరు. ఈ కథ వినుము.

## హరస్వామి కథ

గంగానది యొద్దున "కుసుమపురమ"ను నగరము కలదు. అందు "హరస్వామి" అను తాపసుడు నివసించుచుండెను. ఒకనాడు అతడు భిక్షకై వెళ్ళుచుండగా ఒక దుష్టుడు "అదిగో కపటసన్యాసి ఎందరో బాలకులను అప హరించినాడు అని తరచి చెప్పగా, మరొక దుష్టుడు నిజమే! నేనూ ఆ మాట విన్నాను అనెను. మూడవవాడు మరొకడు 'అది అంతే' అని సమర్థించెను. ఇలా నింద ఊరంతా వ్యాపించి హరస్వామి బిడ్డల నపహరించి తినుచున్నాడని వదంతి వ్యాపించి, పిల్లలను తల్లిదండ్రులు కట్టడి చేసిరి. చివరకు అతనిని ఊరి నుండి వెడలగొట్టుటకు నిశ్చయించిరి. అపుడు హరస్వామి ఊరివారి నందరినీ మఠము వద్దకు రప్పించి 'ప్రజలారా! నేనెవరి పిల్లలనెక్కడ అపహరించితినో పరీక్షించితిరా? ఒకసారి ఆలోచించండి." అని విన్నవించగా ఊరిలోని పిల్లలందరూ క్షేమముగా నున్నట్లు తెలుసుకొని సాధువును నిందించినందుకు అతని కాళ్ళపై బడిరి. అతను విరక్తితో ఆ ఊరు విడిచి వెళ్లబోగా వారంతా బ్రతిమాలి ఎక్కడికీ వెళ్లవద్దని ప్రార్థించి అతనిని అంగీకరింపజేసిరి- కనుక సజ్జనులను చూచి సహించలేక దుర్జనులు నిష్కారణముగా నిందారోపణ చేయుదురు- అని రాజు పలికెను.

## 5-2వ తరంగము

శక్తిదేవుడు 'కనకపురి' చూచితినని అబద్ధము చెప్పి రాజభటులచే గెంటి వేయబడుటచే అవమానము పొంది, ఎలాగైనా ఆ కనకపురిని

చూచెదను లేదా ప్రాణములను విడుతును అని నిశ్చయించుకొని వర్ధమాన పురము నుండి దక్షిణముగా బయలుదేరి వింధ్యాటవి చేరెను. అచట ఒక ఆశ్రమమున 'సూర్యతాపసు'డను ఒక ఋషి ఉండెను. అతనికి నమస్కరించి కనకపురి ఎచ్చట ఉన్నదని ప్రశ్నించెను. 'నాయనా! నేను ఎనిమిది వందల సం.ల వాడను ఆ నగరి పేరెన్నడూ నేనెచ్చటా విని యుండలేదు' - అని ఆ ఋషి పల్కగా శక్తిదేవుడు విషణ్ణుడై 'అలాగైతే ఇక నాకు మరణమే శరణ్యము' అని విచారించగా ఆ ఋషి ఓదార్చి - మూడు వందల యోజనముల దూరములో 'కాంపిల్య' దేశము నందు ఉత్తరమను పర్వతము కలదని అచ్చట తన పెద్ద అన్నగారు దీర్ఘతపుడుండెనని అతనికి తెలియ వచ్చునని, అక్కడకు వెళ్లమని సలహానిచ్చెను. శక్తిదేవుడు ఆ రాత్రి అచ్చట గడిపి మరునాడు కాంపిల్య దేశదిశగా బయలుదేరెను.

ఎన్నో కష్టములు పడి చాలా కాలమునకు అచ్చటకు చేరి దీర్ఘతపుని చేరి, తన వివరములు చెప్పి 'కనకపురి' గూర్చి ప్రశ్నించెను. నాయనా! ఆ పేరు వినుటయే నాకిది ప్రధమము. అయిననూ అది ఎచ్చటనో దూరమున ద్వీపాంతర మందుండ వచ్చు. సముద్ర మధ్యమున 'ఉత్సలమ'ను ద్వీపము కలదు. అచ్చట 'సత్యవ్రతుడ'ను జాలరి నాయకుడు కలడు. అతడు బహు ద్వీపములు సంచరించును. అతడు నీకు వివరములు తెలుపగలడు' అని చెప్పి, ఈ సముద్రతీరము వెంబడి వెళ్ళగా 'విటంక పురము' వచ్చునని అక్కడి ద్వీపవర్తకులతో కలసి ఉత్సలము వెళ్లగలవని సలహా నిచ్చెను. శక్తిదేవుడు మరల అచట నుండి బయలుదేరి అనేక దినములకు విటంక పురము చేరి ఉత్సల ద్వీపము చేరు 'సముద్రదత్తుడ'ను వ్యాపారస్తుని కలసి అతని మైత్రితో సముద్ర ప్రయాణము చేయసాగెను.

ఒకనాటి రాత్రి భయంకరమైన గాలివాన వచ్చి నావ బద్ధలయ్యెను. శక్తిదేవుడు సముద్రమునందు పడగా ఒక తిమింగలము అతనిని మింగినది. అది ఉత్సల ద్వీప సమీపమున జాలర్లకు వలలో చిక్కినది. వారు దానిని

తమ నాయకుని వద్దకు తీసుకువెళ్ళగా దానిని అచట కోసిరి. అంత దాని గర్భము నుండి ప్రాణా వశిష్ఠుడై శక్తిదేవుడు ఇవతల పడెను. ఆ జాలరి నాయకుడు వివరములు ప్రశ్నింపగా శక్తిదేవుడు తాను సత్యవ్రతుని కలుసుకొనవలెనని తన పూర్వ వృత్తాంతము నంతయూ వివరించెను. అంతతానే ఆ సత్యవ్రతుడనని చెప్పి తనకు కూడా కనకపురి తెలియదనీ, అయినా విచారించవలదని ఉపాయాంతరము ఆలోచించెదమని సమీపమున నున్న బ్రాహ్మణ మఠమునకు పంపెను.

అచట భుజించి "విష్ణుదత్తు"డను బ్రాహ్మణునితో ప్రసంగము చేసెను. శక్తిదేవుడు తన దేశము - కులము - వృత్తాంతమంతయూ చెప్పెను. అది విని విష్ణుదత్తుడతనిని కౌగిలించుకుని ఆనందభాష్పములు రాల్చుచూ "నీవు నా మేనమామ కుమారుడవు. నేను చిన్నతనముననే ఇక్కడకు వచ్చితిని. నీవిచ్చటనే యుండుము. త్వరలో ద్వీపాంతరముల నుండి కొందరు వణిజులు రానున్నారు. వారి నడిగి తెలుసుకొందాము" అని ఊరడించెను. పిమ్మట నిద్రపట్టక కూర్చున్న శక్తిదేవునికి విష్ణుదత్తుడు కాలక్షేపమునకై ఈ కథ చెప్పెను.

# అశోకదత్తు కథ

పూర్వము యమునానదీ తీరమందు గల అగ్రహారము నందు గోవింద స్వామి అను బ్రాహ్మణుడుండెను. అతనికి అశోకదత్తు విజయ దత్తులను ఇద్దరు కుమారులు కలరు. కొంతకాలమునకు ఆ ప్రాంతమున భయంకరమైన దుర్భిక్షము ఏర్పడినది. దానితో తనకున్నదంతా బంధు మిత్రుల కిచ్చి పుత్రులిద్దరితో, భార్యతో కాశీకి బయలుదేరెను. మార్గ మధ్యమున ఒక కాపాలికుని చూచి పుత్రులను గూర్చి అతడిని జోస్య మడిగెను. "నీ పుత్రులు గొప్పవారగుదురు. చిన్నవానితో నీకు కొంత కాలము వియోగము కల్గి, పెద్దవాని ప్రభావము వలన అందరూ కలసి సుఖముగా నుండెదరు" అని ఆ యోగి పల్కెను.

అటు పిమ్మట అతనికి నమస్కరించి బయలుదేరి కొంతకాలమునకు కాశీ చేరిరి. ఊరి వెలుపల చండికాలయమున పూజయొనర్చి ఆ దినము గడిపెను. సాయంకాలము తోటి బాటసారులతో కలసి ఒక చెట్టు కింద నివసించెను. అర్ధరాత్రి యందు విజయదత్తునికి భయంకరమైన చలి జ్వరము వచ్చినది. వెచ్చదనమునకై మంట వేయుమని తండ్రిని అర్థించెను. ఈ సమయమున అగ్ని ఎట్లు లభించునురా! అనుచూ గోవిందస్వామి ఏమి చేయుటకు తోచక కంగారు పడసాగెను.

దూరముగా మంటలను చూచి విజయదత్తుడు తనను అచటకు తీసుకు వెళ్లమని చలి భరింపలేకున్నానని ఏడ్వసాగెను. అది శ్మశానమని, ఆ మంటలు చితాగ్నులని, నీవు బాలకుడవు పిశాచములకు బెదెరెదవని తండ్రి చెప్పగా నాకేమీ భయము లేదు. చలి భరింపలేకున్నానని మొత్తు కొనెను. సరేయని విధిలేక గోవిందస్వామి విజయదత్తుని తీసుకుని చితిమంటల వద్దకు వెళ్ళి శరీరమును వెచ్చచేసెను" కొంతసేపటికి చలి తీరినది. ఆ చితిలో గుండ్రముగా నున్నదేమిటని? తండ్రిని ప్రశ్నించెను. అది మనుష్యుని కపాలమని సమాధానమిచ్చెను. అపుడా బాలుడు మండుచున్న ఒక కట్టెతో ఆ కపాలమును గట్టిగా కొట్టెను. అది బద్ధలై దాని నుండి 'వప' పైకి చిమ్మి బాలుని నోటిలో పడెను. అది త్రాగి విజయ దత్తుడు రాక్షసరూపు పొందెను. ఊర్ధ్వకేశములు, వంకర కోరలు కలిగినవి. ఆ కపాలమును లాగి అందరి మిగిలిన 'వప'ను త్రాగి అగ్నిజ్వాల వలె నున్న నాలుకతో నాకి వేసెను.

పిమ్మట తండ్రిని చంపుటకై ఉద్యుక్తుడు కాగా "దేవా! కపాలస్ఫోటా! అతడు నీ తండ్రి అతనిని చంపకుము. ఇటురమ్ము!" అని ధ్వని యా శ్మశానమునందు వినబడినది. అంత కపాలస్ఫోటుడని పేరు పొందిన యాతడు ఆ దిశగా వెళ్లిపోయెను. గోవింద స్వామి! అయ్యో! కొడుకా! ఏమి గతి పట్టినదిరా! అని బిగ్గరగా విలపించుచూ తిరిగి వచ్చి జరిగినదంతా

భార్య కుమారులకు తెలిపెను. అచ్చట నున్నవారు కూడా ఆతని దుఃఖస్థితికి చింతించిరి.

వారిలో సముద్ర దత్తుడను వ్యాపారి వారిపై జాలిపడి తన యింటికి తీసుకు వెళ్ళి ఆశ్రయమిచ్చెను. వారాణసి యందే నివసించుచూ కుమారునికి విద్యలు నేర్పించ సాగెను. అశోకదత్తుడు బాహుయుద్ధములో ఎంతో నేర్పరి అయ్యెను. ఒకనాడు రాజు "ప్రతాపముకుటుడు" మల్లయుద్ధము నేర్పాటు చేసెను. అందు దక్షిణదేశము నుండి వచ్చిన ప్రధానమల్లుని అశోకదత్తు ఓడించి రాజబహుమానము పొంది ఆస్థానమల్లుడై క్రమముగా భాగ్యవంతుడయ్యెను.

ఒకనాడు రాజు ఊరిబయట నున్న శివుని పూజించి వచ్చుచుండగా బాగా రాత్రి అయినది. శ్మశానము మీదుగా వచ్చుచుండగా అచ్చట కొరత వేయబడిన ఒక నేరస్తుడు దప్పికకై అరచుచుండెను. రాజు దయతలచి పక్కనున్న అశోకదత్తునికి అతని దాహము తీర్చి రమ్మని చెప్పి తాను నగరము వెళ్ళిపోయెను. నీటి పాత్ర తీసుకుని అచ్చటికి వెళ్ళగా ఒక స్త్రీ ఆ సమీపము ననే రోదించుచున్నది. ఆమెను ఎవరని ప్రశ్నించగా ఈ కొరత వేయబడిన వాని భార్యను, నీరందించుటకు అతని ముఖము నాకందుట లేదు. నీవు వంగినచో నీపై నిలబడి అతనికి నీళ్లిచ్చెదను అని పలికినది.

అశోకదత్తుడు సరేనని వంగొని యుండగా ఆ స్త్రీ అతని వీపుపై కాళ్ళ నుంచి పైకి ఎక్కినది. క్షణకాలములో పై నుండి రక్తపు బిందువులు కింద పడుట గమనించి పైకి చూచెను. ఆ స్త్రీ శూలాగ్ర మందున్న ఆ పురుషుని మాంసమును కత్తితో కోసి తినుచున్నది. అశోకదత్తుడు కోపముగా లేచి ఆమె కాలు పట్టుకొనగా ఆమె రివ్వున ఆకాశములోనికి ఎగిరి పోయినది. అతని చేతిలో ఆమె కాలి అందె జారిపడినది. ఆ మణినూపుర సౌందర్యమునకు ఆశ్చర్యపడుచూ అశోకదత్తుడు ఇంటికి చేరెను.

మరునాడు రాజసమీపమునకు వెళ్ళి జరిగినది చెప్పి ఆ నూపురమును ఇచ్చెను. రాజు కూడా అందమైన ఆ అందెను చూచి ముచ్చటపడి తన రాణికి బహుమానమిచ్చెను. పిమ్మట ఆ రాజదంపతులు ఆలోచించి తన కుమార్తె మదన లేఖకు అశోకదత్తుడు సరైన వాడని భావించి, అతనికిచ్చి వివాహము చేసిరి. ఒకరోజు రాణి తన భర్తతో ఈ నూపురము ఒక్కటి ధరించిన బాగుండదు, దీనికి సరైన జంటను చేయించుడని కోరినది. రాజు స్వర్ణకారులను పిలిపించి అటువంటి నూపుర మింకొకటి చేయమనగా దేవా! ఇది మరొకటి చేయుట ఎవరి తరమూ కాదు. ఇది దేవశిల్పముగాని, మానుషశిల్పము కాదని బదులు పల్కిరి.

అంతట రాజు చింతాక్రాంతుడు కాగా అశోకదత్తుడు ఆ విషయము తెలుసుకొని రెండవ నూపురమును సాధించి వచ్చెదనని చెప్పి ఆ నూపురమును తీసుకొని ఒక మాసశివరాత్రి నాడు బయలుదేరెను. పూర్వ మానుపురమెక్కడ దొరికినదో ఆ శ్మశానము వద్దకు వెళ్లెను. ఒక ఉపాయమును ఆలోచించి శవమును భుజముపై నుంచి శవము నుండి కొంత మాంసము కోసి మహా మాంసము కావలసిన వారు కొనండహో అని అరుచుచూ శ్మశానములో తిరుగసాగెను.

"ఓయీ! ఇటు రమ్ము!" అని ఒక స్త్రీ స్వరము వినబడి ఆ దిశగా వెళ్లగా, ఒక చెట్టు మీద ఒక దివ్య స్త్రీ నిలబడి యున్నది. ఓ మహాసత్త్వా! దీని వెల ఎంత? అని ప్రశ్నించినది. అపుడు భుజము మీదను శవమును ఉంచుకొని, మరొక చేతిలో గల నూపురమును చూపించి దీని జంట నూపురమిచ్చి కావలసినది తీసుకొనుమని పలికెను. అది నా నూపురమే. నావద్ద రెండవది ఉన్నది. నేను చెప్పినట్లు చేసినచో దానిని ఇచ్చెదనని ఆమె అన్నది. సరేయని అశోకదత్తు డంగీకరించగా ఆమె ఇట్లు చెప్పినది.

హిమాలయమందు "త్రిఘంట"మను నగరము కలదు. అచట లంబ జిహ్వుడను రాక్షసుడు గలడు. అతని భార్యను నేను, నా పేరు "విద్యుచ్ఛిక"

నాకు కామరూపిణీ విద్యతెలియును, నాకు కూతురు జన్మించినపుడు నా భర్తను కపాలస్ఫోటుడు సంహరించెను. నా భర్త పరాక్రమమునకు సంతసించి అతడు ఆ నూపురముల నిచ్చెను. పిదప మేము సుఖముగా నున్నాము. నా కుమార్తె యౌవనవతి అయినది. ఆమెకు తగిన భర్తకై వెతుకుచుంటిని. మాసశివరాత్రి నాడు రాజుతో బాటు వెళ్లుచున్న నిన్ను చూచి నీవు నా కుమార్తెకు తగినవాడవని భావించి ఇదంత యూ చేసితిని. అని చెప్పి తన కుమార్తెను పరిగ్రహించిన రెండవ నూపుర మిచ్చెదనని – ఆమె పలికెను.

అశోకదత్తుడు సరేనని అంగీకరించి ఆమె వెంట గగన మార్గమున ఆ నగరము చేరి, 'విద్యుత్ప్రభ' అను ఆమె కుమార్తెను చూచి, ఆమె అందమునకు మోహితుడై ఆమెను వివాహమాడి అక్కడ కొంతకాల ముండెను. రెండవ నూపురము గ్రహించి వారాణసి బయలు దేరుటకు నిశ్చయించుకొనగా విద్యుచ్ఛిక ఒక బంగారు కమలమును గూడ బహూ కరించినది. ఆమె శక్తిచే అతడు మరల శ్మశానమును చేరి, ప్రతీ మాస శివరాత్రినాడు ఈ చెట్టు వద్దకు వచ్చెదనని చెప్పి ముందుగా తన తల్లిదండ్రు లను చేరెను. చిన్న కొడుకు వియోగముచే దుఃఖితులైన వారికి పెద్దకొడుకు కూడా ఎడబాటు పొందెనని చింతించుచుండగా అశోకదత్తుడు వచ్చి వారి దుఃఖము పోగొట్టి ఆనందమును కలిగించెను.

మరునాడు రాజును చేరి రెండవ నూపురమును, బంగారు కమల మును కూడా సమర్పించెను. అందరూ ఆశ్చర్యపరవశులైరి. జరిగిన వృత్తాంతమంతయూ చెప్పి భార్యనూ, పరివారమునూ సంతోషపరచెను. రాజు ఆ బంగారు కమలమును తాను కట్టించిన దేవాలయ శిఖరముపై అలంకరించెను. ఆ దృశ్యము చూచి భక్తి పరవశుడై రెండవ శిఖరము పైన కూడా ఇటువంటి కమలమే ఉన్నచో ఎంత బాగుండునో కదా! అనెను. అంత అశోకదత్తుడు ఆ రెండవ దానిని కూడా తీసుకు రాగలనని బదులు

పలుకగా, వలదు! ఇంక సాహసములు చేయకుమని రాజు వారించెను. కొంతకాలమైనది. కాని అశోకదత్తుని మనస్సు రెండవ బంగారు కమలము పైనే ఉన్నది. చివరకు ఒక నిశ్చయమునకు వచ్చి ఎవరికీ చెప్పకుండా ఒక మాసశివరాత్రి అర్ధరాత్రి ఇల్లువదలి శ్మశానము చేరి అచట విద్యుచ్ఛిఖను కలుసుకొని తన మనోగతమును వివరించెను.

అంత ఆమె ఆ బంగారు కమలమును కపాలస్ఫోటుడిచ్చెనని అటువంటివి అతడున్న సరస్సు వద్దనే ఉన్నవని, ఎక్కడా అవి లభించవని తెలిపినది. తననా సరసు వద్దకు చేర్చమని ఆమెను బలవంతము చేసెను. అచట భయంకరమైన రాక్షసులు కాపలా ఉండెదరని చెప్పిననూ అశోకదత్తుడు తన పట్టు విడవలేదు. చివరకు ఆమె అతనిని తన మాయాశక్తిచే అచటకు చేర్చినది.

అంతట అచట నున్న సరస్సులో ఆ కమలములను చూచి సరసులో దిగి కమలమును కోయుచుండగా రాక్షసులు దాడిచేసిరి. వారినందరినీ తన విక్రమముచే వధించగా కొందరు పారిపోయి "కపాలస్ఫోటు"నకు విషయము చెప్పిరి. అతడు ఉగ్రుడై సరసు వద్దకు వచ్చి అశోకదత్తుని చూచి, తన అన్నగా గుర్తించి అతని పాదములపై బడి దుఃఖించుచూ, నిన్ను చూచి తనకు తన బ్రాహ్మణత్వము గుర్తుకు వచ్చినదని, తనలోని రాక్షసత్వము నశించినదని – సంతోషము, ఆనందభాష్పములు రాల్చుచూ, అన్నను కౌగిలించుకొనెను. అంతలో అచ్చటికి "ప్రజ్ఞప్తి కౌశికుడ"ను విద్యాధర గురువు వచ్చి, మీరు విద్యాధరులు శాపవశమున ఇట్లయితిరి. ఈనాడు మీ శాపములు తీరినవి. మీ శక్తులు కూడా మీకు సంక్రమించినవి. ఇక సుఖింపుడని ఆశీర్వదించి వెళ్లిపోయెను.

అనంతరము వారు బంగారు కమలములు తీసుకుని ఆకాశ మార్గమున రాక్షసరాజు పుత్రిక వద్దకు చేరిరి. ఆమె కూడా శాపము తీరి

విద్యాధరి అయినది. వారు ముగ్గురూ గగన మార్గమున కాశీ చేరి, తల్లి దండ్రుల వియోగ దుఃఖమును పోగొట్టి నేత్రానందమునూ, మనోల్లాస మునూ కలిగించిరి. పిదప ప్రతాపముకుటుని చేరి ఆ వృత్తాంతమంతయూ వివరించిరి. గోవిందస్వామి విజయదత్తునితో "నాయనా! ఆనాటి రాత్రి శ్మశానమున నీవు రాక్షసుడవైన పిమ్మట ఏమి జరిగినది? అని ప్రశ్నించగా అతడిట్లు జవాబు చెప్పెను.

"తండ్రీ! వప త్రాగి నేను రాక్షసుడను కాగానే, అచట ఉన్న రాక్షసులు నాకు కపాలస్ఫోటుడను పేరుపెట్టి వారిలో చేర్చు కొనిరి. వారికి సేనాపతి నైతిని. ఒకనాడు గంధర్వుల మీదకు యుద్ధమునకు వెళ్లగా అందు రాక్షసరాజు మరణించెను. నన్ను వారికి రాజుగా చేసుకొనిరి. పిమ్మట అన్నను చూచి గతస్మృతి కలిగినదని" - వివరించెను.

తమ విద్యాధరత్వమును గూర్చి తండ్రికి అశోకదత్తుడు ఈ విధముగా తెలిపెను. పూర్వము మేమిద్దరము విద్యాధరులము, ఒకనాడు ఆకాశ గమనము చేయుచూ "గాలవాశ్రమము" వద్ద గంగానదిలో స్నానము చేయు ముని పత్నులను చూచి పరస్పరము వారితో కామమోహితుల మైతిమి. అపుడు ఆ మునులు కోపించి మమ్ములను మానవులుగా జన్మించమని, అందునా సోదరులైనా మీకు కొంతకాలము వియోగము కలుగునని, తిరిగి కలుసుకొన్నప్పుడు జ్ఞప్తికి వచ్చి విద్యాధర గురువుచే మీ శక్తులు పొంద గలరని చెప్పగా- అదే విధముగా జరిగినది అని చెప్పెను. పిదప అందరూ సుఖముగా నుండిరి. ప్రతాపముకుటుడు రెండవ కలశముపై బంగారు కమలము నుంచి ఇతర కమలములతో శివుని పూజించుచూ అతనిచే తన వంశము చరితార్థమైనదని భావించెను.

ఈ విధముగా దివ్యులు కారణజన్ములై మానవ లోకమున జన్మించి దుర్లభమైన కార్యములను సాధించి ఆదర్శప్రాయు లగుచున్నారు - అని విష్ణుదత్తుడు శక్తిదేవునితో చెప్పి ఆ రాత్రి గడిపెను.

# 5 -3వ తరంగము

మరునాడు సత్యవ్రతుడు వచ్చి సమీపములో "రత్నకూట"మను ద్వీపము కలదని రేపు ఆషాఢశుద్ధ ద్వాదశికి "యాత్రోత్సవము" అచట జరుగును వివిధ ద్వీపముల నుండి అనేక మంది వచ్చెదరని, కనుక ఆ ప్రదేశమునకు వెళ్లుదమని చెప్పి, శక్తిదేవుని తీసుకుని పయనమయ్యెను. సముద్రములో ఒకచోట పర్వతము వలె ఒకటి గోచరించినది. అది ఏమిటని శక్తిదేవుడు ప్రశ్నించెను.

అది గొప్ప వటవృక్షమని దానికిందనే బడబా ముఖమను పెద్ద సుడి వున్నదని, అందు పడినవారు తిరిగి రారని చెప్పెను. అంతలోనే గాలిదిశ, నీటివేగము మారి పడవ ఆ సుడి దిశగానే పోసాగినది. సత్యవ్రతుడు తన ప్రాణములను గూర్చి విచారించక శక్తిదేవుని పైకి ఎత్తి ఆమర్రిచెట్టు కొమ్మ పట్టుకొమ్మని, తనను గూర్చి ఆలోచించవద్దని సమయము లేదని, లేనిచో ఇద్దరమూ ఆ సుడిలో పడెదమని హెచ్చరించెను. శక్తి దేవుడు మిత్రునికై చింతించుచూ చేయునది లేక మర్రిచెట్టు కొమ్మ పట్టుకొని దాని నధిరోహించెను. చూచుచుండగనే పడవ సుడిగుండములో పడి మునిగిపోయినది.

సత్యవ్రతుడు పరోపకారము కొరకు తన ప్రాణములర్పించెను. ఆ పగలు గడిచినది. సాయంకాలమున నానా దిక్కుల నుండి భేరుండపక్షులు వచ్చి ఆ చెట్టుపై వాలసాగెను. వాటిలో ఒక ముసలి పక్షి "తానీదినమున 'కనకపురి' వెళ్ళితినని మరల రేపు, ఆహారము సమృద్ధిగా లభించుటచే అచటికే వెళ్లెదనని, దూరదేశము వెళ్లుట వలన శ్రమ ఎక్కువ అని మరొక దానితో పలికినది. శక్తిదేవుడు ఆ మాటలు విని సంతోషించి, మెల్లగా మహాశరీరము గల ఆ పక్షి రెక్కలలో దూరి వాటి ఈకలను పట్టుకొనెను.

ఉదయముననే పక్షులన్నియూ ఆహారము కొరకు వివిధ దిక్కులకు ఎగిరి పోయినవి. ఆ ముసలి పక్షి కూడా కొద్దిసేపు ఎగిరి "కనకపురి" చేరినది. నెమ్మదిగా దాని రెక్కల సందు నుంచి దిగి, భూమిపైన చుట్టూ

పరికించెను. అది ఒక తోట. అచ్చట ఇద్దరు కన్యలు ఇతనిని చూచి ఆశ్చర్య పడిరి. శక్తిదేవుడు వారిని సమీపించి "ఇది ఏ దేశము? మీరెవరు? అని ప్రశ్నించెను.

"ఇది కనకపురి విద్యాధరుల నగరము. చంద్రప్రభ యను విద్యాధరిదీ తోట ఆమె కొరకు పూలను తీసుకువెళ్లుచున్నామని తెలిపెను. అంత వారితో కలసి ఆమె దర్శనమునకు వెళ్లెను. చంద్రప్రభ ఇతనిని చూచి అతని సౌందర్యము నకు వశీకృతురాలై స్వాగతమిచ్చి ఆదరించెను. ఆర్యా! మానవులక గమ్యమైన ఇచ్చటకి మీరెట్లు వచ్చిరి? మీరెవరు? అని ప్రశ్నించెను. అంత శక్తిదేవుడు తన వృత్తాంతమును, కనకరేఖ గురించిన సమాచారమును వివరించెను. అది విని ఆమె ఒక నిట్టూర్పు విడచి ఆర్యా! వినుము.

ఇచట "శశిఖండుడ"ను విద్యాధర రాజునకు మేము నలుగురు కుమార్తెలము. నేను పెద్దదానిని నాపేరు 'చంద్రప్రభ', రెండవది చంద్రరేఖ, మూడవది శశిరేఖ, నాల్గువది శశిప్రభ. మేము పెద్దవారైన పిమ్మట నా చెల్లెళ్ళు ముగ్గురూ గంగానదీ స్నానము చేయుటకు వెళ్ళి జల మధ్యమందున్న అగ్ర్యతపస్సుడను మునిపై పరిహాసముగా నీళ్లు చల్లిరి. ఆ ముని కోపించి ముగ్గురినీ మానవులుగా జన్మించమని శపించెను.

మా తండ్రి వెళ్ళి అతనిని ప్రార్థింపగా, మనుష్యులుగా పుట్టిననూ జాతిస్మరత్వ ముండునని అనుగ్రహించెను. రాబోవు మాసశివరాత్రికి నేను వృషభగిరి వెళ్లెదను. ఆనాడు విద్యాధరులందరూ నానా దిక్కుల నుండి వచ్చి శివుని పూజించెదరు. అచట మా తండ్రికి చెప్పి మిమ్ములను పరిణయ మాడెదను. నన్ను అనుగ్రహింపుడని ప్రార్థించెను. శక్తిదేవుడు సంతోషముతో తన అంగీకారమును తెలిపెను.

మాసశివరాత్రి నాడు చంద్రప్రభ వృషభగిరికి పయనమవుతూ రెండు రోజు లలో తాను వచ్చెదనని, అంతవరకూ ఇచటనే సుఖముగా నుండు మని, ఆ మధ్య అంతస్తుకు మాత్రము వెళ్ళ వద్దని, అది ప్రమాదమని

హెచ్చరించి వెళ్ళిపోయినది. కాని శశిదేవుడు మానవ మనోచాపల్యముచే నిషేధించిన ఆ అంతస్తుకు వెళ్ళి ఒక గదిలో మూడు రత్నద్వారములను చూచెను. వాటిలో ఒక దానిని తెరిచి లోనికి వెళ్ళగా అచట ఒక రత్నశయ్యపై వస్త్రము కప్పిన ఒక శరీరాకృతి యున్నది. దగ్గరగా వెళ్ళి ఆ వస్త్రము తొలగించి చూడగా అది "కనకరేఖ" మృతదేహము.

ఇదేమి యని శక్తిదేవుడు ఆశ్చర్యపడెను. మిగిలిన రెండు రత్న ద్వారములు తెరచి చూడగా అక్కడ రెండు "కనకరేఖ" మృతదేహములున్నవి. విభ్రముడై తిరుగుచూ కిందకి దిగి వచ్చి ఆలోచించుచుండగా ఒక దిగుడు బావి కనబడినది. సమీపముననే రత్నాల జీనుతో ఒక గుర్రమున్నది. దాని నధిరోహించుటకు ప్రయత్నించగా అది ఒక తన్ను తన్నినది. దానితో అతడు వెళ్ళి దిగుడు బావిలో పడెను. అందులో మునిగి యితడు వెంటనే తన 'వర్ధమానపుర'మందలి తోటలోని ఒక నుయ్యిలో తేలెను. శక్తిదేవుడు పైకి వచ్చి తన స్వగ్రామమును చూచి ఇది కలా? నిజమా? అని ఎటూ తోచక స్తబ్ధుడై నడుచుచూ తన ఇంటికి వెళ్ళెను.

మరునాడు ఉదయమున "కనకపురిని చూచినవారు ఎవరైనా ఉన్నారా?" అను రాజు చాటింపును శక్తిదేవుడు వినెను. వెంటనే లేచి అలంకరించుకొని, తాను చూచితినని వారితో చెప్పి, వారి వెంట రాజ మందిరమునకు వెళ్లెను. రాజతనిని గుర్తించి ఇంతకు ముందు అబద్ధము చెప్పి గెంటింపబడితివి కదా మరలా ఏ ముఖముతో వచ్చితివని గద్దించెను. శక్తిదేవుడు "రాజా! నేనిప్పుడు కనకపురిని చూచే వచ్చుచున్నాను. నా మాట అబద్ధమని తేలినచో నా తల తీయింపుడని నిశ్చయముగా పలుకగా, కుమార్తెను పిలిపించెను. ఆమె వచ్చి "ఏమి? మరలా ఈ బ్రాహ్మణుడు వచ్చెనని ప్రశ్నించెను.

అంత శక్తిదేవుడు "ఓ రాజకుమారీ! నేను చెప్పినది నిజమో అబద్ధమో నీవే చెప్పుము. నీవు కనకపురిలో రత్నశయ్యపై మరణించినట్లున్నావు? ఇక్కడ జీవించియున్నావు. నా కేమియూ బోధపడుట లేదు. అని చెప్పగా

కనకరేఖ సంతోషముతో "తండ్రీ! ఇతడు నిజముగా కనకపురిని చూచి వచ్చినాడు. త్వరలోనే ఇతడు నా భర్త కాగలడు. అచట నా అక్కచెల్లెళ్లు ముగ్గురు కలరు. వారిని గూడా ఇతడు పరిణయమాడి విద్యాధర ప్రభువు కాగలడు. నేను మునిశాపమున మీకు జన్మించితిని. ఇపుడు నాకు శాపవిముక్తి కలిగినది. నేను నా విద్యాధర స్థానము చేరుచున్నాను" అని శరీరము విడచి అంతర్ధానమయ్యెను.

రాజమందిర మంతయూ అది చూచి రోధనలతో నిండిపోయెను. శక్తిదేవుడు "కనకరేఖ" మాయమగుట చూచి చింతాక్రాంతుడయ్యెను. మరల వారిని కలుసుకొనుటకై పట్టుదలతో బయలుదేరెను. అనేక దినములకు అతడు సముద్ర తీరమున "విటంకనగరము" చేరెను. అక్కడ సముద్రదత్తుడు కనపడి సంతోషముతో శక్తిదేవుని కౌగిలించుకొనెను. "సముద్రమున నావ బద్ధలైన పిమ్మట ఒక చెక్కతో తేలుచూ సముద్రదత్తుడు మూడు దినములు పయనించి ఒకరోజు ఒక ఓడ వెళ్ళుటను చూచి ఇతని అరుపులు విని వారు చిన్న పడవలో వచ్చి రక్షించితిరని తన వృత్తాంతము చెప్పెను.

ఆరోజు విశ్రాంతి తీసుకొని స్నేహితుని సహాయముతో మరల ఉత్సల ద్వీపమునకు బయలుదేరెను. ఆ ద్వీపము చేరిన వెంటనే సత్యవ్రతుని కుమారులు శక్తిదేవుని తమ తండ్రి గూర్చి ప్రశ్నించిరి. అతడు సుడి గుండములో పడి మరణించెనని తెలుపగా వారు కోపించి, సుడిగుండములో పడి ఒకడు బ్రతికి, మరొకడు ఎట్లు మరణించును. ఇతడే తన తండ్రిని ఏదో చేసెనని బంధించిరి. మరునాడు అతనిని కాళికకు బలి యిచ్చుటకై తీసుకుని పోయి ఆలయములో బంధించిరి.

అచటనే శక్తిదేవుడు తన దౌర్భాగ్యమును నిందించుకొనుచూ, జగన్మాతను ప్రార్థించుకొనుచుండెను. కలలో దేవి కనబడి "భక్తా! భయపడకు, ఈ జాలర్లకు "బిందుమతి" అను చెల్లెలు కలదు. ఆమె రేపు నిన్ను చూచి

భర్తగా వలచును. దానికి నీవంగీకరించినచో నిన్నామె విడిపింప గలదు. ఆమె శాపవశమున భ్రంశము నొందిన ఒక దివ్యాంగన." అని బోధించెను.

ఆ మరునాడు తెల్లవారుఝామున దేవి చెప్పినట్లుగానే బిందుమతి వచ్చి "నిన్ను వలచితినని, తన్ను పెళ్ళిచేసుకొనినచో విడిపింతున"ని చెప్పగా శక్తిదేవుడంగీకరించెను. ఆమె అతనిని బంధవిముక్తుని గావించెను. ఆమె సోదరులు సోదరి కోర్కెను మన్నించి శక్తిదేవునితో వివాహము చేసిరి. ఆమె తన దివ్యరూపమును పొందగా అచ్చటనే సుఖముగా కొంతకాల ముండెను. ఒకనాడు ఒక చండాలుడు గోమాంసమును ఒక మూటయందు ధరించుట చూచి శక్తిదేవుడు విస్మయము పొంది, తన భార్యతో, దేవీ! గోవులు ముల్లోకములోనూ పూజనీయములు కదా! ఇతడు గోమాంసము నెట్లు భుజించునని ప్రశ్నించెను.

ఆ మాట విని బిందుమతి భర్తతో "ఆర్యా! గోవులెన్నడునూ గౌరవార్హములే. నేను కూడా గవాపరాధము చేతనే ఈ జాలరి కులమున జన్మించితినని చెప్పెను. అంతట ఆ వృత్తాంతమును చెప్పమని శక్తిదేవుడు నిర్బంధించగా "నేను చెప్పిన మాట ఆచరించినచో రహస్యమైన ఆ కథను చెప్పెదనని బిందుమతి పల్కెను. శక్తిదేవుడు సరేయని మాట ఇచ్చెను. ఈ ద్వీపమున త్వరలో నీకొక భార్య లభింపగలదు. ఆమె గర్భము ధరించిన పిమ్మట ఎనిమిదవ మాసమున ఆమె ఉదరము చీల్చి దయను జూపక ఆ గర్భమును లాగివేయవలయును" అని తన కోర్కె తెలిపినది. శక్తిదేవుడు ఆశ్చర్యచకితుడై ఆ వివరమును ప్రశ్నించెను.

"నేను ఒక విద్యాధరిని. ఒకనాడు వీణాతంత్రులను పళ్లతో కొరికి వీణకు తగిలించుట చేత నేను జాలరి వంశమున పుట్టితిని. ఆవుల ఎండు నరమును నోటితో కొరికినందులకు నాకిట్టి అధోగతి సంభవించినది. ఇక గోమాంసము తినువాని సంగతి చెప్పనేల? - అని చెప్పుచుండగా ఆమె సోదరుడొకడు వచ్చి గొప్ప వరాహము దాడి చేయుచున్నది, దానిని

వేటాడవలెనని శక్తిదేవుని చేయిపట్టి లాగి తన వెంట తీసుకొనిపోయెను. అతని వెంట వెళ్ళి జనులను హింసించు పెద్ద వరాహమును తన శక్తి ఆయుధముతో కొట్టెను. దెబ్బతిని పరిగెత్తి అది ఒక బిలములో దూరినది. శక్తిదేవుడు కూడా ఆ బిలములో ప్రవేశించి దానిని వెదుకుచూ పోగా క్షణములో ఒక గొప్ప ఉద్యానవనమును, అందు ఒక గృహమును చూచెను. అక్కడ ఒక సౌందర్యవతి ఉన్నది. ఆమెను 'నీవెవరివని? ప్రశ్నించగా ఇట్లు జవాబు చెప్పినది.

"ఇచ్చటకు దక్షిణమున చండవిక్రముడను రాజు కలడు. అతని కుమార్తెను నేను. నా పేరు బిందురేఖ. ఒక రాక్షసుడు నన్ను తీసుకొని వచ్చి ఇచ్చట బంధించెను. ఆహారము కొరకు వరాహరూపము ధరించి బయటకు వెళ్ళి ఆయుధముచే కొట్టబడి ఇచటకు వచ్చి మరణించెను." అది విని శక్తిదేవుడు తానే ఆ వరాహమును కొట్టితినని చెప్పి తనను గూర్చి వివరించి ఆమె అంగీకారముతో అమెను వరించి, ఇంటికి తీసుకు వచ్చి బిందుమతితో చెప్పి బిందురేఖను వివాహము చేసుకొనెను.

కొంతకాలమునకు బిందురేఖ గర్భవతి అయినది. అపుడు బిందుమతి వచ్చి తనకు వాగ్దానమిచ్చిన ప్రకారము ఆమె గర్భము చీల్చి పిండమును తెమ్మని కోరినది. శక్తిదేవుడు ఏమి చేయుటకు తోచక బిందురేఖ వద్దకు వచ్చి ఖిన్నుడై యుండెను. అపుడు బిందురేఖ - స్వామీ! ఏల విచారముగా నున్నారు? నా గర్భమును చీల్చమని బిందుమతి ఆదేశించినదా? నాకు తెలుసు. ఇందేమీ క్రూరత్వము లేదు. ఇందుకుదాహరణగా ఈ కథను వినుము.

## దేవదత్తుని కథ

పూర్వము కంబుక మను పట్టణమును హరిదత్తుడను శ్రీమంత బ్రాహ్మణునకు దేవదత్తుడను కుమారుడు కలడు. అతడు జూదరి అయి వ్యసనము నందు చిక్కెను. ఒకనాడు అమిత ధన నష్టముచే బాధపడి

ఏమియు తోచక ఒక భగ్నాలయమును చేరెను. అక్కడ "జాలపాదు"దను తాంత్రికుడు పరిచయమయ్యెను. ఇతని కథ విని "విద్యాధరీ సాధన" ను చేయమని ప్రోత్సహించెను. సరేయని దేవదత్తుడు శ్మశానము నందు సాధన చేయసాగెను. ఒకనాటి రాత్రి చెట్టు మధ్యభాగము చీలి దాని నుండి ఒక స్త్రీ వచ్చి తన వెంట దేవదత్తుని తీసుకువెళ్ళినది. అచ్చట యక్షరాజైన రత్నవర్షుని కుమార్తె "విద్యుత్ప్రభ" ఇతని సాధనకు మెచ్చి వరించి పరిణయమాడినది. జాలపాదుడు ఆమె గర్భము ధరించినచో అది చీల్చి పిండమును తనకు ఇవ్వమని గురుదక్షిణగా కోరెను.

కొంతకాలమునకు ఆమె గర్భవతి అయినది. కాని గర్భము చీల్చుటకు దేవదత్తుడు అంగీకరించలేదు. కాని ఆ యక్షిణి అది గ్రహించి – స్వామీ! నా గర్భము చీల్చుటకు సందేహించవలదు. నీవు చేయనిచో ఆ పని నేనే చేసెదను. ఎందుచేత ననగా అందువలన నాకు శాపవిమోచనమగును. నేను విద్యాధరినైననూ శాపముచే యక్షిణినైతిని. ఆ పిండమును తిన్నవాడు విద్యాధరుడు కాగలడు అని వివరించి, సంకోచించుచున్న దేవదత్తుని గమనించి, తానే గర్భమును చీల్చి పిండమును అతని ముందుంచినది. మరల తన సమాగమము కలుగునని విచారించవలదని ఆమె అదృశ్య మయ్యెను. దేవదత్తుడిచ్చిన పిండముతో జాలపాదుడు భైరవార్చన చేసి దానిని భుజించి విద్యాధరుడై వెడలిపోయెను.

దేవదత్తుడు చేయునది లేక మరల భేతాళసాధనకై ప్రయత్నము చేసి తన మాంసమునే బలిగా సమర్పించి భేతాళుని అనుగ్రహము పొందెను. ఆ శక్తితో, విద్యాధరి "విద్యుత్ప్రభ" ఉన్న స్థానమునకు వెళ్ళగా అచట జాలపాదుడు ఆమెను వివాహమునకై నిర్బంధించుచుండెను. వెంటనే దేవదత్తుడు అతనిని క్రోధముతో సంహరించబోవగా భేతాళుడు జాలపాదుని శక్తిహీనుని చేసి భూలోకమున నుంచెను. పిదప విద్యుత్ ప్రభతో విద్యాధరత్వము పొంది దేవదత్తుడు సుఖముగా నుండెను.

ఈ కథ చెప్పి శక్తిదేవుని ప్రోత్సహించినది. అయిననూ పాపశంకితుడై ఆలోచించుచుండగా ఆకాశవాణి ఇట్లు పలికినది. “శక్తిదేవా! శంకించ కుండా ఆ గర్భము చీల్చి దానిని చేతితో పట్టుకొనుము అది ఖడ్గముగా మారును' అది విని శక్తిదేవుడు గర్భము చీల్చి పిండమును లాగి చేత ధరించగా అది ఖడ్గముగా మారినది. శక్తిదేవుడు విద్యాధరుడయ్యెను' అపుడు బిందుమతి ఇట్లు చెప్పినది.

నాథా! మేము విద్యాధర కుమార్తెలము అందు మొదటిది కనకరేఖ. నేను మూడవదానిని. చంద్రప్రభ యను మా అక్క అచటనే ఉన్నది. మా విద్యాధర శరీరము లచ్చటనే యున్నవి. ఖడ్గసిద్ధి ప్రభావము వలన నీవు త్వరగా వచ్చి మా తండ్రి అనుమతితో మమ్ము పొందుము అని చెప్పగా శక్తిదేవుడు గగన మార్గమున 'కనకపురి' బయలుదేరెను.

అచ్చట మూడు మండపములలో ముగ్గురూ దివ్యదేహములతో నుండిరి. నాల్గవదైన చంద్రప్రభ శక్తిదేవునితో ఇట్లనెను. వర్ధమానపురమున నీవు చూచిన “కనకరేఖ” నా చెల్లెలు. దాని పేరు చంద్రరేఖ. ఉత్పల ద్వీపమున బిందుమతి యను పేర పల్లెపడుచుగా నున్నది. రెండవ చెల్లెలు శశిరేఖ రాక్షసాపహృతయై నిన్ను వివాహము చేసుకొన్నది, నా మూడవ చెల్లెలు శశిప్రభ అని అతనిని తన తండ్రి వద్దకు తీసుకువెళ్ళెను. అతడు గత వృత్తాంతమునంతా విని తనకు కుమార్తెలను శక్తిదేవుని కిచ్చి వివాహము చేసెను. అనంతరము కనకపురి రాజ్యమును, విద్యాధరు లలో సముచిత స్థానమును పొంది 'శక్తివేగు' డను పేరుతో సుఖముగా నుండెను.

పిమ్మట వత్సరాజుకు జన్మించిన నరవాహనదత్తుడు విద్యాధర చక్రవర్తి కాగలడని తెలుసుకుని అతనికి నమస్కారము చేసి పరిచయము చేసుకొను టకు కౌశాంబి చేరెను”. ఇట్లు తన వృత్తాంతమును వత్సరాజునకు చెప్పి, సర్వ శుభములు పొందుమని అభినందించి ఆకాశమార్గమున వెడలి పోయెను.

# 6-1వ తరంగము

కాలగమనములో నరవాహనదత్తుడు యవ్వనము పొంది నవ యువకుడుగా నుండగా, ఆ సమయమున జరిగిన విషయమిది.

వితస్తానదీ తీరమున 'తక్షశిల' అను నగరము కలదు. దానికి రాజు కళింగ దత్తుడు, అతని భార్యపేరు తార. బౌద్ధమతము నాదరించుచూ రాజు సుఖముగా పరిపాలించుచుండెను. ఆ నగరములో వితస్తాదత్తుడను వైశ్యుడు కలదు. బౌద్ధుల నాదరించుచూ సత్ప్రవర్తనతో, దానధర్మములతో కాలము గడుపుచుండెను. అతని కుమారుడు రత్నదత్తుడు తండ్రి చేయు దానధర్మములను, బౌద్ధుల నాదరించుటయునూ ఏవగించుకొనేవాడు. వైశ్యుడు కళింగదత్తుడను తన రాజునకీ వృత్తాంతమంతయూ తెలిపి తరణోపాయము తెలుపుమని ప్రార్థించెను.

అంతరాజు వైశ్యపుత్రుని పిలిపించి ధర్మదూషకుడగు అతనిని వధించమని ఆజ్ఞాపించెను. వైశ్యుడు తన కుమారుని ప్రాణములు తీయ వద్దని ప్రాధేయపడగా, రెండు నెలల తరువాత వధింపు మని ఆజ్ఞాపించి తండ్రితో అతనిని పంపించి వేసెను. తండ్రి యింటికి తీసుకుపోయెను. వైశ్యపుత్రుడు భయాకులుడై తన చావును గూర్చి చింతించుచూ నిద్రా హారములు సరిగా లేక చిక్కిపోయెను. రెండు నెలల తరువాత అతనిని రాజు వద్దకు తీసుకువెళ్ళెను. అతనిని చూచి రాజు "అదేమిటి? అలా కృశించితివి?" అని ప్రశ్నించగా, తాను మరణభయముతో ఇలా అయితినని బదులు చెప్పెను.

అంతట రాజు ఓయీ చూచితివా? ప్రాణభయముతో ఎట్లయితివో? మృత్యుభీతుడగు విజ్ఞుని మోక్షము కొరకు ప్రయత్నించును. సకల ప్రాణులూ ప్రాణభయము నందు సమానము గానే వ్యవహరించును. ధర్మపరుడగు నీ తండ్రి చేయు పనులను నిందించకుము - అని చెప్పగా, వైశ్యపుత్రుడు

తన తప్పు తెలుసుకొని తనకు సన్మార్గము నాదేశింపుమని రాజును ప్రార్థించెను.

రాజు సరేనని చెప్పి, నూనెతో నిండిన పాత్రను ఒకదానిని ఇచ్చి ఒక చుక్క కూడా కింద పడకుండా నగరమంతా తిరిగి రావలెనని, ఒక బిందువు నేలరాలిన నీ తల రాజభటులు ఖండితురని ఆజ్ఞాపించెను. వైశ్య పుత్రుడు అలాగేనని అంగీకరించి నూనె పాత్రను తీసుకొని అతికష్టముతో నగరమంతా తిరిగి రాజును సమీపించెను. అంతట రాజు నగరములో నెవరినైనా చూచితివా? అని ప్రశ్నించెను. ఆ మాట విని చేతులు జోడించి – "ప్రభూ! నిజముగా ఊరిలో నేనేమియూ చూడలేదు. నూనెచుక్క కింద పడునేమో యను భయముతో జాగ్రత్తగా సంచరించితిని – అని చెప్పెను. నూనె యందే మనసు నుంచి నీవేమియు చూడలేదు. అట్లే శ్రద్ధతో పరతత్త్వ మును ధ్యానింపుము. బాహ్యవృత్తుల నుండి మరలింపబడిన చిత్తమేకాగ్రమై తత్త్వమును దర్శించును. తత్త్వదర్శిని కర్మజాలము బంధించలేదు – అని రాజు చెప్పగా వైశ్యపుత్రుడు రాజుకాళ్ళపై బడి కృతార్థుడై ఇంటికి వెళ్లిపోయెను.

# సురభిదత్త కథ

ఒకనాడు ఇంద్రలోకములో ఉత్సవము జరిగినది. అందు "సురభిదత్త" అను అప్సరస కనబడలేదు. ఇంద్రుడు తన దివ్యదృష్టి చేత ఆమె ఒక విద్యాధరునితో క్రీడించుటను గమనించి, మానవ లోకమున జన్మించమని శపించెను. ఆమె తారాదత్త రాణి గర్భమందు కుమార్తెగా జన్మించినది. ఆమెకు "కళింగసేన" అను పేరు పెట్టిరి. రాజు కన్యా జననముచే చింతించుచుండగా ఒక వృద్ధ బ్రాహ్మణుడు "రాజా! పుత్రుల కంటే కన్య ఉత్తములు. ఇహపర శుభమునిచ్చువారు. రాజ్యలుబ్ధులూ, మర్కటముల వలె జనకుల భక్షించు పుత్రులయందు రాజులకింత యాసక్తి

ఎందుకు? కుంతి భోజాదులు తమ పుత్రికలచే దుర్వాసాదుల వలన కలిగిన దుస్సపరాభవములను దాట గల్గిరి. కన్యాదానము వలన పరలోకమున కలుగు ఫలము పుత్రుని వలన ఎట్లు కలుగును? ఈ విషయమున సులోచన కథను చెప్పెదను వినుము"–అని ఇట్లు చెప్పెను.

# 6-2 సులోచన కథ

పూర్వము చిత్రకూట పర్వతమున 'సుషేణుడ'ను ఒక అందమైన యువకుడు అగు రాజు కలడు. అతడు ఒకనాడు తన ఉద్యానవనమున విహరించుచుండగా, ఆకాశమార్గమున వెళ్ళుచున్న అప్సరస రంభ చూచి అతనిని మోహించి అతనితో సంగమము కోరి భూలోకమునకు వచ్చి అతనితో కలసి నివసించసాగినది. కాలాంతరమున వారికి ఒక కుమార్తె జన్మించినది. ఆమె బిడ్డను రాజునకప్పగించి, తాను అప్సరసనని చెప్పి, కుమార్తె వివాహానంతరము స్వర్గమున తమ సమాగమము జరుగునని, విచారించవలదని చెప్పి అంతర్ధానమయినది. రాజు కుమార్తెకు 'సులోచన' అను పేరు పెట్టెను. ఆమెను కశ్యపగోత్రోద్భవుడైన 'వత్సుడను' మహర్షికిచ్చి వివాహము చేసి కృతార్థుడై స్వర్గమున తన ప్రియురాలైన రంభను మరల పొందెను" అని చెప్పిన కథ విని కళింగదత్తుడు తన కుమార్తెను గారాబముగా పెంచెను.

ఒకనాడు కళింగసేన సౌధముపైన విహరించుచుండగా మయాసురుని కుమార్తె "సోమప్రభ" ఆకసమున వెళ్ళుచూ ఈమెను చూచి ఆమె చెలిమి కోరి మానవ రూపములో చేరి కళింగసేనతో స్నేహము చేసినది. రాజకుమార్తె సోమప్రభ వివరముల నడిగెను. అంతట ఆమె – "సఖీ నీవు రాజకన్యవు – రాజపుత్రుల తోడి చెలిమి కొనసాగుట కష్టము. ఏ పాటి తప్పు కలిగిననూ వారు సహించలేరు. దీనికి నిదర్శనముగా ఈ కథ వినుము.

# రాజపుత్ర - వర్తక పుత్రుల కథ

పుష్కరావతి యను నగరమందు "గూఢసేనుడ"ను రాజు కలదు. అతనికి ఒక్కడే కుమారుడు కలడు. ఆ రాజకుమారునికి బ్రహ్మదత్తుడను వర్తక పుత్రునితో బాల్యము నుండి మిక్కిలి స్నేహముండెడిది. ఒకనాడు వర్తక పుత్రునికి వివాహము నిశ్చయించకోరి మిత్రులిద్దరూ "అహిచ్ఛత్రమ"ను పట్టణమునకు బయలుదేరిరి. సాయం సమయమున ఇక్షుమతీ నదీ తీరమున విశ్రాంతికై విడిది చేసిరి. కాలక్షేపమునకు రాజపుత్రుడు తన విదూషకుని పిలిపించి కథను చెప్పమని కోరెను. కథ మధ్యలోనే రాజ పుత్రుడు నిద్రించెను. విదూషకుడు కథ విరమించి వెళ్ళిపోయెను. వర్తక పుత్రుడు మెలకువగానే యున్నాడు. ఆ సమయమున గగనమందు కొందరు స్త్రీలు మాట్లాడుకొనుటను అతడు ఇట్లు వినెను.

"ఈ పాపి కథ పూర్తిగా వినకుండ నిద్రించెను. కనుక ఉదయమునే ఈ మణిహారము పరిగ్రహించిన మరణించును. అని ఒకతె పలికెను. అంత రెండవ స్త్రీ దానిని తప్పించుకొనిన ఈ మామిడిచెట్టు పండు తినినచో మరణించును. - అంత మూడవది దీనిని కూడా తప్పించుకొనినచో వివాహమునకై గృహములో ప్రవేశింపగనే దూలము విరిగి మీద పడి మరణించును- అని చెప్పెను. అంతట నాల్గవది - ఇది కూడా దాటినచో రాత్రి శయ్యాగృహమున ప్రవేశించినంతనే నూరుసార్లు తుమ్మగలడు. నూరుసార్లును "చిరంజీవ" అని ఎవడునూ పలుకకున్నచో మరణించును. ఇది విన్నవాడు రక్షించుటకు అతనితో చెప్పినచో యతడునూ మరణించునని చెప్పి వెళ్ళిపోయిరి.

భయంకరమైన భవిష్యత్తును విని - ప్రారంభించిన కథను ముగింప కుండుట ఎంత చెడ్డపని? కుతూహలముచే వినవచ్చిన దేవతలిట్లు శపింతురు గదా! ఎలాగైనా రాజపుత్రుని రక్షించవలెనని నిశ్చయించుకొనెను. ఉదయముననే బయలుదేరుచూ రాజపుత్రుడు కిందపడిన మణిహారము

తీసుకొనబోవగా 'మిత్రమా! దానిని గ్రహించవద్దు. అది రాక్షస మాయవలె దోచుచున్నది. లేనిచో సైనికులేల గ్రహించరు - అని నివారించెను.

రాజపుత్రుడు దానిని వదలి, ముందునకు వెళ్ళి మామిడిచెట్టును చూచి దాని పండును ఆశించగా బ్రహ్మదత్తుడు మునుపటివలెనే ఆ పనినీ మానిపించెను. రాజపుత్రుడు మనసున కష్టపడుచు గ్రామమును చేరెను. అచట గృహద్వారములో ముందు రాజపుత్రుడు ప్రవేశించబోవగా బ్రహ్మదత్తుడు దానిని వారించెను. అంతలో అది కూలిపోయినది. రాజపుత్రుని ప్రాణరక్షణ జరిగినది. ఆరోజు రాత్రి రాజపుత్రుడు తన భార్యతో శయినించినపుడు నూరుతుమ్ములు తుమ్మెను. బ్రహ్మదత్తుడు రహస్యముగా ముందుగానే ఆ గదిలో ప్రవేశించియున్నవాడు కనుక తుమ్మిన ప్రతీసారి నెమ్మదిగా 'చిరంజీవ' అనుచుండెను. వంద తుమ్ములు అయిన పిదప సంతోషముతో బయటకు వచ్చెను. రాజపుత్రుడు అతడు అంతఃపురమున దురుద్దేశ్యముతో ప్రవేశించెనని భావించి బంధించమని ఆజ్ఞాపించెను.

ఉదయమున బ్రహ్మదత్తుడు తాను మిత్రద్రోహిని కాదని అందులకు కారణమును, దేవతా స్త్రీల శాపమును వివరించగా, రాజపుత్రుడు తన ప్రాణములు కాపాడినందుకు సంతోషించి స్నేహితుని ఆదరించెను. కనుక నవ్వుచునే ప్రాణములు తీసెడి రాజపుత్రులతోనూ, భేతాళములతోనూ స్నేహమేమిటి? అని సోమప్రభ చెప్పగా-కళింగసేన-చెలీ వారు రాజపుత్రులు కాదు, పిశాచములు-పిశాచదుర్గ్రహమను కథను చెప్పెదను వినుము -

పూర్వము యజ్ఞస్థలమను అగ్రహారమున ఒక బీద బ్రాహ్మణుడుండెను. ఒకనాడు కట్టెలు తెచ్చుటకై అరణ్యమునకు వెళ్ళి చెట్టు కొమ్మలు నరుకుచుండగా కర్రముక్క బెడిసి కాలిపిక్కలో గుచ్చుకొన్నది. దానికి అతడు ఎన్ని ఔషధములు వాడిననూ తగ్గలేదు సరికదా అది నాడీ వ్రణమైనది. ఆ బాధ భరింపలేక, ఆత్మహత్యకు పూనుకొనెను. అంతట అతని మిత్రుడు

రహస్యముగా – యజ్ఞదత్తుడను నా చెలికాడు దరిద్రబాధ నివారణకై పిశాచ సాధన చేసి ఇపుడు సుఖముగా నున్నాడు. నీవు కూడా అది ఆచరించిన నీ వ్రణబాధను అది నివారింపగలదని చెప్పి ఆ మంత్రమును చెప్పి ప్రయోగ మును ఇట్లు వివరించెను.

"రాత్రి నాల్గవ జామున దిగంబరుడవై రెండు చేతులతో రెండు పిడికిళ్ల బియ్యమును నాలుగు మార్గముల కూడలి యందు ఉంచి మౌనముగా వెనుకకు తిరిగి చూడకుండా ఇంటికి వెళ్ళుము. ఈ విధముగా పిశాచము కనబడునంతవరకు చేయుమని చెప్పెను. బ్రాహ్మణుడు మిత్రుడు చెప్పినట్లే చేసి కొంతకాలమునకు "పిశాచ సిద్ధి" ని పొందెను. అంతట అది హిమాలయము నుండి ఔషధమూలికలను తెచ్చి అతని నాడీ వ్రణమును మాన్పెను. బ్రాహ్మణుడు ఎంతో సంతోషించగా పిశాచమిట్లనెను.

"నాకింకొక వ్రణమును చూపుము, దానిని కూడా నయము చేసెదను లేనిచో నీకు మరణము తప్పదనెను. బ్రాహ్మణుడు భయపడి ఏడు దినము లలో రెండవ వ్రణము చూపెదనని తాత్కాలికముగా తప్పించుకొనెను. బ్రాహ్మణుడు జీవితాశ వదలుకొని దిగులు పడుచుండెను. అపుడు అతని విధవ కుమార్తె సంగతి తెలుసుకొని "నాయనా! నేను ఆ పిశాచమును మోసగించెదను. నీవు వెళ్ళి దానితో "నా కుమార్తెకు నాడీ వ్రణము కలదని" చెప్పమనెను.

బ్రాహ్మణుడట్లే చేయగా పిశాచము అతని కుమార్తెను సమీపించి వ్రణమును చూపమనెను. ఆమె తన మర్మాంగమును చూపి "దీని మాన్పు" మనెను. తెలివి లేని ఆ పిశాచము దానికి ఎన్నో పిండికట్లు, పూతలు పూసిననూ అది మాన్పలేక పోయెను. రోజులు గడిచిన కొలది పిశాచము విసిగి అది ఏల మానలేదో చూచెదనని దాని కాళ్లను తన భుజముల మీద వేసుకుని "వరాంగము"ను పరిశీలించినది. దానికి గుద రంధ్రమును చూచెను. అది చూచి ఆశ్చర్యపడి "ఒకటి మానకుండగనే యింకొకటి

బయలుదేరినది. ఛిద్రములందు అనర్ధము లెక్కువగునను సామెత నిజమే. దేని నుండి లోకము పుట్టుచున్నదో, దేని వలన ప్రళయము చెందుచున్నదో అట్టి వివృతమైన సంసారమార్గమును మూయుట ఎవడి తరము? అని అది భావించి, తనకు బంధనము తప్పదని భయపడి పిశాచము పారి పోయినది - బ్రాహ్మణుడు సుఖముగా నుండెను.

ఈ కథ వివరించి మూఢులగు రాజపుత్రులటువంటి వారే. గుణ వతులగు రాజుకుమార్తె లట్టివారు కాదు, కనుక నా స్నేహమును గూర్చి అన్యథా తలచకుము అని కళింగసేన వివరించినది. సోమప్రభ తాను మరల వచ్చెదనని ఆకాశ మార్గమున వెళ్ళిపోయినది. అది చూచి తన సఖి దివ్యాంగన అని భావించి పూర్వము దివ్యాంగనలు మానవులతో చేసిరి కదా! అరుంధతి పృధు చక్రవర్తి కుమార్తెతో స్నేహము చేయలేదా? ఆమె యందలి ప్రీతిచే పృధువు సురభిని భూలోకమునకు తేలేదా? అతడు భ్రష్టుడై మరల దాని పాలు త్రాగి స్వర్గమును పొందలేదా? అని తర్కించుకొని మరల సోమప్రభ రాకకై ఎదురు చూడసాగినది.

# 6-3వ తరంగము

మరునాడు సోమప్రభ తన చెలియ వినోదమునకై ఒక శిల్ప చాతుర్య విశిష్టమైన పేటికను తెచ్చి బహూకరించినది. కళింగసేన దానిని సంతోష ముగా గ్రహించి సోమప్రభ వివరములను ప్రశ్నించెను. అందుకు ఆమె - "తాను గొప్ప శిల్ప విద్యాచతురుడు, విష్ణుభక్తుడూ అయిన మయా సురుని కుమార్తెనని తాము వింధ్యాటవి యందు మాయవివర మందిరమున నివసించుచుంటిమని చెప్పినది. తన అక్క "స్వయంప్రభ" బ్రహ్మచారిణి యని, తనను కుబేరుని కుమారుడైన "నలకూబరు" నకిచ్చి వివాహము చేసిరని వివరించెను. అనంతరము తాను తెచ్చిన "పేటిక" విశేషములను వివరించుచూ దానిని తెరచి అందలి బొమ్మలను చూపెను. కీలు నొక్కినంత

మాత్రమున ఒకటి పూలమాల తెచ్చెను. ఒకటి నాట్యము చేసెను. ఒకటి మంచినీరు తెచ్చెను. ఈవిధముగా చిత్రమైన ఆ పేటిక బహూకృతికి కళింగ సేన ఎంతో మురిసినది.

పిమ్మట సోమప్రభను తన తండ్రికి పరిచయము చేయగా దివ్యాంగనా స్నేహముతో తన కుమార్తె శ్రేయస్సు పొందగలదని భావించెను. రాజాజ్ఞ పొంది సోమప్రభ తన సఖి కళింగసేనను తన వెంట ఆకాశమార్గమున వింధ్యపర్వతము లందున్న తన గృహమునకు తీసుకువెళ్ళినది. అచట తన అక్క స్వయంప్రభను పరిచయము చేసినది. అచట సాయంత్రమందు వన వినోదము చేసి తిరిగి తన తక్షశిలను చేరుకున్నది. జరిగినది తన తల్లిదండ్రులకు చెప్పి వారి నానందపరచెను.

## 6-4వ తరంగము

ఒకనాడు "కళింగసేన" తన ఉద్యానమున విహరించుచుండగా "మదనవేగుడ"ను విద్యాధరుడు చూచి ఆమె సౌందర్యమునకాకర్షితుడై ఆమెను పొందగోరి శివుని అనుగ్రహమునకై తపస్సు చేసెను. అంతట శివుని ఆనతి వలన – "ఆమె సోమప్రభ వలన" వత్సరాజును వరించుటకు నిశ్చయించుకొన్నదని, కనుక ఆ స్వయంవరము జరుగులోపల వత్సరాజు రూపమున వెళ్ళి గాంధర్వవిధిని కళింగ సేనను వివాహము చేసుకొనమని" ఉపదిష్టుడయ్యెను. కళింగసేన తండ్రి "శావస్తి"ని పాలించుచున్న ప్రసేన జిత్తునకు తన కుమార్తెనిచ్చుటకు నిశ్చయించుకొనెను. సోమ ప్రభ ఒకనాడు కళింగసేనతో నరవాహనదత్తుని తండ్రి వత్సరాజు సౌందర్యమునకు మన్మథుడు సాటిరాడు. అతనిని భర్తగా పొందమని సలహానిచ్చినది. తల్లి దండ్రుల యధీనమున నున్న తనకు అదెట్లు సంభవమని కళింగసేన ప్రశ్నించగా – అంతా దైవాధీనమని అందుకు నిదర్శనముగా సోమప్రభ ఈ కథ చెప్పినది.

# తేజస్వతి కథ

పూర్వము "ఉజ్జయిని" యందు విక్రమసేనుడను రాజు కలడు. అతనికి "తేజస్వతి" అను అందమైన కుమార్తె కలదు. ఆమెకు ప్రాయము వచ్చినది. కాని ఏ రాజకుమారుడు నచ్చుటలేదు. ఒకనాడు మేడపై నుండి ఒకనిని చూచి దైవవశమున అతనిని పొందగోరి దేవాలయమునకు రాత్రి రమ్మనమని చెలికత్తె ద్వారా సందేశమంపెను. కాని అతడు రాచవ్యవహార మని తలచి భయపడి అక్కడకు వెళ్లలేదు. కాని సోమదత్తుడను రాజ కుమారుడు దాయాదులచే రాజ్యము అపహరింపబడి ఉజ్జయినీ రాజు సహాయము కోరుటకై వచ్చి ఆ రాత్రి ఆ దేవాలయమును చేరెను. తేజస్వతి నాటి రాత్రి దేవాలయమునకు వచ్చి మనోహరుడగు సోమదత్తుని చూచి మోహించి అతనిని వలచినది. ఇరువురూ పరస్పరము అంగీకరించుకొనిరి. మరునాడు సోమదత్తుడు విక్రమసేనుని వద్దకు వెళ్ళి సైన్యసహాయ మర్థించెను.

పిమ్మట అతని సహాయముచే తన రాజ్యము పొంది, తేజస్వతిని వివాహము చేసుకొని సుఖముగా నుండెను. కనుక దైవబలము అను కూలించినచో ఎన్ని ఆటంకములు వచ్చిననూ దూదిపింజలవలె ఎగిరి పోవును. అధైర్యపడవలదని చెప్పి సోమప్రభ వెళ్ళిపోయినది.

# 6-5వ తరంగము

ప్రసేనజిత్తుతో తన వివాహము చేయుటకు ప్రయత్నించుచున్న తండ్రిని చూచి కళింగసేన ఖేదముతో సోమప్రభ సహాయము కోరెను. తన చెలికి సహాయము చేయుటకు ఆమె నిశ్చయించుకొని తన విమానమున ఆమెను తీసుకుని వత్సరాజు ఉద్యానవనమును చేరినది. అచట వత్స రాజును చూచిన కళింగసేన మదనతాపము చెంది వెంటనే అతనితో

సంప్రదించమని కోరగా - సోమప్రభ-నేడు కాదు. నేను ఉపాయము పన్ని ఏర్పాటు చేసెదను. నీవు ఇచటనే జాగ్రత్తగా ఉండుము. రేపు నేను వచ్చెదనని చెప్పి వెళ్ళి పోయినది. కాని ఆలస్యము సహించలేని కళింగసేన - తన వృత్తాంతమంతయూ ప్రతీహారునికి తెలిపి వత్సరాజునకు సందేశమంపించినది. వత్సరాజు ముల్లోక సౌందర్యవతి అయిన కళింగ సేనను గూర్చి విని యున్నందున మంత్రిని పిలిచి వెంటనే వివాహమునకు శుభముహూర్తము నిర్ణయించమనెను.

కాని యౌగంధరాయణుడు ఈ వివాహము జరిగినచో వాసవదత్తా - పద్మావతులు మనోవ్యాధి పీడితులగుదురని ఎట్లైనా వివాహము తప్పించుటకు ఆలోచన చేయవలెనని భావించి - "ప్రస్తుతము ఆ రాజకుమార్తెకు వాసగృహము - దాస దాసీజనము - వస్త్రాభరణములిచ్చి సత్కరింతము. మంచి ముహూర్తమునకై జ్యోతిష్కులను సంప్రదించెదనని" బదులు చెప్పి తాత్కాలికముగా రాజును శాంతపరచెను. కాని వత్సరాజు మాత్రము ఆమె సౌందర్యమునే భావించుచూ ఆ రాత్రి వాసవదత్త - పద్మావతుల వద్దకు వెళ్ళకుండా మన్మధసంతప్తుడై నిద్రలేక జాగరణ చేసెను. పద్మావతీ - వాసవదత్తా - యౌగంధరాయణులు కూడా ప్రతిక్రియ ఎట్లు చేయవలెనా? అని ఆలోచించుచూ నిద్రలేని వారైనారు.

# 6-6 తరంగము

అనంతరము మంత్రిచేత ముందుగానే జ్యోతిష్కులు ప్రేరితులగుటచే వివాహముహూర్తము ఆరు నెలల వరకూ మంచిది లేదని, ఆగక తప్పదని చెప్పిరి. వత్సరాజు చేయునది లేక సరేయనెను. ఇలా కొంతకాలమునకు వాయిదా వేసి యౌగంధరాయణుడు తన బ్రహ్మరాక్షస మిత్రుడగు యోగేశ్వరుడను వానిని స్మరించెను. అతడు ప్రత్యక్షమై కారణమును ప్రశ్నించెను.

వత్సరాజు వృత్తాంతమును చెప్పి, కళింగసేనను ఎవరైనా వరించినారా? లేదా? ఆమెను రహస్యముగా పరిశీలించుమని అజ్ఞాపించెను. కళింగసేన యందలి దోషమును వివరించి వత్సరాజు హృదయమును ద్వేషపూరితము చేయుట మంచిదని మంత్రి పన్నాగము. బ్రహ్మరాక్షసుడు తన మాయ ప్రభావముచే కళింగసేన గృహమును ప్రవేశించెను.

ఒకనాడు శివుని మెప్పించి కళింగసేనను వివాహము చేసుకొనుటకు ప్రేరితు డైన విద్యాధరుడైన 'మదనవేగుడు' వత్సరాజు రూపమును ధరించి ఆమె మందిరమున ప్రవేశించి గాంధర్వ విధిన వివాహము చేసుకొని ఆమెతో సుఖించెను. మాయా ప్రభావముతో నున్న బ్రహ్మ రాక్షసుడు ఇది గమనించి, యౌగంధరాయణునికి తెలిపెను.

అపుడు మంత్రి వత్సరాజును సమీపించి – రాజా! ఆమె స్వైరిణి, ఈమె ప్రసేనజిత్తును చూచి వివాహవిముఖురాలై రూపలోభముచే నిన్ను చేరినది. పరపురుషునితో క్రీడించుచున్నది, రండు! పరిశీలించుడని చెప్పి రహస్యముగా కళింగసేన మందిరమున ఇద్దరూ ప్రవేశించిరి. అచట తన రూపముతో ఆమె ప్రక్కన శయనించి యున్న మదనవేగుని రాజు చూచెను. అతనిని బంధించుటకై ప్రయత్నింపగా అతడు మేల్కొని తన విద్యా ప్రభావముచే ఆకాశమునకు ఎగిసిపోయెను. కళింగసేన మేల్కొని ఏల మంత్రితో మరల వచ్చితిరి? అని వత్సరాజును ప్రశ్నించెను. యౌగంధ రాయణుడు ఆమెతో – కళింగసేనా! మాయావత్సరాజు రూపములో ఎవరో నిన్ను మోసగించి పరిణయమాడిరి. వత్సరాజు ఇచ్చటకు వచ్చుట ఇదే ప్రథమమని చెప్పి – వారు తిరస్కార భావముతో వెడలిపోయిరి.

అంతట ఆమె బాణము తగిలిన లేడివలె ఆర్తనాదము చేసి, అయ్యో! ఎవరు నన్ను మోసగించిరి? అని విలపించుచుండగా, ఆకాశము నుండి

కేయూరహారములు ప్రకాశించుచుండగా విద్యాధరుడు మదనవేగుడు వచ్చి ఆమెను ఓదార్చి శివుని ఆదేశమును, తన ప్రేమను వివరించి ఆమెను ఓదార్చెను. అతనిని చూచి, అతని మాటలు విని కళింగసేన కొంత ఊరట చెందినది. ఆ విషయమంతయును వత్సరాజు నకు నివేదించి మదనవేగుని అనుమతితో ఆమె ఆ మందిరము నందే నివసించి యుండెను.

## 6-8వ తరంగము

కళింగసేనా సౌందర్యమునకు వ్యామోహితుడైన వత్సరాజు ఒకనాడు ఆమె మందిరమునకు వచ్చి తనకు భార్యగా ఉండుమని ప్రార్థించెను. ఆమె తాను మదన వేగునిచే గాంధర్వ విధిగా పరిణీతనని, కులకాంతను ఇట్లు బలాత్కరించుట మీ వంటి వారికి తగదని, అలా చేసినచో ఇరువురమూ నరకము పొందెదమని హితవు చెప్పినది. వత్సరాజు ధర్మజ్ఞుడగుటచే పశ్చాత్తాపముతో వెనుతిరిగి పోయెను.

కొంతకాలమునకు ఆమె గర్భవతి అయినది. మదనవేగుడు ఆమెతో గర్భవతి అయినచో ఇక తాను ఆమెను దివ్యశక్తులతో పొందలేనని, సంతానమును జాగ్రత్తగా కాపాడుకొనుమని బోధించి ఆమె తనను స్మరించినంతనే వచ్చెదనని పలికి వెడలిపోయెను. అనంతరము రతీదేవి తన భర్త మన్మథుడు, భూలోకమున నరవాహన దత్తుడుగా జన్మించెనని తెలుసుకొని, బ్రహ్మవర ప్రభావముచే అతనిని అయోనిజగా పొందుటకు కళింగసేన కుమార్తెగా ఉండుమని శివుడాజ్ఞాపించెను.

కళింగసేన ఒక శుభముహూర్తమున పుత్రుని ప్రసవించినది. దేవ మాయచే ఆ పుత్రుని అపహరించి, ఆ స్థానమున రతిని శిశువుగా అచట ఉంచబడినది. అందరూ కుమార్తెయే పుట్టినదని భావించిరి. సాటిలేని

సౌందర్యముతో నున్న పుత్రికను చూచి కళింగసేన పుత్ర జననము కంటే ఎక్కువ సంతోషముతో గొప్ప ఉత్సవమును జరిపించెను. ఆ శిశువునకు 'మదనమంచుక' యని పేరు పెట్టిరి. చిన్నతనము నుండీ నరవాహనదత్తుడు, మదనమంచుకా ఎంతో స్నేహానురాగములు కలిగి యుండేవారు.

కాలాంతరమున వత్సరాజు తన కుమారునకు యువరాజ్య పట్టాభిషేకము చేసెను. యౌగంధరాయణుని కుమారుడైన మరుభూతిని మంత్రిగాను, రుమణ్వంతుని కుమారుని హరిశిఖుని సేనాధిపతిగాను, వసంతక సుతుని తపంతకుని క్రీడాసఖుని గాను, ఇత్యకుని పుత్రుని గోముఖుని ప్రతీహారునిగాను, పింగళికాపుత్రులను, పురోహితుని యన్న కుమారులను వైశ్వానశాంతిసోములను పురోహితులుగాను నియమించెను.

కళింగసేన సఖి అయిన సోమప్రభ కూడా వచ్చి మదనమంచుక విహారార్థము నందనమును తలదన్ను చక్కని ఉద్యానవనమును తన శక్తిచే నిర్మించెను. మరునాడు ఉదయము ఆకస్మికముగా ఆవిర్భవించిన వనమును చూచి అందరూ ఆశ్చర్యమును, ఆనందమును పొందిరి. ఉద్యానమందు రాజకుమారుడు మదన మంచుకను కలుసుకొనెడివాడు.

కొన్ని రోజుల పిమ్మట వత్సరాజు-కళింగసేనలు పరస్పరము సంప్రదించుకొని నరవాహన దత్తునికీ - మదన మంచుకకూ వివాహము చేసిరి. ఆ వివాహమహోత్సవములు చిరకాలము కొనసాగెను. వివిధ దిగంతముల నుండి చారణ-గాయక-నర్తకీ సమూహముచే రాజ్య మంతయూ సంగీతమయమై అమందానందము కలిగించెను. దంపతు లిరువురూ సుఖముగా కాలము గడుపుచుండిరి.

# 7-1వ తరంగము

నరవాహనదత్తుడు, దేవ - గంధర్వ - యక్ష - విద్యాధర - మానవ కన్యలను మొత్తము 27 మందిని, తన రూప - శౌర్య - గుణములతో జయించి ప్రేమానురాగవర్తియై - వివాహము చేసుకొనెను.

**ఆ కథలను ముందుగా వివరించి అందున్న అవాంతర కథలను విడిగా గ్రంథ పరిశిష్టమునందు తెలుపుచున్నాను. అట్లుకానిచో కథ మధ్యలో కథలు, మరల వాటిలో ఉపకథలు, అవాంతర కథలతో "అసలు కథ" మరచిపోయే అవకాశం ఉన్నది. కనుక ముందు ప్రధానకథను, వివరించి అవాంతర కథలను చివరన విడిగా వ్రాస్తున్నాను. అందువలన కథా కథ నానికి విఘ్నం ఉండదు. అవాంతర కథలను విడిగా చదువుకొని ఆనందించ వచ్చు.**

**- మేడవరపు సంపత్‌కుమార్**

కౌశాంబియందు నరవాహనదత్తుడు సుఖముగా మదనమంచుకతో సంసారము చేయుచుండెను. ఒక వసంత సమయమున తపంతకుడను వయస్యుడు వచ్చి, అచ్చటకు కొద్ది దూరములో గల వనము నందు అశోక వృక్షము కింద అమిత సౌందర్యవతిని చూచితిని, ఆమె నిన్ను తీసుకురమ్మని వేడుకొన్నది. విషయము తెలుసుకొందము రమ్ము, అని చెప్పి రాజుని తీసుకువెళ్లెను. అచట అపూర్వ లావణ్యవతి అయిన ఒక దివ్యాంగన ఉన్నది. ఆమెను చూచి నరవాహనుడు మోహ పరవశుడయ్యెను. ఆమె వృత్తాంత మును ప్రశ్నించగా ఆమె ఇట్లు చెప్పినది. -

తాను రత్నప్రభ యను విద్యాధర కన్యనని, తన తండ్రి హిమాలయ పర్వతములలో గల కాంచన శృగమను నగరమును పాలించు హేమ ప్రభుడని, శివానుగ్రహము వలన తన తండ్రికి తానూ, తన అన్న వజ్ర ప్రభుడు సంతానముగా కలిగితిమని చెప్పెను. స్వప్నమున నరవాహనుని చూచి, దివ్యవాణీ ప్రబోధముచే స్వయముగా వరించ వచ్చితినని చెప్పెను.

అంతలోనే విద్యాధర ప్రభువైన హేమప్రభుడు ఆకాశము నుండి వచ్చి నరవాహనుని చూచి అతని ఆతిథ్యమును స్వీకరించెను. పిమ్మట వత్సరాజు అనుమతితో నరవాహనుని తన విమానముపై తన నగరమునకు తీసుకు వెళ్ళి రత్నప్రభతో ఘనముగా వివాహము జరిపించెను. నరవాహనుడు అచట దివ్య భోగముల ననుభవించుచూ, ఆమె విద్యాబలమున ఆకాశమున సంచరించుచూ విహరించుచుండెను. కొంతకాలము పిమ్మట రత్నప్రభా సమేతుడై తన నగరమును చేరి అందరినీ ఆనందపరచెను.

# 7 - 2

నరవాహనదత్తుడు, ప్రతీహారుడైన గోముఖుని ద్వారా అనేక రసవత్తరమైన 'కథ'లను రత్నప్రభ, మదనమంచుకా సహితుడై వినుచూ సుఖముగా కాలము గడుపుచుండెను. కొన్ని సమయములందు మంత్రియైన మరుభూతి చక్కని రాజనీతి గల 'కథల'ను వినిపించెడివాడు. మరికొన్ని సమయములందు సేనాధిపతి అయిన మిత్రుడు హరిశిఖుడు కొన్ని గాధలను చెప్పుచుండెడివాడు. ఇక వయస్సుడైన విదూషక తపంతకుడు కూడా తన కథాచాతుర్యముతో రాజ దంపతులను ఆనందపరచెడివాడు.

**(కథాసరిత్సాగరమునందు ప్రధాన నాయకుడు అయిన నర వాహన దత్తుని కథ, విస్తారముగా వర్ణించబడినది. తరంగములలో మధ్యలో కొన్ని ఉపాఖ్యానములు, కథలు, వర్ణనలు ఉన్నవి. కథ ముఖ్య ముగా గ్రహించి పాఠకులు సులభముగా అర్థము చేసుకొనుటకు మధ్య లోని కథా భిన్నమైన ఉపాఖ్యానములు, కథలు విడిచిపెట్టి ముఖ్య కథకు భంగము రాకుండా పాఠకులు అవగతము చేసుకొనుటకు దీనిని ముఖ్యముగా వివరించడమైనది. ఆ మిగిలిన ఉపాఖ్యానములు, కథలు, భేతాళకథలు, మరొక భాగముగా త్వరలో ప్రచురించగలము. కనుక 7వ లంబకములో 2వ తరంగము తరువాత కథ 8వ లంబకమునందు కొనసాగించడమైనది.)**

# 7-8

ఒకనాడు నరవాహనుడు వేటకు బయలుదేరెను. అచట ఒక తాపసి స్త్రీ వలన "కర్పూరిక" యను రాజపుత్రిక సముద్రమున కావలి ద్వీపము నందున్నదని తెలుసుకొని సాహసముతో ఆమెను పొందగోరి బయలుదేరెను. గోముఖుడు వలదని వారించిననూ వినలేదు, ఇక చేయునది లేక భృత్యు లందరూ కూడా నరవాహనుని అనుసరించి బయలుదేరిరి. వత్సరాజు తన కుమారుడు వేట నుంచి ఇన్ని దినములైనా రాలేదేమా? యని విచారించుచుండగా, రత్నప్రభ తన విద్యాప్రభావముచే కర్పూరిక కొరకు అతడు బయలుదేరి వెళ్లెనని తెలుసుకొని, అతని క్షేమ సమాచారమును మామగారికి తెలిపి ఊరడించెను.

నరవాహనుడు, గోముఖుడు అరణ్యము నందు అలా ప్రయాణము చేయుచునే యుండిరి. ఒకనాటి-రాత్రి ఒక సింహము వారిపై దాడి చేయగా గోముఖునిచే హెచ్చరింపబడి చెట్టు నెక్కిరి. అపుడు ఆ సింహము గుఱ్ఱము లను చంపివేసినది. మరునాడు మిత్రులిద్దరూ కాలినడకన బయలుదేరిరి. మార్గాయాసము తెలియకుండా గోముఖుడేవో కథలు చెప్పెడివాడు.

ఒకనాడు ఉదయమున నరవాహనుడు రాత్రి వచ్చిన స్వప్నమును ఇట్లు వివరించెను. "మిత్రమా! తెల్లవారు ఝూమున తెల్లని వస్త్రములు ధరించిన ఒక కన్య సముద్ర తీరమందు "కర్పూర సంభవ"మను తీరమును త్వరలో చేరగలవు. అచట "కర్పూరిక" యను రాజకుమార్తెను పొందగలవు. అని చెప్పినది - అని మిత్రుని ఉల్లాసపరచెను.

త్వరలోనే ఒక గొప్ప నగరమును చేరారు. అచట యంత్రముల వలె నున్న పరివారమును, వారి మధ్యనున్న ఒక మానవుని చూచారు. వివరములు ప్రశ్నించగా అతడు - తన పేరు రాజ్యధరుడని, తన అన్న ప్రాణధరుడని తామిద్దరూ దక్షిణ దేశమునందున్న 'కాంచీ' నగరములో

మాయాయంత్ర నిర్మాణ కుశలురగు శిల్పులమని చెప్పెను. కుమారస్వామి అనుగ్రహమున తాను ఇచట సుఖముగా నుంటినని తెలిపి ఇద్దరినీ చక్కగా ఆదరించెను. మరునాడు రాజ్యధరుడు నరవాహనునికి తాను తయారు చేసిన వాయుయంత్రము నిచ్చి సముద్రమును దాటి "కర్పూర సంభవ" పురమును చేరమని సహాయము చేసెను.

కొంతకాలమునకు ఆ విమాన సహాయమున ఆ పురము చేరిరి. అచట ఒక పూటకూళ్ల యింటి యందు నివాసమేర్పరచుకొని అచట నున్న వృద్ధురాలిని రాజ విహారమును ప్రశ్నించెను. '

'ఆ నగరమును కర్పూరకుడను రాజు పాలించుచుండెనని, శివుని అనుగ్రహము వలన భార్య అయిన 'బుద్ధికర్యా' యందు 'కర్పూరిక' యను కూతురును పొందెనని, ఆమె భర్త విద్యాధర సామ్రాట్టు అగునని అశరీరవాణి పలికినదని, కాని కర్పూరిక పురుషద్వేషిణిగా మారినదని" చెప్పినది. అంతే గాక కర్పూరిక తన పూర్వ జన్మ వృత్తాంతమును ఆ వృద్ధురాలి కుమార్తెకు చెప్పినదని ఆ వివరమునిట్లు చెప్పినది.

"పూర్వ జన్మమున చందన వృక్ష ప్రాంతమందు గల ఒక సరస్సులో తాను హంసినని తన భర్త రాజహంసయని, ఒకనాడు ఒక వరదలో తమ పిల్లలు కొట్టుకొని పోగా, తన భర్త గతించిన వారి కొరకు విచారమనవ సరము, మనకు మరల పిల్లలు కలుగవచ్చు, అని పలుకగా ఛీ! పురుషులు పాపాత్ములని భావించి, శరీర త్యాగము చేయనెంచి మరుజన్మలో జాతిస్మరత గల రాజపుత్రిక నగుదును గాక! అని నిశ్చయించుకొని సముద్రమున బడి ప్రాణత్యాగము చేసితిని. కనుక వివాహమనిన నాకు ఇష్టము లేదు - అని చెప్పిందట.

మరునాడు నరవాహనుడు గోముఖునితో రహస్యముగా కర్తవ్యము నాలోచించి, తాను ఒక సన్యాసి వేషమును ధరించి జనులందరూ చూచు

చుండగా, రాజద్వారమున కేగి "అయ్యో హంసీ! అయ్యో హంసీ! అనుచు తిరుగుచుండెను. చెలికత్తెల వలన ఈ వృత్తాంతమును విని అతనిని, అతని ప్రక్కనున్న గోముఖుని తన సముఖమునకు పిలుపించుకొని 'కర్పూరిక' వివరములు ప్రశ్నించినది. అంతట చెంతనున్న గోముఖుడిట్లనెను. –

'దేవీ! ఇతడు పూర్వజన్మమున ఒక రాజహంస. తన పిల్లలు జల ప్రవాహమందు కొట్టుకొని పోవుటచే, భార్య విరక్తయై ప్రాణత్యాగము చేసినది. ఇతడునూ శివుని ధ్యానించి జాతిస్మరత గల రాజకుమారునిగా జన్మించెను. కాబోవు విద్యాధర చక్రవర్తి నరవాహన దత్త మహారాజితడే. కౌశింబి యందు మదనమంచుక, విద్యాధర కుమార్తె రత్నప్రభలతో నున్ననూ గత జన్మమున గల భార్యను స్మరించుచూ ఇలా బయలుదేరినాడు" అని వివరించగా "కర్పూరిక" తాను వృధాగా విరక్తురాలనైతిని. జన్మాంతమున కూడా తన భర్త తననే తలచుచున్నాడని ప్రేమ పరవశమై అతనిని వివాహము చేసుకొనుటకు నిశ్చయించుకొనెను.

ఒక శుభముహూర్తమున రాజానుమతితో వారిరువురు వివాహితులై సుఖముగా కొంతకాలము గడిపిరి. ఒకనాడు నరవాహనుడు 'కౌశాంబి' వెళ్లుదమని కర్పూరికకు సూచించగా, ఆమె తమ వద్ద నున్న ప్రాణధరుడను శిల్పిని రప్పించి ఒక గొప్ప విమానమును చేయించెను. నరవాహనుడు అతనిని రాజ్యవర్ధన సోదరునిగా గుర్తించి తమ పరిచయ వృత్తాంతమును తెలిపెను. పిమ్మట మామ గారిచ్చిన అనేక ధన రత్న భూషణాధులతో విమానమున బయలుదేరి కౌశాంబి చేరి తల్లిదండ్రులకు, భార్యలకు మిత్రులకు సంతోషము కలిగించెను. మార్గమధ్యమున రాజ్యధరుని, తనతో బాటుగ ప్రాణధరుని కూడా కౌశాంబిని తీసుకొని వచ్చి వారికి చక్కని గృహ–ధన సుఖములు కల్పించి ఎంతో ఆదరించెను.

# 8-1

ఒకనాడు నరవాహనుడు సభలో నుండగా ఆకాశము నుండి దివ్య రూపధరు డొక పురుషుడు వచ్చి తాను హిమవంతముపై గల వజ్రకూటము నందు విద్యాధర రాజైన వజ్రప్రభుడను వాడనని, వత్సరాజు సుతుడు మన్మధాంశతో జన్మించిన నరవాహనుడు ఉభయ వేద్యర్ధ విద్యాధరులకు చక్రవర్తి యగునని తెలుసుకుని దర్శనార్ధము వచ్చితినని చెప్పెను. అంతట నరవాహనుడు ఎంతో ఆదరముతో ఆతిధ్యమిచ్చి గౌరవించెను.

పూర్వము ఒక కల్పమున మనుష్యుడైననూ శివానుగ్రహము వలన "సూర్యప్రభు"డను వాడు విద్యాధర చక్రవర్తి అయ్యెనని, కాని అతడు దక్షిణ వేద్యర్ధమునకు మాత్రమే ప్రభువు, ఉత్తర వేద్యర్ధమునకు అపుడు శృతశర్మ యనువాడు చక్రవర్తి. కాని అతి పుణ్యాత్ములగు మీరు ఉభయ వేద్యర్ధములకూ కల్పస్థాయి చక్రవర్తులగుచున్నారని అభినందించెను.

అంతట నరవాహనుడు కుతూహలముతో 'పూర్వము మనుష్యుడై ననూ' సూర్యప్రభు డెట్లు విద్యాధరుడయ్యెనో వివరించమని కోరెను. అపుడు వజ్రప్రభుడు ఏకాంతమున దేవేరుల, మంత్రుల సమక్షములో ఆ కథను వివరించెను.

**(పై క్రింది లంబకములు, తరంగముల మధ్య ఏవిధమైన ప్రధాన కథాంశములులేని కారణముగా వాటిని విడిచిపెట్టడమైనవి) -రచయిత**

# 9-1

నరవాహనుడు కౌశాంబి యందు సుఖముగా కాలము గడుపుచూ ఒకనాడు వేటకు బయలుదేరెను. గోముఖునితో కలసి మహారణ్యమును ప్రవేశించెను. అక్కడ చక్కని వీణానాదము వినిపించినది. ఆ ధ్వని వచ్చిన వైపు వెళ్ళగా ఒక శివాలయము కనిపించినది. అందు పరిచారికా సమేతు రాలై వీణ వాయించుచున్న ఒక దేవకన్యను చూచెను. గోముఖుడు ఆమెను గూర్చి చెలికత్తెలను ప్రశ్నించగా -

"హిమవంతమున శ్రీ సుందరపురమున అలంకారశీలుడను విద్యాధర రాజు, కుమార్తె 'అలంకారవతి' యని, ఈమె సోదరుడు ధర్మశీలుడని కాబోవు విద్యాధర చక్రవర్తి అయిన నరవాహనునితో వివాహము కొరకు కాశ్మీరములోని స్వయంభూ శివాలయమున, తదితర ముఖ్యములైన నందిక్షేత్రము - మహాదేవగిరి - అమరపర్వతము - సురేశ్వరాద్రి - విజయము - కపటేశ్వరమున ఈ క్షేత్రమున శివుని అర్చించుచున్నది - అని చెప్పెను.

అంతట అచటనే ఉన్న అలంకారవతి తల్లి 'కాంచన ప్రభ' ఇతడే నర వాహనుడని తెలుసుకుని 'ఆడబోయిన తీర్థ మెదురైనట్లు' భావించి తన కుమార్తెను పరిణయమాడుమని రాజును అభ్యర్థించినది. అతడును సరేయని యంగీకరించి అలంకారవతిని పరిగ్రహించెను.

పిమ్మట నరవాహనుడు గోముఖునితో 'కౌశాంబి' చేరెను. అలంకార వతి తండ్రి అలంకారశీలుడు తనవారితో కౌశాంబి చేరి వత్సరాజును కలసి తన వృత్తాంతమును చెప్పి తన కుమార్తెను కోడలిగా గ్రహించమని అభ్యర్థించెను. వత్సరాజు తన కుమారుని అభ్యుదయము కోరి ఆ సంబంధము నంగీకరించి అలంకారవతి - నరవాహనుల వివాహము జరిపించెను.

# 9-2

నరవాహనుడు నూతన భార్యయైన అలంకారవతితో, ఆమె చెటికల దేవ నృత్యములతో రంజిల్లుచూ, తన మిత్రులతో మధుపానము చేయుచూ పితృగృహమున సుఖముగా కాలము గడుపుచుండెను. ఒకనాడు అతని అత్తగారైన కాంచన ప్రభ వచ్చి తన విద్యాధర నగరమునకు వచ్చి కొంత కాలము గడుపుమని కోరగా, తండ్రి ఆనతి తీసుకుని వసంతకాది మిత్రులతో విమానమధిరోహించి నభోమార్గమున బయలుదేరెను. కిన్నరగీతములచే ప్రతిధ్వనించుచూ సుందర హిమవంతమున ఆశ్చర్యకర ప్రకృతి దృశ్యములను చూచుచూ సుందరపురము చేరి దివ్యభోగముల ననుభవించసాగెను. గంగాసరమను తీర్థమున భార్యా సమేతుడై స్నానమాచరించి అచట నున్న శివుని అర్చించి, కొంతకాలమైన పిమ్మట అలంకారవతీ సమేతుడై తన నగరమును చేరి తల్లిదండ్రులను ఆనందపరచెను.

**(పై క్రింది లంబకములు, తరంగముల మధ్య ఏవిధమైన ప్రధాన కథాంశములులేని కారణముగా వాటిని విడిచిపెట్టడమైనవి) -రచయిత**

# 10-3

ఒకనాడు నరవాహనుడు ఉద్యానవనమున విహరించుచుండగా ఆకసము నుండి కిందకు దిగుచున్న కాంతిపుంజమును, అనంతరము అనేక మంది విద్యాధర వనితలను చూచెను. వారి నడుమ చుక్కలలో చంద్రునివలె మెరయుచున్న కన్యను గమనించి ఆమె వద్దకు చేరి వివరములను అడిగెను.

హిమాచలమున కాంచ శృంగమనుపురము కలదు. దాని ప్రభువు "స్ఫటికయశుడు" అను పేరుగల విద్యాధరుడు అతని భార్య యగు హేమప్రభ యందు గౌరి అనుగ్రహము వలన "శక్తియశ" యను నేను కుమార్తెగా జన్మించితిని. అయిదుగురు అన్నల వెన్నుదన్ని పుట్టితిని. గౌరీ వరప్రసాదము వలన జన్మించితినని నా తండ్రి నన్ను ప్రాణ సమానముగా చూచును. నా పూజలకు సంతసించిన దేవి – నేను నరవాహనుని భార్య అయ్యెదనని చెప్పినది.

నిన్నటి రాత్రి కలలో పరమేశ్వరి కలలో కనబడి "పుత్రీ! నీవు వెళ్ళి నీ భర్తను చూచి ఈ దినమే తిరిగిరమ్ము. ఒక నెల రోజులలో నీ తండ్రి కిట్టి సంకల్పమే కలిగి వివాహము చేయగలడు' అని చెప్పి అదృశ్యమయ్యెను. రాత్రియు గతించినది.

ఆర్యపుత్రా! ఇదీ జరిగిన విషయము. ఇక నేను వెళ్ళి వచ్చెదను. అని చెప్పి సఖీజనముతో శక్తియశ వెళ్ళిపోయినది. నర వాహనుడు ఆమెతో వివాహోత్సుకుడై నెల ఎప్పుడు గడచునా అని యుగ సదృశముగా భావించుచూ దినములను భారముగా గడుపుచుండెను. గోముఖుడు వచ్చి వినోదమునకై కథలను చెప్పుచుండెను.

నెలదినముల తరువాత "స్ఫటికయశుడు" తన కూతురు నీయదలచి కౌశాంబి చేరి వత్సరాజును సంప్రదించెను. వత్సరాజతనికి అర్ఘ్యపాద్యాదులచే అతిథి పూజ గావించెను. విద్యాధరేంద్రుడను సిద్ధి ప్రభావముచే దివ్య వైభవ నిధిని క్షణములో కల్పించెను. రత్న సమూహములతో పూర్వమే తాననుకొన్న తన కూతురు 'శక్తియశ'ను శాస్త్రోక్తముగా నరవాహనునికి అర్పించెను. సూర్యకాంతిని పొందిన పద్మము వలె వారు శోభిల్లిరి. పిమ్మట శక్తియశతో కూడి నరవాహనుడు అమరభోగములను అనుభవించసాగెను.

**(పై క్రింది లంబకములు, తరంగముల మధ్య ఏవిధమైన ప్రధాన కథాంశములులేని కారణముగా వాటిని విడిచిపెట్టడమైనవి) -రచయిత**

# 11-1

ఒకనాడు నరవాహనుని వద్దకు దూరప్రాంతమున ఉన్న వైశాఖ పురము నుండి రుచిరదేవుడు - పోతకుడు అను ఇద్దరు రాజపుత్రులు వచ్చిరి. ఒకరివద్ద వేగము కల పిడి ఏనుగు కలదు, మరొకరి వద్ద వేగము గల రెండు గుర్రములు కలవు. వీటిలో తమది వేగము కలదని ఒకరు, దానికంటే వేగము కలది తమ గుర్రములని ఒకరు తగవులాడుకొని న్యాయ పరిష్కారమునకై నరవాహనుని ఆశ్రయించిరి. అంతట వారి కోర్కె మన్నించి వారి తగవు తీర్చుటకు వారి నగరమును చేరెను. అచట వారి చెల్లెలు అనుపమాన సౌందర్యవతి "జయేంద్రసేన" ను చూచి రాజు మోహ పరవశుడయ్యెను.

మరునాడు పోతకుడు తెచ్చిన గుర్రముల జంటను రుచిరదేవుడు తెచ్చిన పిడి ఏనుగును జూచి విద్యావిశారదుడైన యువరాజు ఏనుగు నధిరోహించి వేగ పరీక్షలో గుర్రములను జయించెను. వారి సంశయము తీరినది. నరవాహనుని యందు మరులుగొన్న 'జయేంద్రసేన'ను నర వాహనుని కిచ్చి వివాహము చేసి సోదరులిద్దరూ తమ పిడి ఏనుగు - రెండు గుర్రములనూ బహూకరించిరి. పిమ్మట ఆమెనూ, గజాశ్వములనూ తీసుకుని బావమరదులతో కలసి నరవాహనుడు కౌశాంబి చేరెను. అచట ఆమెతో సుఖించుచూ, మదనమంచుక - రత్నప్రభాది భార్యలతో కూడా సంతోషముగా నుండెను.

**(పై క్రింది లంబికములు, తరంగముల మధ్య ఏవిధమైన ప్రధాన కథాంశములులేని కారణముగా వాటిని విడిచిపెట్టడమైనవి) -రచయిత**

# 12-1

కౌశాంబియందు నరవాహనుడు శ్రీకృష్ణుని వలె బహు భార్యలతో నున్ననూ శ్రీకృష్ణుడు రుక్మిణిని ఆదరించినట్లుగా మదనమంచుకను ప్రాణాధిక ప్రియురాలిగా భావించుచుండెను. ఒకనాడు దివ్యకాంత తనను తీసుకుపోవుచున్నట్లు కలగాంచి, మేల్కొని చూడగా ఒక గొప్ప కొండ చరియ ప్రాంతమున చెట్టునీడన గారుడమణి శిలాతలమున ఉన్నట్లు తెలుసుకొనెను. ప్రక్కనే ఒక దివ్యాంగన యున్నది. వెంటనే నరవాహనుడు ఆమె ఏమి చేయునో చూతమని నిదుర నటించెను. నిదురలో పల వరించినటుల –"ప్రియా! మదనమంచుకా! ఇలా రా! వెచ్చని నీ కౌగిలిలో నను బంధించు" అని పలికెను.

అది విని ఆమె అవకాశమును ఉపయోగించుకొనదలచి సిగ్గును ప్రక్కనుంచి అతని ప్రియురాలి రూపము దాల్చి అతనిని కౌగిలించుకొనెను. అంతనాతడు కన్నులు తెరిచి ప్రియురాలి రూపమున నున్న ఆమెను చూచి "ఔరా! ఏమి ఈ విదగ్ధత? అని పలికి నవ్వుచూ ప్రతి కౌగిలించెను.

పిమ్మట ఆమె తన నిజరూపమును దాల్చి "ఆర్యపుత్రా! స్వయముగా మిమ్ములను వరించి వచ్చిన నన్ను పరిగ్రహింపుము. నాపేరు "లలితలోచన" ఇది రజతకూటమను మలయపర్వత శిఖరమున ఉన్న ఒక నగరము. తన తండ్రి మానవుడైననూ 'ఖడ్గసిద్ధి' పొంది విద్యాధరుడయ్యెనని" పలికినది.

నరవాహనుడు తన యందనురక్తురాలై తన విద్యా ప్రభావముచే తనను హరించి, వరించిన విరిబోణిని పరిత్యజించరాదని భావించి ఆమెను పరిగ్రహించి, పరిపరివిధముల సరససల్లాపములతో సుఖించుచుండెను. ఇచట వత్సరాజాదులు రత్నప్రభాదుల విద్యాప్రభావముచే నరవాహనుని వృత్తాంతము తెలుసుకొనిరి.

# 12-2

నరవాహనుడు "లలితలోచన"తో కూడి మలయపర్వత మందు మనోహర మధుమాస మకరంద భావముల తేలుచూ సుఖముగా విహరించుచుండెను. ఒకనాడొక చోట పూలుగోయుచూ చెట్ల గుబురులలో లలితలోచన కనుచూపు మేర దాటిపోయెను. ఆమెను వెతుకుచూ నరవాహనుడొక సరస్సును చేరి అందు స్నానమాచరించి, దేవతానుష్ఠానము గావించి మంచిగంధపు చెట్టు నీడ విశ్రమించెను.

కౌశాంబి యందున్న మదనమంచుకను తలచుకొని కామాగ్ని ప్రజ్వరిల్లి వేదనచే మూర్ఛితుడయ్యెను. ఆ సమయమున స్నానము చేయుటకై "పిశంగజటుడ"ను ముని అచ్చటికి వచ్చి రాజకుమారునికి ఉపచారములు చేసి, ఓదార్చి తన ఆశ్రమమునకు తీసుకువెళ్ళి ఆతిథ్యమిచ్చెను.

పిమ్మట ధీరస్థైర్యములు పెంపొందింప తలచి "మృగాంకదత్తు"ని కథను చెప్పెను (ఈ కథ గ్రంథాంతమున పరిశిష్ట భాగమందు వివరించ బడినది – మేడవరపు సంపత్‌కుమార్) మృగాంకదత్తుడెట్లు అనేక కష్టములు పొంది శశాంకవతిని పొందెనో నీవును నీ ప్రియురాలిని పొందగలవని ఊరడించెను. నరవాహనుడు శాంతించెను.

**(పై క్రింది లంబకములు, తరంగముల మధ్య ఏవిధమైన ప్రధాన కథాంశములులేని కారణముగా వాటిని విడిచిపెట్టడమైనవి) - రచయిత**

# 14-1

ఒకనాడు నరవాహనుడు తన పట్టమహిషి అయిన మదనమంచుకను, ఆమె పరివార జనమును అంతఃపురమున ఎచ్చటను కానక ఆందోళన చెందెను. భృత్యులెంత వెతికిననూ ప్రయోజనము లేకపోయెను. ఆమె తల్లి కళింగసేన ఈ వార్త విని విద్య నశించిన విద్యాధరి వలె మూర్ఛిల్లినది. అపుడు ఒక వృద్ధదాసి ఇట్లనెను.

"మదనమంచుక కన్యగా నున్నపుడు, మేడపై నున్న ఆమెను చూచిన మానసవేగుడను విద్యాధర యువకుడు. కళింగసేన వద్దకు వచ్చి ఆమె కూతురును తనకు ఇమ్మని అడిగెను. అందులకాతడు ఏమీ అనక వెను తిరిగిపోయెను. ఇపుడు అతడే తన మాయలచే అపహరించెనేమో" - అని తన సందేహమును తెలిపినది.

అపుడు సైన్యాధ్యక్షుడు "అన్ని వైపులా ఈ నగరము సురక్షితముగా నున్నది. గగనమార్గము తప్ప నిందు ప్రవేశ నిర్గమమార్గములు లేవు. ఇక్కడనే యుండి ప్రణయకోపమున ఆమె కనుపించుటలేదేమో యని తన అభిప్రాయము తెలిపెను. అయిననూ అందరూ అన్నివైపులా అన్వేషణ చేయుచునే యున్నారు. లాభం లేకపోయింది. ఇక నరవాహనుడు స్వయముగా వెదుకుటకై బయలుదేరెను. ఎక్కడ వెదికిననూ ఆమె కనిపించలేదు. నిర్విణ్ణుడై ఒక చోట కూర్చుండెను.

అంతలో "వేగవతి" యను విద్యాధర కన్యక మదనమంచుక రూపమును ధరించి ఒంటరిగా ఒక వృక్షచ్ఛాయలో కూర్చుని యుండగా, అటుగా వచ్చిన నరవాహనుని మిత్రుడు మరుభూతి ఆమెను చూచి వెంటనే సమీపము నందున్న రాజును తీసుకు వచ్చి మదనమంచుకను చూపించెను. నరవాహనుడు మిగుల ఆర్తితో ఆలింగనము చేయబోవగా ఆమె ఇపుడు నన్ను తాకవద్దు. వివాహకాలమున స్వహస్తములతో నైవేద్యము చేసెదనని

విద్యాధరులకు వాగ్దానము చేసి అది మరచితిని, అందులకు వారు కోపించి నన్ను అపహరించిరి కనుక నీవు మరల ఇచట నన్ను వివాహము చేసు కొన్నచో వారికి నైవేద్యము సమర్పించి నీ వెంట వచ్చెదను, లేనిచో మనకు శ్రేయస్కరము కాదని" బదులు చెప్పెను.

ఆ మాట విని నరవాహనుడు శాంతి సోముడను తన పురోహితుని పిలిచి సంభారములు సేకరించి వెంటనే వివాహము చేసుకొనెను. మద్య మాంసాదులచే మాయా మదనమంచుక యక్షులకు విద్యాధరులకు నైవేద్యము పెట్టెను. వాసగృహమున నరవాహనుడామెతో మధుపానము చేసెను. ఏకాంతమున ఆమె రాజుతో "ప్రియా! నేను నిదురించునపుడు నా ముఖము పై మేలి ముసుగు తొలగించి చూడవలదని' చెప్పెను. కాని నరవాహనుడు ఆ మాటలను శంకించి ఆమె నిదురించు సమయమున మేలి ముసుగు తొలగించి చూడగా ఆమె మదనమంచుక కాదు. కొద్ది సేపటికి ఆమె మేల్కొనెను. నరవాహనుడు నిజము చెప్పమని నిర్బంధించగా - తాను ఆషాఢపురమను విద్యాధర నగరమును పాలించు భుజబలోద్ధతు నకు తానే వేగవతినను కుమార్తెనని, తన అన్న వేగవంతుడని చెప్పెను".

అంతేగాక స్వప్నమున నరవాహనుడు తన భర్తయని గౌరీదేవి చెప్పిన పిమ్మట ఆమె రూపమున ఇచటకు వచ్చి యుక్తిగా వివాహమాడితినని, నా ప్రేమను ఉపేక్షింప వలదని 'వేగవతి' అభ్యర్థించినది. తరువాత తన విద్యాబలముచే నరవాహనుని తీసుకుని ఆకాశమార్గమున విద్యాధర దేశము చేరినది. వత్సరాజాదులు రాజ కుమారుడు కనిపించక ఆందోళన చెందు సమయమున నారదమహర్షి వచ్చి శివాజ్ఞ వలననే ఇది సంభవించినదని విచారించ పనిలేదని ఊరడించెను.

ఇంతలో నభో మార్గమున వెళ్లుచున్న వేగవతీ నరవాహనులపై మానసవేగుడు దాడిచేసెను. అపుడు విద్యాబలోద్ధతు అన్న వేగవంతునితో

కలసి వేగవతి, మానసవేగునితో గొప్ప యుద్ధము చేసినది. ఆమె భైరవ రూపము దాల్చి మానసవేగుని మోహపరచి అగ్నిపర్వతమున అతన్ని పడవేసినది. నరవాహనుని ఒక పాడు నూతి యందుంచి "ఆర్యపుత్రా! నీవధైర్యపడకుము. అన్న నతిక్రమించుటయే నా విద్యలు దుర్బలములైనవి. వానిని చక్క జేసి త్వరలో వచ్చి నిన్ను కలుసుకొనెదను" అని వెడలిపోయినది.

# 14-2

కూపమందున్న నరవాహనుని "వీణాదత్తుడ"ను గంధర్వుడు చూచి రక్షించి తన నగరమునకు తీసుకుపోయెను. అచట అందరూ వీణాధారులై యున్నారు. అందులకు కారణమేమి యని నరవాహనుడు ప్రశ్నించగా "సాగరదత్తుడను గంధర్వరాజుకు 'గంధర్వదత్త' యను కుమార్తె కలదని, వీణపై శౌరి ఇచ్చిన స్తుతిగీతమును మూడు స్థాయిలలోనూ చక్కగా వాయించినవాడు ఆమె భర్త యగునని, అందువలన అందరూ వీణ అభ్యసించుచున్నారని తెలిపెను. కళలందు నిష్ణాతుడైన నరవాహనుడు తన తండ్రి వద్ద అభ్యసించిన వీణాపాటవములో శౌరి గీతములను వీణపై మూడు గ్రామములందూ వాయించి గంధర్వదత్తను వివాహము చేసు కొనెను. అచ్చటనే ఆమెతో దివ్యభోగముల ననుభవించుచూ కాలము గడుపుచుండెను.

ఒకనాడు నగర బాహ్య ఉద్యానవనమందు నరవాహనుడు సంచరించుచుండగా సింహుడను విద్యాధరుని కుమార్తె 'అజినవతి'ని ఆమె తల్లి ధనవతి తీసుకొని వచ్చి ఈమెను పరిగ్రహింపుమని ప్రార్థించి గంధర్వులు సంచరించుచోట మానవులున్నచో ఈర్ష్యా ద్వేషములతో సంహరించెదరని చెప్పి అతనిని తీసుకొని, ఆకాశ మార్గమున "శ్రావస్తి" నగరమును చేరి ఒక తోట యందుంచి కుమార్తెతో సహా వెడలిపోయినది. ఆ నగరమును పాలించు 'ప్రసేనజిత్తు' వేట నుండి మరలివచ్చుచూ నర

వాహనుని చూచి రూప-వయో-లావణ్యాదులు గమనించి, వివరములు తెలుసుకొని, తన నగరమునకు సగౌరవముగా తీసుకొని వెళ్ళి అతని ప్రభావ మును విని యుండుట చేత తన కుమార్తె "భగీరథయశ"ను ఇచ్చి ఘనముగా వివాహము చేసెను.

ఈ విధముగా నరవాహనుడు ఎక్కడికి వెళ్ళిననూ స్త్రీలనూ, సంపదనూ, భాగ్యమునూ పొందుచూ మహాసుఖముగా కాలము గడుపు చున్నాడు. అచ్చటనే పింగళ గాంధారుడను పేరుగల విద్యాధరుని కుమార్తె "ప్రభావతి"ని పరిణయమాడెను. ఆమె సహాయము చేత మానసవేగుని సంహరించి, మదనమంచుకను తిరిగి పొందెను. మానసవేగుడపహరించిన పిమ్మట మదనమంచుక ఒక ప్రతిజ్ఞ చేసినది.

తన జడను దుర్మార్గుడైన మానసవేగుడు తాకినందున అతడు చనిపోయిన పిమ్మటే దానిని విప్పెదనని, అది కూడా తన భర్త నరవాహనుడే విప్పవలెనని లేనిచో శరీరము అగ్నిదగ్ధము కావింతునని ప్రతిజ్ఞ చేసినది" ఆ మాటలు విని నరవాహనుడు ఆమె జటా బంధమును విప్పి ఆమె ప్రతిజ్ఞ నెరవేర్చెను. మానసవేగుడప హరించిన పిమ్మట ఏమి జరిగినది? అని ప్రశ్నించగా మదనమంచుక ఇట్లు సమాధానమిచ్చెను.

మానసవేగుడు మాయచే నన్ను తెచ్చి క్రూరకర్మలచే భయపెట్టసాగెను. అంత ఒక భైరవాకారము ఖడ్గము ధరించి హుంకారము చేయుచూ "ఈమె విద్యాధరులకు చక్రవర్తి కాబోవు వాని భార్య! జాగ్రత్త అని హెచ్చరించగా అతడు రక్తము గక్కుకుని కిందపడెను. నేను మీ వియోగము భరింపలేక ప్రాణత్యాగమునకు సిద్ధపడగా, అంతఃపురచేటికలు నన్నోదార్చి ఇట్లనిరి.

పూర్వము ఒక ముని కన్యను బలాత్కారముగా మానసవేగుడప హరింపగా "పాపీ! ఇష్టము లేని స్త్రీని ఎపుడు సంగమించెదవో అపుడు నీ తల నూరువ్రక్కలగునని - వారు శాపమిచ్చిరి. అందువలన ఇతడు నిన్నేమీ

చేయలేదు. నీవు నీ భర్తను మరల పొందగలవు. అని ఓదార్చిరి. అనంతరము మానవేగుని చెల్లెలు వేగవతి నన్నూరడించి మీ దగ్గరకు వచ్చి మీపై మరులుగొని మిమ్ము వివాహము చేసుకొన్నది. ఆపైన జరిగిన కథ మీకు తెలిసినదే - అని విరమించెను.

## 14-3

ఋష్యమూక పర్వతముపై ప్రభావతితో యున్న నరవాహనుడు ఒకనాడు సమీపమున ఉన్న పంపాసరమున స్నానమాడి తియ్యని రుచి గల పండ్లను, దుంపలను తినెను. ఆ సమయమున ధనవతి - అజినావతి యను ఇద్దరు విద్యాధర స్త్రీలు వచ్చిరి. అంత సఖులైన ప్రభావతి - అజినావతి కలుసుకొని ఆనందించిరి. అపుడు ధనవతి ఇట్లనెను.

"ఈమె అజినవతి, ఇది వరలో వాగ్దత్తగా నీకిచ్చితిని, కావున దీని నిచట పరిణయముగమ్ము, నీకభ్యుదయము కలుగుచున్నది" ధనవతి చెప్పిన మాటను సఖీ స్నేహమున ప్రభావతి, నరవాహనదత్తుడును అభినందించిరి. అంత ధనవతి తగిన విధమున తన కుమార్తెను అజినవతిని నాతనికిచ్చి వివాహము చేసెను. అనంతరము అజినవతిని - ప్రభావతిని తీసుకొని నభో మార్గమున "కౌశాంబి" చేరెను. అచట వేగవతి కూడా తన విద్యాసిద్ధిని సాధించి నరవాహనుని చేరి పాదముల ప్రణమిల్లెను. గంధర్వరాజు సాగర దత్తుడు తన కుమార్తె గంధర్వదత్తను తీసుకొని కౌశాంబి చేరెను. అపుడు ప్రభావతి తండ్రి పింగళ గాంధారుడు సభలో నున్న అల్లునితో - నీవు మాయందరికి దేవనిర్మితుడవైన చక్రవర్తివి. ఇచట హిమాలయమున విద్యాధరులకు రెండు వేదృర్థములు గలవు.

అవి ఉత్తర వేదృర్థము, దక్షిణ వేదృర్థము. అవి నానా శిఖరముల నాశ్రయించి యున్నవి. కైలాసమున కావలయున్నది ఉత్తర వేదృర్థము, దక్షిణమున నున్నది దక్షిణ వేదృర్థము. అందు ఉత్తరాధిపత్యమునకై ఈ

యమితగతి దుశ్చర్యమైన తపస్సు చేసి శంకరుని మెప్పించెను. నర వాహనదత్తుడు నీకు చక్రవర్తి. నీ కోరిక దీర్చగలడని శంకరుడు చెప్పగా నీకడ కరుదెంచెను.

అచట దర్మతి మందరదేవుడని ముఖ్యమైన రాజు గలదు. అతడు బలవంతుడైనను విద్యలు ప్రాప్తించిన పిమ్మట నీకసాధ్యుడు గాడు. దక్షిణ వేద్యర్ధమున గూడా దుష్టాత్ముడైననూ విద్యాప్రభావమున దుర్జయుడగు గౌరీ ముందుడను రాజు గలడు. అతడు నీకు శతృవగు మానసవేగునకు పరమ మిత్రము. అతనిని సాధింపనిదే నీ కార్యము సిద్ధించినట్లు కాదు.

కావున నీవు కూడా విస్తారముగా విద్యాబలము సాధింపుము" అని పింగళ గాంధారుడు చెప్పిన తరువాత ధనవతి ఇట్లనెను. "వత్సా! ఈ రాజు చెప్పిన మాట నిజము. కనుక సిద్ధ క్షేత్రమునకు పోయి విద్యాసిద్ధికై ఈశ్వరునారాధింపుము. అతని యనుగ్రహము లేనిదే ప్రకర్ష ప్రశస్తి ఎట్లు కలుగును? ఈ రాజులందరూ కలసి నిన్ను రక్షించెదరు. అనంతరము చిత్రాంగదుడు ఇదంతయు, నేను ముందుగా అందరికీ తెలియజేసి విజయము సాధించెదను - అని పలికెను.

కార్యనిశ్చయము చేసి ప్రస్థానమంగళమాచరించి, కంట తడి పెట్టెడి పితరులకు, గురువులకు మొక్కి వారి యాశీస్సులు పొంది, అమితగతి కల్పితమైన వాహనముపై తాను, భార్యలు, సచివులతో నరవాహనుడు, సాగరజలములతో సమానమైన సైన్యబలముతో బయలుదేరెను. సేనా నినాదములకు దిగంతముల నుండి వచ్చు ప్రతిధ్వనులు "విద్యాధరుల చక్రవర్తి యిటే వచ్చుచున్నా"డని చెప్పుచున్నట్లుండెను. క్షణములో గంధర్వ విద్యాధరేశ్వరులు సిద్ధక్షేత్ర పర్వతమునకు తీసుకువెళ్ళిరి. అచట సిద్ధులా దేశము మేర వ్రతదీక్ష పొంది ప్రాతఃస్నాయి, భూశాయి, ఫలాశనుడునై శంకరారాధనకై తపస్సు ప్రారంభించెను.

విద్యాధరేశ్వరులు అతని చుట్టూ ప్రమాదములు సంభవించకుండా సంరక్షించుచుండిరి. మరునాడు ఇతని దీక్షభగ్నము చేయుటకై గౌరీ ముండుడు ససైన్యముగా దాడి చేసెను. అతనిపైకి చిత్రాంగదుడు సైన్యముతో ప్రతిఘటించెను. సాగరదత్తుడు, వాయుపథుడు, పింగళ గాంధారుడు మొ॥ మహారథులు సింహముల వలె గర్జించుచూ మానసవేగు నెదిరించిరి. సైన్యముల పద ఘట్టనచే లేచిన ధూళి మేఘములను తాకెను. నెత్తురను మద్యముతో, శత్రువుల శిరములను బలులతో నింద చిత్రాంగదాదులు భూతమహా యాగము వలె యుద్ధము నాచరించిరి. మొండెములను మొసళ్ళతో, ఆయుధములను సర్పములతో, మెదడులను నురుగుతో నెత్తుటేరులు ప్రవహించినవి.

తన సైన్యమంతా మరణించగా గౌరీముండుడు, తన ఆరాధ్య దేవతను గౌరిని స్మరించెను. మూడు కన్నులతో దేవి సాక్షాత్కరించి నరవాహన సైన్యమును సొమ్మసిల్ల చేసెను. అంత గౌరీముండుడు నరవాహనునితో బాహు యుద్ధమునకు తలపడెను. ఆ యుద్ధమున దెబ్బతిని మాయావియై మాయా విద్యచే నరవాహనుని పట్టుకొని నింగికెగిరెను. ధనవతీ విద్యా బలముచే అతనిని చంపలేక అగ్నిపర్వతమున పడవైచెను.

మానసవేగుడు అతని సఖులైన గోముఖాదులను ఆకసమునకు తీసుకువెళ్ళి నలుదెసల విసిరివేసెను. ధనవతి తన విద్యాబలముచే గోముఖాదులను రక్షించినది. జయము తమదేనని భావించి గౌరీముండుడు మానస వేగుడు అంతర్ధానమైరి. కార్యసిద్ధిని పొంది నరవాహనుడు మరల మనలను చేరగలడని ధనవతి చెప్పగా గంధర్వ - విద్యాధర ప్రభువులు విగతమోహులై చిత్రాంగదాదులతో తమ తమ స్థానములకు వెళ్ళిరి.

మానసవేగుడు మదనమంచుకను చేరి నీ భర్త మరణించెను. కనుక నన్ను వరించుమని పలికెను. ఆ మాట విని అతడు మిమ్ములను తప్పక

చంపును దేవ నిర్మితుడైన అతనిని ఎవరూ చంపలేరని పరిహసించుచూ బదులిచ్చెను. నరవాహనుని అగ్నిపర్వతమున పడవేసినపుడు ఒక దివ్య పురుషుడు వచ్చి అతనిని పట్టుకొని రక్షించి గంగాతటమునకు చేర్చెను. "దేవా! నేను అమృత ప్రభుడను విద్యాధరరాజును. నిన్ను రక్షించుటకై శివాజ్ఞతో వచ్చితిని. ఇదే కైలాసపర్వతము. ఇచట శివునారాధించి నిర్విఘ్నముగా శ్రేయస్సు పొందగలవు అని సురక్షిత స్థానమును చేర్చెను. అచట గణపతి నారాధించి, శివాలయమున నందిని మొక్కి ఉగ్రమైన తపస్సు చేసెను. కొంతకాలమునకు శివుడు సంతసించి ఇట్లాదేశించెను.

"ఇక నుంచి సకల విద్యాధరులకు నీవే చక్రవర్తివి. సర్వాతిశయము లైన విద్యలను నీకనుగ్రహించుచున్నాను. నా ప్రభావము వలన నీవు శత్రువులకు అజేయుడవు, అచ్ఛేద్యుడవు, అభేద్యుడవు. నీవు కనబడగానే నీ శత్రువుల విద్యలు శక్తి హీనములగును. గౌరీ విద్యయు నీకు స్వాధీనము కాగలదు. అని వరమిచ్చి బ్రహ్మనిర్మితమైన చక్రవర్తి మహాపద్మ విమానమును బహూకరించెను.

పిమ్మట నరవాహనుడు పార్వతీ పరమేశ్వరులకు మొక్కి, దివ్య విమానము నధిరోహించి అమితగతిపురమును చేరెను. అచట విద్యాధర రాజు తన కుమార్తె 'సులోచన' నిచ్చి వివాహము చేసెను. కొన్ని రోజులు సుఖముగా గడిపెను.

## 14-4

అనంతరము నరవాహనుడు, గౌరీముండ - మానసవేగులను యుద్ధమునకు రమ్మనమని ఒక దూతను పంపెను. తన అనుచర విద్యాధరేంద్రులతో యుద్ధ స్థలము గోవింద కూటము బయలుదేరెను. అచట మరల వారికి భయంకర యుద్ధము జరిగినది. అందు గౌరీముండుడు -

మానసవేగులు మరణించిరి. శివానుగ్రహము వలన నరవాహనుడు జయించెను. అనంతరం ధనవతి ఆజ్ఞా మేరకు గౌరీముండుని కుమార్తె "ఆత్మనిక"ను వివాహము చేసుకొనెను.

ఒకనాడు సభ సమావేశమై యుండగా చారులు వచ్చి మందారదేవుడు కుట్రలు చేయుచున్నాడని, గౌరీ ముండుని - మానసవేగుని చంపినందున ప్రతీకారము చేయుటకు సమకట్టుచున్నాడని తెలిపిరి. వెంటనే మంత్రులతో చర్చించి నరవాహనుడు శత్రుశేషముండరాదని భావించి మరల జైత్ర యాత్రకు బయలుదేరెను. మార్గ మధ్యమున వాయుపథుని ప్రార్థన మన్నించి ఒక దినము అతని నగరమున ఉండెను. అచట అతని చెల్లెలు "వాయు వేగమున ఇతనిని వలచుటచే ఆమెను పరిణయమాడెను. మరల గోముఖాదులతో కలసి బయలుదేరునపుడు మార్గ మధ్యమున ఒక చోట నలుగురు విద్యాధర యువతులు అగ్నిప్రవేశము చేయబోవుట గమనించి గోముఖుడు రాజునకు తెలిపెను.

అంత నరవాహను డచటికి వెళ్ళి కారణమును ప్రశ్నించెను. వారు 1. కాల కూటపతి కుమార్తె కాళిక 2. విద్యుత్‌పుంజుని కుమార్తె విద్యుత్ పుంజ 3. మందరుని కుమార్తె మతంగిని 4. మహాదంష్ట్రుని కూతురు పద్మప్రభ. అయిదవది వాయు వేగయశ, మేమైదుగురము ఒకే భర్తను వివాహము చేసుకొనవలెనని ఒక నియమము పెట్టుకొంటిమి అని చెప్పెను. అపుడు ప్రక్కనే యున్న వాయువేగయశ ఇట్లనెను.

"నాథా! సిద్ధక్షేత్రమున తపస్సు చేయుచున్న మిమ్ములను చూచి మేమైదుగురము మిమ్ము వలచితిమి. నాకు మీతో వివాహమై నందున వీరు నలుగురూ ఆత్మహత్యకు పూనుకొనుచున్నారు. అని వివరించగా, వారిని ఆ ప్రయత్నము నుండి విరమింపజేసి నరవాహనుడు నలుగురినీ వివాహము చేసుకొనెను. ఒకనాడు సేనాపతి హరిశిఖుడు రాజుతో ఇట్లనెను.

ప్రభూ! శాస్త్రజ్ఞుడవయి కూడా నీతి దప్పి ప్రవర్తించెదవేల? నిగ్రహింప వలసిన కాలమున నీకీ కామభోగానందమేమిటి? మందరదేవుని జయించు టకై జైత్రయాత్రా ప్రయత్నమెక్కడ? ఇక్కడ ఇన్ని దినములు అంతఃపురజను లతో విహారమెక్కడ? అనెను. అది విని రాజు "యుక్తమైన మాట చెప్పితివి. భోగమునకై నేనిక్కడేమియూ ప్రయత్నము చేయులేదు; ఈ భార్యా సంబంధము బంధుప్రాప్తికి కారణము కదా, శత్రునాశనమునకు ఇది ముఖ్యాంగము కదా! కనుక ఇక శత్రుజయమునకై తరలిపోదము – అని జవాబిచ్చెను. రాజు, మామ మందరుడిట్లనెను.

"చక్రవర్తి యంగములైన అన్ని రత్నములు సిద్ధింపనిదే మందరదేవుని జయించలేము. అతడు దూరమున ఉన్న దుర్గ భూమి యందున్నాడు. దేవమాయుడను వాడు త్రిశీర్షమను గుహద్వారదేశమును రక్షించు చున్నాడు. సిద్ధరత్నముగల చక్రవర్తియే ఆ గుహను జయించగలడు. చందన వృక్షమే ఆ చక్రవర్తి రత్నము. అది ఈ భూమి యందున్నది. అభీష్టసిద్ధికై దానిని సాధింపుము. చక్రవర్తి కానివాడు దాని సమీపమునకు కూడా పోలేడు" అని చెప్పగా రాజు ఆ రాత్రి వ్రతము పూని మరునాడు శివుని ధ్యానించి ఆ చందన వృక్షమునకు నమస్కరించి దానిని సాధించెను. అటు పిమ్మట యితర రత్నములు సాధించుటకై బయలుదేరెను.

**(పై క్రింది లంబకములు, తరంగముల మధ్య ఏవిధమైన ప్రధాన కథాంశములులేని కారణముగా వాటిని విడిచిపెట్టడమైనవి) -రచయిత**

# 15-1

ఒకనాడు, నరవాహనదత్తుని అగ్నిపర్వతము నుండి రక్షించిన విద్యాధరుడు "అమృతప్రభు"డు ఆకాశమార్గమున వచ్చి రాజుతో ఇట్లనెను"

రాజా! దక్షిణ దిశనందు మలయపర్వతముపై వామదేవాశ్రమము కలదు. ఆయన మిమ్ములను తీసుకురమ్మని ఆజ్ఞాపించినారు" అని చెప్పగా, రాజు సగౌరవముగా ఆ ఆనతిని తలదాల్చి విద్యాధరునితో అచటకు వెళ్లెను. వామదేవ మహర్షి నరవాహనునికి ఆతిధ్యమిచ్చి, ఇచట గుహ యందు సిద్ధ రత్నములున్నవని శివాజ్ఞచే నీకందచేయుటకు పిలిపించితినని చెప్పి వాటి సాధనామార్గమును వివరించెను.

నరవాహనుడు వామదేవ మహర్షికి పాదాభివందనము చేసి గుహ లోనికి వెళ్ళి, అచట మహాగజరత్నము, ఖడ్గరత్నము, చంద్రికారత్నము, కామినీరత్నము, విద్యారత్నములను సాధించెను. అనంతరము, వామ దేవ మహర్షి "పుత్రా! చక్రవర్తి రత్నములు అన్నీ నీకు సిద్ధించినవి. ఇక కైలాస ఉత్తరభాగమున ఉన్న మందరదేవుని జయించి కైలాసపర్వతమున కిరువైపులా గల సామ్రాజ్యలక్ష్మిని అనుభవింపుము." అని ఆశీర్వదించి పంపెను.

నరవాహనుడు తన శిబిరము చేరెను. రాజు సకల రత్నములు సాధించిన శుభసమయముగా అందరూ గొప్ప ఉత్సవము చేసిరి. మరునాడు పాపగ్రహములు శత్రుక్షేత్రములందు, శుభగ్రహములు కేంద్రస్థానములందు ఉన్న శుభముహూర్తమున మందరదేవుని జయించుటకు బయలుదేరెను. మార్గములో "మానస సరోవరము" దాటి, పిమ్మట "గండశైలము" అతి క్రమించి, ధవళవర్ణ శోభితమైన కైలాస పర్వత మూలమును చేరెను. అచట మందరుడిట్లనెను.

"దేవా! ఈ మందాకినీ తటముననే యుండుము. కైలాసమును దాటరాదు. ఇది ఈశ్వరుని నియమమగుటచే దీనిని దాటినచో విద్య

లన్నియూ నశించును. త్రిశీర్షగుహామార్గమున ఉత్తరమునకు పోవలెను. దేవమాయుడను రాజు దానిని రక్షించుచుండును. అతడతిగర్వి అని వివరించెను. మరునాడు సకల సైన్యసమేతముగా దేవమాయునిపై దండెత్తి అతనిని తన విద్యాప్రభావముచే ఓడించెను. దేవమాయుడు రాజునకు మిత్రుడయ్యెను. మరునాడు ఉదయమున చక్రవర్తి వద్దకు వచ్చినపుడు 'త్రిశీర్ష గుహామ్నాయము" (వృత్తాంతం) ప్రశ్నించెను. అందుకాతడిట్లు జవాబిచ్చెను.

"దేవా! పూర్వము కైలాసమున కిరువైపుల ఉత్తర దక్షిణదిశలందు రెండు సామ్రాజ్యము లుండెడివి. "ఋభుడ"ను వాడు తపస్సుచే శివుని మెప్పించి ఆ రెండు పార్శ్వములకు చక్రవర్తి అయ్యెను. ఒకనాడు ఉత్తర పార్శ్వమునకు బోవుచూ కైలాసమును దాటి శివుని క్రోధమున విద్యాభ్రష్టుడై ఆకాశము నుండి కిందపడెను. మరల మహోగ్రమైన తపస్సుచే శివు నారాధించి శివానుగ్రహముచే చక్రవర్తి అయి ఋభుడు శివునితో ఇట్లు విన్నవించెను.

"ప్రభూ మేము కైలాసము దాటుటకు వీలు లేదు కదా! మరి నేనెట్లు ఉభయపార్శ్వములకు చక్రవర్తినయ్యెదను? అని ప్రశ్నించగా, శివుడు ఉత్తర పార్శ్వమునకు వెళ్లుటకు భూమి కింద నుండి గుహా మార్గమును ఏర్పరచెను. అపుడు కైలాసపర్వతము శివునితో ఇట్లు విన్నవించినది.

"స్వామీ! ఉత్తర పార్శ్వము మానవుకు అగమ్యము. ఇపుడు ఇట్లు గుహామార్గము వలన మనుష్యులకు గమ్యమైనది. కావున నా మర్యాదకు భంగము కలుగకుండా చేయుము" అని కోరగా శివుడు ఆ గుహారక్షణకు "గుహ్యకుల"ను నియమించెను. గుహదక్షిణ ద్వారమున మాహామాయుని, ఉత్తర ద్వారమున కాళరాత్రిని, అపరాజితయను యను చండికను కాపలా యుంచెను. సిద్ధరత్నుడైన చక్రవర్తికి గగనచరులకు వారి భార్యలకు, చక్రవర్తి అనుజ్ఞ ఇచ్చిన వారికి తప్ప ఇతరులకు ఈ గుహా మార్గము నిషేధమని

ఆజ్ఞాపించెను. కొంతకాలమునకు ఋషభుడు ఇంద్రునిపై దాడి చేసి హతుడయ్యెను. ఇదే త్రిశీర్షగుహ ఆగమం. కాలక్రమమున మహామాయునికి నేను దేవమాయుడను జన్మించి గుహారక్షణ భారమును స్వీకరించితిని" అని వివరించెను.

పిమ్మట గుహను అర్చించి గుహలోనికి ప్రవేశించెను. అందలి చీకటిని చంద్రికారత్నము చేతను, సర్పముల దృష్టి విషమును చందన రత్నము చేతను, దిగ్గజములను మహా గజరత్నము చేతను, గుహ్యకులను ఖడ్గరత్నము చేతను నివారించి ససైన్యముతో గుహను దాటి మరొక "జీవలోకము" వంటి ఉత్తరపార్శ్వమును చేరెను. పిమ్మట కాళరాత్రిని పూజించి ఆమె ఆశీర్వాదము పొంది మందరదేవునితో యుద్ధము కొరకై శిబిరముల నేర్పాటు చేసెను. మరునాడు చారులు వచ్చి మందర దేవుడు యుద్ధమునకై వచ్చుచున్నాడని తెలిపిరి.

వెంటనే ముందుగానే మహాసైన్యముతో అతనికి ఎదురు వెళ్ళి యుద్ధమునకు తలపడెను. దేవాసుర మహాసంగ్రామము వలె ఆ యుద్ధము ప్రళయభీకరముగా జరిగినది. మందరదేవుడు వివిధ మాయలను ప్రయోగించెను. నరవాహనుడు అన్ని మాయలను తన విద్యాబలముచే త్రిప్పికొట్టెను. చివరకు బాహు యుద్ధము జరిగినది. అందు మందర దేవుని ఓడించి ఖడ్గము తీసి శిరచ్ఛేదము చేయునంతలో మందర దేవుని చెల్లెలు మందరదేవి వచ్చి నరవాహనుని వారించి ఇట్లనెను.

"రాజా! నీవు తపోవనమున నుండగా నిన్ను జూచి నేను వరించితిని, ఇతడు నీకు బావమరిది యగును, నా సోదరుని చంపకుము" అని ప్రార్థించెను. అంత నరవాహనుడతనిని విడిచిపెట్టి "విద్యాధరేశ్వరా! నీవు సిగ్గు పడవలదు. యుద్ధమున శూరుల జయాపజయములు చంచలములు. అనగా మందరదేవుడు "యుద్ధమున ఒక స్త్రీ వలన ప్రాణరక్షణ పొందుట వీరునకుచితము కాదు, నేను తపస్సుకై వనమందు నివసించుచున్న నా

తండ్రి· వద్దకు వెళ్లెదను. నీవే ఈ ఉభయ వేద్యర్ధములకు చక్రవర్తిగా నిర్ణయింపబడితివి. ఇది జరుగునని నా తండ్రి నాకు ముందుగనే చెప్పి యుండెను. - అని చెప్పి అభిమానవంతుడైన అతడు తపోవనమునకు వెళ్ళిపోయెను. అందరూ విజయోత్సాహము జరుపుకొనిరి.

# 15-2

కాలక్రమమున నరవాహనుడు తాను ఉభయవేద్యర్ధము లందలి విద్యాధరేంద్రులకు చక్రవర్తి అయిననూ, ఇంకనూ ఆధిక్యమును కోరి మంత్రులు వలదని వారించుచున్ననూ దేవతలకు నిలయమును దాటుటకు శక్యము కాని "మేరు భూముల"ను జయింపతలచెను. ఆ సమయమున నారదమహర్షి వచ్చి "రాజా! రాజనీతిని తెలిసి కూడా ఈ అనుచిత కార్యమేల చేసెదవు. శివుడు నీకు విద్యాధర చక్రవర్తిత్వము మాత్రమే ఇచ్చెను. కాని దేవేంద్రత్వమివ్వలేదు. హిమవంతము విద్యాధరుల భూమి, దానిని నీవు జయించితివి, దేవభూమి అయిన మేరువుతో నీకేమి? దురభిమానము మానుము. మందరదేవుని తండ్రి అకంపనుడు రాజర్షి అయినాడు అతనిని దర్శించి శుభములు పొందుమని ఆదేశించి అంతర్ధానము నొందెను.

దేవర్షి మాటలను తలదాల్చి, ఇంతకు ముందు ఇట్లే దేవతలపై దండెత్తి నిహతుడైన ఋషభుని వృత్తాంతము జ్ఞాపకము చేసుకొని, యుద్ధ ప్రయత్నము విరమించి అకంపన రాజర్షిని చూచుటకు అరణ్యమునకు బయలుదేరెను. అచట రాజర్షి ఆతిధ్యము పొంది ఆయన కుమార్తె మందర దేవిని, ఆమె సఖులు నలుగురూ 1. కనకదుంష్ట్రుని కూతురు కనకవతి 2. కాలజిహ్వుని కుమార్తె కాలవతి 3. దీర్ఘ దంష్ట్రుని కుమార్తె తనూద్భవ 4. పోత్రరాజపుత్రి అంబరప్రభలను వివాహమాడెను. అనంతరము చక్రవర్తిత్వ మహాభిషేకము ఋషభపర్వతమునందు జరుపుటకు నిశ్చయింప బడినది. పూర్వులందరూ అచటనే అభిషిక్తులైనారని దేవవాణి ప్రబోధించినది.

అనంతరము కైలాసము చేరి శివపార్వతులకు నమస్కరించి వారికి ప్రదక్షిణలు చేసి ఋషభపర్వతమును చేరెను. అచట నానానదుల పవిత్ర తీర్థములతో మహర్షులు నరవాహనుని విద్యాధర చక్రవర్తిగా మహాభిషేకము చేసిరి. పిమ్మట, మదన మంచుకను ప్రసవసమయమున మార్చి కళింగ సేనకు జన్మించిన పుత్రుడు 'ఇత్యకుడ'ను పేర మదనవేగుని వద్ద ఉండెనని చెప్పి మదనమంచుక అయోనిజ కావున ఆమె అర్ధసింహాసనము నధిష్టించుట కర్హురాలని అశరీరవాణి పలికినది.

విద్యాధరులంతా సంతోషముతో మదనమంచుకను ప్రశంసించిరి. నరవాహనుని ప్రక్కన దివ్యాలంకారములు ధరించి మదనమంచుక అభిషేకము పొంది ఇంద్రుని భార్య శచీదేవి వలె శోభిల్లెను. ఆకసము నుండి పుష్పవర్షమును దేవతలు కురిపించిరి. అపుడు నరవాహనుడు తండ్రియైన వత్సరాజును తల్లులను వాయుసఖుని ద్వారా కౌశాంబి నుండి విమానముపై తన వద్దకు రప్పించుకుని వారి నానందపరచెను.

దివ్యాభరణములు ధరించిన నరవాహనుని 27 మంది భార్యలు, మామగారైన వత్సరాజునకు - అత్తలైన వాసవదత్తా, పద్మావతులకు పాద ప్రణామములు చేసి వారి ఆశీర్వచనము పొందిరి. కొన్ని దినములు ఇలా సుఖముగా గడిపి, వత్సరాజు తన నగరమునకు వెళ్లదలచి "కుమారా! దివ్యభోగముల ననుభవించితిని, కాని మానవులకు జన్మభూమి మమ కారము ఆకర్షించుచుండును. కనుక మేము 'కౌశాంబి' వెళ్లెదము. నీవీ విద్యాధర సంపద ననుభవింపుము. నీవు దివ్య - మానుషడవగుటచే నీకీ భూములు తగినవి. మా జన్మ ధన్యమైనది" అని నరవాహనునికి నచ్చజెప్పి తన పరివారముతో కౌశాంబికి వెళ్ళిపోయెను.

**(పై క్రింది లంబకములు, తరంగముల మధ్య ఏవిధమైన ప్రధాన కథాంశములులేని కారణముగా వాటిని విడిచిపెట్టడమైనవి) - రచయిత**

# 16-1

ఋషభ పర్వతమున నరవాహన విద్యాధర చక్రవర్తి తన భార్యలైన 1. మదనమంచుక 2. రత్నప్రభ 3. కర్పూరిక 4. భగీరథయశ 5. దివ్యరూప 6. అలంకార ప్రభ 7. అలంకారవతి 8. శక్తియశ 9. జయేంద్రసేన 10. లలితలోచన 11. గంధర్వదత్త 12. ప్రభావతి 13. అజినవతి 14. వేగవతి 15. సులోచన 16. ఆత్మనిక 17. కాళిక 18. విద్యుత్‌పుంజ 19. మతంగిని 20. పద్మప్రభ 21. వాయువేగయశ, 22. మందరదేవి 23. కనకవతి 24. కాలవతి 25. తనూద్భవ 26. అంబర ప్రభలతో దివ్యభోగముల ననుభవించుచూ సుఖముగా నుండెను.

ఒకనాటి తెల్లవారు జామున నరవాహనునికి కలలో ఒక నల్లని స్త్రీ వచ్చి తండ్రిని లాగుకొనుచు దక్షిణదిశగా తీసుకొనిపోవుటను చూచి, వెంటనే మేల్కొని, అనిష్టము శంకించి "ప్రజ్ఞప్తి" యను విద్యచే జరిగినది తెలుసుకొన గోరెను. ఆ విద్య ఇట్లు చెప్పినది.

"కౌశాంబి యందు వత్సరాజునకు ఉజ్జయిని నుండి దూత వచ్చి చండమహాసేనుని మరణవార్తను, అతని భార్య అంగారవతి సహగమన మును తెలిపెను. ఆ వార్త విని అతడు మూర్ఛిల్లెను. పిమ్మట తెలివి వచ్చి వాసవదత్తతో, పరివారముతో అత్తమామల గూర్చి దుఃఖించెను. తరువాత బావమరిది గోపాలుని ఉజ్జయినీకి వెళ్ళి పితృరాజ్యమును పాలించమనగా అతడు నిన్ను, చెల్లిలిని వదలి వెళ్ళలేనని చెప్పగా అతని ఆనతిపై అతని తమ్మునికి పాలకునికి రాజ్యమిచ్చెను. రుమణ్వంతుని ఉజ్జయినికి పంపెను.

అటుపిమ్మట విషయ వైరాగ్యము పొంది, సారములేని సంసారమందు చివరకు అన్నీ నీరసములే అని భావించి కాలంజర పర్వతమునకు వెళ్ళి దేహత్యాగము చేయుటకు నిశ్చయించుకొనెను. అతని వెంట వాసవదత్త, పద్మావతులు, మంత్రులు, స్నేహితులు కూడ అనుగమించిరి, గోపాలుడు

కూడా వెంట వచ్చుటకు ప్రయత్నించగా వత్సరాజు కోపగించి, నీవు, నర వాహనుడు నాకిద్దరూ కుమారులే, నీవు ఈ కౌశాంబిని పాలించుము, ప్రజలను అనురక్తితో పాలించుము అని ఆజ్ఞాపించెను.

కాలంజరి పర్వతము చేరి, ఈశ్వరునికి ప్రణామములర్పించి, సర్వ కాల ప్రియమైన "ఘోషవతి" యను వీణను చేత ధరించి ఇద్దరు భార్యలూ ఇరుపక్కలా నుండగా మంత్రులతో పై నుండి అగాధములోనికి దుమికెను. వెంటనే ఒక దివ్య విమానము వచ్చి అనుచర సమేతముగా అతని ఊర్ధ్వ లోకమునకు తీసుకుపోయినది! విద్యాముఖమున ఈ దుర్వార్త విని "అయ్యో! తండ్రీ! అని విలపించుచూ నరవాహనుడు మూర్ఛిల్లెను.

పిదప తేరుకుని అందరినీ తలచుకొని దుఃఖించెను. అతని మంత్రులు కూడా వారి తల్లిదండ్రులకై దుఃఖించిరి. విద్యాధర వృద్ధులు వారినందరినీ కాలప్రవాహమందు ఈ పరిణామము తప్పదని ఊరడిల్లుమని ఓదార్చిరి. తరువాత పితృదేవతలకు తర్పణములను మొ॥ శాస్త్రోక్తముగా చేసి గోపాలకుడు కాశ్యపాశ్రమ మందున్నాడని తెలుసుకుని అచటకు వెళ్ళెను. గోపాలకుడు నరవాహనుని పరామర్శించగా పరస్పరము ఆలింగనము చేసుకొని విలపించిరి.

మరునాడు గోపాలకుని తన వద్దకు రమ్మని నరవాహనుడు కోరెను. అందుకాతడంగీకరించలేదు. ఈ వర్షాకాలమంతయూ ఇచ్చటనే నర వాహనుని పరివార సమేతముగా యుండు మని నిర్భంధించెను. ఆత్మీయుల సహవాసము కొంత దుఃఖోపశమనము కలిగించునని నరవాహ నుడంగీకరించెను.

## 16-2

ఒకనాడు కశ్యపాశ్రమమందున్న నరవాహనుని వద్దకు సేనాపతి వచ్చి మదనమంచుక సోదరుడైన ఇత్యకుడు సురతమంజరి అను సాధ్విని అపహరించెనని చెప్పెను. వెంటనే నరవాహనుడు తన విద్యాబలముచే

ఇత్యకుని చేరి బెదిరించగా ఇత్యకుడు ప్రాణభయముచే సురతమంజరిని అప్పగించెను. ఆ వృత్తాంతమంతయు పరికించి కశ్యపమహర్షి నరవాహనుని అభినందించెను.

పూర్వము ఋషభకాది చక్రవర్తులు చాలామంది గలరు. వారు తమ స్వయంకృత దోషములచే అపకీర్తిపాలైరి. ఋషభుడు - సర్వ దమనుడు, మూడవవాడు బంధుజీవకుడు అతిగర్వము వలన ఇంద్రుని చేతిలో మరణించిరి. జీమూతవాహనుడను విద్యాధర చక్రవర్తి కూడా తన విద్యాధర చక్రవర్తిత్వమునకు కల్పవృక్షమును, తన శరీరమును దానమిచ్చు టయే కారణ మని నారదునికి చెప్పి పుణ్యము కోల్పోయి పదభ్రష్టుడయ్యెను. విశ్వాంతరుడను చక్రవర్తి తన కుమారుడు ఇందీవరాక్షుడు చేదిరాజు భార్య నపహరించి హతుడయ్యెను. పుత్రశోకముచే విశ్వాంతరుడు మరణించెను.

ఒక్క "తారావలోకుడే" మనుష్యుడై తన పుణ్యబలముచే విద్యాధర చక్రవర్తియై ఏ దోషము లేక చిరకాలము సామ్రాజ్యము పాలించి అవసాన కాలములో రాజ్యము త్యజించి వనమునాశ్రయించెను. కనుక విద్యాబల గర్వముచే రాగాంధులు కారాదు. ధర్మమెరిగి పాలింపుము శాశ్వత కీర్తి పొందుమని" కశ్యపమహర్షి నరవాహనునికి హితోపదేశము చేసి ఆశీర్వ దించెను. అటు పిమ్మట వర్షాకాలము ముగిసిన తరువాత తన మామ గోపాలుని, ఋషులను వీడి భార్య- సచివులతో విమానమధిరోహించి తన నివాసమైన ఋషభాద్రిని చేరెను. విద్యాధర సామ్రాజ్యమును చిర కాలము పాలించి కీర్తివంతుడయ్యెను.

శివుని నోట వెలువడి ఈ "బృహత్కథ" శాపముచే భూమిని చేరి కాత్యాయనాది పరంపరలో పుష్పదంతాదులచే ప్రసిద్ధి పొందినది. ఈ కథ చెప్పినవారు, విన్నవారు పుణ్యము పొందుదురని పరమేశ్వరు డనుగ్రహించెను.

# అవాంతర కథలు

## 6-3 కీర్తిసేన కథ

పూర్వము పాటలీ పుత్రమున ధనపాలితుడను వర్తకుడుండెను. అతని కుమార్తె "కీర్తిసేన" ఆమెను మగధ దేశమందు దేవసేనుడను వానికిచ్చి వివాహము చేసెను. "దేవసేనునికి తండ్రిలేదు. తల్లి ఉన్నది. కాని పరమ గయ్యాళి. కొడుకు లేనపుడు కోడలిని నానా దుర్భాషలాడుతూ వేధించేది. ఒకసారి వ్యాపార నిమిత్తము దేవసేనుడు వలభపురము వెళ్ళవలసి వచ్చినది. కీర్తిసేన భర్తతో అతని తల్లి పెట్టు బాధలు వివరించినది. అతడు తల్లిని ప్రశ్నించి జాగ్రత్తగా యుండుమని చెప్పగా, ఆమె మరింత మండిపడి అంతా సమానులే అని కపటపు మాటతో ఓదార్చినది. కుమారుడు వెళ్ళిపోగానే కోడలిని నేలమాళిగలో బంధించి హింసించసాగెను.

ఒకనాటి రాత్రి కీర్తిసేన అక్కడ నున్న ఒక గునపముతో గోడలను త్రవ్వగా ఒక సొరంగ మార్గము కనబడినది. దాని నుండి బయట పడి ఒక రాజపుత్ర వేషము ధరించి సముద్ర సేనుడను వర్తకునితో స్నేహము చేసి వలభీపురమునకు బయలుదేరింది. మార్గ మధ్యమున వర్తకులను దోచుకొనెడి దొంగల గుంపు దాడి చేసినది. రక్షణకై కీర్తిసేన ఒక గోతిలో దూరి పైన గడ్డిని కప్పుకొన్నది. అంతా సమసిపోయినది. అందరూ వెళ్ళిపోయిరి. ఆమె అచట నుండి బయటపడి చీకటి పడుచుండగా ఒక చెట్టు తొర్రలో దూరి దాగి ఉన్నది. నిశిరాత్రి వేళలో ఒక రాక్షసి తన పిల్లలతో వచ్చి ఆ చెట్టు నెక్కెను.

"పిల్లలారా! ఈరోజు ఎంత ప్రయత్నించిననూ ఆహారము దొరకలేదు -కాని కొన్ని దినములాగినచో సమీపమున ఉన్న గ్రామములో వసుదత్తు డను అధికారి మరణింపనున్నాడు మనకు విందు భోజనము" అని చెప్పిది. అతడెట్లు మరణించును? అని పిల్లరాక్షసులు ప్రశ్నించిరి. ఒకనాడతడు అడవిలో వేటాడి అలసి చెట్టుకింద నిద్రించినాడు, ఆ సమయమున ఒక చెవి పాము అతని చెవిలో దూరినది, శిరస్సులో దాని సంతానము పెరిగిపోయెను. దానిచే అతడు చిక్కి శల్యుడయ్యెను. కొద్దిరోజుల్లో అతడు మరణించును. ఎందరు వైద్యులు వచ్చి ప్రయత్నించినా అది నయము కాలేదు. - కాని వేడి నేయితో తల మర్దనా చేసి ఎండలో కూర్చుండబెట్టి వెదురు గొట్టము ఒక వైపు చెవిలోనూ, రెండవ వైపు చన్నీళ్ళకుండలో నుంచి తలలోని ఆ పాములు బయటకు వచ్చి కుండలో పడునని, అతడు బ్రతుకునని" రాక్షసి చెప్పినది.

ఇదంతయూ "కీర్తిసేన" తొర్రలో నుండి విన్నది. మరునాడు ఉదయమున ఆమె, గ్రామము చేరి రాక్షసి చెప్పిన పద్ధతిలో రోగనివారణ చేసినది. అధికారిచే సత్కరింపబడినది. భర్త అదే మార్గమున వచ్చునని అక్కడే నివసించసాగెను. కొంతకాలమునకు దేవసేనుడు ఆ గ్రామమునకు వచ్చినట్లు తెలుసుకొని, తన నిజరూపము అధికారికి తెలిపి భర్తను చేరి విషయమంతయూ వివరించినది. దేవసేనుడు ఎంతో ప్రేమతో భార్యను చేరదీసి, అధికారిచే సత్కారములను పొందెను. పిమ్మట తల్లిని విడిచి భార్యతో సుఖముగా నుండెను.

# 7-3 నిశ్చయదత్తుని కథ

పూర్వము ఉజ్జయిని యందు నిశ్చయదత్తుడను వర్తక పుత్రుడుండెను. అతడు గొప్ప జూదరి. జూదములో ధనము సంపాదించుచూ శిప్రానదిలో స్నానమాచరించి మహాకాలుని పూజించి, బ్రాహ్మణులకు, దీనులకు

దానములు చేయుచూ సుఖముగా కాలము గడుపుచుండెను. ప్రతీరోజూ మరోకాలుని ఆలయసమీపమందలి శ్మశానమునకు బోయి చందన గంధము పూసుకొనెడివాడు, అక్కడ నున్న శిలాస్తంభమున గంధము రాసి వీపును దానిపై రుద్దు చుండెడివాడు.

కొంతకాలమునకు ఆ స్తంభము నున్నగా అయినది. ఒకనాడా మార్గమున ఒక చిత్రకారుడు, ఒక శిల్పి వెళుతూ ఆ స్తంభమును చూచి దానిపై గౌరీ చిత్రమును గీసెను. శిల్పి దానిని చాలా సులభముగా చెక్కి శిల్పము చేసెను. వారు వెళ్ళిన పిమ్మట ఒక విద్యాధర కన్య అలా వచ్చి ఆ గౌరీ చిత్రమును చూచి సలక్షణముగా నున్నదని పూజించి, అదృశ్య రూపమున విశ్రాంతికై ఆ శిలాస్తంభమున ప్రవేశించినది. ఇంతలో నిశ్చయ దత్తుడచ్చటకి వచ్చి స్తంభమున గౌరీదేవిని చూచి ఆశ్చర్యపడెను.

ఆ స్తంభమున మరొక వైపున గంధలేపనము నుంచి దానికి వీపు రాయుట ప్రారంభించెను. అందున్న విద్యాధర కన్య అతని రూపమును చూచి మురిసి చేయి చాపి ప్రేమగా వీపునకు గంధము రాయుచుండెను. అపుడు స్పర్శ సుఖమును, చేతి కంకణ ధ్వని విని తన చేతితో ఆమె చేయి పట్టుకొనెను.

ఆర్యా! నేను చేసిన అపరాధమేమి? నా చేయి వదలి పెట్టుము అని విద్యాధరి పలుకగా, నాకు కనబడి నీవెవరో చెప్పిన నీ చేయి వదులు దనెను. అపుడు ఆమె బయటకు వచ్చి అతని ఎదుట కూర్చుండి "హిమ వంతమునందు పుష్కరావతి యను నగరమును నా తండ్రి వింధ్యపరుడను వింధ్యధరుడు పాలించుచుండెను. నేనతని కుమార్తెను. నాపేరు 'అనురాగ పర'. మహాకాలుని అర్చించుటకై వచ్చి యిచట విశ్రమించితిని అని చెప్పగా అతడు తనతో నివసించుమని వేడుకొనెను. ఆమె కూడా రాగము మీర 'నీవు మానగరము వచ్చినచో నీతో కలిసెదను' ప్రయత్నించుము అని చెప్పి వెడలి పోయెను.

నిశ్చయదత్తుడు ఆమెను ఎలాగైనా పొందవలెనని దృఢనిశ్చయము చేసుకొని హిమవత్ పర్వత దిశగా ప్రయాణము ప్రారంభించెను. మార్గములో మరి ముగ్గురు బాటసారులు కలిసిరి. అందరూ కలసి పోవుచుండగా అనేక పురములు, గ్రామములు, అరణ్యము దాటినవి. ఒక చోట మ్లేచ్ఛులు – తురుష్కులు బంధించి చంపుటకు ప్రయత్నించిరి.

ఆ ముగ్గురూ నిశ్చయదత్తుని ఉపాయము వలన బ్రతికిరి. కాని ప్రాణభయముచే ముందుకు రామని చెప్పి వెనుదరిగి పోయిరి. నిశ్చయ దత్తుడు ముందుకే సాగెను. దారిలో నలుగురు సన్యాసులు జతకలిసిరి. అంతా వితస్తానదిని దాటి చీకటి పడు సమయమునకు ఒక కట్టెలు కొట్టు వారి గుంపు ఎదురైనది. ఎక్కడికి పోయెదరు? ముందు గ్రామమేదియు లేదు. ఈ అరణ్యమున భగ్న శివాలయమున్నది. అందు 'శృంగోత్పాదిని' అనుయక్షిణి ఉన్నది. అందు శయనించిన వారికి కొమ్ములు మొలిపించి భక్షించును. అని చెప్పిరి. ఎవరూ ఆ మాటలకు భయపడక అంతా ఆ రాత్రి అందు పెద్ద నెగడు రగిలించి నిద్రించిరి.

అర్ధరాత్రి సమయమున 'కంకాళ కిన్నరి' అను వాద్యమును వాయించుచూ యక్షిణి వచ్చినది. ఒక సన్యాసిని చూచి మంత్రము పఠించినది. అతనికి కొమ్ములు మొలిచినవి. లేచి ఆడుచూ అగ్నిలో పడెను. దాని నుండి అతనిని లాగి యక్షిణి భక్షించెను. పిమ్మట ముగ్గురు సన్యాసులను భక్షించినది. అంతలోనే కిన్నెర వాయిద్యము కింద బెట్టినది. నిశ్చయ దత్తుడు వెంటనే దానిని గ్రహించి వాయించుచూ ఇంతకు ముందు యక్షిణి చదివిన మంత్రము పఠించెను. అంత యక్షిణి భయపడి అతనికి వశమైనది! దాని సహాయముతో నిశ్చయదత్తుడు పుష్కరావతి నగరము చేరి అనురాగ పరను కలుసుకొనెను.

చిరకాలమునకు కలుసుకొనుట వలన ఆనందముతో అనేక విధముల సంతోషపరచెను. గాంధర్వ విధితో అతనిని వివాహమాడి సుఖములను

అనుభవించుచుండెను. కాని కొంతకాలమునకు రాజభంజనుడను విద్యాధరునిపై మరులుగొని రహస్యముగా అతనితో సంగమించుచుండెను. ఒకనాడు నిశ్చయదత్తుడు ఇది గమనించి ఆమెను దుర్భాషలతో నిందించగా ఆమె అది సహించలేక అతనిని విడచి ఆకాశమార్గమున వెళ్లిపోయినది. ఇక చేయునది లేక వైరాగ్యముతో అచట నుండి నిశ్చయదత్తుడు గృహోన్ముఖుడయ్యెను.

# 7-5 గుణవరాదేవి కథ

పూర్వము వర్ధమాన నగరమున వీరభుజుడను రాజుండెను. అతనికి గల అనేక మంది భార్యలలో 'గుణవరాదేవి' అనిన చాలా మక్కువ. కాని అతనికి ఎవరి యందునూ సంతానము కలుగలేదు. అపుడు శృతవర్ధనుడను రాజవైద్యుడు అడవి మేకను తెప్పించి రసకమును తయారు చేసి పదిమంది రాణులకు సేవించుటకు ఇచ్చెను. అందు గుణవరాదేవికి మేక కొమ్ములుతో చేసిన మందును ఇచ్చిరి.

అందరూ గర్భవతులై పుత్రులను కనిరి. గుణవరాదేవికి కలిగిన కుమారునికి 'శృంగభుజ'డను పేరు పెట్టెను. అతడే అందరికన్నా రూప, జ్ఞానములందు అధికముగా ఉండేవాడు. రాణులలో యశోలేఖ అనునది అతని గుణప్రకర్షను సహించలేక అతని తల్లి గుణవరాదేవి అంతఃపుర రక్షకుడైన సురక్షితునితో సంగమించున్నదని ఇతర రాణులతో కలసి చాడీలను రాజుతో చెప్పినది. అతడు ఆ దుర్బోధలను విశ్వసించి సురక్షితుని కాశ్మీరము వెళ్ళి అచటి మడవ క్షేత్రమును, ఉత్తరమానసము దర్శించి పవిత్రుడవై రమ్మని పంపించెను.

రాణిని ఒక యోగి వచ్చి తన క్షేమము నిమిత్తము నేలమాళిగ యందు కొంతకాలముంచమని చెప్పినాడని గుణవరాదేవితో చెప్పి భూగృహమున

ఆమెను నిర్బంధించెను. ఇక శృంగభుజుని తరిమి వేయుటకు అతని సోదరులు పన్నాగము పన్నుచుండిరి.

ఒకనాడు అగ్నిశిఖుడను రాక్షసుడు పెద్ద కొంగరూపమున కోటపై వాలెను. రాజకుమారులందరూ దానిని విస్మయముగా చూచుచుండగా ఒక యోగి వచ్చి అతడు రాక్షసుడని చెప్పెను. సోదరులు తమ సోదరుడు శృంగభుజుని పీడవదిలించుకొనుటకు, తండ్రి యొక్క బంగారు ధనుర్బాణములు తెచ్చి ఆ కొంగను చంపమని అతనికిచ్చిరి.

శృంగభుజుడు బంగారు బాణముతో కొంగను కొట్టగా అది గాయపడి ఎగిరిపోయినది. సోదరులు బంగారు బాణమును తెమ్మని లేనిచో తమను తండ్రి బాధించునని అతనిని దాని వెంట పంపిరి. అతడు దానినన్వేషించుచూ అరణ్యమును ప్రవేశించి ఒక చోట విశ్రమించెను. అచటికి ఒకకన్య వచ్చి తన పేరు రూపశిఖయని బాణము తగిలిన కొంగ రూపములో నున్నవాడు తన తండ్రి అగ్నిశిఖుడని అతనికి ఉపచారము చేసి వచ్చుచున్నానని చెప్పి అతనిని వలచెను.

శృంగభుజుడు కూడా ఆమెను గ్రహించుటకు అంగీకరించెను. ఆమె తన తండ్రితో ఈ విషయము చెప్పి అతనిని వివాహమునకు ఒప్పించినది. అతడు సరేనని శృంగభుజుని స్నానము చేసిరమ్మని, రూపశిఖ యొక్క మిగిలిన 99 మంది సోదరిలను తీసుకురమ్మనెను. అపుడు ఆమె ప్రియునితో ఇట్లనెను.

ఆర్యపుత్రా! మేము 100 మంది ఒకే రూపముతో నుందుము. నా తండ్రి నిన్ను మోసము చేయనున్నాడు. మమ్ములందరినీ నిలిపి నన్ను వరించమని చెప్పెను. కనుక నీవు నన్ను గుర్తించుటకు వీలుగా ఈ హారమును కంఠము నుండి తీసి శిరసున ధరించెదను. ఆ గుర్తు గ్రహించి నా మెడలో వరమాల వేయుము అని బోధించినది.

ఆమె చెప్పినట్లుగానే అంతా జరిగినది. శృంగభుజుడు ఆమె గుర్తు ననుసరించి ఆమెను వరించెను. అపుడు ఇచటికి దక్షిణముగా రెండు యోజనముల దూరమున శివాలయమున్నది అచ్చట నా సోదరుడు "ధూమశిఖుడు" నివసించుచున్నాడు. అతనిని నీ వివాహమున కాహ్వానించి రమ్ము" అని పంపెను.

అపుడు రూపశిఖ శృంగభుజునికి కొంత మట్టి-కొంచెం నీరు, ముండ్లు, నిప్పు, ఒక గుర్రమును ఇచ్చి వచ్చునపుడు వెనుకకు తిరిగి చూచుచూ అపాయము వచ్చినచో వీటిని ప్రయోగింపుమని చెప్పెను. సరే యని గుర్రముపై బయలుదేరి శివాలయమును చేరి ధూమశిఖుని ఆహ్వానించి వెంటనే తిరుగు ప్రయాణమయ్యెను. మార్గమున వెనుకను చూచెను. ధూమశిఖుడు వెంబడించుచుండెను. వెంటనే తన వద్ద ఉన్న మట్టిని వెనుకకు విసిరెను. అది ఒక పర్వతమై అడ్డు నిలచినది. ఎలాగో దానిని దాటి రాక్షసుడు రాసాగెను. అపుడు అతడు నీరు వదిలెను. అది ఒక మహానదిగా మారి అడ్డమైనది. రాక్షసుడు దానిని ఈది ముందుకు వచ్చుచుండగా శృంగభుజుడు ముండ్లు విసెరెను. అది ఒక కంటకవనమై అడ్డు నిలిచినది.

అయిననూ దానిని దాటి రాక్షసుడు ముందుకు వచ్చుచుండగా అతడు నిప్పును వదిలెను. అది కార్చిచ్చుగా మారి దహించసాగినది. అది చూచి ధూమశిఖుడు దానిని దాటలేక విచారముతో వెనుకకు మరలిపోయెను.

పిమ్మట శృంగభుజుడు ధూమపురమునకు వచ్చి రూపశిఖకు గుర్రము నిచ్చి జరిగినదంతయూ ఆమెకు చెప్పి సంతోషపరచి అగ్నిశిఖుని వద్దకు వెళ్ళిపోయెను. అగ్నిశిఖునికి అచట గుర్తులు చెప్పి తాను వెళ్ళి వచ్చినట్లు ఋజువు పరచెను. అతడు శృంగభుజుని మానవాతీత వ్యక్తిగా భావించి

తన కుమార్తె నిచ్చి వివాహము చేసెను. కొంతకాలము అచట భోగముల ననుభవించి ఆమెతో కలసి వర్ధమాన పురమునకు బయలుదేరెను.


ధూమశిఖునికి తెలియకుండా వారు బయలుదేరిరి. కాని అతడు గ్రహించి వారిని వెంబడించెను. వారు మాయారూపములు ధరించి అతనిని మోసగించిరి. అతడు చేయునది లేక వెనుదిరిగి పోయెను.


పిమ్మట శృంగభుజుడు వర్ధమాన పురమును చేరి తండ్రి వీరభుజునికి జరిగినది వివరించి సంతోషపరచెను. వీరభుజుడు యశోలేఖతో ఒకనాడు నిద్రించి యుండగా, ఆమె రతి పారవశ్యము పొందిన అనంతరము నిద్రమత్తులో మద్యప్రభావముచే తాను గుణవరాదేవికి చేసిన అపకారము పలవరించినది.


వీరభుజుడు అదే సమయమున మేల్కొని ఆ మాటలు విని, గుణవరాదేవి నిర్దోషి యని గుర్తించెను. శృంగభుజుని ఆదరించెను. మిగిలిన రాణులకు తంత్రమునంతయూ తెలుసుకుని వారిని భూగృహములో బంధించెను. శృంగభుజుడు తల్లితో జరిగిన వృత్తాంతము వివరించగా ఆమె రూపశిఖను ప్రేమగా అక్కున చేర్చుకున్నది.


గుణవరాదేవి తన సవతులను మన్నించమని రాజును వేడుకున్నది. వారునూ పశ్చాత్తాపము చెందిరి. రాజు, మిగిలిన కుమారుల దుష్కృత్యము తెలుసుకుని ప్రవాస శిక్ష విధించెను. కాని వారిని కూడా మన్నించమని శృంగభుజుడు తండ్రిని వేడుకొనెను. రాజు కుమారుని ఔదార్యమునకు సంతసించి వారిని మన్నించెను. అందరూ సుఖసంతోషములు పొందిరి.


# మా ఇతర ప్రచురణలు





























**గొల్లపూడి వీరాస్వామి సన్™**

కోటగుమ్మం, రాజమండ్రి - 533 101. ☎ 2465253